

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 189
SUNDAY Special
ఆదివారం 29-9-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత టి20 జట్టులో నితీశ్‌కుమార్ రెడ్డి

బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి స్థానం లభించింది.

- వివరాలు 14లో



నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై బెంగళూరులో కేసు నమోదైంది. ఎన్నికల బాండ్ల పేరిట రూ.కోట్లు దోచుకున్నారంటూ ఆమెపై జేఎస్‌పీ ఫిర్యాదు చేసింది.

- వివరాలు 6లో



నస్రల్లా మృతి

ఇజ్రాయెల్ దాడుల్లో తమ చీఫ్ హసన్ నస్రల్లా మృతి చెందినట్టు హెజ్బొల్లా ధ్రువీకరించింది. దీంతో యుద్ధ వాతావరణం నెలకొంది.

- వివరాలు 6లో▶



అమెరికాలో హెలెన్ విధ్వంసం

భీకర హెలెన్ తుపాను ఫ్లోరిడాతోపాటు ఆగ్నేయ అమెరికాలో విధ్వంసం సృష్టించింది. వివిధ ఘటనల్లో 44 మంది చనిపోయారు.

- వివరాలు 6లో▶



ఆ పార్టీలు రాజ్యాంగ శత్రువులు

కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు భారత రాజ్యాంగానికి అతిపెద్ద శత్రువులని ప్రధాని నరేంద్రమోదీ మండిపడ్డారు.

- వివరాలు 6లో▶



డిప్యూటీ సీఎంగా ఉదయనిధి

తమిళనాడు సీఎం స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రిగా పదోన్నతి లభించింది.

- వివరాలు 6లో▶

'మూసీ'పై పవర్ ప్లే!

నది పరీవాహక ప్రాంతంలో ఇళ్ల తొలగింపుపై గరంగరం

అటు ఉధృతంగా కొనసాగుతున్న బాధితుల ఆందోళనలు, ఉద్రిక్తత

ఇటు ప్రక్రియను వేగవంతం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం..
బలవంతంగా తరలించబోమంటూనే..
ఖాళీ చేయడం తప్పనిసరి అంటున్న అధికారులు
నిర్వాసితులకు మద్దతుగా రంగంలోకి బీఆర్ఎస్, బీజేపీ
తెలంగాణ భవన్‌కు వెళ్లిన 'మూసీ' నిర్వాసితులు..
అండగా ఉంటామని హరీశ్‌రావు భరోసా
నేడు మూసీ కాలనీల్లో పర్యటిస్తామని ప్రకటన
ఆందోళనల్లో పాల్గొంటున్న బీజేపీ ఎంపీ ఈటల
వ్యతిరేకత వస్తోందని గుర్తించిన టీపీసీసీ..
ప్రభుత్వానికి తగిన సూచనలు చేసేందుకు కసరత్తు

మూసీ సుందరీకరణ మరిన్ని ప్రకంపనలు రేపుతోంది. ఇళ్ల గుర్తింపు కోసం అధికారుల సర్వేలు, ఖాళీ చేయిస్తామంటూ నిర్వాసితుల ఆందోళనలు కొనసాగుతూ ఉండగా.. రాజకీయ పార్టీలూ రంగంలోకి దిగాయి. నిర్వాసితులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ ప్రకటిస్తే.. ఎక్కడికక్కడ ఆందోళనలకు బీజేపీ నేతలు మద్దతు ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్ కూడా అప్రమత్తమై నష్టనివారణపై కసరత్తు మొదలుపెట్టింది.



కొత్తపేట వినాయకనగర్‌లో ఇల్లు ఖాళీ చేస్తున్న ఓ కుటుంబం..



..ఒప్పించి పంపిస్తాం

- ఖాళీ చేయడం తప్పనిసరి.. రెండు నెలల్లో పునరావాస ప్రక్రియ పూర్తి చేస్తాం
- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్
- హైడ్రా అంటే బూచి కాదు భరోసా..: హైడ్రా కమిషనర్ రంగనాథ్

5లో



మూసీలో పేదల కన్నీళ్లు పారిస్తారా?

- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం 5లో
- బాధితుల గోడు విని హరీశ్, సబిత కంటతడి
- బాధితులకు రక్షణగా నిలుస్తామని భరోసా

మూసీ, హైడ్రాపై ఆచితూచి!



- ఈ రెండు అంశాల్లో జాగ్రత్తగా ముందుకు వెళ్లాలంటున్న టీపీసీసీ
- నగర ఎమ్మెల్యేలతో మహేశ్‌గౌడ్ భేటీ

5లో

న్యూస్‌రీల్

రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేవాలి



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతూనే సభ్యత్వ నమోదునూ పూర్తిస్థాయిలో చేపట్టాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ రాష్ట్ర నేతలను ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించారు.

- వివరాలు 15లో▶

కిడ్నీ బాధితులకు ఉపశమనం



మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు ఊరటనిస్తూ.. కొత్తగా 7 వాస్క్యులర్, 18 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం కొనసాగుతున్న డయాలసిస్ కేంద్రాల్లో అదనంగా 74 డయాలసిస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురానుంది.

- వివరాలు 2లో▶

మీరు చెప్పింది అబద్ధం !

- నిజాలే చెప్తానని ప్రమాణం చేసి తప్పుడు సాక్ష్యం ఇస్తారా?
- మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఫైర్

15లో



దేవుడా.. ఏపీని రక్షించు!

తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు

తిరుమల పవిత్రతను మంటగలుపుతూ సీఎం చంద్రబాబు ఘోర అపచారం

బాబు పాపాల ప్రక్షాళన కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల పూజలు

"స్వామీ.. చంద్రబాబు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా మేము మా ఊళ్లోని మీ గుడిలో పూజలు చేస్తున్నాం.. తప్పు చేసింది మేం కాదు.. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న చంద్రబాబు నాయుడు.. ఆయన నిర్వాకంపై మీకొస్తున్న కోపాన్ని ప్రజలపై కాకుండా చంద్రబాబుపైనే చూపండని వేడుకుంటున్నాం.. ఎందుకంటే జరిగింది ఘోర అపచారం.. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని పలుచన చేస్తూ, ఆయన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. జరగనిది జరిగినట్లుగా.. వాడని జంతువుల కొవ్వును వాడినట్లుగా, ఆ లడ్డూలు పంపిణీ చేసినట్లుగా.. పచ్చి అబద్ధాలాడుతూ మిమ్మల్ని(దేవుడు) అడ్డు పెట్టుకుని చంద్రబాబు రాజకీయం చేస్తూ అపవిత్రం చేశారు.. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసంపై దెబ్బ కొట్టారు.. దేవుడు, దైవం.. అనే భయం, భక్తి లేకుండా.. కళ్లార్పకుండా చెప్పిన అబద్ధాన్నే పదే పదే చెబుతూ ప్రజల్లో విష బీజాలు నాటుతున్నారు.. వైఎస్ జగన్‌పై కోపంతో మమ్మల్ని క్షోభకు గురిచేస్తూ.. మిమ్మల్ని అపవిత్రం చేస్తున్నారు. ఆ పాపాన్ని కడిగేయాలని అభిషేకాలు, పూజలు చేస్తున్నాం.. చంద్రబాబు క్షుద్ర రాజకీయాల నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం."

- రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజల వేడుకోలు

12లో

సత్యం, కరుణే ఆయుధం

మహాత్ముడి విజయానికి అదే మార్గం

'నల్సార్' స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

3లో

పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, సీజే జస్టిస్ అలోక్ అరాధే




ఎందుకీ రాద్ధాంతం?

ఏ నివేదికలో నిరూపణ కాకుండానే తిరుమల లడ్డూపై దుష్ప్రచారం తగదు

చంద్రబాబు పచ్చి అవకాశవాది.. తన స్వార్థ ప్రయోజనాలే ముఖ్యం

'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రముఖ ఆర్థిక వేత్త, సామాజిక కార్యకర్త మోహన్ గురుస్వామి



సీఎం చంద్రబాబు తిరుమలను వివాదాస్పదంగా మార్చడం సరి కాదు.. అయినా ఆ నెయ్యి వాడనేలేదు.. అపచారం ఎక్కడ?

వివరాలు 12లో▶



కనకం.. పూనకం!

- ప్రపంచవ్యాప్తంగా స్వర్ణకాంతులు
- అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 2,700 డాలర్లకు జంప్
- దేశీయంగా 10 గ్రాముల ధర రూ.78,000 స్థాయికి..
- ఏడాదిలో తులం.. 'ల'కారం ఖాయమంటున్న విశ్లేషకులు

2లో

క్లుప్తంగా...

పారదర్శకంగానే పాలన

మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నది ప్రజా ప్రభుత్వమని, దాపరికాలు, రహస్యాలు ఏవీ ఉండవని, ప్రతిదీ పారదర్శకంగానే జరుగుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో లాగా కొద్దిమంది చేతిలో అధికారం కేంద్రీకృతం కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగంపై ఏ ఒత్తిడులు లేవని, ఎక్కడా రాజీ పడకుండా ప్రభుత్వం పనిచేస్తోందని శనివారం ఓ ప్రకటనలో వివరించారు. బిల్లుల విడుదలలో ఆర్థిక శాఖ 7%, 8%, 20% కమీషన్లు తీసుకుంటోందని వచ్చిన వార్తలు నిరాధారం, దుర్మార్గమైనవని పేర్కొన్నారు.

ములుగు మున్సిపాలిటీ బిల్లు ఆమోదించండి

రాష్ట్రపతికి మంత్రి సీతక్క విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చే చట్టానికి ఆమోదం తెలపాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల పాటు రాష్ట్రపతి కార్యాలయంలో ఈ బిల్లు పెండింగ్‌లో ఉందని, దీనిని ఆమోదిస్తే ములుగుకు మున్సిపాలిటీ హోదా దక్కుతుందని ఆమె వివరించారు. ఈ మేరకు శనివారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మంత్రి సీతక్క రాష్ట్రపతికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ప్రారంభించిన సందర్భంగా మంత్రి సీతక్క ప్రసంగించారు. అనంతరం హైదరాబాద్ పర్యటన ముగించుకొని ఢిల్లీకి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతికి బేగంపేట విమానాశ్రయంలో ఒక పెయింటింగ్‌ను మంత్రి సీతక్క బహూకరించారు. రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన వారిలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ ఉన్నారు.

త్వరలో గురుకుల పీఈటీల సమస్య పరిష్కారం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హామీ




సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ 2017లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం గురుకుల పాఠశాలల్లో 616 పీఈటీ పోస్టుల నియామకాల సమస్యను దసరాలోపు పరిష్కరిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్ ద్వారా పరీక్షలు రాసిన నిరుద్యోగులు శనివారం గాంధీభవన్‌కు వచ్చారు. 2017లో నోటిఫికేషన్ ఇచ్చినా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పీఈటీ పోస్టుల పరీక్ష ఫలితాలను వెల్లడించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 19న ఫలితాలు ప్రకటించి మెరిట్‌లిస్టును తయారు చేసిందని మహేశ్‌గౌడ్‌కు విన్నవించారు. ఈ జాబితాపై కొందరు కోర్టుకు వెళ్లి నియామకాలను నిలిపి వేయించే ప్రయత్నాలు చేస్తున్నారని, న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన మహేశ్‌గౌడ్ టీజీపీఎస్సీ అధికారుల తో మాట్లాడారు. తక్షణమే పీఈటీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని కోరారు.

సమాచార కమిషనర్లను నియమించండి

సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన సుపరిపాలన వేదిక

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలో సమాచార కమిషనర్లు లేక 18నెలలకుపైగా అవుతుందని, తక్షణమే ప్రధాన సమాచార కమిషనర్, కమిషనర్లను త్వరగా నియమించాలని ప్రభుత్వాన్ని సుపరిపాలన వేదిక (ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. సమాచారహక్కు చట్టం సెక్షన్15(1) ప్రకారం సమాజంలో మంచి పేరున్న నిపుణులను, అనుభవజ్ఞులను కమిషనర్లుగా నియమించాలన్నారు. కమిషనర్లు లేకపోవడంతో 15వేలకుపైగా అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం అడిగినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

కనకం.. పూనకం!



ప్రపంచవ్యాప్తంగా విరజిమ్ముతున్న స్వర్ణ కాంతులు

- అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 2,700 డాలర్లకు జంప్
- దేశీయంగా 10 గ్రాముల ధర రూ.78,000 స్థాయికి..
- భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి ప్రభావం..
- అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్ల కోత ఆజ్యం..
- ఏడాదిలో తులం.. 'ల'కారం ఖాయమంటున్న విశ్లేషకులు

(శివరామకృష్ణ మిర్తిపాటి)

కనకం.. పూనకాలు లోడింగ్ అంటూ బంగారం రోజురోజుకూ రేటు పెరుగుతూ కొనుగోలుదారుల్లో గుబులు పుట్టిస్తోంది. ఏడాది క్రితం రూ.60,000 స్థాయిలో ఉన్న 10 గ్రాముల బంగారం రేటు ఇప్పుడు రూ.78,000ను దాటేసి 'నగ'ధగలాడిపోతోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దిగుమతి సుంకం తగ్గించడంతో కాస్త దిగివచ్చిన బంగారం.. చాలా మందిలో ఆశలు రేపింది. మరికొంత తగ్గుతుందేమో కొనుక్కుందామని ఎదురుచూసిన వారికి నిరాశ మిగుల్చుతూ చుక్కలను తాకుతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితులు, అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడంతో.. ప్రపంచవ్యాప్తంగా పుత్తడికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు మన దేశంలో పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌తో డిమాండ్ పోటెత్తుతోంది. రేటెంతైనా తప్పదుకదా అన్నట్టుగా కొనుగోలుదారులు బంగారం దుకాణాలకు క్యూకడుతున్నారు.

➤ కొండెక్కిన బంగారం కొత్త శిఖరాలతో చుక్కలు చూపిస్తోంది. తాజాగా ప్రపంచ మార్కెట్లో ఔన్స్ (31.1 గ్రాములు) ధర 2,700 డాలర్ల పైకి ఎగబాకి ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకింది. దేశీ మార్కెట్లో కూడా 10 గ్రాముల మేలిమి బంగారం (24 క్యారెట్) రేటు రికార్డులు బ్రేక్ చేస్తూ రూ.78,300కు ఎగబాకింది. 2023లో మొత్తంగా 20% ఎగబాకిన గోల్డ్ రేటు.. ఈ ఏడాది ఇప్పటికే 29% దూసుకెళ్లడం విశేషం. గడిచిన 14 ఏళ్లలో ఒక ఏడాదిలో ఇంతగా పెరగడం ఇదే తొలిసారి. అసలే, పండుగ సీజన్‌కు తోడు వచ్చే 3 నెలల్లో పెళ్లిళ్ల బాజాలు మోగనుండటంతో రేటెక్కువున్నా బంగారం షాపులు కళకళలాడుతున్నాయని బులియన్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో గ్రామీణ డిమాండ్ కూడా జతవుతోందని అంటున్నారు. జూలైలో దిగుమతి సుంకం భారీ కోత నేపథ్యంలో ఆగస్టు నెలలో దేశంలోకి బంగారం దిగుమతులు దాదాపు మూడు రెట్లు పెరిగి 140 టన్నులకు జంప్ చేయడం మన దగ్గర డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందనేందుకు నిదర్శనం. కాగా 2023-24లో భారత్ మొత్తం 800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకోగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది 850 టన్ను లకు చేరవచ్చనేది వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా. వెరసి చైనా తర్వాత ప్రపంచంలో రెండో అతిపెద్ద పసిడి దిగుమతిదారుగా భారత్ నిలుస్తోంది.

పసిడి కాంతులకు కారణమేంటి?

కొన్నేళ్లుగా పసిడి ఉత్పత్తి మందగించి, భూగర్భంలోని నిల్వలు అడుగంటుతున్నాయి. మరోవైపు ఆభరణాల డిమాండ్ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ప్రపంచ దేశాలు డాలర్లలో వాణిజ్యానికి క్రమంగా చెల్లుచెప్పుండటంతోపాటు తమ విదేశీ కరెన్సీ నిల్వల్లో డాలర్ వాటాను తగ్గించుకుంటున్నాయి. ఫలితంగా డీ-డాలరైజేషన్ జోరందుకుంటోంది. ఆర్థిక అనిశ్చితి, యుద్ధ భయాలతోపాటు కరెన్సీ క్షీణతకు విరుగుడుగా బంగారం నిల్వలను సెంట్రల్ బ్యాంకులు పెంచుకుంటూ పోతున్నాయి. గత పదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు సగటున ఏటా 800 టన్నులు కొనడం గమనార్హం. మన రిజర్వు బ్యాంకు వద్ద కూడా పసిడి నిల్వలు 840 టన్నులకు ఎగబాకాయి. ఇలా ఓవైపు సరఫరా మందగించడం.. మరోవైపుడిమాండ్ విపరీతంగా పెరిగిపోవడమే గోల్డెన్ రన్‌కు ప్రధాన కారణం. ఇక ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు కనబడకపోగా.. ఇజ్రాయెల్ దాడులు, ప్రతిదాడుల తో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. 'అణు' యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అనిశ్చితిలో ఆదుకునే సురక్షిత సాధనాల్లో కి, బంగారంలోకి తమ పెట్టుబడులను తరలిస్తున్నారు. తాజా గా అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ దాదాపు 4 ఏళ్ల విరామం తర్వాత అంచనాలను మించి అర శాతం వడ్డీరేట్ల కోత విధించడంతో బంగారానికి మరింత బూస్ట్ ఇచ్చినట్లయింది. ఫిబ్రవరిలో 2,000 డాలర్లకు అటూఇటుగా ఉన్న ఔన్స్ బంగారం ఇప్పుడు 2,708 డాలర్లను తాకింది.

సుంకం కోతతో తగ్గినా.. రూపాయి వాతతో!

మోదీ సర్కారు జూలైలో ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్లో బంగారంపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి ఏకాయెకిన 6 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో బంగారం రేటు ఒక్కసారిగా రూ.5 వేల వరకు తగ్గి.. రూ.66 వేల స్థాయికి దిగొచ్చింది. దీనితో కొనుగోళ్లు భారీగా పెరిగాయి. కానీ అంతర్జాతీయంగా బంగారం రేటు నాన్‌స్టాప్‌గా పరుగులు తీయడంతో మన మార్కెట్లో కూడా పుంజుకోవడం మొదలైంది. ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత (సెప్టెంబర్ 18న)తో ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది.

సుంకం కోతతో తగ్గినా.. రూపాయి వాతతో

గత 10 రోజుల్లో 100 డాలర్లకు పైగా (మన దగ్గర 10 గ్రాములకు దాదాపు రూ.3,000) పెరిగింది. అంటే సుంకం కోత లేకుంటే.. ధర ఇప్పుడు రూ.83,000 కింద లెక్క. మరోవైపు రూపాయి విలువ అంతకంతకూ పడిపోతూ పసిడి ధరను దేశీయంగా మరింత ఎగదోస్తోంది. రెండేళ్ల క్రితం డాలర్‌తో రూపాయి మారకం విలువ 80 వద్ద ఉంది. అదే స్థాయిలో ఉండుంటే.. ప్రస్తుత పసిడి ధర రూ.74,000 (6 శాతం దిగుమతి సుంకంతో కలిపి) ఉండేది. కానీ రూపాయి 83.60కి దిగజారడంతో రేటు 78,000 స్థాయికి చేరింది. అంటే రూపాయి పతనం వల్ల మనం మరో రూ.4,000 అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోందన్నమాట!


ఈ పరుగు ఎందాకా?

ఫెడ్ రేట్ల కోత ఇప్పుడే ప్రారంభమైందని.. వచ్చే మూడు, నాలుగు నెలల్లో మరో ముప్పావు శాతం తగ్గే అవకాశం ఉందని.. దీనివల్ల పసిడి పరుగులకు ఢోకా ఉండదని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ చెబుతోంది. వచ్చే ఏడాది మధ్య నాటికి బంగారం రేటు 2,900 డాలర్లకు చేరవచ్చని తాజాగా అంచనా వేసింది. ''అమెరికాలో వాస్తవ వడ్డీరేట్లు ఇంకా తగ్గుముఖం పట్టనున్నాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలతో పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ జోరందుకోనుంది. సీజనల్‌గా ఆభరణాల కొనుగోళ్లు కూడా పుంజుకోనున్నాయి. సెంట్రల్ బ్యాంకుల బంగారం నిల్వలు ఇంకా ఎగబాకవచ్చు. దీంతో రాబోయే 6-12 నెలల్లో పసిడి రేట్లు భారీగా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి''అని యూబీఎస్ పేర్కొంది. యూఎస్ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ సైతం సమీప భవిష్యత్తులోనే పసిడి ఔన్స్ ధర 3,000 డాలర్లకు చేరుతుందని లెక్కగట్టింది. వీటి ప్రకారం చూస్తే.. దేశీయంగా 10 గ్రాముల రేటు (24 క్యారెట్) రూ.85,000కు చేరే చాన్సుంది. అంటే పాత తులం (11.7 గ్రాములు) అక్షరాలా లక్ష రూపాయలను తాకుతుంది. రూపాయి విలువ గనుక ఇంకా బక్కచిక్కితే పసిడి మరింత కాంతులీనడం ఖాయమంటున్నారు విశ్లేషకులు!



వన్నె తగ్గని పెట్టుబడి..

పసిడి పగ్గాల్లేకుండా పరుగులు తీస్తుండటంతో పెట్టుబడులూ జోరందుకుంటున్నాయి. నిజానికి పెట్టుబడి కోసమైనా కూడా మన దగ్గర ఆభరణాల రూపంలో కొనేవారే ఎక్కువ. దీనివల్ల తరుగు, మజూరీ నష్టాలు అదనం. కాబట్టి పెట్టుబడి కోసం కాయిన్లు, బార్ల రూపంలో 24 క్యారెట్ల బంగారాన్ని కొనడం బెటర్. కానీ ఇందులోనూ అదనపు చార్జీల భారం ఉంటుంది. పైగా వస్తుసేవల పన్ను (జీఎస్టీ) బాదుడు తప్పదు. ఆభరణాలు, నాణేలు, కడ్డీల రూపంలో కొని దాచుకోవడం రిస్కు కూడా. దీనికి ప్రత్యామ్నాయం సార్వభౌమ గోల్డ్ బాండ్లు (ఎస్జీబీలు), గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) తదితర రూపాల్లో లభించే డిజిటల్ గోల్డ్. ఎనిమిదేళ్ల క్రితం గ్రాము రూ.3,100 పెట్టి కొన్న గోల్డ్ బాండ్లపై ప్రస్తుతం 150 శాతంపైగా రాబడి లభిస్తోంది. అయితే బంగారం భగభగలతో ప్రభుత్వం ఇప్పుడు వీటి జారీని నిలిపేసింది. సెకండరీ మార్కెట్లోనే దొరుకుతున్నాయి. ఈటీఎఫ్‌లు, ఎస్జీబీలను షేర్ల లాగే నచ్చినప్పుడు విక్రయించి సొమ్ము చేసుకోవచ్చు. ఏ రూపంలో కొన్నాసరే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో కనీసం 10-15 శాతాన్ని బంగారానికి కేటాయించడం మంచిదని, ప్రతి నెలా కొద్దికొద్దిగా (సిప్ రూపంలో) ఇన్వెస్ట్ చేయాలనేది నిపుణుల సలహా!



రిస్కు పూజ్యం.. రాబడి ఘనం!

ప్రపంచంలో ఏ అసెట్ (ఆస్తి)కూ లేనంత స్టోర్ ఆఫ్ వేల్యూ బంగారం సొంతం. స్టోర్ ఆఫ్ వేల్యూ అంటే మన దగ్గర ఏదైనా అసెట్ (కరెన్సీ, బంగారం, భూమి, ఇళ్లు, షేర్లు ఇతరత్రా) ఉంటే.. ఎన్నాళ్లయినా దాని విలువ పెరగడమే కానీ ఆవిరైపోకుండా ఉండటం అన్నమాట. భూమి వంటివాటికి స్టోర్ ఆఫ్ వేల్యూ ఉన్నా.. బంగారంలా వెంటనే సొమ్ము చేసుకోవడం (లిక్విడిటీ) కష్టం. అంటే అసలుకు మోసం రాకుండా, లిక్విడిటీ ఎక్కువ ఉండేది బంగారమే. దానికితోడు మంచి రాబడి కూడా. పసిడి ధర ఐదేళ్లలో రెండింతలకుపైగా పెరిగింది. స్టాక్ మార్కెట్ల (షేర్ల)లో ఇంతకు మించి లాభాలొచ్చే వీలున్నా.. అది చాలా రిస్క్‌తో కూడుకున్నది.

ధర ఇంతగా పెరుగుతుందనుకోలేదు



రెండు నెలల క్రితం బంగారం ధర తగ్గినప్పుడు చాలా ఆనందించాం. ఇంకా తగ్గుతుందేమో అవసరమైన నగలు కొనుక్కోవచ్చని అనుకున్నాం. కానీ ఇంతగా పెరుగుతుందనుకోలేదు. రేట్ చూస్తుంటే భయమేస్తోంది. భవిష్యత్తులో బంగారం కొనగలుగుతామా? అనిపిస్తోంది.

– శిరీష, మోతీనగర్, హైదరాబాద్

ఎంత పెరిగినా కొనాల్సిందే..



➤ బంగారం ధర ఇంతగా ఎందుకు పెరుగుతుందో అర్థం కావడం లేదు. నేను అమెరికా నుంచి వచ్చాను. అక్కడి వారికి బంగారంపై మక్కువ లేకపోయినా మనవారికి మాత్రం ఎనలేని ఇష్టం. ఎంత పెరిగినా ఎంతో కొంత కొనాల్సిందే.

– నేహా, హైదరాబాద్

2,01,296 టన్నులు
వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనాల ప్రకారం భూమిపై ఉన్న మొత్తం బంగారం (ఆభరణాలు, పెట్టుబడులు, ప్రభుత్వాల వద్ద, పారిశ్రామిక వినియోగంతో కలిపి)


దీని విలువ 17.4 ట్రిలియన్ డాలర్లు.. మన కరెన్సీలో రూ.1,455 లక్షల కోట్లు!

53,000 టన్నులు
భూగర్భంలో ఇంకా మిగిలి ఉన్న కచ్చితమైన బంగారు నిక్షేపాలు.

21.8 క్యూబిక్ మీటర్లు
ప్రపంచంలో ఇప్పటిదాకా వెలికితీసిన బంగారం అంతా కరిగించి ముద్ద చేస్తే.. 21.8 మీటర్లుండే క్యూబ్‌లో పట్టేస్తుందట!

13%
ప్రపంచ పసిడి నిల్వల్లో భారతీయుల వాటా ఇది.

25,000 టన్నులు
మన దేశంలో ప్రభుత్వం, దేవాలయాలతోపాటు ఆభరణాలు, ఇతర రూపాల్లో ప్రజల వద్ద ఉన్న మొత్తం బంగారం అంచనా.



ఇలాగైతే బంగారం కొనడం కలే..



ప్రభుత్వం బంగారంపై సుంకం తగ్గించినప్పుడు చాలా ఆనందించాం. బంగారం రేటు పెరుగుతుందనుకోలేదు. ఇలాగైతే బంగారం కొనడం కల గానే మిగిలిపోయే పరిస్థితి వచ్చింది. పెళ్లిళ్లు, ఫంక్షన్ల కోసం బంగారం కొనాలంటే.. చాలా పెద్ద మొత్తంలో ఖర్చుపెట్టాల్సి వస్తుంది.

– నిషా, జూబ్లీహిల్స్, హైదరాబాద్

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి

- భారతీయ కళా మహోత్సవ్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము
- పాల్గొన్న ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు, కళాకారులు
- అక్టోబర్ 6 వరకు కొనసాగనున్న భారతీయ కళా మహోత్సవ్



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి, హైదరాబాద్: దేశ సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం, ప్రోత్సహించడం అందరి సమష్టి బాధ్యతని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక వైవిధ్యం, సంగీతం, కళలు, సంప్రదాయ వస్త్రధారణను దేశ వారసత్వంగా అభివర్ణించారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజల సంప్రదాయాలు, జాతుల గురించి దేశ ప్రజలందరికీ తెలియజేసేందుకే 'భారతీయ కళా మహోత్సవ్'ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారతీయ కళా మహోత్సవ్ తొలి ఎడిషన్‌ను సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ద్రౌపదీ ముర్ము శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈశాన్య, దక్షిణాది ప్రాంతాల మధ్య వారధిగా ఈ ఉత్సవం నిలుస్తుందన్నారు. కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ దేశంలోని విభిన్న సంస్కృతుల ప్రదర్శన దేశ ఐక్యతను చాటుతుందన్నారు. మంత్రి సీతక్క తెలంగాణ ప్రభుత్వం తరఫున రాష్ట్రపతిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్, అరుణాచల్ ప్రదేశ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ కె.త్రివిక్రమ్ పట్నాయక్, మణిపూర్, అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, మేఘాలయ గవర్నర్ సీ.హెచ్. విజయశంకర్, సిక్కిం గవర్నర్ ఓం ప్రకాశ్ మాథుర్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆయా రాష్ట్రాల కళాకారులు, అధికారులు పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించనున్నారు. అక్టోబర్ 6 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల మధ్య సందర్శకులను అనుమతిస్తారు. https://visit.rashtrapatibhavan.gov.in ద్వారా స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చు.

ముగిసిన రాష్ట్రపతి రాష్ట్ర పర్యటన: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఒక రోజు రాష్ట్ర పర్యటన ముగిసింది. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతికి బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్, మంత్రులు పొన్నం, సీతక్క, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేంద్ర, సీపీ సీవీ ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి శామీర్‌పేటలోని నల్సార్ లా వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఆ తరువాత బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 'కళామహోత్సవ్'ను ప్రారంభించారు. రాత్రి తిరిగి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

పసిడి కోక.. కట్టుకుంటే కేక

- బంగారు చీర నేసిన సిరిసిల్ల చేనేత కళాకారుడు
- 200 గ్రాముల బంగారంతో తయారీ
- రూ.18 లక్షల వ్యయం



పసిడి చీర. ఇన్‌సెట్‌లో చీరను నేసిన విజయ్‌కుమార్

సిరిసిల్ల: అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసిన సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల పరంధాములు తనయుడు నల్ల విజయ్‌కుమార్.. పది రోజులపాటు శ్రమించి పసిడి కోకను నేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి తన కూతురు పెళ్లి కోసం 200 గ్రాముల బంగారంతో చీర తయారీకి ఆర్డర్ ఇచ్చారు. ఆ మేరకు విజయకుమార్ బంగారంతో నిలువు, అడ్డం పోగులను చేనేత మగ్గంపై నేశారు. 800 నుంచి 900 గ్రాముల బరువు.. 49 అంగుళాల వెడల్పు, ఐదున్నర మీటర్ల పొడవుతో చీరను రూపొందించారు. కట్టుకునేందుకు వీలుగా కొత్త డిజైన్లతో పసిడి కోకను సిద్ధం చేశాడు. ఈ చీర తయారీకి బంగారంతో కలిపి మొత్తం రూ.18 లక్షలు ఖర్చయినట్టు విజయ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 17న సదరు వ్యాపారి కూతురు పెళ్లి ఉండడంతో.. ఆరు నెలల కిందటే ఆర్డర్ తీసుకున్నట్లు తెలిపారు. గతంలో ఉంగరం, దబ్బనంలో దూరే చీరలు, సువాసన వచ్చే చీర, కుట్టులేని జాతీయ జెండాను చేనేత మగ్గంపై నేసిన విజయ్‌కుమార్.. తాజాగా బంగారు చీరను నేయడం విశేషం.

ఫ్యామిలీ డిజిటల్ కార్డులో యజమానిగా మహిళే

- ఈ అంశంపై అధికారులతో ప్రత్యేక భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఒకే కార్డులో రేషన్, ఆరోగ్యశ్రీ, ఇతర పథకాల వివరాలు
- ప్రస్తుతం అందుబాటులోని సమాచారం ఆధారంగా కుటుంబాల నిర్ధారణ
- వచ్చే నెల 3 నుంచి పైలట్ ప్రాజెక్టుగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని నిర్దేశం



శనివారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో మహిళలనే ఇంటి యజమానిగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలను కార్డుల వెనుకభాగంలో ముద్రించాలని సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ)లపై శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశంపై ఈ నెల 25 నుంచి 27 వరకు రాజస్తాన్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించిన అధికారుల బృందం... తమ అధ్యయనానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. కార్డుల రూపకల్పనలో ఆయా రాష్ట్రాలు సేకరించిన వివరాలు, కార్డులతో కలిగే ప్రయోజనాలు, లోపాలను సీఎంకు వివరించింది. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు సీఎం పలు ఆదేశాలు, సూచనలు చేశారు. ప్రస్తుతమున్న రేషన్, ఆరోగ్యశ్రీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా కుటుంబాలను నిర్ధారించాలన్నారు. ఇతర రాష్ట్రాల కార్డు ల రూపకల్పన, జారీలో ఉన్న మేలైన అంశాలను స్వీకరించాలని, లోపాలను పరిష్కరించాలని ఆదేశించారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి సమాచారం సేకరించాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

ప్రతి నియోజకవర్గం పరిధిలోని రెండు ప్రాంతాల్లో...
ఎఫ్‌డీసీ కోసం సమాచార సేకరణ, వాటిల్లో ఏయే అంశాలు పొందుపరచడంతోపాటు మార్పుచేర్పుల వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, దామోదరతో కూడిన మంత్రివర్గ ఉప సంఘానికి అందించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. మంత్రివర్గ ఉప సంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన లేదా తొలగించాల్సిన అంశాల సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రెండేసి ప్రాంతాలను (ఒక గ్రామీణ, ఒక పట్టణ) పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని వచ్చే నెల 3 నుంచి కుటుంబాల నిర్ధారణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, దామోదర్, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు ఉపశమనం

- రాష్ట్రంలో కొత్తగా 7 వాస్క్యులర్ సెంటర్లు, 18 డయాలసిస్ సెంటర్లు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా 7 వాస్క్యులర్ సెంటర్లు, 18 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించింది. అదేవిధంగా ప్రస్తుతం కొనసాగుతున్న డయాలసిస్ కేంద్రాల్లో అదనంగా 74 డయాలసిస్ యంత్రాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్న రోగులకు డయాలసిస్ తప్పనిసరి. వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి వారానికి రెండు నుంచి మూడుసార్లు డయాలసిస్ అవసరమవుతుంది. తొలిసారిగా డయాలసిస్ చేయాల్సినప్పుడు రోగికి ముందుగా శస్త్రచికిత్స చేయాలి. డయాలసిస్‌కు యాక్సెస్ పాయింట్‌ను రూపొందించే సర్జరీ ఇది. సాధారణంగా రోగి చేతి మణికట్టు దగ్గర ఈ పాయింట్ గుర్తించి సర్జరీ చేస్తారు. రక్తప్రసరణ వ్యవస్థకు చికిత్స చేయడంలో నైపుణ్యం కలిగిన వాస్క్యులర్ సర్జన్ ఈ ఆపరేషన్ చేస్తారు. ఈ యాక్సెస్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తేనే డయాలసిస్ ప్రక్రియ సులభతరమవుతుంది. ప్రస్తుతం వాస్క్యులర్ సర్జరీ చేయించుకోవడానికి కిడ్నీ పేషెంట్లు కచ్చితంగా హైదరాబాద్ రావాల్సి ఉంటుంది. దీనివల్ల పేషెంట్లకు ఆర్థికంగా భారం కావడంతో పాటు, నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో వాస్క్యులర్ యాక్సెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిమ్స్, గాంధీ, ఉస్మానియాలతో పాటు ఖమ్మం జనరల్ హాస్పిటల్, వరంగల్ ఎంజీఎం, మహబూబ్‌నగర్ జనరల్ హాస్పిటల్, ఆదిలాబాద్ రిమ్స్‌లో వీటిని అందుబాటులోకి తీసుకురానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఏడు వాస్క్యులర్ సెంటర్ల కోసం రూ.32.7 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. డయాలసిస్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 85 డయాలసిస్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. డిమాండ్‌కు తగిన విధంగా వ్యవస్థ లేకపోవడంతో ఈ కేంద్రాలు అర్ధరాత్రి వరకూ నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్తగా 18 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుతో పాటు, ఇప్పటికే ఉన్న కేంద్రాల్లో అదనంగా 74 మెషీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ప్రస్తుతం ఉన్న సెంటర్లపై ఒత్తిడి తగ్గడమే కాకుండా రోగులకు ఉపశమనం కలగనుంది.

ఇదం జగత్



లక్ష్యం లేదంటూనే అదే లక్ష్యంగా మాట్లాడుతున్నట్లనిపిస్తుంది సార్!

సత్యం, కరుణే ఆయుధం

మహాత్ముడి విజయానికి అదే మార్గం: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాంకేతికతను సాధనంగా మలచుకొని న్యాయానికి బాటలు వేయాలి

- పేదలకూ న్యాయం అందించడానికి కృషి చేయాలి... సామాజిక న్యాయ సాధనకు మీరే ఏజెంట్లు
- 'నల్సార్'స్నాతకోత్సవంలో యువతకు పిలుపునిచ్చిన రాష్ట్రపతి
- పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహా, సీజే జస్టిస్ అలోక్ అరాధే

సాక్షి, హైదరాబాద్: న్యాయానికి సత్యం, కరుణ జోడించినప్పుడే అసలైన విజయం సాధించినట్లని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. ఈ ఆయుధంతోనే మహాత్మా గాంధీ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి దేశానికి స్వేచ్ఛ ప్రసాదించారని చెప్పారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలే ఆదర్శమని రాజ్యాంగం చెబుతోందన్నారు. సాంకేతికతను సాధనంగా మలచుకుని సత్వర న్యాయానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. మానవ శ్రేయస్సు కోసం జంతువులు, పక్షులూ అవసరమని, వాటి సంరక్షణ అందరి బాధ్యతని చెప్పారు. నీటి వనరులను కూడా కాపాడాల్సిన అవసరం ఉందని, యువతరం దీని కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. శనివారం శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ వర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ అలోక్ అరాధే హాజరయ్యారు.

మంత్రిగా పని చేసిన రోజులు గుర్తొచ్చాయి...

'నల్సార్‌లో యానిమల్ లా సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఆనందదాయకం. ఇది 25 ఏళ్ల క్రితం ఒడిశా మత్స్య, జంతు వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా పని చేసిన నాటి సంగతిని గుర్తు చేసింది. జంతువుల రక్షణ, సంక్షేమం కోసం ప్రజలను చైతన్యం చేసేందుకు విస్తృత ప్రయత్నాలు జరగాలి. ఆ దిశగా నల్సార్ ముందడుగు వేసింది. కృత్రిమ మేధ, సాంకేతికత న్యాయవ్యవస్థను ప్రభావితం చేయనుంది. ఆ మార్పులను ఎదుర్కొనేందుకు యువ న్యాయవాదులు సిద్ధంగా ఉండాలి. వృత్తిలో రాణించడానికి, సామాజిక న్యాయం పెంపొందించడానికి సాంకేతికతను సాధనంగా మలచుకోవాలి. మన న్యాయ వ్యవస్థ ఈ నాటిది కాదు. చంద్రగుప్తుడు, చాణక్యుల సమయం నుంచే న్యాయాధికారులు ఉన్నారు. ఒకే వ్యక్తి ఉండకుండా ముగ్గురితో బెంచ్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. కేసులు పరిష్కారమయ్యే వరకు న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య వ్యక్తిగత భేటీకి అనుమతి ఉండేది కాదు. నిష్పక్షపాత న్యాయ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు' అని ముర్ము పేర్కొన్నారు.



10 బంగారు పతకాలు సాధించిన భవ్య జోహరిని అభినందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు

పేదవాడికి న్యాయం అందడంలేదు

'దేశానికి న్యాయం కోసం మహాత్మాగాంధీ న్యాయవాద వృత్తి వదులుకున్నారు. అయినా సత్యాగ్రహం, దోపిడీకి గురైన రైతులకు న్యాయం చేయడం కోసం ఓ న్యాయవాదిలా అడుగులు వేశారు. ఆర్థిక, ఇతర ఏ వైఫల్యాల కారణంగా ఏ పౌరుడికీ న్యాయం నిరాకరించకూడదు. దురదృష్టవశాత్తు ధనవంతుడికి లభించే న్యాయం పేదవాడికి అందడం లేదు. అట్టడుగు వర్గాలకు న్యాయం అందించడంపై యువ న్యాయవాదులు దృష్టి సారించాలి. సామాజిక న్యాయ సాధనకు మీరే ఏజెంట్లు. న్యాయ నిపుణులుగా మీరు ఏ రంగం ఎన్నుకున్నా విలువలకు కట్టుబడండి. శక్తికి నిజంతోడైతే మరింత శక్తివంతమవుతారు. ఇక్కడ పతకాలు పొందిన వారిలో బాలికలు ఎక్కువగా ఉన్నా.. డిగ్రీలు పొందిన వారిలో తక్కువగా ఉన్నారు. ఇది మారాలి. మహిళా సాధికారతకు న్యాయవాదులు కృషి చేయాలి. జువెనైల్ జస్టిస్, న్యాయ సాయం, వైకల్యమున్న వారిపై శ్రద్ధ వహించడంలో నల్సార్ కృషి అభినందనీయం' అని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. అనంతరం న్యాయ విద్య పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలు, వివిధ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 592 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్సార్ వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు, రిజిస్ట్రార్ విద్యుల్లత, అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత్రి డాక్టర్ విజయభారతి కన్నుమూత

డాక్టర్ విజయభారతి బొజ్జా తారకం సతీమణి, సీనియర్ ఐఏఎస్ రాహుల్ బొజ్జా తల్లి



విజయభారతి (ఫైల్)

సనత్‌నగర్/సాక్షి, హైదరాబాద్: ప్రముఖ రచయిత్రి, పద్మభూషణ్ బోయి భీమన్న కుమార్తె, బొజ్జా తారకం సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా మాతృమూర్తి డాక్టర్ విజయభారతి (83) శనివారం ఉదయం కన్నుమూశారు. అనారోగ్యంతో గత కొంతకాలంగా చికిత్స పొందుతున్న ఆమె, సనత్‌నగర్ రెనోవా నీలిమ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలులో ఆమె జన్మించారు. తెలుగు రచయిత్రిగా సుప్రసిద్ధురాలు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆమె ఎంఏ తెలుగు లిటరేచర్, అనంతరం పీహెచ్‌డీ చేశారు. తెలుగు సాహిత్యం, చరిత్ర, సామాజిక అంశాలకు సంబంధించి 20కి పైగా పుస్తకాలను రచించారు. ముఖ్యంగా ఆమె మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్రలను తన పుస్తకాల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లారు. తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతిగా కూడా వ్యవహరించారు. 2005లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 2015లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డులు ఆమెకు దక్కాయి. విజయభారతి పార్థివదేహాన్ని ఆదివారం గాంధీ మెడికల్ కళాశాలకు అందించనున్నారు.

ప్రముఖుల సంతాపం: ప్రముఖ రచయిత్రి, ఐఏఎస్ అధికారి బొజ్జా రాహుల్ తల్లి డాక్టర్ విజయభారతి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. విజయభారతి తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలు అందించడంతో పాటు ప్రాచీన సాహిత్య కోశం, ఆధునిక సాహిత్య కోశం వంటి రచనలు వెలువరించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సాహితీరంగానికి ఆమె చేసిన సేవలు అపారమైనవని పేర్కొన్నారు. రాహుల్ బొజ్జాతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. విజయభారతి మృతిపట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విజయభారతి మరణంపై సెంటర్ ఫర్ దళిత్ స్టూడెంట్ (సీడీఎస్) ఛైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, వైస్ ఛైర్మన్‌కృష్ణ సంతాపం ప్రకటించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై భిన్నాభిప్రాయాలు

- మద్దతు తెలిపిన బీజేపీ
- వ్యతిరేకించిన కాంగ్రెస్, వైఎస్ఆర్‌సీపీ, ఎంఐఎం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ సవరణ బిల్లుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. బిల్లుపై అభిప్రాయ సేకరణ కోసం శనివారం హైదరాబాద్‌కు వచ్చిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ముందు తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వివిధ పక్షాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు వినిపించారు. కాంగ్రెస్ పక్షాన ఎమ్మెల్సీ అమెర్ అలీఖాన్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ పక్షాన జేపీసీ మెంబర్ విజయసాయిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, ఎంఐఎం పక్షాన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వక్ఫ్ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించి తమ వాదనలు వినిపించారు. బీజేపీ పక్షాన బిల్లుకు మద్దతు ఇస్తూ ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు, ఈటల రాజేందర్ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వక్ఫ్ భూముల వివాదాలకు సంబంధించి ఛైర్మన్‌కు వినతి పత్రాలు అందజేశారు. అదేవిధంగా పలువురు మతపెద్దలు సైతం హాజరై తమ వాదనలు వినిపించి లేఖలు ఇచ్చారు.

నాకే గౌరవం లేదు..

- మామూలు ఎస్సీ, ఎస్టీల పరిస్థితేమిటి?
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య



వెంకటయ్య

మెదక్ జోన్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా.. ప్రొటోకాల్ ప్రకారం అధికారులు తననే గౌరవించనప్పుడు.. మామూలు ఎస్సీ, ఎస్టీల పరిస్థితేమిటని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య వాపోయారు. మెదక్ కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన ల్యాండ్, అట్రాసిటీ కేసుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి మంత్రి కొండా సురేఖతో పాటు తాను హాజరైతే.. అధికారులు కనీసం బొకే కూడా ఇవ్వలేదని చెప్పారు. అవమాన భారంతో సమావేశం మధ్యలో నుంచి వెళ్లిపోయానని పేర్కొన్నారు. సమావేశానికి హాజరవుతున్నట్లు ముందుగా సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంతకుముందు మంత్రి దామోదర రాజనర్సింహ వచ్చినా తనకెలాంటి సమాచారం లేదని వెంకటయ్య చెప్పారు.

జేఎన్ఎఫ్ఏయూకు భూ కేటాయింపు నిర్ణయాన్ని విరమించుకోవాలి

సీఎం రేవంత్‌రెడ్డికి పలువురు మేధావులు లేఖ

బంజారాహిల్స్: డా.బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఎఫ్ఏయూ) కేటాయించడాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులోభాగంగా తెలంగాణ మేధావులు, విద్యావంతులు 61 మంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. లేఖ రాసిన వారిలో మాజీ వీసీలు ప్రొఫెసర్లు వి.ఎస్.ప్రసాద్, కె.సీతారామారావు, రామచంద్రం, వాయునందన్, వి.వెంకయ్య, ఘంటా చక్రపాణి, ఎమ్మెల్సీ కోదండరాం, నాగేశ్వర్, పద్మజాషాలతో పాటుగా ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగు యూనివర్సిటీ, సీఫెల్, కాకతీయ, మౌలానా ఉర్దూ యూనివర్సిటీలతో పాటు పలు విద్యా సంస్థల ప్రొఫెసర్లు ఉన్నారు.

30న రైతు హామీల సాధన దీక్షకు రైతాంగం తరలిరావాలి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: నగరంలోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 30న ఉదయం 11 గంటలనుంచి 24 గంటలపాటు నిర్వహించనున్న రైతు హామీల సాధన దీక్షకు రాష్ట్ర రైతాంగం తరలిరావాలని రాష్ట్ర బీజేపీ విజ్ఞప్తి చేసింది. రైతులకిచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు బీజేపీకి మద్దతునివ్వాలని కోరింది. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ దీక్షలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు పాల్గొననున్నారు. దీక్ష ఏర్పాట్లపై శనివారం బీజేపీ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, పాపయ్య గౌడ్ పాల్గొన్నారు.



నేను వాటికి నిత్యజీవమునిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు. ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం,
తిథి: బ.ద్వాదశి సా.5.37 వరకు తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.5.59 వరకు, తదుపరి మఖ,
వర్జ్యం: సా.6.54 నుండి 8.34 వరకు,
దుర్ముహూర్తం: సా.4.16 నుండి 5.04 వరకు,
అమృతఘడియలు: తె.5.08 నుండి ఉ.6.51 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం : 5.50
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అమిత్ షా (హోం మంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"రేపటితో సెప్టెంబర్ ముగుస్తోంది అమిత్ జీ..." అన్నారు మోదీజీ!

ముగియనున్న సెప్టెంబర్‌తో ఆయన ఒక సంభాషణను ఎందుకు ప్రారంభించదలచినట్లు?! లేక, ఎప్పటి సంభాషణనో ముగించటం కోసం సెప్టెంబరును ఒక ప్రారంభంగా ఆయన ఎంచుకుని ఉంటారా?!

"మోదీజీ... కాలానికే కదా 'వచ్చే సెప్టెంబర్', 'పోయే సెప్టెంబర్' ఉంటాయి! కాలాతీత వ్యక్తులకు ఆ 'వచ్చిపోయే' వాటితో పనేమిటి?!' అన్నాను. ఆయనేం మాట్లాడలేదు.

"ఇలా దగ్గరగా కూర్చోండి..." అని మాత్రం అన్నారు. నెమ్మదైన స్వరంతో!

ఆయనకు మరికాస్త దగ్గరకు జరిగాను.

"మీరంటున్న ఈ కాలాతీత వ్యక్తికి వచ్చే సెప్టెంబర్‌కు 75 ఏళ్లు నిండుతాయి అమిత్ జీ..." అన్నారు భావ రహితంగా!

నన్ను కాకుండా, దూరంగా ఉన్న నెమళ్లను చూస్తూ ఆయన ఆ మాట అన్నారు.

"మోదీజీ! నెమలి పురివిప్పినప్పుడు... చూడగానే మొదట మనకు పురి మాత్రమే కనిపిస్తుంది. తర్వాత కానీ నెమలి కనిపించదు. భారత్ ఇప్పుడు పురివిప్పిన నెమలి. ఆ నెమలి శ్రీ నరేంద్ర మోదీ..." అన్నాను... ఆయన్ని



ఆహ్లాదపరిచే ప్రయత్నంగా.

"కానీ, కొంతమంది... నెమలి ఎంత ఎత్తుకు పురివిప్పిందో చూడటం లేదు అమిత్‌జీ. నెమలి పుట్టింది ఎన్ని సెప్టెంబర్‌ల క్రితమో చూస్తున్నారు! నెమలికి 75 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా లోక్ కల్యాణ్ మార్గ్‌లోనే ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు! నెమలికి స్టేజ్ మీద ఉన్నప్పుడే 75 ఏళ్లు నిండుతాయి కనుక నాట్యం ఆపేసి, స్టేజ్ దిగిపోతుందా మరి... అని సవాళ్లు విసురుతున్నారు..." అన్నారు మోదీజీ.

ఆయనలో అదే భావ రహిత స్థితి!

'కొంతమంది' అని ఆయన అన్నది కేజ్రీవాల్ అనే ఒక బయటి వ్యక్తి గురించి మాత్రమే కాదు – ఇక ఎప్పటికీ ప్రధానిగా ఆయనే ఉండిపోతారా? అని – పైకి అనలేకపోతున్న లోపలి మనుషుల గురించి కూడానని నాకు అర్థమయింది. "ప్రధానిగా నన్ను ఉండమని అంతా అడుగుతున్నారు" అని గడ్కరీ చెప్పుకుంటున్నారు. "ప్రజలు నీలో దేవుణ్ణి చూడాలి కానీ, 'నేనే దేవుణ్ణి' అని నువ్వు చెప్పుకోవటం కాదు!" అని మోహన్ భాగవత్ అంటున్నారు. అంటే... 'వయసు మీద పడుతోంది. ఇకనైనా మీరు దిగిపోండి...' అని వారు మోదీజీకి చెప్పటమేగా!

"కానీ మోదీజీ... 75 ఏళ్లకు విరమణ అనేది మన 'విధానమే' తప్ప మన 'నియమం' కాదు కదా! విధానాన్ని మార్చకూడదనే నియమం ఏదీ లేనప్పుడు, నియమమైనా సరే అందరికీ ఒకేలా ఉండే విధానం మాత్రం ఎందుకు ఉండాలి?" అన్నాను.

ఆ మాటకు మోదీజీ కళ్లు మెరిశాయి!!

"మోదీజీ! మీ మూడు రోజుల యూఎస్ పర్యటన ముగించుకుని వచ్చాక, మీ ఫ్లయిట్ ఇంకా గాలిలో ఉండగానే చంద్రబాబు ఏమన్నారో తెలుసా? మీరొక 'టాల్ వరల్డ్ లీడర్' అట. మీ నాయకత్వంలో పని చేయటం తన అదృష్టమట! నితీశ్ కుమార్ కూడా అమెరికా నుంచి మీరు అన్నన్ని ఇన్వెస్ట్‌మెంట్‌లు ఎలా మోసుకుని రాగలిగారని ఇప్పటికీ నివ్వెరపోతూనే ఉన్నారు. ఏక్‌నాథ్ షిండే అయితే – ఇలా వెళ్లి అలా వందల సంఖ్యలో మన పురా వస్తువుల్ని మనకు భలేగా చేతపట్టుకుని వచ్చారని – ఆనందం పట్టలేకపోతున్నారు. అసలు మూడంటే మూడే రోజుల్లో న్యూక్లియర్ ఎనర్జీ, ఎ.ఐ., క్వాంటమ్ టెక్నాలజీ, ఇండో–పసిఫిక్ ఎకనామిక్ ఆర్కిటెక్చర్... ఇన్నిటిని ఎలా కవర్ చేసుకొచ్చారని హెచ్.డి. కుమారస్వామి ఆశ్చర్యపోతున్నారు. వీళ్లంతా మళ్లీ మిమ్మల్నే ప్రధానిగా కోరుకుంటున్నారు. వచ్చే సెప్టెంబర్ తర్వాత మాత్రమే కాదు... 2029 తర్వాతా, 2047 వరకూ కూడా..." అన్నాను.

మోదీజీ కళ్లలోని మెరుపు పురివిప్పింది.

'భావ' రహిత వయఃస్థితి నుంచి 'భార' రహిత మనఃస్థితిలోకి వచ్చినట్లుగా కనిపించారాయన!!

పరిపాలనకు 'తిరు'క్షవరం

జనతంత్రం



వర్ధెల్లి మురళి

వారెవ్వా! ఎంతటి వంచనాశిల్ప చాతుర్యము. శకుని మామ అనేవాడు బతికే ఉంటే ఈ చతురత ముందు మోకరిల్లి పొర్లు దండాలు పెట్టి ఉండేవాడే! జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల దర్శనానికి వెళ్తే పెద్ద ఎత్తున అల్లరి జరగాలి. ఆయన మీద రాళ్లు రువ్వాలి. దాడులకు తెగబడాలి. అందుకు ఏర్పాట్లు కూడా జరిగాయి. వేలాదిమందిని సమీకరించి పెట్టుకున్నారు. వైసీపీ వాళ్లను గృహనిర్బంధం చేశారు. జగన్ యాత్రకు అనుమతి లేదని పేర్కొంటూ ఆ పార్టీ కార్యకర్తలకు నోటీసులు ఇచ్చారు. అయినా కూడా జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లి ఉంటే విధ్వంసానికి రంగం సిద్ధం. అందుకు నెపాన్ని కూడా ఆయన పైనే వేయడానికి స్క్రిప్ట్ రెడీ.

పరిస్థితిని గమనించి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన వాయిదా వేసుకున్నారు. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకనే జగన్ వెళ్లలేదనే ప్రచారం ప్రారంభం. ఈ ప్రచారానికి సాక్షాత్తూ ముఖ్యమంత్రే నాయకత్వం వహించారు. ఆయన ప్రెస్‌మీట్ నుంచి సందేశాన్ని అందుకున్న కూటమి నాయకులు పొట్టోడు, పొడుగోడు అనే తేడా లేకుండా డిక్లరేషన్ దండకాన్ని అందుకున్నారు. ఇదంతా వ్యూహం ప్రకారమే జరిగింది.

తన వంద రోజుల పాలనా వైఫల్యాల నుంచి జనం దృష్టిని మళ్లించడానికి తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని చంద్రబాబు ఓ అభూతకల్పన సృష్టించారు. నిజానిజాలు నిలకడ మీద తేటతెల్లమవుతున్నాయి. దేవస్థానం మార్కెటింగ్ విభాగం వారి నాణ్యతా పరీక్షలను దాటుకొని ప్రసాదం తయారీ చెంతకు కల్తీ నెయ్యి వెళ్లే పరిస్థితే అక్కడున్న వ్యవస్థలో ఉండదు. అందువల్లనే కొన్ని డజన్ల పర్యాయాలు కల్తీ నెయ్యి ట్యాంకర్లు వెనక్కు మళ్లాయి. అట్లా వెనక్కు పంపిన ట్యాంకర్లలోని ఒక శాంపుల్‌నే గుజరాత్‌లో ఉన్న ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పంపించింది. మైసూర్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ల్యాబ్‌కు పంపించే సంప్రదాయానికి భిన్నంగా ఈసారి గుజరాత్‌కు పంపించారు. పంపించడానికి ఒకరోజు ముందు ఎన్‌డీడీబీ చైర్మన్, మాజీ చైర్మన్‌లతో టీటీడీ ఈవో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని కోరుతూ భారత రాష్ట్రపతి, ప్రధాని, చీఫ్ జస్టిస్‌లకు భారత వ్యవసాయ పరిశోధనా మండలి గవర్నింగ్ బాడీ సభ్యుడు బద్రవాడ వేణుగోపాల్ లేఖలు రాశారు.

మైసూర్ ల్యాబ్‌కు కూడా ఇదే కంటైనర్‌లోని శాంపుల్‌ను పంపించినట్టు విశ్వసనీయమైన సమాచారం ఉన్నది. అక్కడి నుంచి రిపోర్టు వచ్చిందా? లేదా? వస్తే ఎందుకు బహిర్గతం చేయడం లేదన్నది ఓ అంతుచిక్కని రహస్యం. వేణుగోపాల్ లేఖ మీద విచారణ జరిగితే చాలా అంశాలు బయటకు రావచ్చు. కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ దేశీయ గోసంపద వృద్ధి లక్ష్యంగా కొన్ని కార్యక్రమాలను ప్రారంభించింది. కానీ ఎన్‌డీడీబీ చైర్మన్, మాజీ చైర్మన్‌లు ఆ కార్యక్రమాలకు తూట్లు పొడుస్తూ సంకర జాతి జెర్సీ ఆవులను ప్రోత్సహించారని కూడా వేణుగోపాల్ ఆరోపించారు.

తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ వారు సరఫరా చేసిన నెయ్యికి సంబంధించి ఈ వివాదమంతా జరుగుతున్నది. వారు ఆన్‌లైన్ టెండర్‌లో పాల్గొని కేజీ నెయ్యికి 319 రూపాయలు కోట్‌చేసి ఎల్–వన్‌గా వచ్చినందువల్ల ఆనవాయితీ ప్రకారం 65 శాతం నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఆ డెయిరీకి అప్పగించారు. ఏపీలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన జూన్ నెలలోనే వారు నెయ్యి సరఫరాను ప్రారంభించారు. ఈ నెయ్యి ధర మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రమైన అభ్యంతరాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అంత తక్కువ ధరకు మంచి నెయ్యిని ఎట్లా సరఫరా చేస్తారన్నది ఆయన ప్రశ్న.

డెయిరీ నిర్వాహకులు చెబుతున్న లెక్కల ప్రకారం ఆవు పాల సేకరణ ధర 35 రూపాయల లోపే వుంటే రూ.300లకు కిలో చొప్పున నాణ్యమైన నెయ్యిని సరఫరా చేయడం అసాధ్యమేమీ కాదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఆవు పాల సేకరణ ధర అంతకంటే తక్కువే ఉన్నది. కనుక ఏఆర్ డెయిరీ కోట్ చేసిన ధర అభ్యంతరకరమైనదేమీ కాదని డెయిరీ నిర్వాహకుల అభిప్రాయం. ఏఆర్ డెయిరీని ఆపేసిన తర్వాత పిలిచిన టెండర్లలో యూపీకి చెందిన ఆల్ఫా ఫుడ్స్ అనే డెయిరీ ఎల్–వన్‌గా నిలిచింది. వాళ్లు రూ. 475 కోట్ చేశారు. పద్ధతి ప్రకారం ఎల్–వన్‌గా ఉన్న ఆల్ఫా ఫుడ్స్ 65 శాతం సరఫరా కాంట్రాక్టును, ఎల్–టూగా ఉన్న నందినీ డెయిరీ వారు 35 శాతం సరఫరా కాంట్రాక్టును దక్కించుకున్నారు.

నందినీ డెయిరీ లోగోలోనే సంకర జాతి జెర్సీ ఆవు బొమ్మ ఉంటుందనీ, వాళ్లు సరఫరా చేసేది దేశీ ఆవు నెయ్యి కాదని



డెయిరీ నిర్వాహకులు చెబుతున్న లెక్కల ప్రకారం ఆవు పాల సేకరణ ధర 35 రూపాయల లోపే వుంటే రూ. 300లకు కిలో చొప్పున నాణ్యమైన నెయ్యిని సరఫరా చేయడం అసాధ్యమేమీ కాదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఆవు పాల సేకరణ ధర అంతకంటే తక్కువే ఉన్నది. కనుక ఏఆర్ డెయిరీ కోట్ చేసిన ధర అభ్యంతరకరమైనదేమీ కాదని డెయిరీ నిర్వాహకుల అభిప్రాయం. ఏఆర్ డెయిరీని ఆపేసిన తర్వాత పిలిచిన టెండర్లలో యూపీకి చెందిన ఆల్ఫా ఫుడ్స్ అనే డెయిరీ ఎల్–వన్‌గా నిలిచింది. వాళ్లు రూ.475 కోట్ చేశారు. పద్ధతి ప్రకారం ఎల్–వన్‌గా ఉన్న ఆల్ఫా ఫుడ్స్ 65 శాతం సరఫరా కాంట్రాక్టును, ఎల్–టూగా ఉన్న నందినీ డెయిరీ వారు 35 శాతం సరఫరా కాంట్రాక్టును దక్కించుకున్నారు.

నందినీ డెయిరీ లోగోలోనే సంకర జాతి జెర్సీ ఆవు బొమ్మ ఉంటుందనీ, వాళ్లు సరఫరా చేసేది దేశీ ఆవు నెయ్యి కాదని స్వదేశీ గో ఉద్యమకారులు అభ్యంతరాలు చెబుతున్నారు. ఇది మరో చర్చనీయాంశం. ఇక ఎల్–వన్‌గా వున్న ఆల్ఫా ఫుడ్స్ డెయిరీ ప్లాంట్‌కు తిరుపతి సుమారు రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నది ఇంత దూరాభారాన్ని మోస్తూ అక్కడినుంచి వాళ్లే సరఫరా చేస్తారా లేక అదే పేరుతో స్థానిక డెయిరీలు ఏవైనా ఆ పని చేస్తాయా, అనే చర్చ కూడా జరుగుతున్నది. ఆల్ఫా డెయిరీ అనేది అన్‌లిస్టెడ్ కంపెనీయే కనుక అదేమీ అసాధ్యమైన వ్యవహారం కాదు. ఇక్కడింకో విచిత్రమైన విషయం ఏమిటంటే నెయ్యి నాణ్యత మీద చంద్రబాబు ఆరోపణలు చేసిన రోజున అంటే సెప్టెంబర్ 19న ఆయన కుటుంబ యాజమాన్యంలోని హెరిటేజ్ డెయిరీ షేర్ విలువ రూ. 565. సరిగ్గా వారం రోజుల్లో సెప్టెంబర్ 27 నాటికి అది రూ. 635 దాటింది. మొత్తంగా చూస్తే వారం రోజుల్లో హెరిటేజ్ సంపద 600 కోట్లు పెరిగింది. ఇది యాదృచ్ఛికమేనా?

స్వదేశీ గో ఉద్యమకారులు అభ్యంతరాలు చెబుతున్నారు. ఇది మరో చర్చనీయాంశం. ఇక ఎల్–వన్‌గా వున్న ఆల్ఫా ఫుడ్స్ డెయిరీ ప్లాంట్‌కు తిరుపతి సుమారు రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇంత దూరాభారాన్ని మోస్తూ అక్కడినుంచి వాళ్లే సరఫరా చేస్తారా లేక అదే పేరుతో స్థానిక డెయిరీలు ఏవైనా ఆ పని చేస్తాయా, అనే చర్చ కూడా జరుగుతున్నది. ఆల్ఫా డెయిరీ అనేది అన్‌లిస్టెడ్ కంపెనీయే కనుక అదేమీ అసాధ్యమైన వ్యవహారం కాదు. ఇక్కడింకో విచిత్రమైన విషయం ఏమిటంటే నెయ్యి నాణ్యత మీద చంద్రబాబు ఆరోపణలు చేసిన రోజున అంటే సెప్టెంబర్ 19న ఆయన కుటుంబ యాజమాన్యంలోని హెరిటేజ్ డెయిరీ షేర్ విలువ రూ. 565. సరిగ్గా వారం రోజుల్లో సెప్టెంబర్ 27 నాటికి అది రూ.635 దాటింది. మొత్తంగా చూస్తే వారం రోజుల్లో హెరిటేజ్ సంపద 600 కోట్లు పెరిగింది. ఇది యాదృచ్ఛికమేనా?

ఇక డిక్లరేషన్ విషయానికొద్దాం. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన ఆధారాలు సుమారు 15 వందల ఏళ్ల క్రితం వరకూ చరిత్రలో మనకు కనిపిస్తున్నాయి. తిరుమలలో అన్యమతస్థులకు ప్రవేశం లేదనిగానీ, వారు డిక్లరేషన్ ఇస్తే తప్ప ప్రవేశించడానికి వీల్లేదని గానీ ఎన్నడూ లేదు. ఈ డిక్లరేషన్ వ్యవహారం 1987లోనే ప్రారంభమైంది. అన్యమతస్థులు శ్రీ వేంకటేశ్వరునిపై భక్తి విశ్వాసాలున్నాయని ప్రకటిస్తూ ఒక ఫామ్‌పై సంతకం చేసి వెళ్లవచ్చునని నిబంధనను తీసుకొచ్చారు. ఇదో అర్థం లేని నిబంధన. ఎవరైనా దేవుడిని ఎందుకు దర్శించుకుంటారు? ఆ దేవునిపై భక్తి విశ్వాసాలు ఉంటేనే కదా!

తిరుమలేశుని దర్శనానికి రోజుకు సుమారు ఐదొందల నుంచి వెయ్యిమంది వరకు అన్యమతస్థులు వస్తుంటారని అంచనా. వారంతా అత్యంత భక్తి విశ్వాసాలతో తిరుమల దేవస్థానం నిర్ణయించిన సంప్రదాయ డ్రెస్ కోడ్‌ను పాటిస్తూ దర్శనం చేసుకుంటారు. అంతే తప్ప రోజుకు ఒక్క డిక్లరేషన్ కూడా రాదు. డ్రెస్ కోడ్‌ను పాటించినంతవరకు దేవస్థానం సిబ్బంది కూడా ఎవరినీ డిక్లరేషన్ అడగదు.

గత రెండు రోజులుగా బీజేపీ – టీడీపీ – జనసేన కూటమి చేస్తున్న హడావిడి విచిత్రంగా ఉన్నది. స్వామివారి వెండి వాకిలి చెంతనున్న బీబీ నాంచారమ్మ మూర్తిని కూడా రోజుకోసారి డిక్లరేషన్ ఇవ్వాలని ఈ సరికొత్త హిందూ భక్తులు డిమాండ్ చేస్తారేమోనన్న అనుమానం కూడా వస్తున్నది. జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మాజీ ముఖ్యమంత్రి. ఆ హోదాలో ఐదేళ్లపాటు బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకుముందు కూడా ఆరేడుసార్లు స్వామి దర్శనం చేసుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా కూడా దర్శించుకున్నారు. ఆయన చరిత్రాత్మక పాదయాత్రను ప్రారంభించడానికి ముందూ, ముగించిన తర్వాత కూడా కాలినడకన వెళ్లి వేంకటనాథుని దర్శనం చేసుకున్నారు.

ఇంతకంటే విశ్వాస ప్రకటన ఇంకేముంటుంది? కాగితం మీద రాసి సంతకం పెట్టి తీరాలనడం వితండవాదం కాక మరేమిటి? ఈ దేశంలో మరే ఆలయంలోనైనా, మసీదులోనైనా, చర్చిలోనైనా, గురుద్వారాలోనైనా ఇటువంటి పట్టింపులున్నాయా? మతం పేరుతో చేసే ఈ రకమైన పిడివాదనలను నూటా ముప్పయ్యేళ్ల కిందనే స్వామి వివేకానందుడు ఈసడించుకున్నారు. మతం అనేది పుస్తకాల్లో, ఉపన్యాసాల్లో, సంస్థలు పెట్టుకొనే నిబంధనల్లో ఉండదు. అది ఆత్మకూ పరమాత్మకూ మధ్యన ఉండే సంబంధమని లండన్ (1895)లో వివేకానందుడు ప్రకటించారు. షికాగోలో జరిగిన విశ్వవ్యాప్త సర్వమత సమ్మేళనంలో హైందవ విశిష్టతను విజయ పతాకంగా ఎగరేసి ప్రశంసలందుకున్న వివేకానందుని కంటే గొప్ప హిందువులా ఈ నడమంత్రపు నామాలవారు?

సహనం హిందూమతపు సహజ భూషణమని ఆయన ప్రకటించారు. సర్వమత సహనాన్ని పాటిస్తాం. అన్ని మతాలు సత్యమైనవనే నమ్ముతాం. ఎక్కడెక్కడో పుట్టిన నదులన్నీ సముద్రంలో చేరినట్టే, అన్ని రకాల ఆరాధనా మార్గాలూ ఆ సర్వేశ్వరుడినే చేరుతాయి. ఇది హిందూమత సారమని వివేకానందుడు ప్రకటించారు. ఏది ఆ స్ఫూర్తి? అటువంటి సహనం నిన్న మొన్నటి వీరాలాపాల్లో కనిపించలేదే? కాషాయ వస్త్రాలు ధరించినవారు కూడా క్షౌరజేసి పళ్లు కొరకడం సమంజసమేనా? హైందవాన్ని అర్థం చేసుకున్నవారేనా వీరు? లేక రాజకీయం కోసం, పబ్బం గడుపుకోవడం కోసం మతం రంగు పులుము కున్న పౌండ్రక వాసుదేవులా?

తిరుమలేశుని దర్శనానికి రోజుకు సుమారు ఐదొందల నుంచి వెయ్యిమంది వరకు అన్యమతస్థులు వస్తుంటారని అంచనా. వారంతా అత్యంత భక్తి విశ్వాసాలతో తిరుమల దేవస్థానం నిర్ణయించిన సంప్రదాయ డ్రెస్ కోడ్‌ను పాటిస్తూ దర్శనం చేసుకుంటారు. అంతే తప్ప రోజుకు ఒక్క డిక్లరేషన్ కూడా రాదు. డ్రెస్ కోడ్‌ను పాటించినంతవరకు దేవస్థానం సిబ్బంది కూడా ఎవరినీ డిక్లరేషన్ అడగదు.

గత రెండు రోజులుగా బీజేపీ – టీడీపీ – జనసేన కూటమి చేస్తున్న హడావిడి విచిత్రంగా ఉన్నది. స్వామి వారి వెండి వాకిలి చెంతనున్న బీబీ నాంచారమ్మ మూర్తిని కూడా రోజుకోసారి డిక్లరేషన్ ఇవ్వాలని ఈ సరికొత్త హిందూ భక్తులు డిమాండ్ చేస్తారేమోనన్న అనుమానం కూడా వస్తున్నది. జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మాజీ ముఖ్యమంత్రి. ఆ హోదాలో ఐదేళ్లపాటు బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకుముందు కూడా ఆరేడుసార్లు స్వామి దర్శనం చేసుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా కూడా దర్శించుకున్నారు. ఆయన చరిత్రాత్మక పాదయాత్రను ప్రారంభించడానికి ముందూ, ముగించిన తర్వాత కూడా కాలినడకన వెళ్లి వేంకటనాథుని దర్శనం చేసుకున్నారు.

ఇంతకంటే విశ్వాస ప్రకటన ఇంకేముంటుంది? కాగితం మీద రాసి సంతకం పెట్టి తీరాలనడం వితండవాదం కాక మరేమిటి? ఈ దేశంలో మరే ఆలయంలోనైనా, మసీదులోనైనా, చర్చిలోనైనా, గురుద్వారాలోనైనా ఇటువంటి పట్టింపులున్నాయా? మతం పేరుతో చేసే ఈ రకమైన పిడివాదనలను నూటా ముప్పయ్యేళ్ల కిందనే స్వామి వివేకానందుడు ఈసడించుకున్నారు.

బీజేపీ సంగతి జగమెరిగిన సత్యమే. ఆ పార్టీ మనుగడకు హిందూమత భావోద్వేగాలే ఆలంబన. ఆర్థిక వృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన వంటి కబుర్లన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో దాని పలుకుబడికి ప్రమాదం ముంచుకొస్తున్నది. అందుకోసం కొత్త స్థావరాలు కావాలి. హిందూ ఎజెండా ఎత్తడానికి అవకాశం దొరికితే అది ఊరుకుంటుందా? ఆంధ్రలో వారి భాగస్వామి చంద్రబాబు ఆ ఎజెండా వారి మెడలో వేశారు. తిరుమలలో జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకుంటామంటూ తెలంగాణ నుంచి కూడా ఆ పార్టీ అనుయాయులు తరలివెళ్లారు.

కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ ఈమధ్య కాషాయ పార్టీ కంటే ఘాటుగా హిందూ భావజాలాన్ని ప్రకటిస్తున్నారు. ఈ సందర్భాన్ని కూడా ఆయన బాగానే ఉపయోగించుకున్నారు. సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు కిందకు ఆలయాల పరిపాలనను తీసుకురావాలనే డిమాండ్ కూడా చేశారు. ఇది ఎప్పట్నుంచో ఆరెస్సెస్ పరివారం చేస్తున్న డిమాండే! ఆలయాల నియంత్రణ మొత్తం కేంద్రం కనుసన్నల్లోకి రావాలనేది వారి సంకల్పం. జమిలి ఎన్నికల ఉద్దేశం కూడా అదే! రాష్ట్రాల స్థాయిని తగ్గించి కేంద్రీకృత అధికారాన్ని పాదుకొల్పడం వారి ఎజెండా. అందుకోసం ఈ దేశంలోని బహుళత్వాన్నీ, భిన్న సంప్రదాయాలనూ కొనసాగించడానికి, గౌరవించడానికి వారు ఇష్టపడరు.

ఇక చంద్రబాబు ప్రస్తుతం ఏడుకొండలవాడే దిక్కనే పరిస్థితుల్లో ఉన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒక్క అడుగూ ముందుకుపడలేదు. వార్షిక బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేని ఏకైక రాష్ట్ర పాలకుడుగా ఇప్పటికే అపఖ్యాతి పాలయ్యారు. వరదల నియంత్రణ కోసం పాటించవలసిన కనీస పాలనా పద్ధతులను కూడా పాటించలేక విజయవాడ మునకకు కారణమయ్యారు. విద్య, వైద్య రంగాల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణలను అటకెక్కించారు. గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచారు. నాలుగు నెలలు నిండకముందే జనంలో ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నది. జనం దృష్టిని మళ్లించడానికి తిరుమల లడ్డూపై ఒక కల్పిత కథను సృష్టించారు. దాని చుట్టూనే రాజకీయాలు తిప్పి గట్టెక్కాలని ప్రయత్నిస్తున్నారు. ఆయన ఎంచుకున్న మార్గం చాలా ప్రమాదకరమైనది. భారీ మూల్యం చెల్లించవలసి రావచ్చు.

vardhelli1959@gmail.com

తొలి కులరహిత ద్రవిడోద్యమ మార్గదర్శి

విశ్లేషణ




డా॥ దేవరాజు మహారాజు

దక్షిణ భారతదేశంలో కులాన్ని ప్రశ్నిస్తూ తొలిసారి గొంతెత్తిన కార్యకర్త అయోతీ థాస్. ఆది ద్రావిడ నేపథ్యం నుండి వచ్చిన ఆయన రాజకీయం, సాహిత్యం, మతం వంటి అనేక రంగాలలో అవిరళ కృషి చేసినవారు. తమిళ పండితుడు. వృత్తి రీత్యా సిద్ధ వైద్యుడు. పంధొమ్మిదవ శతాబ్దం చివరలో ఆది ద్రావిడ ప్రజల అభ్యున్నతి కోసం నడుం బిగించి 1891లో 'కుల రహిత ద్రవిడ మహాసభ'ను స్థాపించారు. ఈ విషయంలో రెట్టమాలై శ్రీనివాసన్ అనే మరో సంఘ సంస్కర్త ఈయనకు సహకరించారు. బౌద్ధం స్వీకరించిన అయోతీ థాస్, పరయల (మాలల) అసలు మతం బౌద్ధమని తేల్చారు. అందరినీ అందులోకి మారమని సూచించారు. కులరహిత సమాజం బౌద్ధం ద్వారానే సాధ్యమని ఉద్బోధించారు.

1861–91 మధ్య కాలంలో క్రైస్తవులు, ముస్లింలు మినహా మిగిలిన వారందరినీ బలవంతంగా హిందువులుగానే పరిగణించేవారు. అయితే అయోతీ థాస్ 'హిందూ' అనే గుర్తింపును నిరాకరించారు. కారణమేమంటే హిందూను గుర్తిస్తే అందులో ఉన్న కుల నిర్మాణాన్ని, నిచ్చెన మెట్ల కుల సంస్కృతిని, అసమానతలను స్వీకరించాలి. అందుకని ఆయన దాన్ని తిరస్కరించడంతో పాటు, తన అనుయాయులందరినీ తిరస్కరించమని సూచించారు.

ఆయన రాజకీయంగా కూడా కొన్ని ప్రయత్నాలు చేశారు. తను స్థాపించిన 'కుల రహిత ద్రవిడ మహా సభ' పక్షాన 10 డిమాండ్లతో ఒక వినతి పత్రం తయారు చేసి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి పంపారు. వారు వాటిని తమ 12వ సమావేశంలో చర్చించారు కూడా! అయితే, అందులో ఒక్క డిమాండుకు కూడా సుముఖత వ్యక్తపరచలేదు. ఆ డిమాండ్లలో ఉచిత విద్య, బంజరు భూముల కేటాయింపు, పరయల ఆలయ ప్రవేశం వంటివి ఉన్నాయి. ఆలయ ప్రవేశం ఇక్కడ భక్తికి సంబంధించిన విషయం కాదు. మనుషులుగా సమాన హోదా, సమాన హక్కుకు సంబంధించిన విషయం. కాంగ్రెస్ పార్టీతో పని కాలేదని అయోతీ థాస్ తన ప్రయత్నం మానుకోలేదు. ప్రత్యామ్నాయ ప్రయత్నాలు



అయోతీ థాస్ (1845-1914)

ప్రారంభించారు. కాంగ్రెస్‌కు పోటీగా 1884లో స్థాపితమైన 'మద్రాస్ మహాజన సభ'కు కూడా అవే పది డిమాండ్ల వినతి పత్రం పంపించారు. కానీ, అక్కడా చుక్కెదురైంది. నిర్వాహక సభ్యులు ఆయనను ఘోరంగా అవమానించారు.

జరిగిన అవమానంతో అయోతీ థాస్ తీవ్రమైన మనోవేదనకు గురయ్యారు. తాము హిందువులమే అయితే జాతి వివక్షణ ఎందుకూ? కుల దూషణలెందుకూ? దేవుడు అందరి వాడైనప్పుడు ఆలయ ప్రవేశం తమకెందుకు ఉండదూ? వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఆయన వాటికి సమాధానాలు కనుగొనే ప్రయత్నంలో వేదాలు, బ్రాహ్మణత్వం, ఆచారాలు వంటి వాటి గూర్చి అధ్యయనం ప్రారంభించారు.

1870 దశకంలో తన పాతికేళ్ళ ప్రాయంలో తమిళనాడు నీలగిరి ప్రాంతంలోని తోడర్–కొండ జాతులను సమైక్యపరిచి 1875లో 'అద్వైతానంద సభ'కు రూపకల్పన చేశారు. అప్పుడే రెవరెండ్ జాన్ రతినమ్‌తో పరిచయం ఏర్పడింది. ఈయన మద్రాసులో ఆది ద్రావిడుల కోసం వెస్లియన్ మిషన్ పాఠశాల నిర్వహిస్తున్నాడు. ఆయన పరిచయంతో అయోతీ థాస్‌కు కొత్త ఉత్సాహం లభించింది. దాంతో 1885లో 'ద్రవిడ పాండ్యన్' అనే వార్తా పత్రికను ప్రారంభించారు. 1886లో 'ఆది ద్రావిడులు హిందువులు కారు' అని భారతదేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన ప్రకటన చేశారు.

1891లో ద్రవిడ మహాసభను స్థాపించి, ఆది ద్రావిడులకు ఒక పిలుపునిచ్చారు. వారంతా తమను తాము హిందువులుగా కాక, 'కుల రహిత తమిళులు'గా ప్రకటించుకోవాలని కోరారు. ఆ రోజుల్లో అదొక సాహసోపేతమైన చర్య. ఒకసారి అయోతీ థాస్ తన అనుచరులతో థియోసాఫికల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడయిన కల్నల్ హెచ్.ఎస్. ఆల్కాట్‌ను కలుసుకున్నారు. బౌద్ధం స్వీకరించాలన్న తన కోర్కెను ఆయనకు తెలియజేశారు. ఆయన అయోతీ థాస్ శ్రీలంకకు వెళ్లే ఏర్పాటు చేశాడు. శ్రీలంకలో అయోతీ థాస్ సింహళ బౌద్ధ భిక్షువు సుమంగళ నాయక్ నుండి ధమ్మదీక్ష స్వీకరించారు. చెన్నై తిరిగి వచ్చాక 1889లో 'శాక్య బౌద్ధ సంఘాన్ని' స్థాపించి, దాన్ని శాఖోపశాఖలుగా విస్తరింపజేశారు. ఈయన అప్పుడు ఏర్పాటు చేసిన శాక్య బౌద్ధ సొసైటీయే కాలక్రమంలో ఇండియన్ బుద్ధిస్ట్ అసోసియేషన్‌గా మారిపోయింది. ద్రవిడ ఉద్యమ పితామహుడిగా నిలిచిన ఆయన, రచయితగా చేసిన కృషి కూడా తక్కువది కాదు. అంబికయ్యన్ కథ, ఇంద్ర జాతి చరిత్ర, ఇంద్ర దేశ బౌద్ధ పండుగలు, తిరువళ్ళువర్ చరిత్ర వంటి డజనకు పైగా గ్రంథాలు రాశారు.

'అయోతీ థాస్'గా ప్రసిద్ధుడైన ఈయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు కాత్తవరాయన్. అయోతీ థాస్ అనేది ఆయనకు ఆయనే పెట్టుకున్న పేరు. బాల్యంలో ఈయన అయోధ్య దాసర్ పండిట్ అనే ఉపాధ్యాయుడి వద్ద చదువు నేర్చుకున్నారు. తమిళం, ఇంగ్లీష్, పాళీ భాషలు, తత్వశాస్త్రం, సిద్ధ వైద్యం... ఇలా అనేక విషయాలు నేర్చుకున్నారు. అందువల్ల గురువుగారి పట్ల ఏర్పడ్డ గౌరవ భావంతో తన పేరు కూడా అయోధ్య దాసర్‌గా చెప్పుకునేవాడు. ఆ పేరే స్థిరపడి అయోతీ థాస్‌గా మారింది. తమిళ పలుకుబడి థాస్ అంటే తెలుగులో దాసుడు అనే అర్థం.

వీరిది విద్యావంతుల కుటుంబం. ఈయన తండ్రి కాంతప్పన్, ఫ్రాన్సిస్ వైటీ ఎల్లిస్ అనే బ్రిటిష్ అధికారి దగ్గర పని చేసేవాడు. తన కుటుంబం తరతరాలుగా భద్రపరచుకుంటూ వచ్చిన తాళపత్ర గంథాలు తిరుక్కురళ్, నాలడియార్‌లను ఫ్రాన్సిస్ ఎల్లిస్‌కు అందించాడు కాంతప్పన్. ఆయన వాటి విలువను గ్రహించి, ఇంగ్లీష్‌లోకి అనువదించాడు. తర్వాత పుస్తకాలుగా ముద్రించి ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆ రకంగా తమిళుల సాంస్కృతిక సంపదైన తిరుక్కురళ్ వెలుగులోకి వచ్చింది. అయోతీ థాస్ 1845 మే 20న మద్రాసులోని రాయపేటలో జన్మించారు. మళ్ళీ అదే మే నెల 5వ తేదీన 1914లో 69వ యేట కన్నుమూశారు. ఒక రకంగా పెరియార్, ద్రవిడర్ కళగమ్, బి.ఆర్. అంబేడ్కర్‌లకు ఈయనే స్ఫూర్తిప్రదాత!

– వ్యాసకర్త సాహితీవేత్త, విశ్రాంత ప్రొఫెసర్
(మెల్బోర్న్ నుంచి)

నేడు 'మూసీ' పర్యటనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బాధితుల్లో భరోసా నింపడమే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని మూసీ పరీవాహక ప్రాంత ప్రజల్లో భరోసా నింపడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆదివారం పర్యటించనున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు కార్పొరేటర్లు ఈ పర్యటనలో పాల్గొంటారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హరీశ్‌రావు తెలంగాణ భవన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి హైదర్షాకోట్‌తో పాటు సమీప కాలనీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పర్యటిస్తుంది. మూసీ పరీవాహక కాలనీల్లో అధికారుల సర్వే పరిశీలన, ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు వినడంతో పాటు బాధితులకు పార్టీపరంగా భరోసా ఇస్తారు.

కూల్చివేతల్ని ఎవరూ తప్పు పట్టడం లేదు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: అక్రమ నిర్మాణాలకు అన్ని ప్రభుత్వాలదీ బాధ్యతని, పార్టీలు కాదని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. హైడ్రా చేపట్టిన కూల్చివేతల్ని ఎవరూ తప్పుపట్టడం లేదన్నారు. కూల్చి వేతల ముందు పేదలకు భరోసా, భద్రత కల్పిస్తే సమస్య ఉండదని ఆయన సూచించారు. బీఆర్ఎస్‌పైన, ఆ పార్టీ నేతలపై ఉన్న కోపాన్ని ప్రజలపై చూపించొద్దని హెచ్చరించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఏ ప్రభుత్వమైనా ఆక్రమణలను కూల్చాల్సిందేనన్నారు. అయితే ఆ కూల్చివేతల ముందు ప్రజల అవసరాలను గుర్తించి అందుకు తగ్గట్టు వ్యవహరించాలని సూచించారు. కొందరి పట్ల ఒకలా, పేదల పట్ల మరొకలా హైడ్రా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హైడ్రా విషయంలో అధికారులు తొందరపడుతున్నారని, వచ్చేది మా ప్రభుత్వమే అని హెచ్చరించారు. గత పదేళ్ల ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా పరిపాలించామని, ఎవరూ ఊహించనిస్థాయికి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామన్నారు. పదేళ్లయినా బయ్యారం ఉక్కు, రైల్వే కోచ్, బీబీనగర్ ఎయిమ్స్ వంటి హామీలు నెరవేరలేదన్నారు. ఏపీలో కలిపిన ఏడు మండలాలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోంది

బీఆర్ఎస్‌పై ఎంపీ చామల మండిపాటు



సాక్షి, న్యూఢిల్లీ: హైడ్రా విషయంలో బీఆర్ఎస్ ప్రజల్ని రెచ్చగొట్టి ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. 28 వేల కట్టడాలు నాలాలు, చెరువులపై ఉన్నాయని, వీటన్నింటినీ కూల్చేస్తామంటూ నాటి సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో చెప్పిన మాటలు నిజం కాదా అని ప్రశ్నించారు. నిజానిజాలను కప్పిపుచ్చి హైడ్రా చేస్తోన్న కార్యక్రమాల్ని బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తోందన్నారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చామల మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కార్ పదేళ్లలో మూసీ ప్రక్షాళన చేయలేదని, రేవంత్ పదినెలల పాలనలో ఆక్రమణలు తొలగిస్తుంటే అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. హైడ్రా భావి తరాల వారికి భవిష్యత్తు లాంటిదని పేర్కొన్నారు. పదేళ్లుగా చిన్నపాటి వర్షానికి నగరం అంతా మునిగిపోతూ ఎందరో పేదలు రోడ్డున పడుతుంటే.. అవేవీ బీఆర్ఎస్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.


దేవుడి పేరుతో రాజకీయాలు చేయొద్దు

టీటీడీ శ్రీవారి లడ్డూ వివాదంపై మీడియా అడిగిన ప్రశ్నలకు చామల స్పందించారు. 'ఎవరూ దేవుడిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయొద్దు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా అక్కడ ఏమైనా తప్పిదాలు జరిగితే.. అవి ప్రజలకు తెలియాల్సిన అవసరం లేకుండా సరిదిద్దేందుకు ప్రక్షాళన చేస్తే బాగుండేది' అని అన్నారు.

సిద్దిపేట మీదుగా ఫోర్‌వే

దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు 20 మీటర్ల వెడల్పుతో నిర్మాణం

అలైన్‌మెంటు ఖరారు.. వచ్చే నెలలో డీపీఆర్ సమర్పణ



సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట మీదుగా నాలుగు వరుసల సరికొత్త జాతీయ రహదారి రూపుదిద్దుకోనుంది. సిద్దిపేట సమీపంలోని దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు రూ.1,100 కోట్ల వరకు వ్యయం రోడ్డు నిర్మించడానికి జాతీయ రహదారుల విభాగం అంచనా వేస్తోంది. ప్రస్తుతం కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్ సిద్ధం చేస్తోంది. వచ్చేనెలలో కేంద్ర ఉపరితల రవాణాశాఖకు జాతీయ రహదారుల విభాగం దానిని సమర్పించనుంది. ఇప్పటికే ఈ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించగా, అలైన్‌మెంట్ కూడా ఖరారైంది.

ఎన్‌హెచ్ 365 బీకి కొత్త రూపు..

సూర్యాపేట నుంచి సిరిసిల్ల వరకు 184 కి.మీ. మేర ఉన్న 365బీ రోడ్డును కేంద్రం విస్తరిస్తోంది. దీనిని జాతీయ రహదారిగా గుర్తించినా, చాలా ఇరుకుగా ఉండి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రం విస్తరిస్తోంది. సూర్యాపేట నుంచి రాజీవ్ రహదారి మీద ఉన్న దుద్దెడ వరకు రెండు వరుసలుగా రోడ్డుగా 10 మీటర్లకు విస్తరించింది. సూర్యాపేట నుంచి జనగామ వరకు పనులు గతంలోనే పూర్తి కాగా, జనగామ నుంచి చేర్యాల మీదుగా దుద్దెడ వరకు పనులు ఇప్పుడు పూర్తి అవుతున్నాయి. ఇక రాజీవ్ రహదారి నుంచి ఈ రోడ్డుకు కొత్తరూపు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. దీన్ని నాలుగు వరుసలుగా 20 మీటర్ల వెడల్పునకు విస్తరించాలని నిర్ణయించింది. ఇప్పుడు ఈ పనులకు శ్రీకారం చుట్టబోతోంది. ఈ భాగం 365బీలో అంతర్భాగమే అయినా, ఇందులో సింహభాగం గ్రీన్‌ఫీల్డ్ హైవేగా పూర్తి కొత్త రోడ్డుగా ఏర్పడబోతోంది.

రాజీవ్ రహదారి మీదుగా కాకుండా..

ప్రస్తుతం 365బీ జాతీయ రహదారి చేర్యాల మీదుగా వచ్చి దుద్దెడ వద్ద రాజీవ్ రహదారిలో కలుస్తుంది. దుద్దెడ నుంచి సిద్దిపేట వరకు ఆ రోడ్డులోనే భాగంగా కొనసాగుతోంది. ఇప్పుడు దాన్ని పూర్తిగా విడదీసి కొత్తరోడ్డుగా నిర్మించేందుకు సిద్ధమయ్యారు. దుద్దెడ వద్ద రాజీవ్ రహదారిని క్రాస్ చేసి సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం వెనక ఉన్న సామాజిక అటవీ భాగం వెనుక నుంచి కోమటి చెరువు పక్క నుంచి సిద్దిపేటకు చేరుతుంది. పట్టణ వెనుక భాగం నుంచి కోటి లింగేశ్వర దేవాలయ సమీపం మీదుగా ముందుకు సాగి రామంచ గ్రామం వద్ద ప్రస్తుతం ఉన్న 365బీ జాతీయ రహదారితో అనుసంధానమవుతుంది. అక్కడి వరకు కొత్త అలైన్‌మెంటుతో రహదారిగా నిర్మిస్తారు. ఆ తర్వాత జక్కాపురం, రామచంద్రాపూర్, నేరెళ్ల, సారంపల్లి, తంగళ్లపల్లి గ్రామాల వద్ద బైపాస్‌లతో రోడ్డుగా రూపొందనుంది. అనంతరం సిరిసిల్ల పట్టణం వద్ద మానేరు నదిని దాటుతుంది. అక్కడ దీనికోసం వంతెన నిర్మిస్తారు. ప్రస్తుతం నేరుగా సిరిసిల్లలోకి చేరే పాత హైవేను కాదని, సిరిసిల్ల బైపాస్ రోడ్డుతో పట్టణం దాటిన తర్వాత బైపాస్ కూడలి వద్ద ఇతర రోడ్లతో అనుసంధానమవుతుంది. 100 మీటర్లు – 150 మీటర్ల వెడల్పు.. ఇలా రెండు ప్రణాళికలను డీపీఆర్‌లో చేర్చనున్నారు. వీటిల్లో కేంద్రం దేనికి మొగ్గుచూపితే అంత వెడల్పుతో రోడ్డుకు భూమిని సేకరిస్తారు. డీపీఆర్ ఆమోదం తర్వాతే వివరాలు వెల్లడవుతాయి. రాజీవ్ రహదారిని క్రాస్ చేసే చోట, సిరిసిల్ల వద్ద మానేరు మీద ఫ్లైఓవర్లు ప్లాన్ చేస్తున్నారు. మధ్యలో కొన్ని చిన్న వంతెనలు కూడా నిర్మిస్తారు. డీపీఆర్‌కు ఆమోదం తర్వాతనే వీటిల్లో వేటికి కేంద్రం ఆమోదం తెలిపిందో స్పష్టత వస్తుందని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

బలవంతంగా ఖాళీ చేయించం.. ఒప్పించి పంపిస్తాం

ఖాళీ చేయడం తప్పనిసరి.. రెండు నెలల్లో పునరావాస ప్రక్రియ పూర్తి చేస్తాం

- 10,600 ఇళ్లను ఖాళీ చేయించి 23 ప్రాంతాలకు తరలిస్తాం
- డబుల్ బెడ్రూం ఇళ్లతోపాటు కొత్తగా రూ.300 కోట్లతో ఇళ్లు నిర్మిస్తాం
- 'మూసీ ప్రాజెక్టు'పై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ వెల్లడి
- హైడ్రా అంటే బూచి కాదు భరోసా.. అనుమతులు లేని నిర్మాణాలనే కూల్చేస్తాం: రంగనాథ్



మీడియాతో మాట్లాడుతున్న రంగనాథ్, దానకిషోర్

సాక్షి, హైదరాబాద్: మూసీ నది రివర్ బెడ్‌తోపాటు బఫర్ జోన్‌లో 10,600 ఇళ్లు, నిర్మాణాలు ఉన్నట్టు గుర్తించామని.. ఆ ఇళ్లను ఖాళీ చేయించి కుటుంబాలను 23 ప్రాంతాలకు తరలిస్తామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తెలిపారు. రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా గుర్తించిన ఇళ్లను ఖాళీ చేయడం తప్పనిసరి అంటూనే.. ఎవరినీ బలవంతంగా ఖాళీ చేయించబోమని, ఇళ్లు కూల్చబోమని చెప్పుకొచ్చారు. రెండు నెలల్లో తరలింపు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇక ''జీహెచ్ఎంసీ, ఇతర స్థానిక సంస్థల నుంచి అనుమతి పొంది బఫర్‌జోన్లలో నిర్మించిన ఇళ్లను నేరుగా కూల్చివేయడం లేదని.. ఆ అనుమతులు రద్దు చేసిన తర్వాతే కూలుస్తున్నామని 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో దానకిశోర్, రంగనాథ్ కలిసి మీడియాతో మాట్లాడారు.

2026 జూన్ నాటికి మూసీలో మంచినీరు: దానకిశోర్

మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా 2026 జూన్ నాటికి మూసీ నదిలో మంచినీరు ప్రవహించాలని సీఎం ఆదేశించారని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ చెప్పారు. ''గోదావరి నుంచి 5 టీఎంసీల నీటిని మూసీలోకి తరలిస్తాం. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ కోసం ఏజెన్సీలను పిలుస్తున్నాం. మూడు నెలల క్రితం మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ అధికారులు మూసీ నది వెంట 55 కిలోమీటర్ల మేర సర్వే చేశారు. అందులో భాగంగా గుర్తించిన ఇళ్లకు వెళ్లి మార్కింగ్ చేసి, రిలోకేషన్ కోసం ఎంపిక చేసిన ప్రాంతాలకు పంపించే ప్రయత్నం చేస్తున్నాం. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల విలువ చేసే డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇస్తున్నాం. కొత్తగా వెళ్లే ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలతోపాటు ఉపాధి లభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటివరకు 974 ఇళ్లను సర్వే చేసి.. 576 ఇళ్లకు మార్కింగ్ చేశాం. వారిలో 470 కుటుంబాలు ఖాళీ చేసి వెళ్లేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. శుక్రవారం 50 మంది పునరావాస ప్రాంతాలకు తరలివెళ్లగా.. శనివారం 200 కుటుంబాల వరకు వెళ్లాయి. 2 నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం. మూసీని ఖాళీ చేసేందుకు అక్కడి కుటుంబాలు సిద్ధంగా ఉన్నాయి..''అని దానకిశోర్ వెల్లడించారు. అయితే కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళతామని చెప్పారు. మూసీ రివర్‌బెడ్‌లో నివసిస్తున్న ఇంటి యజమానులతోపాటు కిరాయిదారులకు పునరావాసం, ఉమ్మడి కుటుంబం కాకుండా వారి వారసులకు ఇళ్లు కేటాయించే అంశం కూడా పరిశీలనకు వచ్చిందని తెలిపారు. అయితే ప్రస్తుతం ఓనర్లకు మాత్రమే ఇళ్లు కేటాయిస్తున్నామని వివరించారు. మూసీలో నిర్మించిన ఎంజీబీఎస్ బస్‌స్టేషన్, మెట్రో రైల్వేస్టేషన్ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు.

అనుమతులు రద్దయ్యాకే ఇళ్లు కూల్చేశాం: రంగనాథ్

జీహెచ్ఎంసీ, ఇతర పట్టణ స్థానిక సంస్థలు అనుమతులు ఇచ్చిన ఇళ్లను తాము కూల్చలేదని 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. బఫర్‌జోన్లలో నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులను మున్సిపాలిటీలు రద్దు చేసిన తరువాతే కూల్చివేశామని చెప్పారు. ఇప్పటివరకు కూల్చినవన్నీ అనుమతులు లేని నిర్మాణాలు, లేదా అనుమతులు రద్దయిన నిర్మాణాలేనని తెలిపారు. ''బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్యకు హైడ్రాకు సంబంధం లేదు. హైడ్రా బూచి కాదు. భరోసా. హైడ్రా సైలెంట్‌గా లేదు. తన పని తాను చేస్తుంది. ధనవంతుల ఇళ్లు, ఫామ్‌హౌస్‌లు, కట్టడాల జోలికి వెళ్లడం లేదనేది వాస్తవం కాదు. వారి ఆక్రమణల కూల్చివేతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. జన్వాడ ఫామ్‌హౌస్ 111 జీవో పరిధిలో ఉంది. 111 జీవో హైడ్రా పరిధిలోకి రాదు. ఒవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన కాలేజీలపై వచ్చిన ఫిర్యాదుల విషయంలో.. విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోతారనే చర్యలు తీసుకోలేదు. ఓఆర్ఆర్ లోపల 565 చెరువులను గుర్తించాం. ఇందులో 136 చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించాం. మిగతావి కూడా గుర్తించాక అన్ని వివరాలు వెబ్‌సైట్లో పెడతాం..''అని రంగనాథ్ తెలిపారు.

మూసీ, హైడ్రాపై ఆచితూచి!

ఈ రెండు అంశాల్లో జాగ్రత్తగా ముందుకెళ్లాలంటున్న టీపీసీసీ

- హైదరాబాద్ సిటీ ఎమ్మెల్యేలతో సమావేశమైన పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- కూల్చివేతలపై అవగాహన, పరిహారం గురించి ప్రజలకు వివరించడంపై చర్చ
- అన్ని విషయాలతో కాంగ్రెస్ పార్టీ పక్షాన సీఎం రేవంత్‌కు సమగ్ర నివేదిక



సాక్షి, హైదరాబాద్: హైడ్రా, మూసీ సుందరీకరణ ప్రాజెక్టులపై ఆచితూచి ముందుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ రెండు ప్రాజెక్టులను చేపట్టడంలో ఎలాంటి అభ్యంతరం లేదని.. కచ్చితంగా ఈ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిందేనని టీపీసీసీ నేతలు అంటున్నారు. కానీ వీటి అమల్లో ముందుకెళ్లే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని పేర్కొంటున్నారు. దీనికి సంబంధించి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ కొందరు హైదరాబాద్ సిటీ ఎమ్మెల్యేలతో మాట్లాడారని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందని, ప్రభుత్వానికి అభినందనలు అందుతున్నాయని.. కానీ ప్రజలకు ఈ అంశాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేలు, నేతలు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కూల్చివేతల వలన కలిగే ప్రయోజనాలు, పరిహార ప్యాకేజీల గురించి ప్రజలకు క్షుణ్నంగా వివరించాలని ప్రభుత్వానికి సూచించాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ అంశంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం చురుగ్గా వ్యవహరించాల్సి ఉంటుందనే అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ టీపీసీసీ పక్షాన ప్రత్యేక నివేదికను సిద్ధం చేస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ శనివారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. త్వరలోనే సీఎం రేవంత్‌ను కలిసి నివేదిక ఇస్తారని వెల్లడించారు.

హరీశ్‌రావు తొలుత మల్లన్నసాగర్ బాధితులను ఓదార్చాలి

మూసీ సుందరీకరణ, హైడ్రా కూల్చివేతల వల్ల పేదలకు నష్టం జరుగుతోందని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు కన్నీరు పెట్టుకున్నారన్న అంశంపై మహేశ్‌గౌడ్ స్పందించారు. హరీశ్‌రావు ఓదార్చాల్సింది హైదరాబాద్‌లో కాదని.. సొంత జిల్లాకు వెళ్లి మల్లన్నసాగర్ బాధితులను ఓదార్చాలని సూచించారు. ఇన్నాళ్లూ మల్లన్నసాగర్ బాధితుల కన్నీళ్లు హరీశ్‌రావుకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. నాడు మల్లన్నసాగర్ బాధితులను పరామర్శించేందుకు వెళ్తే అడ్డుకుని అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మూసీ నదిపై ఉన్నవన్నీ అక్రమ కట్టడాలేనని.. మూసీ ప్రక్షాళన జరిగితే నదీ పరీవాహకంలో ఉన్న రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో సాగునీరు పెరుగుతుందని చెప్పారు. హైడ్రా, మూసీ అభివృద్ధితో కొంతమంది సామాన్యులకు ఇబ్బంది కలుగుతుందని.. హైదరాబాద్ మొత్తానికి లాభం జరుగుతుందని మహేశ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు.

మూసీలో పేదల కన్నీళ్లు పారిస్తారా?

సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

- హైడ్రా పేరిట ప్రభుత్వ హైడ్రామా హైడ్రోజన్ బాంబులా తయారైందని మండిపాటు
- రాష్ట్రంలో నడుస్తున్న బుల్డోజర్ రాజ్యాన్ని ఆపాలని డిమాండ్
- తెలంగాణ భవన్‌లో మూసీ బఫర్‌జోన్ ఇళ్ల బాధితులతో బీఆర్ఎస్ నేతల భేటీ
- బాధితుల గోడు విని హరీశ్, సబిత కంటతడి.. ఉచిత న్యాయ సాయానికి హామీ



బీఆర్ఎస్ భవన్‌లో బాధితులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, సబిత

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: 'మూసీ నదిలో గోదావరి నీళ్లు పారిస్తాం అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి అందులో పేద, మధ్యతరగతి ప్రజల కన్నీళ్లు, రక్తం పారించే ప్రయత్నం చేస్తున్నాడు. హైడ్రా పేరిట మొదలైన సర్కారు హైడ్రామా.. హైడ్రోజన్ బాంబులా మారి ఎవరికీ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది. దేశమంతా తిరుగుతూ బుల్డోజర్ ఉపన్యాసాలు ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు ముందు రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్‌ను ఆపాలి'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మూసీ బఫర్ జోన్ పేరిట తమ ఇళ్ల కూల్చివేతకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ పలువురు బాధితులు శనివారం తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్తీక్‌రెడ్డి, విక్రమ్, బీఆర్ఎస్ లీగల్‌సెల్ బృందం బాధితులతో సమావేశమయ్యారు. వారి గోడు వింటూ హరీశ్, సబిత కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ తరపున ఉచిత న్యాయ సహాయం అందిస్తామని లీగల్ సెల్ సభ్యులు ప్రకటించారు. సమస్యలు ఉంటే తమను 8125535604, 9247817735, 9985507660, 8143726666 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడారు.

పేదల ఇళ్లను రాత్రికిరాత్రే కూలగొడతారా?

'రేవంత్ సోదరునికి నోటీసుల పేరిట 45 రోజుల వ్యవధి ఇచ్చిన ప్రభుత్వం.. పేదల ఇళ్లను రాత్రికిరాత్రే బుల్డోజర్లతో కూలగొడుతోంది. బాధితులంతా రెక్కల కష్టంతో భూములు కొనుక్కొని అన్ని అనుమతులు, బ్యాంకు లోన్లతో ఇళ్లు కట్టుకున్నారు. ప్రభుత్వానికి పన్నులూ కట్టారు. 1993లో అనుమతులు ఇచ్చిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కూల్చడం అన్యాయం'అని హరీశ్‌రావు విమర్శించారు. పది వేల ఇళ్లు కూలుస్తామని తొలుత పేర్కొన్న ప్రభుత్వం.. 25 వేల ఇళ్లు కూల్చేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. బాధితుల వేదన వింటే నాకు బాధగా ఉందని.. పేదల గుండెలు ఆగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా బాధితులు ధైర్యం కోల్పోవద్దని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా రక్షణ కవచంలా నిలబడతారని చెప్పారు.

మమ్మల్ని ఆక్రమణదారులు అంటున్నారు



కష్టపడి ఇల్లు కట్టుకున్నాం. అధికారులు ఇప్పుడు మమ్మల్ని ఆక్రమణదారులని ముద్రవేసి దొంగల్లా చూస్తున్నారు. తలుచుకుంటే కన్నీళ్లు ఆగట్లేదు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక భయంభయంగా గడుపుతున్నాం.

– సిరిమాను

మా లోన్లు ఎవరు కడతారు?

బ్యాంకుల చుట్టూ తిరిగి లోన్లు తెచ్చుకొని ఇళ్లు కట్టుకున్నాం. ఉన్నట్టుండి అభివృద్ధి, సుందరీకరణ పేరుతో మా ఇళ్లు కూలిస్తే లోన్లు ఎవరు కడతారు? మేము ఎక్కడ బతకాలి? మా ఇళ్లు అక్రమమైనప్పుడు ప్రభుత్వం మాకు అన్ని వసతులు ఎందుకు కల్పించింది?

– తేజస్విని, సన్‌సిటీ కేకే నగర్, నర్మద, గంధంగూడ

ఇప్పుడు కూలుస్తామంటే ఎలా?



మా నాన్న ఆర్టీసీలో పనిచేశారు. ఆయన జీతం డబ్బుతో కష్టపడి ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు కూలుస్తామంటే ఎలా? అధికారులే అన్ని వసతులు కల్పించి ఇప్పుడు వారే కూలుస్తామని బెదిరిస్తున్నారు.

– శిరీష, గండిపేట

మాకెందుకు ఆ ఇళ్లు?



మా ఇళ్లు కూల్చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామంటున్నారు. మాకెందుకు ఆ ఇళ్లు? లండన్‌ను చూసి మూసీని అభివృద్ధి చేస్తానంటే ఎలా? తదుపరి దశలో మా ప్రాంత ఇళ్లు కూలుస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. టీవీ చూడాలంటేనే భయమేస్తోంది.

– రాజు, హైదర్‌షాకోట్

'హైడ్రా'పై సందేహాలా?



కమిషనర్ రంగనాథ్ స్వయంగా సమాధానమిస్తారు..

ఫిర్యాదులు, సందేహాలు, సమాచారం కోసం 89777 94588కు వాట్సాప్ చేయండి..

మీతో సాక్షి

హైడ్రా.. ఇప్పుడు అందరి నోటా ఇదే మాట. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా ఈ హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఏర్పాటైంది. బుల్డోజర్లతో చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లలో, నాలాలపై ఉన్న పార్కులు, ఫాంహౌస్‌లు, విల్లాలు, ఇళ్లు, ఇతర నిర్మాణాలను కూల్చేస్తోంది. దీంతో హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రజలను సవాలక్ష సందేహాలు చుట్టుముడుతున్నాయి. అసలు హైడ్రా ఏ నిర్మాణాలు కూల్చేస్తుంది? వేటిని వదిలేస్తుంది? ఏది ఎఫ్‌టీఎల్? ఏది బఫర్ జోన్? భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి? ప్లాట్లు, ఇళ్లు ఖరీదు చేసే ముందు ఏఏ అంశాలు సరి చూసుకోవాలి? ఇలాంటి ప్రశ్నలన్నీ వేధిస్తున్నాయి. మరోవైపు తమ చుట్టూ కబ్జాలు జరుగుతున్నా ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి మరికొందరిది. ఈ నేపథ్యంలోనే 'మీతో సాక్షి' మీ ముందుకొస్తోంది. హైడ్రాకు సంబంధించి మీకు ఎలాంటి సందేహాలున్నా, సమాచారం కావాలన్నా, ఫిర్యాదు చేయాలనుకున్నా 89777 94588 నంబర్‌కు వాట్సాప్ చేయండి. సందేశం, వాయిస్ మెసేజ్, ఫొటోల రూపంలో పంపండి. వీటిని 'సాక్షి' హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్తుంది. ఆయన స్పందన మీకు చేరేలా చేస్తుంది. అసలు హైడ్రా ఏం చేయబోతోందో తెలియజేస్తుంది.

నోట్: తమ పేరు, వివరాలను గోప్యంగా ఉంచాలని ఎవరైనా కోరితే.. వారి అభిప్రాయాన్ని 'సాక్షి' కచ్చితంగా గౌరవిస్తుంది.

హైడ్రా బాధితులకు అండగా నిలవండి

పార్టీ నాయకులు, శ్రేణులకు కేటీఆర్ సూచన



సాక్షి, హైదరాబాద్: హైడ్రా బాధితులకు పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, లీగల్ సెల్ అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రకటించారు. తమ గోడు వినిపించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తున్న బాధితులకు అండగా నిలవాలని పార్టీ నాయకులు, శ్రేణులకు సూచించారు. శనివారం పెద్దఎత్తున హైడ్రా బాధితులు తెలంగాణ భవన్‌కు తరలివచ్చిన విషయాన్ని తెలుసుకున్న కేటీఆర్ వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గడిచిన రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నందున రాలేకపోతున్నట్లు 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు. గురువారం రాత్రి నుంచి జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నట్లు వెల్లడించారు.

రేవంత్ శాఖలో అవినీతి ఘనులు!

నకిలీ డాక్యుమెంట్లు రసీదులు పుట్టించిన కొందరు అక్రమార్కులు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) నుంచి రూ.150 కోట్లు విలువచేసే 1.50 లక్షల టన్నుల ఇసుకను దోచారని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అవసరాల కోసం అంటూ తప్పుడు కాగితాలు సృష్టించి ఇసుకను కొందరు ఇంటి దొంగలు దారిమళ్లించారన్నారు. సాక్షాత్తూ రేవంత్‌రెడ్డి అధీనంలో ఉన్న శాఖలోనే జరిగిన ఈ కుంభకోణం ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా జరిగే అవకాశం లేదని ఆయన అన్నారు.

సమగ్ర మాస్టర్ ప్లాన్ అవసరం

నగర పరిరక్షణపై ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కన్వీనర్ వేదకుమార్



చింతచెట్టు వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వేదకుమార్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర పరిరక్షణకు, అభివృద్ధికి సమగ్రమైన మాస్టర్ ప్లాన్ అవసరమని ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కన్వీనర్, ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణులు ఎం.వేదకుమార్ తెలిపారు. నగరాన్ని ముంచెత్తిన 1908 నాటి మూసీ వరదల 116వ స్మారక కార్యక్రమం శనివారం ఉస్మానియా ఆసుపత్రిలోని ఆ నాటి నుంచి నేటికీ నిలిచి ఉన్న చింత చెట్టు వద్ద జరిగింది. ఆ సంవత్సరం సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా మూసీ మహోగ్రరూపం చెందింది. వేలాది మంది మృత్యువాతపడ్డారు. 150 మంది ఈ చింతచెట్టుపైకి ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు. ఆనాటి పరిణామాలను గుర్తుచేస్తూ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని కాపాడేందుకు, భవిష్యత్‌లో నగర విస్తరణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 1914లోనే అప్పటి ఏడవ నిజాం సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేశారని చెప్పారు.

'జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని తక్షణమే జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. కొన్ని జిల్లాలు ప్రాధాన్యతను కోల్పోయినందున గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని కోరింది.

ఉగ్రవాదాన్ని ఎగదోస్తే తీవ్ర పరిణామాలే



ఐరాస జనరల్ అసెంబ్లీలో మాట్లాడుతున్న భవికా మంగళానందన్

- ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్‌కు భారత్ హెచ్చరిక
- భారత్ గురించి మాట్లాడే అర్హత పాక్‌కు లేదని స్పష్టీకరణ

ఐక్యరాజ్యసమితి: జమ్మూకశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావించిన పాకిస్తాన్‌కు భారత్ గట్టిగా బదులిచ్చింది. భారత్‌కు వ్యతిరేకంగా సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తే తీవ్ర పరిణామాలను స్వయంగా ఆహ్వానించినట్లే అవుతుందన్న సంగతి తెలుసుకోవాలని హితవు పలికింది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు ఉగ్రవాద దాడులపై పాకిస్తాన్ వేలిముద్రలు ఉన్నాయని స్పష్టంచేసింది. ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో శుక్రవారం భారత దౌత్యవేత్త భవిక మంగళానందన్ మాట్లాడారు. ఇదే సభలో తాజాగా పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. ఆర్టికల్ 370పై మాట్లాడారు. దీనిపై భవిక మంగళానందన్ ఘాటుగా స్పందించారు. సైన్యం పెత్తనం కింద నలుగుతూ ఉగ్రవాదాన్ని ఉత్పత్తి చేసే దేశమైన పాకిస్తాన్ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ గురించి మాట్లాడడం ఏమటని నిలదీశారు. ఎన్నికల్లో విచ్చలవిడిగా రిగ్గింగ్‌లు జరిగే దేశం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. భారత దేశ భూభాగాన్ని కబళించేందుకు పాక్ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఆటంకాలు సృష్టించడానికి ఉగ్రవాదాన్ని నమ్ముకుంటోందని ధ్వజమెత్తారు. ఉగ్రవాదానికి, మాదక ద్రవ్యాల వ్యాపారానికి, చీకటి నేరాలకు మారుపేరైన పాకిస్తాన్‌కు భారత్ గురించి నోరువిప్పే అర్హత లేదని భవిక మంగళానందన్ పరోక్షంగా హెచ్చరించారు. పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని పొరుగు దేశాలపై ఒక ఆయుధంగా ప్రయోగిస్తోందన్న సంగతి ప్రపంచం మొత్తానికి తెలుసని పేర్కొన్నారు. తమ దేశ పార్లమెంట్‌పై, ఆర్థిక రాజధాని ముంబై నగరంపై, మార్కెట్లపై, యాత్రా మార్గాలపై దాడులు చేసిన నీచ చరిత్ర పాకిస్తాన్ ఉందని నిప్పులు చెరిగారు. అలాంటి ధూర్త దేశం హింస గురించి నీతులు చెప్పడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. అల్‌ఖైదా ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిన దేశం ఏమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.

అరబ్బుల హీరో

పేద కుటుంబంలో జన్మించి ఉన్నత స్థాయికి చేరుకున్న షేక్ హసన్ నస్రల్లా

- మత విద్య నుంచి హెజ్‌బొల్లా అధినేతగా ప్రస్థానం
- క్యాన్సర్ లాంటి ఇజ్రాయెల్‌ను సమూలంగా నాశనం చేయాలని పిలుపునిచ్చిన నస్రల్లా

హెజ్‌బొల్లా గ్రూప్‌నకు సుదీర్ఘకాలం సారథ్యం వహించిన షేక్ హసన్ నస్రల్లా ప్రస్థానం ముగిసిపోయింది. నిరుపేద కుటుంబంలో జన్మించి, ఉన్నత స్థాయికి చేరుకొని, లక్షల మందిని అభిమానులుగా మార్చుకున్న నస్రల్లా మరణం హెజ్‌బొల్లాకు తీరని నష్టమే అని చెప్పొచ్చు. ఆయన 1960 ఆగస్టు 31న ఉత్తర లెబనాన్‌లో షియా ముస్లిం కుటుంబంలో జన్మించారు. కూరగాయలు విక్రయించే నస్రల్లా తండ్రికి మొత్తం 9 మంది సంతానం. అందరిలో పెద్దవాడు నస్రల్లా. ఆయన బాల్యం తూర్పు బీరూట్‌లో గడిచింది. మత విద్య అభ్యసించారు. చిన్నప్పటి నుంచే మత గ్రంథాలు విపరీతంగా చదివేవారు. తనకు కావాల్సిన పుస్తకాల కోసం సెకండ్-హ్యాండ్ బుక్ షాపుల్లో గాలించేవారు. షియా పండితుడు మూసా అల్-సదర్‌ను ఆరాధించేవారు. రాజకీయాలపై, షియా వర్గం సంక్షేమంపై నస్రల్లాకు చిన్నప్పుడే ఆసక్తి ఏర్పడింది. తమవాళ్ల కోసం పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు.

32 ఏళ్లకే నాయకత్వ బాధ్యతలు

1975లో అంతర్యుద్ధ సమయంలో నస్రల్లా కుటుంబం దక్షిణ లెబనాన్‌కు తరలివచ్చింది. ఆయన 1989లో ఇరాన్‌లోని నజఫ్ సిటీలో కొంతకాలం మత సిద్ధాంతాలు అభ్యసించారు. లెబనాన్‌కు తిరిగివచ్చి 16 ఏళ్ల వయసులో షియా రాజకీయ, పారామిలటరీ గ్రూప్ అయిన అమల్ మూవ్‌మెంట్‌లో చేరారు. ఆ సంస్థలో చురుగ్గా పనిచేశారు. పాలస్తీనియన్ లిబరేషన్ ఆర్గనైజేషన్(పీఎల్‌ఓ)ను అంతం చేయడానికి 1980లో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడిలో పీఎల్‌ఓకు భారీ నష్టం వాటిల్లింది. ప్రతీకారమే లక్ష్యంగా ఇజ్రాయెల్ నిఘా సంస్థ కార్యాలయంపై షియా ఇస్లామిక్ వాదులు దాడికి దిగారు. ఈ ఘటనలో చాలామంది ఇజ్రాయెల్ అధికారులు మరణించారు. అనంతరం షియా ఇస్లామిక్‌వాదులతో హెజ్‌బొల్లా గ్రూప్ ఏర్పాటైంది. ఈ సంస్థ ఏర్పాటు వెనుక సయ్యద్ అబ్బాస్ ముసావీతోపాటు నస్రల్లా కీలక పాత్ర పోషించారు. 1992లో ఇజ్రాయెల్ దాడిలో ముసావీ మరణించారు. దీంతో 32 ఏళ్ల వయసులో హెజ్‌బొల్లా నాయకత్వ బాధ్యతలను నస్రల్లా స్వీకరించారు. హెజ్‌బొల్లా శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దారు. లెబనాన్ సైన్యం కంటే హెజ్‌బొల్లా పవర్‌ఫుల్ అనడంలో అతిశయోక్తి లేదు. మధ్యప్రాచ్యంలోని అరబ్ దేశాల్లో నస్రల్లా పలుకుబడి అమాంతం పెరిగిపోయింది. హెజ్‌బొల్లాకు ఇరాన్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచింది. ఆయుధాలు, డబ్బు అందజేసింది. హమాస్‌తో పాటు మధ్యప్రాచర్యంలోని పలు ఉగ్రవాద సంస్థలకు హెజ్‌బొల్లా శిక్షణ ఇచ్చింది. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంది.

ఇజ్రాయెల్‌కు బద్ధ శత్రువు

ఇజ్రాయెల్‌పై నస్రల్లా అలుపెరగని పోరాటం సాగించారు. పూర్తి అంకితభావంతో పనిచేశారు. 2000 సంవత్సరం నాటికల్లా దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ సేనలను తరిమికొట్టారు. అరబ్ ప్రపంచానికి ఒక ఐకాన్‌గా మారారు. 1997లో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడిలో నస్రల్లా కుమారుడు హదీ మరణించాడు. 1997లో హెజ్‌బొల్లాను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. 2006లో ఇజ్రాయెల్‌పై హెచ్‌బొల్లా సాగించిన యుద్ధం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. లెబనాన్‌లో 34 రోజుల పాటు జరిగిన ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ ఓడిపోయింది. నస్రల్లాను పలు దేశాలు హీరో అంటూ కీర్తించాయి. తమకు కంటిమీద కునుకు లేకుండా చేసిన నస్రల్లాను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. గత 20 ఏళ్లలో ఆయన చాలా అరుదుగానే బహిరంగంగా కనిపించారు. టీవీ, రేడియో ద్వారా తన అనుచరులకు సందేశం చేరవేసేవారు. ఇజ్రాయెల్ ఏ క్షణమైనా దాడిచేసే ప్రమాదం ఉందన్న ఉద్దేశంతో నస్రల్లా ఎక్కువగా అండర్ గ్రౌండ్ బంకర్లలోనే ఉండేవారు. ఇజ్రాయెల్‌తోపాటు అమెరికాను నస్రల్లా తమ బద్ధ శత్రువుగా ప్రకటించారు. క్యాన్సర్ లాంటి ఇజ్రాయెల్‌ను సమూలంగా నాశనం చేయాలని తన అనుచరులకు పిలుపునిచ్చారు. నస్రల్లా వేషధారణ షియా మత బోధకుడిలాగే ఉండేది. వేలాది మంది హెజ్‌బొల్లా సాయుధులను ముందుకు నడిపించే నాయకుడంటే నమ్మడం కష్టం. ఉద్రూతలూగించే ప్రసంగాలకు ఆయన పెట్టింది పేరు. హెజ్‌బొల్లాను రాజకీయ శక్తిగా కూడా మార్చారు. 2005లో లెబనాన్ పార్లమెంటరీ ఎన్నికల్లో హెజ్‌బొల్లా పోటీ చేసింది. రెండు సీట్లు గెలుచుకుంది. అంతేకాదు మంత్రివర్గంలో సైతం హెజ్‌బొల్లా చేరిందంటే నస్రల్లా చాతుర్యం అర్థం చేసుకోవచ్చు. - సాక్షి, నేషనల్ డెస్క్

● బంకర్ బాంబు దాడిలో...

నస్రల్లా మృతి


షేక్ హసన్ నస్రల్లా

బీరూట్: లెబనాన్ ఉగ్ర సంస్థ హెజ్‌బొల్లాకు కోలుకోలేని దెబ్బ తగిలింది. శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన భారీ వైమానిక దాడుల్లో సంస్థ చీఫ్ షేక్ హసన్ నస్రల్లా (64)తో పాటు పలువురు అగ్ర శ్రేణి కమాండర్లు మృతి చెందారు. హెజ్‌బొల్లా కూడా దీన్ని ధ్రువీకరించింది. 'నస్రాల్లా తన తోటి అమరవీరులను చేరుకున్నారు' అంటూ శనివారం ప్రకటన విడుదల చేసింది. 'పాలస్తీనాకు మద్దతుగా శత్రువుపై పవిత్రయుద్ధం కొనసాగుతుంది' అని ప్రతిజ్ఞ చేసింది. నస్రల్లాయే ప్రధాన లక్ష్యంగా లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దళం శుక్రవారం భారీ బాంబు దాడులకు దిగి హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేయడం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే ఏకంగా 80కి పైగా బాంబులతో విరుచుకుపడింది. ఆ క్రమంలో ఏకంగా 2,200 కిలోల బంకర్ బస్టర్ బాంబులను కూడా ప్రయోగించింది. దాడిలో నస్రల్లాతో పాటు ఆయన కూతురు జైనబ్, హెజ్‌బొల్లా సదరన్ కమాండర్ అలీ కర్కీతో పాటు పలువురు కమాండర్లు మృతి చెందినట్టు ఇజ్రాయెల్ పేర్కొంది. నస్రల్లాతో పాటు తమ సీనియర్ సైనిక కమాండర్ అబ్బాస్ నిల్ఫోరుషన్ (58) కూడా దాడుల్లో మృతి చెందినట్టు ఇరాన్ వెల్లడించింది. ''నస్రల్లా కదలికలను కొన్నేళ్లుగా అత్యంత సన్నిహితంగా ట్రాక్ చేస్తూ వస్తున్నాం. అతనితో పాటు హెజ్‌బొల్లా అగ్ర నేతలంతా బంకర్లో సమావేశమైనట్లు అందిన కచ్చితమైన సమాచారం మేరకు లక్షిత దాడులకు దిగాం'' అని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నదావ్ షొషానీ

ధ్రువీకరించిన హెజ్‌బొల్లా

- మృతుల్లో అగ్ర నేతలు, కూతురు
- ఇరాన్ సీనియర్ కమాండర్ కూడా
- దాడులు కొనసాగుతాయి: ఇజ్రాయెల్
- సరిహద్దుల్లో భారీగా మోహరింపులు
- హెజ్‌బొల్లాకు అండగా ఉంటాం: ఇరాన్
- పూర్తిస్థాయి యుద్ధం దిశగా పరిణామాలు

వివరించారు. ''నస్రల్లాను మట్టుపెట్టాం. పలు రకాలైన నిఘా సమాచారం ఆధారంగా నిర్ధారణ కూడా చేసుకున్నాం'' అని ప్రకటించారు. ''అంతేకాదు, గత వారం రోజులుగా చేస్తున్న దాడుల్లో హెజ్‌బొల్లా సాయుధ సంపత్తిని భారీగా నష్టపరిచాం. దాన్ని పూర్తిగా నాశనం చేసేదాకా దాడులు చేస్తాం'' అని తెలిపారు. శుక్రవారం నాటి దాడిలో వాడిన బాంబులు తదితరాలపై మాట్లాడేందుకు నిరాకరించారు. ''హెజ్‌బొల్లా ప్రతీకార దాడులకు దిగుతుందని తెలుసు. మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం'' అని ప్రకటించారు.

హెజ్‌బొల్లాకు ఇరాన్, ఇరాక్ దన్ను

హెజ్‌బొల్లాకు పూర్తిగా అండగా నిలుస్తామంటూ ఇరాన్, ఇరాక్ ప్రకటించాయి. అత్యంత శక్తిమంతమైన ఇరాన్ పార్లమెంటరీ కమిటీ ఆఫ్ నేషనల్ సెక్యూరిటీ శనివారం అత్యవసరంగా సమావేశమైంది. ఇజ్రాయెల్ దాడులకు గట్టిగా జవాబివ్వాల్సిందేనని ముక్త కంఠంతో తీర్మానించింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం తమ సైనిక కమాండర్ మృతికి ప్రతీకారం తీర్చుకునే హక్కుందని ఇరాన్ న్యాయవ్యవస్థ డిప్యూటీ చీఫ్‌రెజా పూర్ ఖగాన్ అన్నారు. ముస్లిం ప్రపంచమంతా పాలస్తీనా, హెజ్‌బొల్లాలకు దన్నుగా నిలవాలంటూ ఇరాక్ కూడా పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా మూడు రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది. ఇరాక్ ప్రధాని మొహమ్మద్ సియా అల్ సుడానీ ఇరాన్, హెజ్‌బొల్లాతోనే అధికారంలోకి వచ్చారు. ఈ నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగడం ఖాయమంటున్నారు. మరోవైపు, నస్రల్లా మృతితో అంతా అయిపోయినట్టు కాదని ఇజ్రాయెల్ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హలేవీ అన్నారు. హెజ్‌బొల్లాపై దాడులు మరింత తీవ్రంగా కొనసాగుతాయని ప్రకటించారు. ఇజ్రాయెల్ ఇప్పటికే అదనపు బలగాలను సమీకరించుకుంటోంది! భూతల దాడులను ఎదుర్కొనేందుకు రెండు బ్రిగేడ్లను ఉత్తర ప్రాంతానికి పంపింది. దేశవ్యాప్తంగా ఉన్న రిజర్వు బెటాలియన్లను కూడా రంగంలోకి దిగాల్సిందిగా ఆదేశించింది. దాంతో లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య ఇప్పటికే తారస్థాయికి చేరిన ఘర్షణలు పూర్తిస్థాయి యుద్ధంగా మారవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హెజ్‌బొల్లా దాడుల వల్ల లెబనాన్ సరిహద్దుల్లో 60 వేల మందికి పైగా తమ ప్రజలు నిర్వాసితులయ్యారని ఇజ్రాయెల్ మండిపడుతోంది. దాడులకు పూర్తిగా స్వస్తి చెప్పేదాకా తగ్గేదే లేదంటోంది. ఇజ్రాయెల్ తాజా దాడుల దెబ్బకు లెబనాన్‌లో గత వారం రోజుల్లోనే ఏకంగా 2 లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారని ఐరాస చెబుతోంది.

కోలుకోలేని దెబ్బ!

మూడు దశాబ్దాలకు పైగా హెజ్‌బొల్లాను నడిపిస్తున్న నస్రల్లా మృతి ఆ సంస్థకు కోలుకోలేని దెబ్బే. హెజ్‌బొల్లాపై తలపెట్టిన తాజా దాడిలో ఇజ్రాయెల్‌కు ఇది అతి పెద్ద విజయంగా భావిస్తున్నారు. హెజ్‌బొల్లా హెడ్డాఫీస్‌తో పాటు ఆరు అపార్ట్‌మెంట్లను నేలమట్టం చేసిన శుక్రవారం నాటి దాడుల్లో మృతులు ఆరుకు, క్షతగాత్రుల సంఖ్య 91కి పెరిగినట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. రెండు వారాల క్రితమే లెబనాన్ అంతటా పేజర్లు పేలి పదుల సంఖ్యలో చనిపోగా వేలాది మంది తీవ్రంగా గాయపడటం తెలిసిందే. దాన్నుంచి తేరుకోకముందే వాకీటాకీలు మొదలుకుని పలు ఎలక్ట్రానిక్ పరికరాలు పేలి మరింత నష్టం చేశాయి. ఇదంతా ఇజ్రాయెల్ పనేనని, మృతులు, క్షతగాత్రుల్లో అత్యధికులు హెజ్‌బొల్లా మిలిటెంట్లేనని వార్తలొచ్చాయి.


శనివారం బీరుట్ శివారు ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడులతో కమ్ముకున్న పొగలు

మరిన్ని దాడులు

బీరూట్: హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ దాడులు శనివారం కూడా కొనసాగాయి. బీరూట్‌తో పాటు తూర్పు లెబనాన్‌లోని బెకా లోయ తదితరాలపై 140కి పైగా వైమానిక దాడులు జరిగాయి. బీరూట్ శివార్లలోని దాహియేలో యాంటీ షిప్ మిసైళ్లు తదితరాలను దాచిన ఆయుధాగారంపైనా దాడులు జరిగాయి. పౌర ఆవాసాల కింద బంకర్లలో వీటిని దాచినట్టు ఇజ్రాయెల్ చెబుతోంది. బీరూట్ వ్యాప్తంగా పలు ప్రాంతాలను పెద్ద ఎత్తున పొగ కమ్ముకోవడం దాడుల తీవ్రతకు అద్దం పట్టింది. దాంతో జనం ఇళ్లు ఖాళీ చేసి ఎగువనున్న పర్వతాల్లోకి పారిపోతున్నారు. హెజ్బొల్లా కూడా ఉత్తర, మధ్య ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు దిగింది. వీటిలో పలు భవనాలు దెబ్బతిన్నట్టు సమాచారం.

సురక్షిత స్థలానికి ఖమేనీ

ఇజ్రాయెల్‌కు బుద్ధి చెబుదాం ● ముస్లిం దేశాలన్నింటికీ పిలుపు



టెహ్రాన్: శత్రువు ఏ మూలన దాక్కున్నా ఇజ్రాయెల్ వెదికి మరీ తుదముట్టిస్తుండటంతో ఇరాన్ అప్రమత్తమైంది. సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీని శనివారం సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఆయన భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ఇజ్రాయెల్ తాజా దాడులను ఖమేనీ తీవ్రంగా ఖండించారు. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ''లెబనాన్‌కు దన్నుగా ముస్లిం ప్రపంచమంతా కలిసిరావాలి. ఇజ్రాయెల్‌ను అణచివేసేందుకు ఏకమవ్వాలి'' అని పిలుపునిచ్చారు. గాజాపై ఏడాదిగా జరుపుతున్న దమనకాండ నుంచి ఇజ్రాయెల్ ఏ పాఠమూ నేర్చుకోలేదంటూ ఖమేనీ మండిపడ్డారు.


నెతన్యాహు దిగగానే.. విమానాశ్రయంలో సైరన్లు

బీరుట్: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటన ముగించుకొని శనివారం టెల్అవీవ్‌కు చేరుకోగానే ఆయనకు క్షిపణి దాడుల హెచ్చరిక సైరన్లు స్వాగతం పలికాయి. టెల్అవీవ్ విమానాశ్రయంలో నెతన్యాహు దిగిన కొద్దిసేపటికే ఎయిర్‌పోర్ట్‌తో పాటు సెంట్రల్ ఇజ్రాయెల్‌లో గగనతల క్షిపణి దాడుల గురించి ముందస్తుగా హెచ్చరించే సైరన్లు మోగాయి. సైరన్లు మోగిన కాసేపటికే యెమెన్ నుంచి ప్రయోగించిన ఒక క్షిపణిని గగనతలంలోనే కూల్చివేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. నెతన్యాహు విమానాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగిందా అన్నదానిపై స్పష్టత లేదు.

బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది. బాస్మతియేతర బియ్యానికి ఎగుమతి సుంకం నుంచి మినహాయింపు ఇచ్చింది. టన్ను బియ్యానికి 490 డాలర్ల కనీస ఎగుమతి ధర నిర్ణయించింది. దేశీయంగా బియ్యం సరఫరాను మెరుగుపర్చేందుకు బాస్మతియేతర బియ్యం ఎగుమతులపై , 2023 జూలై 20న నిషేధం విధించడం తెలిసిందే. దీన్ని ఎత్తేస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శనివారం ప్రకటించింది. గిడ్డంగుల్లో సరిపడా బియ్యం నిల్వలుండటం, రిటైల్ ధరలు నియంత్రణలో ఉండటంతో ఈ నిర్ణయానికి వచ్చింది. బాస్మతియేతర బియ్యంపై ఎగుమతి సుంకం మినహాయించడమే కాకుండా పారాబాయిల్డ్ బియ్యంపై లెవీని 10 శాతం తగ్గించింది. ఇప్పటిదాకా తెల్ల బియ్యంపై ఎగుమతి సుంకం 20 శాతం ఉండేది. 15 రోజుల కింద బాస్మతి బియ్యానికి కనీస ఎగుమతి ధరను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది.

వారసుడు హాషీం?



ఎడతెరిపి లేకుండా ఇజ్రాయెల్ చేస్తున్న ప్రతీకార దాడుల ధాటికి లెబనాన్ ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లా కకావికలవుతోంది. ముఖ్యంగా అగ్ర నాయకత్వమంతా దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది ముందు సంస్థ ఆపరేషన్స్ చీఫ్ ఇబ్రహీం అకీల్, తర్వాత టాప్ కమాండర్ ఫౌద్ షుక్ర్. ఇప్పుడు తాజాగా ఏకంగా సంస్థ అధినేత నస్రల్లా. ఇలా ఒకరి తర్వాత ఒకరుగా అగ్ర నేతలందరినీ రోజుల వ్యవధిలోనే మట్టుపెట్టింది ఇజ్రాయెల్. శుక్రవారం నాటి దాడుల్లో నస్రల్లాతో పాటు కనీసం మరో ఇద్దరు అగ్ర నేతలు కూడా మరణించారు. దాంతో హెజ్‌బొల్లాలో నాయకత్వ సంక్షోభం తలెత్తింది. మూడు దశాబ్దాల పైచిలుకు సారథ్యంలో సంస్థను తిరుగులేని సాయుధ శక్తిగా మార్చిన ఘనత నస్రల్లాది. ఆయన మృతితో ఇప్పుడు ఇజ్రాయెల్ నుంచి ఎదురవుతున్న పెను దాడులను కాచుకుంటూ కష్టకాలంలో సంస్థను ముందుండి నడిపేది ఎవరన్నది పెద్ద ప్రశ్నగా మారింది. కొత్త సారథిగా నస్రల్లాకు వరుసకు సోదరుడయ్యే హాషీం సైఫుద్దీన్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ద టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్‌లో ఇప్పటికే ఈ మేరకు కథనం కూడా వెలువడింది.

హాషీం ప్రస్తుతం హెజ్‌బొల్లా రాజకీయ వ్యవహారాల చీఫ్‌గా ఉన్నాడు. శుక్రవారం నాటి హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ లక్షిత దాడుల్లో అతను కూడా మరణించినట్టు తొలుత వార్తలొచ్చినా అదేమీ లేదని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ తదితర వార్తా సంస్థలు తేల్చాయి. హాషీం ప్రస్తుతం హెజ్‌బొల్లా రాజకీయ వ్యవహారాలు చూడటమే గాక సంస్థ జిహాద్ కౌన్సిల్‌లో కీలక సభ్యుడు కూడా. 2017 లోనే అమెరికా అతన్ని ఉగ్రవాదిగా ప్రకటించింది. పైగా హెజ్‌బొల్లాకు కొమ్ము కాసే ఇరాన్‌తో అతనికి అతి సన్నిహిత సంబంధాలున్నాయి. 2020లో అమెరికా మట్టుపెట్టిన ఇరాన్ సైనిక జనరల్ ఖాసీం సులేమానీ కూతురు జైనబ్‌కు హాషీం మామ అవుతాడు. నస్రల్లా మాదిరిగానే ఇతను కూడా మతాధికారే. తలపాగతో అచ్చం నస్రల్లాను తలపిస్తాడు. 1964లో దక్షిణ లెబనాన్‌లో పుట్టాడు. 1990ల్లో ఇరాన్ లో ఉన్నత చదువులు చదువుతుండగానే హెజ్‌బొల్లా అతన్ని వెనక్కు పిలిపించింది. తర్వాత ఏడాదికే నస్రల్లా హెజ్‌బొల్లా చీఫ్ అయ్యాడు. రెండేళ్లకే హాషీం సంస్థ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సారథి అయ్యాడు. నాటినుంచే నస్రల్లా వారసునిగానూ గుర్తింపు పొందుతూ వస్తున్నాడు. విద్యా వ్యవస్థ, ఆర్థిక వ్యవహారాలు తదితరాలు చూసుకుంటున్నాడు. మారిన పరిస్థితుల్లో హెజ్‌బొల్లాకు సారథి కావాలంటే సంస్థ ఇతర అగ్ర నేతలతో పాటు ఇరాన్ మద్దతునూ హాషీం కూడగట్టుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

కుటుంబ పార్టీలు రాజ్యాంగానికి శత్రువులు

జమ్మూలో ప్రధాని మోదీ ధ్వజం



జమ్మూ: కుటుంబ పార్టీలైన కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) భారత రాజ్యాంగానికి అతిపెద్ద శత్రువులని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. ఓటు బ్యాంక్ కోసం సమాజంలో అణగారిన వర్గాల హక్కులను కాలరాశాయని, రాజ్యాంగ స్ఫూర్తిని హత్య చేశాయని నిప్పులు చెరిగారు. ఆ మూడు పార్టీలు జమ్మూకశ్మీర్‌కు తీవ్ర గాయాలు చేశాయని ఆరోపించారు. జమ్మూకశ్మీర్ ప్రజలు తమ బిడ్డల బంగారు భవిష్యత్తు, శాంతి కోసం అవినీతి, ఉగ్రవాదం, వేర్పాటువాదం లేని మంచి ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. శనివారం జమ్మూలోని ఎంఏఎం స్టేడియంలో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మూడు కుటుంబ పార్టీలకు గట్టిగా బుద్ధి చెప్పాలని ఇక్కడి ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలు, అరాచకాలు, ఉగ్రవాదం, వేర్పాటువాదం, రక్తపాతం, ఉద్యోగాల్లో వివక్షను జనం కోరుకోవడం లేదని తేల్చిచెప్పారు. బీజేపీ ప్రభుత్వం రావాలన్నదే వారి ఆకాంక్ష అని స్పష్టంచేశారు. మొదటి రెండు దశల పోలింగ్ ఓటర్ల మనోగతాన్ని ప్రతిబింబిస్తోందని వెల్లడించారు. బీజేపీ పూర్తి మెజార్టీతో సొంతంగా అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. పాకిస్తాన్ భాషలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు క్షమిస్తారా అని మోదీ ప్రశ్నించారు.

హరియాణాలో కాంగ్రెస్ వస్తే అస్థిరతే: మోదీ

హిస్సార్: హరియాణాలో పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అస్థిరత తప్పదని ప్రధాని మోదీ హెచ్చరించారు. ఆ పార్టీలో అంతర్గత పోరాటం సాగుతోందని, ముఖ్యమంత్రి పదవి కోసం నేతలంతా పోటీ పడుతున్నారని చెప్పారు. బాపు(భూపీందర్ సింగ్), బేటా(దీపేందర్ సింగ్) పోటీలో ఉన్నారని తెలిపారు. శనివారం హరియాణాలోని హిసార్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలో మోదీ మాట్లాడారు.

కర్ణాటకలో

నిర్మలపై కేసు



సాక్షి, బెంగళూరు: అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఎన్నికల బాండ్ల పేరిట రూ.కోట్లు దోచుకున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై బెంగళూరులో కేసు నమోదైంది. నిర్మల తదితరులు పారిశ్రామికవేత్తలను బెదిరించి ఎన్నికల బాండ్ల పేరిట రూ.8,000 కోట్లకుపైగా లూటీ చేశారని జనాధికార సంఘర్ష సంఘటన (జేఎస్‌పీ) నేత ఆదర్శ ఆర్.అయ్యర్ ఫిర్యాదు చేశారు. దాంతో నిర్మల తదితరులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించింది. ఆ మేరకు తిలక్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఏ1గా నిర్మల, ఏ2గా ఈడీ అధికారులు, ఏ3గా బీజేపీ కేంద్ర పదాధికారులు, ఏ4గా కర్నాటక బీజేపీ మాజీ చీఫ్ నళిన్ కుమార్ కటీల్, ఏ5గా ప్రస్తుత చీఫ్ బి.వై.విజయేంద్ర, ఏ6గా రాష్ట్ర బీజేపీ పదాధికారులను చేర్చారు.

నిర్మల రాజీనామా చేయరా: సిద్ధు

కేసు నేపథ్యంలో నిర్మలను కూడా బీజేపీ రాజీనామా కోరుతుందా అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశ్నించారు. 'ముడా' కేసులో ఆయన రాజీనామా చేయాల్సిందేనని బీజేపీ కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తుండటం తెలిసిందే.

హెలెన్ విధ్వంసం

- ఫ్లోరిడాతో పాటు ఆగ్నేయ అమెరికా అతలాకుతలం
- తుపాను సంబంధిత ఘటనల్లో 72 మంది మృతి


అట్లాంటాలో వీధుల్లో పడవ ప్రయాణాలు

ఫ్లోరిడా: అమెరికాను తాకిన భీకర హెలెన్ తుపాను ఫ్లోరిడాతో పాటు ఆగ్నేయ అమెరికాలో అపారమైన విధ్వంసం సృష్టించింది. జార్జియా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, వర్జీనియాల్లో వరదలు, ఇళ్లు కూలిన ఘటనల్లో 72 మంది చనిపోయారు. మృతుల సంఖ్య పెరిగేలా ఉంది. వరద నష్టం 15 నుంచి 26 బిలియన్ డాలర్ల దాకా ఉంటుందని మూడీస్ అంచనా వేసింది. టెన్నెసీలోని యునికోయ్ కౌంటీ హాస్పిటల్‌లోకి వరద చేరడంతో మొత్తం 54 మంది భవనంపైకి చేరారు. వారిని హెలికాప్టర్ ద్వారా కాపాడారు. న్యూపోర్టు సమీపంలో జలాశయం పొంగిపొర్లుతుండటంతో 7 వేల మందిని తరలించారు. నార్త్ కరోలినాలో వందేళ్లలోనే రికార్డు స్థాయిలో వరదలు సంభవించాయని అధికారులు వెల్లడించారు. అట్లాంటాలో 48 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 28.24 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. ఇక్కడ 1878 తర్వాత ఈ స్థాయి వర్షం ఇదే మొదటిసారని జార్జియా వాతావరణ విభాగం ప్రకటించింది. వరదల ధాటికి పార్కు చేసిన కార్లన్నీ మునిగిపోయాయి. ఈ ప్రాంతాన్ని ముంచెత్తాయి. ఫ్లోరిడాలో పలు ప్రాంతాలకు చేరేందుకు పడవలే దిక్కయ్యాయి. ఫ్లోరిడా, జార్జియా, కరోలినాల్లో 30 లక్షల ఇళ్లు, వ్యాపారసంస్థలకు కరెంటు నిలిచిపోయింది. ఇటీవలి ఇడాలియా, డెబ్బీ తుపాన్లను మించిన నష్టం కలిగిందని ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీ శాంటిస్ తెలిపారు. తుపాను తీవ్రత తగ్గినా కుండపోత కొనసాగుతుందని వాతావరణ విభాగం హెచ్చరించింది.

డిప్యూటీ సీఎంగా

ఉదయనిధి



చెన్నై: తమిళనాట వారసుడికి పట్టాభిషేకం జరిగింది. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రిగా పదోన్నతి లభించింది. 2026 అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా 46 ఏళ్ల ఉదయనిధిని డిప్యూటీ సీఎం చేయాలని డీఎంకే శ్రేణులు చాన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. శనివారం స్టాలిన్ ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉదయనిధి డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు కూడా. పలు చిత్రాల్లో నటించడంతో పాటు సినిమాలు నిర్మించారు. మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని కూడా స్టాలిన్ తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మనీలాండరింగ్ కేసులో 471 రోజుల తర్వాత రెండ్రోజుల క్రితమే ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. బాలాజీతో పాటు గోవి చెజియన్, రాజేంద్రన్, నాజర్‌లను స్టాలిన్ కేబినెట్‌లోకి తీసుకున్నారు. టి.మనో తంగరాజ్, జింజీ ఎస్.మస్తాన్, కె.రామచంద్రన్‌లను మంత్రివర్గం నుంచి తొలగించారు.



బుచ్చమ్మది ప్రభుత్వహత్య

'బుచ్చమ్మది ఆత్మహత్య కాదు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య' అని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సమస్యలను పక్కదారి పట్టించేందుకు డ్రామా ఆడుతోందన్నారు. -8లో



సారథి రెడీ

ఆర్టీఏ ఇక సరికొత్త సాంకేతిక హంగులను అద్దుకోనుంది. పౌరసేవలను సులభతరం చేసేందుకు 'సారథి' వ్యవస్థను అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అమలు చేయనుంది. -8లో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది.

కండల కోసం తప్పటడుగులు

అక్రమంగా ఇంజెక్షన్లు విక్రయిస్తున్న నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: కండరాల తక్షణ పెరుగుదల కోసం విని యోగించే మెఫెన్‌టర్‌మైన్ ఇంజెక్షన్‌ను అక్రమంగా కొనుగోలు చేసిన నిందితుడ్ని హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అఫ్సాన్ 150 ఇంజెక్షన్లను కొనుగోలు చేశాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును మెహిదీపట్నం జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.

రేబిస్ వ్యాధి ప్రబలకుండా చర్యలు

సీడీఎంఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ వి.పి.గౌతమ్



కేబీఆర్ పార్కు వద్ద వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న అక్కినేని అమల

బంజారాహిల్స్: ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే రేబిస్ మరణాలు భారతదేశంలోనే ఎక్కువగా ఉన్నాయని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా రేబిస్ వ్యాధి ప్రబలకుండా, ఒక్క మరణం కూడా లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సీడీఎంఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌతమ్ అన్నారు. వరల్డ్ రేబిస్ ప్రివెన్షన్ డే సందర్భంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ దగ్గర పలువురు మున్సిపల్ కమిషనర్లు రేబిస్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్‌తోపాటు హైదరాబాద్ బ్లూ క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ అక్కినేని అమల కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వీధికుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. అనంతరం గౌతమ్ మాట్లాడుతూ 13 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేల శునకాలకు రేబిస్ వ్యాక్సిన్లు వేసినట్టు చెప్పారు. అమల మాట్లాడుతూ కుక్కలను చంపడం ద్వారా కాకుండా, వాటికి వ్యాక్సినేషన్ చేయడం వల్లనే రేబిస్‌ను నివారించడం సాధ్యమవుతుందని అన్నారు. వాటిపై దాడులు చేయడం ఆపి, ప్రేమతో చేరదీయాలన్నారు. వ్యాక్సినేషన్ చేసిన శునకాల చెవుల దగ్గర చిన్న వీకటింగ్ ఉంటుందని, దానిని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

డాన్‌గా ఎదగాలని నేరబాట

పాతనేరస్తుడి అరెస్టు..
7 తుపాకులు, 11 తూటాలు స్వాధీనం



తుపాకులను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నాగోలు: సులువుగా డబ్బులు సంపాదించాలని, డాన్‌గా ఎదగాలని మూడు రాష్ట్రాల్లో తుపాకులను ఉపయోగించి నేరాలకు పాల్పడేందుకు ప్లాన్ వేసిన ఓ పాత నేరస్తుడు పోలీసులకు చిక్కాడు. అతడి వద్ద నుంచి ఏడు దేశవాళీ రివాల్వర్లు, పిస్టళ్లు, తపంచాలు, 11 తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఏపీలోని కాకినాడకు చెందిన బొల్లింకల సాయిరాంరెడ్డి (25) బీకాం చదువును మధ్యలోనే ఆపేశాడు. హైదారాబాద్‌కు వచ్చి నాగోలు బ్రాంచ్ అమెజాన్ ఆఫీస్‌లో బాయ్‌గా 4 నెలలు పనిచేశాడు. జీతం డబ్బులు సరిపోక పోవడంతో దొంగతనాలకు పాల్పడి జైలు పాలయ్యాడు. అక్కడ కొందురు ఖైదీలతో పరిచయాలు పెంచుకున్నాడు. బయటికి వచ్చి గ్యాంగ్ స్టర్ తరహాలో భారీ నేరాలకు పాల్పడాలని ప్లాన్ చేసుకున్నాడు. మహారాష్ట్రలో తుపాకులను తక్కువ ధరకు కొనుగోలు చేసి, నగరంలో ఎక్కువ ధరకు విక్రయించాలనుకున్నాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుంచి ఆయుధాలు తీసుకువస్తుండగా నిఘా పెట్టిన మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు సాయిరాంరెడ్డి అరెస్టు చేశారు. ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్యాంగ్‌లో ఎవరెవరు ఉన్నారనే దానిపై దర్యాప్తు సాగుతోంది. సమావేశంలో మల్కాజిగిరి ఎస్ఓటీ 1 డీసీపీ రమణారెడ్డి, ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ ఎస్.నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐలు సందీప్‌కుమార్, జానయ్య, పరమేశ్వర్ పాల్గొన్నారు.

మలక్‌పేటలోని శంకర్‌నగర్‌లో ఇల్లు ఖాళీ చేస్తున్న నిర్వాసితులు





సానుకూల నిర్వాసితుల తరలింపు

- పునరావాసం కింద తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు
- నిర్వాసితులకు ఉపాధి, సంక్షేమ పథకాల వర్తింపు హామీ
- ప్రభుత్వ ఖర్చులతో వాహనాల్లో సామగ్రి తరలింపు

మూసీ 'మార్కింగ్'కు బ్రేక్!



నిర్వాసితులకు డబుల్ ఇళ్ల ధ్రువపత్రం అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

సాక్షి, సిటీబ్యూరో:

మూసీ పరీవాహకంలోని పేదల ఇళ్లపై రెడ్ మార్కింగ్ ప్రక్రియకు శనివారం బ్రేక్ పడింది. సానుకూలత వ్యక్తం చేస్తున్న కుటుంబాల తరలింపుపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది. పునరావాసం కింద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు తక్షణమే సామగ్రి తరలింపునకు అధికారులు వాహనాలను సైతం సమకూర్చారు. మరోవైపు కుటుంబ జీవనోపాధి కోసం కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక చేయూత, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపునకు స్పష్టమైన భరోసా కల్పిస్తున్నారు. అయితే ఆయా కుటుంబాల్లోని విద్యార్థులకు నివాస సముదాయలకు సమీపంలోని పాఠశాలల్లో అడ్మిషన్లు, అవసరమైతే గురుకులాల్లో ప్రవేశాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నా కొందరు నిర్వాసితులు ససేమిరా అంటున్నారు. ఇక్కడి నుంచి కదలబోమని తేల్చిచెబుతున్నారు.

14 నివాస సముదాయాలకు తరలింపు

మూసీ నదీ గర్భంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారిని శాశ్వత పునరావాసం కింద డబుల్ బెడ్‌రూమ్ గృహసముదాయాలకు తరలిస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు తక్షణమే పట్టా కూడా అందిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో గల పిల్లిగుడిసెలు, జంగమ్మెట్, ప్రతాపసింగారం, సాయిచరణ్ కాలనీ, కమలానగర్, కొల్లూరు-1, గాంధీనగర్, జై భవానీ నగర్, తిమ్మాయిగూడ, నార్సింగ్, బండ్లగూడ, డి.పోచంపల్లి-2, బాచుపల్లిలో గల డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో ఖాళీ ప్లాట్లను నిర్వాసితులకు కేటాయిస్తున్నారు. గతంలో డబుల్ ఇళ్ల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని ఆధార్ కార్డు ఆధారంగా వారికి ఇళ్లను మంజూరు చేస్తున్నారు. జవాబుదారీగా ఉండేందుకు లాటరీ ద్వారా నివాస సముదాయాలను కేటాయిస్తున్నారు.

కలెక్టర్ సుడిగాల పర్యటన

మూసీ పరీవాహక ప్రాంతంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి శనివారం పర్యటించారు. వినాయక వీధి, శంకర్ నగర్ సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి రెండు పడకల గదుల ఇండ్లను లాటరీ ద్వారా కేటాయించి పట్టా సర్టిఫికెట్లు, తాళం చెవులు అందచేస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితుల జీవనోపాధికి, పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తరలి వెళ్లేందుకు సిద్ధమైన నిర్వాసితులు

కాంగ్రెస్‌కు 'గ్యారంటీ'గా కొరివి

కేంద్రమంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్

బండ్లగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయిందని, హైడ్రాతోపాటు ఆరు గ్యారంటీల అంశాలే కాంగ్రెస్ పార్టీకి కొరివి పెట్టబోతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తల గోక్కుంటోందని, మూసీ సుందరీకరణ పేరుతో చుట్టుపక్కలనున్న పేదల ఇండ్లను కూల్చివేసేందుకు సిద్ధమైందని ఆరోపించారు. మలక్‌పేట్ రేసు కోర్సు నుంచి ముసారాంబాగ్ వరకు మూసీ స్థలాలను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అనుచరులు కబ్జా చేశారని, వాటిని టచ్ చేసే దమ్ము ప్రభుత్వానికి ఉందా..? అని ప్రశ్నించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం ఆవరణలో నిర్మించిన నూతన భవన ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ హైడ్రా దుశ్చర్యల వల్ల రియల్ ఎస్టేట్ సంక్షోభంలో చిక్కుకుందని అన్నారు. 'మూసీ సుందరీకరణ పెద్ద బోగస్. గత 30 ఏళ్ల నుంచి ఈ మాటలు వింటూనే ఉన్నాం. మూసీ ప్రక్షాళన పేరుతో జపాన్, జమైకా నుంచి నిధులు తెచ్చిరు. ఒకాయన ఏకంగా హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లలా మారుస్తానన్నాడు... చివరకు ఏమైంది..? అదే మూసీ, అదే కంపూ.. నిధులు మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల జేబుల్లోకి పోయినాయి. మూసీ కంపు బారిన పడి హైదరాబాద్ ప్రజలు రోగాలతో ఆసుపత్రి పాలవుతున్నారు'అని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాలకే పైసల్లేక అల్లాడుతున్న ప్రభుత్వం మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్ల యాడ నుంచి తీసుకొస్తది'అని సంజయ్ ప్రశ్నించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షులు గోకరి అర్జున్‌గౌడ్, కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలో నిమిషానికి రెండు సైబర్ నేరాలు



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో నిమిషానికి రెండు సైబర్ నేరాలు జరుగుతున్నాయని, బాధితులు రూ.1.23 కోట్లు మోసపోతున్నారని రాష్ట్ర ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం డిప్యూటీ సెక్రటరీ భావిష్ మిశ్రా తెలిపారు. సైబర్ నేరాలలో రికవరీ 20 శాతం కంటే తక్కువగా ఉందని ఆయన తెలిపారు. ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్ అండ్ కంట్రోల్ అసోసియేషన్ (ఐఎస్ఏసీఏ) ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ ప్రైవసీ అండ్ ఏఐ' అంశంపై మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో వార్షిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ..ఏడాదిలో ఎనిమిది బిలియన్ల క్రైమ్ జరిగిందని, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణకు ఐటీ, డేటా, పోలీసు విభాగాలతో పాటు ఆడిటర్లు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అనంతరం సైబారాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. సైబర్ నేరాలు వ్యవస్థీకృతంగా మారాయని, అత్యాశ, భయం ఈ రెండే సైబర్ నేరస్తులకు ఆయుధంగా మారుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఏసీఏ బోర్డు ఉపాధ్యక్షుడు దినేష్ దాస్, కార్యదర్శి జీవీ వంశీకృష్ణ, కోశాధికారి సీ వెంకటరాం తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు

రూ.826 కోట్లతో నిర్మాణాలకు ప్లాన్

- ఆరు జంక్షన్ల వద్ద.. సిగ్నల్ ఫ్రీ ప్రయాణాలే లక్ష్యం
- నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లోని కేబీఆర్(కాసు బ్రహ్మానందరెడ్డి) పార్కు చుట్టూ సిగ్నల్ ఫ్రీ రాకపోకల కోసం ఆరు జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈ పనులకు అవసరమైన రూ.826 కోట్లు మంజూరు చేశారు.

హైసిటీ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా ఈ పనులు చేపట్టనున్నారు. పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్ల వద్ద ఈ పనులు పూర్తయితే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ ఐటీ కారిడార్‌కి వచ్చేవారికి ఎంతో సదుపాయం. అక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలతోపాటు వివిధ వ్యాపారాలు, వాణిజ్యాలు జోరుగా సాగుతుండటం తెలిసిందే. సంపన్నవర్గాల వారు, సినీ తారలు, రాజకీయ ప్రముఖులు, ఇతర వీఐపీలు నిత్యం సంచరించే ప్రాంతం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఈ జంక్షన్లపై దృష్టి సారించినట్లు తెలిసింది. అందుకనుగుణంగా పనులు చేపట్టాల్సిందిగా జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించడంతో డిజైన్లు రూపొందించారు. ఈ పనులు పూర్తయితే సిగ్నల్ ఫ్రీగా ప్రయాణాలు సాగించవచ్చు. ఒక మార్గంలో(క్లాక్ వైజ్‌గా) వెళ్లేవారు అండర్‌పాస్‌ల గుండా ప్రయాణిస్తే.. మరో మార్గంలో (యాంటీ క్లాక్‌వైజ్‌గా) వెళ్లేవారు ఫ్లై ఓవర్ల మీదుగా వెళ్లేలా డిజైన్లు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. పనుల్ని రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. వివరాలిలా ఉన్నాయి.

ప్యాకేజీ-1 (రూ.421 కోట్లు)

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్..

- రోడ్ నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్కు, యూసుఫ్‌గూడల వరకు వై ఆకారపు అండర్‌పాస్
- కేబీఆర్ పార్కు ఎంట్రన్స్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్ 36 వైపు 4 లేన్ల ఫ్లై ఓవర్
- యూసుఫ్‌గూడ వైపు నుంచి రోడ్ నెంబర్ 45 జంక్షన్ వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్

కేబీఆర్ జంక్షన్, ముగ్ధ జంక్షన్ల వద్ద..

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు నుంచి కేన్సర్ హాస్పిటల్ జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్
- పంజగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు 3 లేన్ల ఫ్లైఓవర్
- కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ నుంచి పంజగుట్ట వైపు 3 లేన్ల అండర్‌పాస్

ప్యాకేజీ-2 (రూ.405 కోట్లు)

రోడ్ నెంబర్ 45 జంక్షన్..

- ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌వైపు 2 లేన్ల అండర్‌పాస్
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి రోడ్ నెంబర్ 45 వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్

ఫిల్మ్‌నగర్ జంక్షన్..

- మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్ 45 జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్
- ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్

మహారాజా అగ్రసేన్ జంక్షన్..

- కేన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిల్మ్‌నగర్ జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్
- ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి రోడ్‌నెంబర్ 12 వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్

కేన్సర్ హాస్పిటల్ జంక్షన్..

- కేబీఆర్ పార్కు నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్
- మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్ 10 వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్

చిత్తశుద్ధితో.. చెత్తశుద్ధి!

జీహెచ్ఎంసీ చెత్తశుద్ధిలో అన్నీ ఉన్నాయి, ఒక్క చిత్తశుద్ధి తప్ప! ఇళ్ల నుంచి చెత్త సేకరణ నిమిత్తం కార్మికులకు ఉచితంగానే ఆటోలిచ్చి బ్యాంకు లోన్లకు జీహెచ్ఎంసీనే ఈఎంఐలు చెల్లిస్తున్నా నగరంలో స్వచ్ఛత కరువైంది. కారణం.. స్వచ్ఛ ఆటోలపై కానీ, వాటిని నడుపుతున్న కార్మికులు, సహాయకులపై కానీ అధికారులకు ఎలాంటి అజమాయిషీ లేకపోవడమే. ఇళ్లకు బదులు హోటళ్ల నుంచి చెత్త తరలిస్తూ వ్యాపారం చేసుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదు. ఆటోలు మాయమైనా అడిగేనాథుడు లేదు.

– సాక్షి, సిటీబ్యూరో

స్వచ్ఛ ర్యాంకింగ్స్‌లో 'ఇండోర్'నెంబర్ 1



ఆ ఇంటినెంబరుకు స్వచ్ఛ ఆటో వెళ్లాల్సిన సమయం ఉదయం 9.15-9.30లు (అది సీరియల్ నెంబర్ 10 వద్ద చూడవచ్చు) ఇంటి నెంబర్లు 5/136 నుంచి 154 వరకు..

- ఆటోలకు చెత్త ఇవ్వకుంటే చర్యలక్కడ..
- ప్రతిరోజూ ఇళ్లకు ఆటోలే రావు ఇక్కడ
- అధ్యయనాల మీద అధ్యయనాలు.. ఆచరణ శూన్యం

ఇండోర్‌లో అలా..

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఇండోర్ పరిస్థితి మన నగరం లాగా లేదు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలకు.. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఉద్యోగులే సకాలంలో రారు. కానీ, అక్కడ ఉదయం 6.30 గంటలకే కార్మికులు వచ్చి 7 గంటల నుంచి ఇంటింటికీ చెత్త సేకరణ నిమిత్తం బయల్దేరుతారు. 7.15 గంటలకు ఆయా కాలనీల్లోని ఏ లైనుకు వెళ్లాలి.. ఆ తర్వాత ఏ లైనుకు అనేది ముందే నిర్ణయించుకుని అక్కడికే బయలుదేరుతారు. తొలుత వెళ్లాల్సిన లైనుకు కాకుండా వేరే లైనుకు వెళితే ఊరుకోరు. ప్రతి ఆటోను పర్యవేక్షించే వారుంటారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆటోల కదలికలను పర్యవేక్షించే ఉద్యోగులుంటారు. సమయం, వెళ్లాల్సిన వీధుల విషయంలో తేడావస్తే వెంటనే హెచ్చరిస్తారు. సంబంధిత కార్మికుల ఫోన్‌కు మెసేజ్ వెళ్తుంది. అక్కడ జరుగుతున్న చెత్తసేకరణ తీరుకు ఇదో ఉదాహరణ. ఇండోర్‌లోనే కాదు.. లక్నోలోనూ ఏ ఆటో ఎన్ని గంటలకు, ఏ వీధిలో, ఏ నెంబరు ఇంటికి వెళ్లాలో సరిగ్గా అక్కడకే వెళ్తుంది. ఉదాహరణకు... వెళ్లాల్సిన సమయం 7.15 నుంచి 7.30 గంటల మధ్య అని నిర్ధారిస్తే, ఆ సమయంలోనే ఆటో వెళ్తుంది. ప్రజలకు కూడా చెత్త ఆటో వస్తుందో , రాదో అనే అనుమానం ఉండదు.



ఆరు రకాలుగా చెత్తను వేసేందుకు ఆటోకు ఉన్న ఆరు భాగాలు

ఆరు రకాలుగా చెత్త సేకరణ...

అధ్యయన యాత్రలకు వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులు, కొందరు కార్పొరేటర్ల ద్వారా తెలిసిన సమాచారం మేరకు... ఇండోర్‌లో అయినా, లక్నోలో అయినా చెత్తను ప్రజలే ఆటోల వద్దకు తెచ్చి ఇస్తారు. కార్మికులు ఆయా భవనాల్లోని అంతస్తులకు వెళ్లరు. ఇండోర్‌లో చెత్తను ఆరు రకాలుగా వేరు చేసి సంబంధిత బాక్సుల్లోనే వేస్తారు. ప్లాస్టిక్, నాన్‌ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, హజార్డస్, శానిటరీ వేస్ట్‌తో పాటు సేంద్రియ ఎరువుకు పనికొచ్చే తడిచెత్తను విడిగా వేస్తారు. ఒకవేళ ఏ ఇంటి నుంచైనా వరుసగా రెండురోజులు చెత్త రాకపోతే ఆరా తీస్తారు. వెళ్లి చూస్తారు. తాళం ఉంటే ఊరికి వెళ్లారనుకుంటారు. ఉండీ వేయకపోతే.. ఎందుకు వేయలేదో ప్రశ్నించడమే కాదు.. బహిరంగ ప్రదేశాల్లో వేసినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటారు. పెనాల్టీలు విధిస్తారు. అందుకే ఇండోర్ స్వచ్ఛ ర్యాంకింగ్స్‌లో నెంబర్‌వన్‌గా ఉంటోంది. జీహెచ్ఎంసీ అధికారులు, పాలకమండలి నేతలు గతంలోనూ ఇండోర్‌కు అధ్యయనం నిమిత్తం వెళ్లారు. అక్కడి విధానాలను ఇక్కడ అమలు చేస్తామన్నారు. ఏళ్లు గడుస్తున్నాయి కానీ అతీగతీలేదు. ఇటీవల మళ్లీ వెళ్లివచ్చారు. ఏం చేస్తారో చూడాలి మరి!

చెత్త సేకరణకు నో చార్జి

ఇండోర్‌లో స్వచ్ఛ ఆటోలు కార్పొరేషన్ కార్యాలయాల్లో నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలోనే ఉంటాయి. కార్మికులు ఆటోలను ఇళ్లకు తీసుకు వెళ్లరు. వారికి వేతనాలను కార్పొరేషన్ చెల్లిస్తుంది. ఇక్కడి మాదిరిగా ప్రజల నుంచి కార్మికులు సేకరణ చార్జీగా తీసుకోరు. ఆటోలు కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే.. వేతనాలు చెల్లించేది కార్పొరేషనే.. అందుకే ఆజమాయిషీ ఉంటుంది. పనిచేయని వారిపై చర్యలుంటాయి. ఎప్పుడైనా, ఎక్కడైనా మార్గమధ్యంలో ఏదైనా ఆటో మరమ్మతుకు గురైతే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం వెళ్తుంది. సదరు ఆటో వెళ్లాల్సిన ఇళ్లకు వేరే ఆటోను అప్పటికప్పుడే పంపిస్తారు. మధ్యాహ్నానికల్లా అన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరణ జరిగి తీరాల్సిందే. అదీ అక్కడి నిబద్ధత. చిత్తశుద్ధి! హైదరాబాద్‌లో ప్రతిరోజూ ప్రతి ఇంటికీ స్వచ్ఛ ఆటోలు వెళ్లవు. రెండు, మూడు రోజులకోమారు వెళ్తాయి. వెళ్లక పోయినా ఎవరిపైనా ఎలాంటి చర్యలుండవు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియదు. ఇదీ ఇక్కడి దుస్థితి!

ఖర్చు మాత్రం భారీగానే..

జీహెచ్ఎంసీలోనూ చెత్త కోసం స్వచ్ఛ ఆటోలున్నాయి. తడి-పొడి అంటూ వేరుగా వేసేందుకు అరలున్నాయి. కానీ, కలిపే వేస్తున్నారు. ఒకటికి మించి కమాండ్ కంట్రోల్ సెంటర్లున్నాయి. పారిశుధ్య విభాగంలో అధికారులూ తక్కువేం లేరు. ఆటోల కదలికలు గుర్తించేలా ప్రత్యేక యాప్ తెస్తామన్నారు. ప్రతి ఇంటికీ క్యూఆర్ కోడ్ అమర్చి చెత్త సేకరించగానే ఆన్‌లైన్ నుంచే తెలుసుకునే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇంకా చాలా చెప్పారు. అన్నీ ఆరంభ శూరత్వాలు, మూణ్నాళ్ల ముచ్చటలుగా ముగిశాయి. అధ్యయన యాత్రల పేరిట వెళ్లామా.. వచ్చామా.. అన్నట్లు కాకుండా ఏవైనా బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేస్తేనే ఆ యాత్రలకు సార్థకత అని, లేకుంటే కేవలం విహారయాత్రలుగానే మిగులుతాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటీవల అధ్యయనయాత్రలకని వెళ్లిన కార్పొరేటర్లు అధికారికంగా పేర్కొన్న ప్రాంతాలే కాక.. ఇతర ప్రాంతాలకూ వెళ్లినట్లు సమాచారం.



ప్రజలే చెత్తను ఆటో వద్దకు తెచ్చి వేయడం

'సారథి' రెడీ

- నరికొత్త సాంకేతిక హంగులతో ఆర్టీఏ సేవలు
- అక్టోబర్ 1న సికింద్రాబాద్‌లో ప్రారంభించనున్న మంత్రి పొన్నం
- డ్రైవింగ్, లెర్నింగ్ లైసెన్సులు, రెన్యూవల్స్, ఎన్‌ఓసీలు సులభతరం...
- సారథి నుంచే స్లాట్ నమోదుకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ఇక సరికొత్త సాంకేతిక హంగులను అద్దుకోనుంది. రవాణాశాఖ అందజేసే వివిధ రకాల పౌరసేవలను మరింత సులభతరం చేసే లక్ష్యంతో రూపొందించిన 'సారథి' సాంకేతిక వ్యవస్థను అక్టోబర్ ఒకటో తేదీ నుంచి సికింద్రాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తేనున్నారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీఏల్లో ఒకేసారి 'సారథి' సేవలు వినియోగంలోకి వస్తాయి. కేంద్రం కొత్తగా ఏర్పాటు చేసిన జాతీయ సమాచారం కేంద్రం (నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్)తో సారథిని అనుసంధానం చేస్తారు. అక్టోబర్ 1న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సికింద్రాబాద్‌లో 'సారథి'ని లాంఛనంగా ఆవిష్కరించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా రవాణాశాఖ సేవలన్నింటిని ఏకీకృతం చేసే లక్ష్యంలో భాగంగా ఇప్పటికే పలు రాష్ట్రాల్లో 'వాహన్'ను అమల్లోకి తెచ్చారు. ఇది వాహన గణాంకాలను నమోదు చేసే సాంకేతిక వ్యవస్థ. ఇప్పటి వరకు వాహన్ సేవలు హైదరాబాద్‌లో అమల్లోకి రాలేదు. కానీ దీనికి



సమాంతరంగా రూపొందించిన 'సారథి'ని ప్రస్తుతం అమలు చేస్తున్నారు. ఇది డ్రైవింగ్ లైసెన్సుల సేవలను నమోదు చేసే సాంకేతిక వ్యవస్థ. ఇది విజయవంతమైన తరువాత 'వాహన్'ను అమలు చేసే అవకాశం ఉందని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

సారథితో సాంకేతిక దన్ను...

- అన్ని రకాల డ్రైవింగ్ లైసెన్సుల డేటాను సారథిలో నిక్షిప్తం చేస్తారు. దీనిద్వారా వాహన వినియోగదారులు తమకు అవసరమైన పౌరసేవలను సారథి నుంచి నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుంది.
- డ్రైవింగ్ లైసెన్సులను పునరుద్ధరించుకోవడం, చిరునామాల్లో మార్పులు వంటి సర్వీసులకు సారథి సేవలను వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం టీ-యాప్ ఫోలియో ద్వారా ప్రత్యక్ష సేవలు లభిస్తుండగా ఇక నుంచి సారథి నుంచి వాటిని పొందేందుకు అవకాశం ఉంటుంది.
- వాహనదారులు సారథితో పాటు టీ-యాప్ ఫోలియోను కూడా వినియోగించుకోవచ్చునని అధికారులు తెలిపారు.
- ఇలా సారథి నుంచి ప్రత్యక్షంగా పౌరసేవలను పొందడమే కాకుండా స్లాట్ నమోదు ద్వారా పౌరసేవలను నమోదు చేసుకొనే పద్ధతి కూడా అందుబాటులో ఉంటుంది.
- గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల నుంచి అందజేసే డ్రైవింగ్ లైసెన్సుల వివరాలను ఎప్పటికప్పుడు సారథిలో నిక్షిప్తం చేస్తారు.
- ఈ డేటా ఆర్టీఏ అందజేసే పౌరసేవలకు సాంకేతిక బలంగా నిలుస్తుంది.

ఎన్‌ఓసీలు ఈజీ...

- రవాణా శాఖ అందజేసే పౌరసేవల్లో బదిలీల ప్రక్రియ కఠినంగా ఉంటుంది. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్సులను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేసుకోవడం ఇప్పటి వరకు కష్టంగా ఉండేది.
- ఆయా ప్రాంతీయ రవాణా కార్యాలయాల నుంచి నిరభ్యంతర పత్రాలు లభిస్తే తప్ప లైసెన్సుల డాటా బదిలీ సాధ్యం కాదు. కానీ సారథిని ప్రవేశపెట్టడం వల్ల రవాణా అధికారులు తమ పనిని తేలిగ్గా చేయగలుగుతారు. సారథిలో లభించే డేటా ఆధారంగా క్షణాల్లో ఎన్‌ఓసీలను అందజేసే అవకాశం ఉంటుంది.
- వాహనదారులు ఆన్‌లైన్‌లోనూ ఈ ఎన్‌ఓసీలను పొందవచ్చు.
- వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేసేవారు, తరచుగా బదిలీపై వెళ్లే వారు తాము ఎక్కడ ఉంటే అక్కడి చిరునామాతో డ్రైవింగ్ లైసెన్సులను తీసుకొని వినియోగించుకోవచ్చు.
- వాహన బదిలీలపైన ఎన్‌ఓసీలు పొందేందుకు మాత్రం ఇప్పుడు సాధ్యం కాదు.
- సారథి తరహాలో 'వాహన్' అమల్లోకి వస్తేనే ఆర్సీలను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు లేదా రాష్ట్రానికి బదిలీ చేసుకొనేందుకు తేలిగ్గా ఎన్‌ఓసీలను పొందే సదుపాయం లభిస్తుంది.
- అధికారుల పర్యవేక్షణ, ఆమోదంతోనే సర్వీసుల బదిలీ సదుపాయం లభించనుంది.
- ఇందుకోసం ఆన్‌లైన్‌లోనే నిర్ణీత ఫీజు చెల్లించి అవసరమైన డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేయాలి.
- ప్రస్తుతంగ్రేటర్ హైదరాబాద్‌లోని 3 జిల్లాల్లో 62,7056 డ్రైవింగ్ లైసెన్సులు ఉన్నాయి. సుమారు 83 లక్షల వాహనాలు తిరుగుతున్నాయి.

'లెర్నింగ్' లభిస్తుందా...

- సారథి అమల్లోకి వస్తే ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేకుండానే లెర్నింగ్ లైసెన్సులను తీసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనే పరీక్షలు రాయవచ్చు.
- కానీ ఈ నదుపాయం ప్రస్తుతం అందుబాటులోకి రాలేదు. దీనిపైన రవాణాశాఖ నిర్ణయం తీసుకోవలసి ఉంది. ఇందుకు మరికొంత సమయం పట్టవచ్చునని అధికారులు చెబుతున్నారు.

బుచ్చమ్మది ఆత్మహత్య కాదు..

ప్రభుత్వ హత్య

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబిత, కృష్ణారావు ధ్వజం
- సమస్యలు పక్కదారి పట్టించేందుకే హైడ్రా డ్రామా
- ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన
- గాంధీ ఆస్పత్రి మార్చురీలో బుచ్చమ్మ మృతదేహానికి నివాళి



గాంధీ ఆస్పత్రి వద్ద హరీశ్‌రావు, సబిత తదితరులు

గాంధీఆస్పత్రి : 'బుచ్చమ్మది ఆత్మహత్య కాదు,, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న అనేక ప్రధాన సమస్యలను పరిష్కరించడం చేతకాక వాటిని పక్కదారి పట్టించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రా పేరిట డ్రామాలు ఆడుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని విమర్శించారు. హైడ్రా కారణంగా ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని, ఇంకా ఎంతమందిని పొట్టన పెట్టుకుంటారని రేవంత్‌ను ప్రశ్నించారు. కూల్చివేతలు కాదు, హైదరాబాద్ ఇమేజ్‌ను నిలబెట్టడం నేర్చుకోవాలని హితవు పలికారు. హైడ్రా వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన కూకట్‌పల్లి యాదవబస్తీకి చెందిన బుచ్చమ్మ మృతదేహాన్ని చూసేందుకు శనివారం గాంధీ ఆస్పత్రి మార్చురీకి మాజీమంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు వచ్చారు. పోలీసులు వారిని మార్చురీ లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సుమారు 20 నిమిషాలపాటు మార్చురీ బయటే వేచి చూసి పోస్టుమార్టం అనంతరం లోపలకు వెళ్లి బుచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.



అడ్డుకున్న పోలీసులతో బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

కూల్చివేతలపై త్వరలోనే కార్యాచరణ

కూకట్‌పల్లి నియోజకవర్గం నల్లచెరువు బఫర్ జోన్‌లో ఉన్న ఇంటిని హైడ్రా కూలగొడుతుందని భయాందోళనకు గురైన బుచ్చమ్మ ఆత్మహత్యకు పాల్పడిందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కాంగ్రెస్, తెలుగుదేశం హయాంలోనే ఆ ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని, 30 ఏళ్ల నుంచి నివాసాలు ఏర్పరచుకున్న వారి ఇళ్లను కూల్చే అధికారం రేవంత్‌రెడ్డికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. పేదలను నిర్వాసితులను చేయాల్సి వస్తే, వారి ఇంటికి నష్టపరిహారం, కొత్త ఇల్లు, జీవన భృతి కింద రూ. 5 లక్షలు చెల్లించాలనే నిబంధన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూసేకరణ చట్టంలో స్పష్టంగా ఉందని గుర్తు చేశారు. ఉపాధి పోయి, ఇండ్లు పోయి ప్రజలు రోడ్డు మీదకు వస్తున్నారని, నష్ట పరిహారం ఇచ్చే విషయంలో ప్రభుత్వం దగ్గర ఎలాంటి సమాచారం లేదని దుయ్యబట్టారు. 'ముఖ్యమంత్రిగా ప్రజలకు సహాయం చేస్తావా? లేక పేదలను కన్నీళ్లు పెట్టిస్తావా? వారి రక్తం, కన్నీళ్లను మూసీనదిలో పారిస్తావా, ఇకనైనా పిచ్చి పనులు మార్చుకో రేవంత్‌రెడ్డీ'అంటూ హెచ్చరించారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని పార్టీల సూచనల మేరకు సమష్టిగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. బాధితులు ఆందోళన చెందవద్దని, అండగా బీఆర్ఎస్ పార్టీ ఉందని, ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఎవరికోసం ఈ మూసీ సుందరీకరణ? ఎవరికి మేలు చేసేందుకు ఈ కూల్చివేతలు అని నిలదీశారు. హైడ్రా మీద పోలీస్ కేసు నమోదు చేయాలని, రంగనాథ్ పేద వాళ్ల ఇళ్లను రాత్రికి రాత్రి కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి సోదరునికి నెల రోజుల ముందు పర్మిషన్ తెచ్చుకునే అవకాశం కల్పించారన్నారు. పేదవారికి ఒక న్యాయం రేవంత్ రెడ్డి సోదరులకు మరొక న్యాయమా అని నిలదీశారు. పేదలు కోర్టుకి వెళ్లలేరనే ధైర్యంతోనే కదా వారి ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి సోదరులు లాగానే అందరికి నోటీసులు ఇవ్వాలన్నారు.

కుక్క కాటుకు సరైన చికిత్స తీసుకోవాలి

పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్

కాచిగూడ: కుక్కల వల్ల రేబిస్ వ్యాధి వ్యాపించే విధానం, నిర్మూలనా మార్గాలపై అవగాహన కల్పించడానికి శనివారం నారాయణగూడలోని సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ హాస్పిటల్‌లో వరల్డ్ రేబిస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ రేబిస్ వ్యాధికి సకాలంలో..సరైన చికిత్స తీసుకోవాల్సిందేనని, లేకుంటే అతి ప్రమాదానికి దారితీస్తుందని చెప్పారు. ఒక్కోసారి బాధితుడి మరణానికి దారితీస్తుందన్నారు. కుక్కకాటుకు గురైన వారు వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలని, సంబంధిత ఇంజెక్షన్ చేయించుకోవాలని సూచించారు. తద్వారా రేబిస్ వ్యాధి సోకుండా కాపాడుకోవచ్చన్నారు. కుక్కలను పెంచేవారు వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సద్గుణ దేవి తదితరులు పాల్గొన్నారు.



వరల్డ్ రేబిస్ డేలో పాల్గొన్న డాక్టర్ మధుసూదన్

జానీ మాస్టర్ పోలీస్ కస్టడీ ముగింపు

రంగారెడ్డి కోర్టులు: నృత్య దర్శకుడు జానీ మాస్టర్‌కు గత బుధవారం కోర్టు విధించిన పోలీసు కస్టడీ శనివారంతో ముగిసింది. దీంతో నార్సింగి పోలీసులు అతన్ని రంగారెడ్డి జిల్లా 9వ అదనపు కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. వచ్చే నెల 3వ తేదీ వరకు జుడీషియల్ కస్టడీ విధిస్తూ చంచల్‌గూడ జైలుకు తరలించాల్సిందిగా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా జానీ మాస్టర్ బెయిల్ పిటీషన్‌పై సోమవారం తీర్పు వెలువడనుంది.

ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి...మెడికల్ షాపు దగ్ధం



సుభాష్‌నగర్: చార్జింగ్ పెట్టిన బ్యాటరీ బైక్ ప్రమాదవశాత్తు పేలడంతో మెడికల్ షాప్ అగ్నికి ఆహుతైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సూరారం ప్రధాన రోడ్ పక్కన ఆదిత్య మెడికల్ షాప్‌లో సిబ్బంది ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీని శనివారం ఉదయం చార్జింగ్ పెట్టారు. ఉదయం 9 గంటల సమయంలో అకస్మాత్తుగా బ్యాటరీ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి, మంటల్లో బ్యాటరీ బైక్ కాలిపోగా క్షణాల్లో మంటలు మెడికల్ షాప్‌లోకి వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని గంట పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే మెడికల్ షాపులోని మందులు 90 శాతం మేర కాలిపోయాయి. సంఘటన స్థలానికి పెద్ద ఎత్తున జనాలు తరలిరావడంతో కాసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE CHEVELLA RANGA REDDY DISTRICT: AT: CHEVELLA
I.A.NO.1286 OF 2024
IN
O.S.No. 166 OF 2022

Between:
Smt. Patiolla Lakshmi Anuther .....PETITIONERS/ PLAINTIFF
AND
Sri M.L. Rajan & 10 Others ....RESPONDENTS/DEFENDANTS

THE DEFENDANTS No.1 TO 3 AND 5

1. Sri M.L. Rajan, S/o Late Rajaram, Aged about 47 years, Occ: Business, R/o. H.No.12-5-87/1, S.P.Nagar, Moosapet, Hyderabad-500018.T.G. **(D1).**
2. Sri Ajay Narme, S/o. Sri Prabhaker Narne, aged about 52 years, Occ: Business, R/o. H.No. 6-3-1112, Basura, Begumpet, Hyderabad-500016.T.G. **(D2).**
3. Sri G. Chaithanya Reddy, Sri Ramakrishna Reddy, Aged about 50 years, Occ: Business, R/o. Flat No.8, 3rd Floor, Road No.3, Aparna Apartment, Banjarahills, Hyderabad-500034. **(D3).**
4. Sri Y.R. Rajeshwer Rao, S/o. Sri Balaramayya, Aged about 57 years, Occ:Business, R/o.H.No. 2-33/A, Road No.48, Jubilee Hills, Hyderabad-500033.T.G. **(D5).**

PUBLIC NOTICE

Please take notice that the plaintiffs filed the above suit against you for partition and separate possession in respect of the suit schedule property and the said suit presently coming for appoint the Advocate commissioner with I.A.No.1070/2024, for issue the Final Decree with I.A.No.1069/2024, in O.S.No.166/2022. Therefore the matter is stands posted on 04/10/2024, for your appearance before the Hon'ble Junior civil Judge Court Chevella R.R. District,T.G.

Hence please make it convenient to appear before the Hon'ble Junior civil Judge Court Chevella R.R. District, on 04/10/2024, at 10-30 A.M, failing which the matter will be decided in your absence as per law.

Hence, this Public notice

//BY ORDER OF THE HON'BLE COURT//
T. BALAKRISHNAIAH
Advocate
Office: Plot No.33 & 34, Beside Yadava Mithra, welfare Association Koman, Municipal Office Road, Khali Mandir, Bandlaguda Jagir, R.R.Dist, HYD-500086
Mobile No.9392539938.

4 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసశర్మ, అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలను అక్టోబర్ 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎం. శ్రీనివాసశర్మ తెలిపారు. శనివారం ఆలయంలో అర్చకులు, వేద పండితులతో కలిసి బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు స్వామివారి బ్రహ్మోత్సవాలు, మరో వైపు శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను సైతం వేడుకగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారికి విశేష పల్లకీ సేవలతో పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు కనువిందు చేయనున్నాయని తెలిపారు. 4వ తేదీన స్వామివారి శేషవాహన సేవ, 5న పెద్ద శేష వాహన సేవ, ధ్వజారోహణ, సాయంత్రం హనుమంత వాహన సేవ, 6న పొన్న వాహన సేవ, హంసవాహన సేవ, 7న సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, 8న సర్వభూపాల వాహన సేవ, గజ వాహన సేవ, 9న స్వామివారి తిరుక్కళ్యాణ మహోత్సవం, 10న ముత్యపు పందిరి వాహన సేవ, శ్రీవారి తిరువీధి రథమహోత్సవం, 11న సింహ వాహన సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కంటిమీద.. కునుకు లేకుండా...

బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లో విచ్చలవిడిగా సెల్లార్ అక్రమ తవ్వకాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లోని బ్లూఫాక్స్ హోటల్ వెనుక ఇంటి నెంబర్ 8–2–616 ప్లాట్‌లో గత కొన్నాళ్లుగా అనుమతులు లేకుండా సెల్లార్ అక్రమ తవ్వకాలు స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. భారీ జేసీబీలతో రాళ్ల పగులగొడుతుండడంతో విపరీతమైన శబ్దాలు, ఇళ్లకు పగుళ్లు, డస్ట్‌తో స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకోకుండానే ఈ తవ్వకాలు చేపడుతున్నారని, వీటిని తక్షణమే నిలిపివేయాలంటూ ఇప్పటికే స్థానికులు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు, సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ గత ఏసీపీ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా సరే ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారని, దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని, ఈ సెల్లార్లు ప్రమాదకరంగా ఉన్నాయని ఆరోపించారు. నిర్మిష్ అగర్వా ల్ అనే వ్యక్తి ఈ ప్లాట్‌లో తవ్వకాలు చేపడుతుండగా తాము ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని, అ యినా పట్టించుకోవడం ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమ సెల్లార్ల నిర్మాణం చేప డు తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: రాష్ట్రంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ఏదో ఒక సమస్య ఉందని, కొన్నింటిలో మరుగుదొడ్లు లేకపోతే, మరికొన్నింటిలో టీచర్లు లేరని వాటన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలని నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతా సిన్హా అన్నారు. ఎం.వెంకటరంగయ్య ఫౌండేషన్ (ఎం.వీ ఫౌండేషన్) ఆధ్వర్యంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, మదర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పబ్లిక్ హియరింగ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రముఖులు వచ్చి వారి జిల్లాల్లో పాఠశాలల పరిస్థితిని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా శాంతా సిన్హా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. కొన్నిచోట్ల మరుగుదొడ్లు లేక బాలికలు పాఠశాలలు మానేసే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.వీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది అశోక్ అగర్వాల్, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప లక్ష్యాలతో ముందుకుసాగాలి



కార్యక్రమంలో కృష్ణ మాల కొండారెడ్డి

బంజారాహిల్స్: గొప్ప లక్ష్యాలతో ముందుకుసాగి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఉస్మానియా మెడికల్ కాలేజ్ సీనియర్ కార్డియాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణ మాల కొండారెడ్డి అన్నారు. సైఫాబాద్ సైన్స్ కాలేజ్, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ సంయుక్తంగా డిగ్రీ విద్యార్థులకు శనివారం ఇండక్షన్ ప్రోగ్రాం, వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కృష్ణ మాల కొండారెడ్డి హాజరై మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో చదివే విద్యార్థుల్లో 80 శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారేనని భవిష్యత్తులో ఉన్న స్థానానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్‌కు దూరంగా ఉండి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత భావాలతో అనుకున్న లక్ష్యాలను సాధించేవరకు పట్టుదల, కృషితో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వరల్డ్ హార్ట్ డే బ్యానర్ పట్టుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సంవత్సరానికై తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ వైద్య రంగంలో సేవలందిస్తున్న డాక్టర్ కృష్ణ మాలకొండారెడ్డికి బెస్ట్ కార్డియాలజీ డాక్టర్ అవార్డును ప్రకటించినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజ్‌నారాయణ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నవనీత, అకాడమిక్ కో–ఆర్డినేటర్ మీనాక్షి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు అరవింద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దాటిన తర్వాత వ్యాపారం

ఒక్కరోజు జైలు పాలు

పంజగుట్ట: అర్ధరాత్రి దాటినా వ్యాపారం నిర్వహిస్తున్న నిర్వాహకునికి నాంపల్లి కోర్టు ఒకరోజు జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోల్కొండకు చెందిన మహ్మద్ ముదస్సిర్ పాషా అమీర్‌పేట ఈమేజ్ ఆసుపత్రి సమీపంలో హోటల్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. అర్ధరాత్రి ఒకటి తరువాత కూడా వ్యాపారం నిర్వహిస్తుండడంతో పెట్రోలింగ్‌లో ఉన్న పంజగుట్ట పోలీసులు ముదస్సిర్ పాషాను అదుపులోకి తీసుకుని పెట్టీ కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. శనివారం నాంపల్లి 10వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పాషాకు ఒక్క రోజు జైలు శిక్ష విధించారు.

రోటరీ సౌత్‌జోన్ సమావేశాలు ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో మారియో సీజర్

బంజారాహిల్స్: అంతర్జాతీయ సేవా సంస్థ రోటరీ సౌత్ జోన్ సమావేశాలు శనివారం జూబ్లీహిల్స్‌లోని దస్పల్లా హోటల్‌లో ప్రారంభమయ్యాయి. దీనికి రోటరీ ఇంటర్నేషనల్ కాబోయే అధ్యక్షుడు మారియోసీజర్ హాజరయ్యారు. ఈస్ట్ క్లబ్ అధ్యక్షుడు తలశిల మల్లికార్జున సరసయ్యచౌదరి ఈ సమావేశాలను ప్రారంభించగా, కాన్‌క్లేవ్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ చిలుకూరి శరత్‌బాబు, రోటరీ జిల్లా 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి ఈ సమావేశ విశిష్టత గురించి తెలియజేశారు. రోటరీ సంస్థ 2025–26కు కాబోయే అధ్యక్షుడు మారియో సీజర్ మాట్లాడుతూ రోటరీ సంస్థ కొత్త సభ్యులను చేర్చుకోవడంలో ముందుండాలన్నారు. ముఖ్యంగా యువతను, మహిళలను సభ్యులుగా చేర్చుకోవాలని, అందు కోసం ప్రతి రోటరీ క్లబ్, ప్రతి రోటరీ సభ్యుడు ఒకపక్క సేవా కార్యక్రమాలు చేస్తూనే, రెండో పక్క కొత్త సభ్యులను ఆకర్షించేవిధంగా క్లబ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ నాయకులు దీపక్ పురోహిత్, డైరెక్టర్లు రాజు సుబ్రమణ్యన్, అనిరుధ్‌రాయ్ చౌదరి, ఎలక్ట్ నాగేష్, రోటరీ జిల్లా 3150 నాయకులు ప్రభాకర్, గోపీనాథ్ రెడ్డి, జవహర్ వడ్లమాని, శామ్ పాటిబండ్ల, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి బతుకమ్మ సంబురాలు

బంజారాహిల్స్: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అక్టోబర్ 5న బంజారాహిల్స్ సాగర్ సొసైటీ గ్రౌండ్‌లో బతుకమ్మ సంబురాలను వైభవంగా నిర్వహించన్నారు. ఈ మేరకు సన్నాహక సమావేశం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో బీజేపీ మహిళా మోర్చా ముఖ్య నాయకులతో శనివారం జరిగింది. అక్టోబర్ 5 శనివారం సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ఆడపడుచులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని తెలంగాణ సంప్రదాయాన్ని నలుదిశలా వ్యాపింపజేయాలని ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు పల్లె వీణారెడ్డి, నీరజ, కృష్ణవేణి, మాధవి, అనురాధ, నాగమణి, శారద, వర్ష, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి



బంజారాహిల్స్: దుర్గామాత నవరాత్రి మహోత్సవాల్లో డీజేలు, అత్యధిక శబ్దాలు వచ్చే మ్యూజిక్ సిస్టమ్‌లకు అనుమతి లేదని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సూచించారు. డీజే, మ్యూజిక్ సిస్టమ్స్ యజమానులతో పాటు దేవీ శరన్నవరాత్రి మండప నిర్వాహకులతో శనివారం ఆయన సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ, హైకోర్టు ఆదేశాలను ప్రస్తావిస్తూ ఆ మేరకు నడుచుకోవాలని సూచించారు. ఫైర్ క్రాకర్స్‌కు కూడా అనుమతి లేదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాసబ్ ట్యాంక్ ఎస్‌హెచ్ఓ, బంజారాహిల్స్ డీఐ పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణాన్ని భావితరాలకు అందిద్దాం

గోల్కొండ హోటల్స్ డైరెక్టర్ శ్యామల శ్రీనివాస్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న శ్యామల శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్: ఆహ్లాదకర వాతావరణాన్ని భావి తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గోల్కొండ హోటల్స్ డైరెక్టర్ శ్యామల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గోల్కొండ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పచ్చదనం–పరిశుభ్రత కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు. గోల్కొండ హోటల్స్ డైరెక్టర్ శ్యామల శ్రీనివాస్‌రెడ్డితో పాటు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. డివిజన్ పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన శనివారం సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలను నివేదికలు రూపొం దించాలని హెచ్ఎంలకు సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారితో సమస్యలపై చర్చిస్తానని తెలిపారు. పేద విద్యార్థులు విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిరంతర వ్యాయామం ఆరోగ్యవంతుల లక్షణం



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఐజీ సిద్దిఖీ

వెంగళరావునగర్: నిరంతరం వ్యాయామం చేయడం అనేది మంచి ఆరోగ్యవంతుని లక్షణమని టీజీఎస్పీ డీఐజీ సిద్దిఖీ అన్నారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్పీ ఫస్ట్ బెటాలియన్ గ్రౌండ్‌లో కమాండెంట్ పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో గత మూడురోజుల పాటు మాన్యువల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఇందులో భాగంగా సిబ్బందికి కబడ్డీ, క్రికెట్, షటిల్, వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నిస్ తదితర క్రీడా పోటీలు నిర్వహించగా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బెటాలియన్‌లోని గ్రౌండ్‌లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఐజీ సిద్దిఖీ మాట్లాడుతూ క్రీడల వల్ల నిరంతరం ఉత్సాహంగా, చురుగ్గా ఉండవచ్చన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో కమాండెంట్‌తో పాటుగా అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ చంద్రశేఖర్, అప్పారాయ్, భాస్కర్, ఆర్ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, రాజేష్, శ్యామ్, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో రాజ్‌భవన్ విద్యార్థుల సత్తా



క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కరుణశ్రీ

పంజగుట్ట: హైదరాబాద్ పాఠశాలలో జరిగిన ఆటల పోటీల్లో రాజ్‌భవన్ విద్యార్థులు సత్తా చాటారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని డాన్‌బాస్కో స్కూల్‌లో ఇటీవల జరిగిన ఆటల పోటీల్లో రాజ్‌భవన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖో అండర్ –14 బాలుర విభాగంలో మొదటి బహుమతి, అండర్ –17 విభాగంలో రెండో బహుమతి, అండర్ –14 బాలిక విభాగంలో రెండో బహుమతి, అండర్ –17 బాలికల విభాగంలో రెండో బహుమతి సాధించారు. అదే విధంగా నాంపల్లిలోని శంకర్ జీ మెమోరియల్ పాఠశాలలో జరిగిన ఆర్చరీ పోటీల్లోనూ జిల్లాస్థాయిలో రాజ్‌భవన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వైభవ్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు.

జానపద కళలను భవిష్యత్ తరాలకు అందించాలి



జానపద గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

భారతీయ విద్యాభవన్‌లో సందడిగా ఔట్రీచ్

ఫిలింనగర్: జానపద కళలను భవిష్యత్ తరాలకు అందించాలని ప్రధానోపాధ్యాయులు శ్రీలతానాయర్ అన్నారు. భారతీయ విద్యాభవన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం నిర్వహించిన ఔట్రీచ్ కార్యక్రమం ఆకట్టుకుంది. తెలంగాణ జానపద కళలను, కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి వేదికను అందించడమే లక్ష్యంగా ఔట్రీచ్ కొనసాగింది. ముఖ్యంగా 'తెలంగాణ జానపద గేయాలు' అనే అంశాన్ని తీసుకుని యువ కళాకారుల చేత జానపద గేయాలను పాడించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు డాక్టర్ లింగా శ్రీనివాస్, శంకర్, నరేష్, సృజన్ కిషోర్, వీణ, సైదమ్మ తదితర కళాకారులు జానపద గేయాలను ఆలపించి సంగీత మాధుర్యంతో అందరినీ ఓలలాడించారు. తెలంగాణ ప్రజల దైనందిన జీవితాలను, సంప్రదాయాలను ప్రతిబింబించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతానాయర్ మాట్లాడుతూ భవిష్యత్తులో కళాకారులకు మరింత ప్రోత్సాహాన్ని అందించేలా వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు.

ఏకపక్ష నిర్ణయాలు తగదు



రహమత్‌నగర్: మసీదు కమిటీ అభిప్రాయం తీసుకోకుండా కొంతమంది ఏక పక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచిదికాదని కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం వారు శ్రీరాంనగర్‌లోని జామీయ మసీద్ హజ రత్ సయిద్నా ఉమర్ ఫారుఖ్ రజీ అల్లాహు తా అలా అన్హులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బస్తీవాసులు సంప్రదించకుండా, వారి అభిప్రాయాన్ని తీసుకోకుండా కొంతమంది మదర్సా నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటించుకోవడం సరికాదని సూచించారు. దీనికి బస్తీవాసులు గమనించాలని వారు కోరారు. ఈ సమావేశంలో మసీదు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ వర్సిటీ నాణ్యమైన సేవలు



పంజగుట్ట: అత్యంత ప్రమాణాలతో విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు, విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందించడంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎప్పుడూ ముందుంటుందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుధా రాణి అన్నారు. శనివారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఖైరతాబాద్ స్టడీ సెంటర్‌లో ఓపెన్ యూనివర్సిటీ కోర్సులు, అడ్మిషన్లు, ఫోన్ నెంబర్‌లు అన్ని అంశాలతో కూడిన 'ప్రాస్పెక్టస్' కరపత్రాన్ని స్టూడెంట్ సర్వీసెస్ డైరెక్టర్ ఎల్.వి.కె రెడ్డి, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాజేంద్ర కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, ఖైరతాబాద్ స్టడీ సెంటర్ కో ఆర్డినెటర్ నవీన్ చందర్ రాజులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, కౌన్సిలర్‌లకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. స్టడీ సెంటర్‌ను యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులకు బోధించే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వే లాద్రి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్

మామిడి నర్సింగ్‌రావు



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

ఫిలింనగర్: దేశం కోసం ప్రాణాలు సైతం అర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన మామిడి నర్సింగ్‌రావు భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నింపిన గొప్ప పోరాట యోధుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సహదేవ్, ప్రధాన కార్యదర్శి లింగాచారి, కోశాధికారి తిరుపతయ్య, రవిరాజు, మాజీ అధ్యక్షుడు సి. రామచంద్రయ్య, జి. వెంకటేష్, గోవిందు, వెంకటేష్, విష్ణు, రవి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో పాటు నగదు కాజేసిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్ : సెల్‌ఫోన్‌తో పాటుగా నగదు కూడా కాజేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం యాదగిరినగర్‌లో నివాసం ఉండే సంతోష్‌రెడ్డి ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేస్తుంటాడు. ఈనెల 23 రాత్రి సెల్‌ఫోన్ పక్కన పెట్టుకుని తలుపు కొద్దిగా తెరిచి నిద్రపోయాడు. అర్ధరాత్రి లేచి చూసేసరికి ఫోన్ కనిపించలేదు. 25వ తేదీ బ్యాంక్‌కు వెళ్ళి తన అకౌంట్ చెక్ చేసుకోగా తన ఫోన్ ద్వారా రూ.27 వేలు విత్‌డ్రా చేసినట్టుగా ఉన్నాయి. కాగా తన ఫోన్‌తో పాటుగా నగదును కూడా ఆలూరి నరేంద్ర అనే వ్యక్తి కాజేసినట్టు అనుమానంతో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువకుడిపై..

మద్యం సేవించి ద్విచక్ర వాహనంతో డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన కె.భాస్కర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 27వ తేదీ రాత్రి యూసుఫ్‌గూడ మాస్టర్ కాలేజీ వైపు తన ద్విచక్ర వాహనంపై రాంగ్‌రూట్‌లో అత్యంత వేగంగా వచ్చి డీసీఎం వాహనాన్ని ఢీకొట్టాడు. విషయం తెలుసుకున్న మధురానగర్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్లో రావడమే కాకుండా డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు భగత్‌సింగ్ ఆదర్శం



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: నేటితరం యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పద్మావతినగర్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పి.విజయారెడ్డి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్ చేసిన పోరాటం, త్యాగం ఎన్నటికీ మరువలేమన్నారు. నేటితరం యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు చేయూత

పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు జాస్ అల్లుకాస్ ముందుకు వచ్చింది. రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ. 1.43 లక్షల వ్యయంతో మ్యూజిక్ సిస్టం, క్రీడా సామగ్రిని కొనుగోలు చేసేందుకు శనివారం సంస్థ మేనేజర్ షానోజ్ ఫిలిప్ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము పేద విద్యార్థులకు తోచిన విధంగా సాయం చేసేందుకు చూస్తున్నామని, వారు చదువుకుని ఉన్నత శిఖరాలకు వెలితే ఒక కుటుంబం బాగుపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ మాట్లాడుతూ పాఠశాలకు ఎంతో మంది దాతలు సాయం చేయడం వల్ల విద్యార్థులు చదువుల్లో, క్రీడల్లో ఎంతో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్, సురేందర్, లత, సునీత తదితరులు పాల్గొన్నారు.

వెయ్యిమంది అన్నదానానికి ఏర్పాట్లు

ఎస్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ సుధారెడ్డి



అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 25లో నిత్యాన్నదానం చేస్తున్నామని మూడు నెలల క్రితం ప్రారంభించినప్పుడు 300 మంది వరకు వచ్చేవారని కానీ ఇప్పుడు సంఖ్య సుమారు వెయ్యి వరకు పెరిగిందని వారికి తగినట్లు అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ సుధారెడ్డి తెలిపారు. శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులకు కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తమ ప్రహరీ వెంట బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమం నిత్యం కొనసాగుతుందని మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటల వరకు నాణ్యమైన భోజనాన్ని తాము అందిస్తున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఎక్కువ మంది సెక్యూరిటీ గార్డులు, ఇళ్ళల్లో పని చేసేవారు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తాము చేస్తున్న అన్నదాన కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన వస్తున్నదని అన్నారు. త్వరలోనే తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ఫిలింనగర్: సైబర్ నేరాలపై అవగాహన ఉంటేనే వాటి బారినపడకుండా ఉండవచ్చునని హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రీ అన్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం 'సైబర్ సెక్యూరిటీ'పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీమా సిక్రీ హాజరై సైబర్ రంగంలో వచ్చిన మార్పులను వివరించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లు, ఏవిధంగా సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు, వారి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను క్షుణ్ణంగా వివరించారు. అంతకముందు సైబర్ క్రైమ్‌లపై 9, 10 తరగతి విద్యార్థులకు ఏమేర అవగాహన ఉందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. వారి నుంచి సమాధానాలను, వినూత్న ఆలోచనలను, అభిప్రాయాలను తెలుసుకుంటూ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ వర్క్‌షాప్ కొనసాగించారు. గూగుల్ సెర్చ్ ఇంజన్, ఆన్‌లైన్ గేమ్‌లు, వెబ్‌సైట్‌లను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. తెలియని అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా నేరం జరిగిన గంట లోపే రిపోర్ట్ చేయాలని, 1930 లేదా 112 నెంబర్లకు కాల్‌చేసి ఫిర్యాదు చేయా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై లైంగికదాడి

వెంగళరావునగర్: సినిమా ఆఫీస్‌లో పని ఉందంటూ నమ్మించి వివాహితపై లైంగికదాడి చేసిన యువకునిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... పల్నాడు జిల్లాకు చెందిన యువతికి తణుకు నివాసి నరేంద్రతో 9 ఏళ్ళ కిందట వివాహమైంది. బతుకుదెరువు కోసం ఇరువురూ నగరానికి వచ్చి శ్రీకృష్ణానగర్‌లో ఉంటూ సినిమాల్లో పనులు చేసుకుని జీవించేవారు. నాలుగేళ్ళ కిందట భర్తతో గొడవ జరగడంతో విడిగా ఉంటుంది. ఈ ఏడాదిలోనే అతనితో విడాకులు తీసుకుంది. ఈక్రమంలో రెండు వారాల కిందట శశికిరణ్‌రెడ్డితో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం అయింది. దీంతో అతడికి ఫోన్ నెంబర్ ఇచ్చింది, అతడికి తన వివాహం, విడాకులు తీసుకున్న వ్యక్తిగత విషయాలు తెలిపి, ఉద్యోగం కావాలని అడగడంతో తనకు సినిమా ఆఫీస్ ఉందని అక్కడకు రావాలని సూచించాడు. ఈ క్రమంలో ఈనెల 27న మధురానగర్‌లోని అతడి రూంకి వెళ్లగా ఆమెను బెదిరించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చివరకు 5 గంటల తర్వాత ఆమె అతడి నుంచి తప్పించుకుని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చర్లపల్లి జైల్‌ను సందర్శించిన జిల్లా న్యాయమూర్తులు



చర్లపల్లి జైల్‌లో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా కోర్టు న్యాయమూర్తులు

కుషాయిగూడ: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.బాలభాస్కర్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జిల్లా కోర్టు సీనియర్ జడ్జ్ డి.కిరణ్‌కుమార్ చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో పేద ఖైదీలకు అందుతున్న న్యాయసాయంపై ఆరా తీశారు. జైల్ ప్యార లీగల్ వలంటీర్స్‌తో సమావేశమయ్యారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న న్యాయసాయంపై అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయసాయం అందజేయాల్సిన బాధ్యత జైల్ ప్యార లీగల్ వలంటీర్స్‌పై ఉందన్నారు. అనంతరం జైల్‌లోని వంటశాల, ఆస్పత్రి, బ్యారక్‌లు, ఇతర పరిశ్రమలను పరిశీలించారు. వారి వెంట జైల్ పర్యవేక్షణాధికారి జి.రామచంద్రం, డిప్యూటీ పర్యవేక్షణాధికారి వి.శశికాంత్, సిబ్బంది శ్రీనునాయక్, రత్నం తదితరులు ఉన్నారు.

2047 నాటికి అత్యంత ఆర్థిక శక్తివంతంగా..

- ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి వి.సుబ్రమణియన్



రాయదుర్గం: 2047 నాటికి అత్యంత ఆర్థిక శక్తివంతమైన దేశంగా మన దేశం ఎదగడం ఖాయమని ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి వి.సుబ్రమణియన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్–2024 ముగింపులో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థ నిజమైన వృద్ధిరేటు 8ని నిర్వహిస్తే అది సాధ్యమవుతుందన్నారు. నూతన ఆవిష్కరణలు మరింతగా రావాలని, అవి ఉత్పత్తి స్థాయికి ఎదిగి ప్రజాసమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఐఎస్ఎఫ్ చైర్మన్, కన్వీనర్ జేపీ చౌదరి మాట్లాడుతూ స్టార్టప్‌లు వాల్యుయేషన్‌పై దృష్టి పెట్టడం కంటే వాల్యూ క్రియేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో విజయానికి ఇది ఖచ్చితంగా మార్గమన్నారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు, స్టార్టప్ నిర్వాహకులు, ఐఎస్ఎఫ్–20204 నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పించేందుకే మహిళా శక్తి క్యాంటీన్లు

- రాష్ట్ర పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్



శిక్షణ పొందిన మహిళలతో వాణిప్రసాద్, అధికారులు

రాయదుర్గం: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. గచ్చిబౌలిలోని 'నిథమ్' ప్రాంగణంలో సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(ఎస్ఈఆర్‌పీ), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణకు ఎంపికైన మహిళలకు ప్రత్యేక శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శిక్షణను పరిశీలించి పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళాశక్తిని గుర్తించి వారికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రస్తుతం వివిధ సంఘాల్లో పనిచేసే మహిళలకు ప్రత్యేక శిక్షణ అందించి వారిచే మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత అప్పగిస్తామన్నారు. ఆహార పదార్థాల తయారీలో నిథమ్‌లో నైపుణ్యం కలిగిన చెఫ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళలు క్యాంటిన్ల నిర్వహణలో విజయవంతం కావాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఎస్ఈఆర్‌పీ సీఈఓ డి.దివ్య, నిథమ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గణేష్, మిషెల్లీ జే ఫ్రాన్సిస్, పర్యాటకశాఖ డైరెక్టర్ ఈలా త్రిపాఠి, ఎస్ఈఆర్‌పీ డైరెక్టర్ గోపాలరావు, టీసీఈఐ అధ్యక్షుడు అల్లా బలరామ్‌బాబు, ప్రధాన కార్యదర్శి రవి బుర్రా, ఫైనాన్స్ డైరెక్టర్ కాంతి, డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

హెల్దీ హార్ట్‌బీట్స్!

చిన్నారుల్లో గుండె వ్యాధులపై అవగాహన • ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం



రెయిన్ బో ఆస్పత్రిలో వరల్డ్ హార్ట్‌డే కార్యక్రమంలో చిన్నారులతో సినీ హీరో సాయిధరమ్ తేజ్



ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులతో నిమ్స్, యూకే వైద్య బృందం

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల్లో పుట్టుకతోనే వచ్చే గుండె సంబంధ వ్యాధులతో పాటు అధునాతనమైన చికిత్స గురించి అవగాహన కల్పించడం చాలా ముఖ్యమని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి చైర్మన్, ఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా సినీ నటుడు సాయిధరమ్ తేజ్ హాజరయ్యారు. ఆర్థిక కారణాల వల్ల చాలా కుటుంబాలు చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు చేయించేందుకు వెనకాడుతున్నాయని చెప్పారు. అలాంటి చిన్నారులను కాపాడుకునేందుకు సమాజంలోని ప్రతిఒక్కరూ చేయి కలపాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 230 మంది చిన్నారులకు గుండె సర్జరీలు చేసి కాపాడగలిగామని తెలిపారు. గుండె జబ్బుల నుంచి విజయవంతంగా బయటపడిన చిన్నారులను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోనేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మేనరికం పెళ్లిళ్లు, మహిళల్లో పోషకాహార లోపం, పెస్టిసైడ్స్ ఉన్న ఆహారపదార్థాలు, ధూమపానం, ఆల్కహాల్ వంటి కారణాల వల్ల గర్భస్థ శిశువుల్లో గుండె లోపాలు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా గుండె వ్యాధుల నుంచి బయటపడి ఆరోగ్య జీవితాన్ని గడుపుతున్న పలువురు చిన్నారులు చేసిన ర్యాంప్ వాక్ అందరినీ ఆకట్టుకుంది. వారితో పాటు సాయిధరమ్‌తేజ్, వైష్ణవ్ తేజ్ కూడా ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్‌రావు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్వేత, పలువురు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నిమ్స్‌లో 18 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు

లక్డీకాపూల్: రాష్ట్రంలో ఎంతోమంది చిన్నారులు గుండె జబ్బులతో ఇబ్బంది పడుతున్నారు. చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ప్రాణాలు విడుస్తున్నారు. మరికొందరు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి వారికి ప్రభుత్వ సహకారంతో నిమ్స్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించారు. నిమ్స్ కార్డియో థొరాసిక్ విభాగం అధిపతి డాక్టర్ మాలెంపాటి అమరేశ్వరరావు సహకారంతో ఆల్డర్ హే హాస్పిటల్స్ లివర్‌పూల్ నుంచి డాక్టర్ రమణ ధన్నపునేని రమణ నేతృత్వంలోని యూకే వైద్యుల బృందం ఈ నెల 23 నుంచి శుక్రవారం వరకు 18మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేసింది. యూకేలోని లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్, నిమ్స్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ శిబిరం జరిగింది. మొత్తం 18 మంది చిన్నారులు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించుకోగా వారిలో 10 సంవత్సరాల 18 కిలోల పిల్లలు వివిధ సంక్లిష్టమైన పుట్టుకతో వచ్చే గుండె సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నారు. వీరికి ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ వంటి వివిధ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడంతో విజయవంతంగా శస్త్ర చికిత్సలు జరిగాయి.

నిమ్స్ ఆపరేషన్ థియేటర్‌లో బ్రిటన్ వైద్య బృందం



పీడియాట్రిక్ హార్ట్ సర్జరీ సేవలు అవశ్యం

రాష్ట్రంలో పీడియాట్రిక్ హార్ట్ సర్జరీ సేవల ఆవశ్యకతను గుర్తించి నిమ్స్‌లో ఉచిత గుండె ఆపరేషన్ల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యూకేకి చెందిన డాక్టర్ రమణ ధన్నపునేని తెలిపారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఇక్కడ ఆపరేషన్లు నిర్వహించడమే కాకుండా ఇక్కడి వైద్యులకు మెరుగైన శస్త్రచికిత్స మెళకువలను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 6 వేల మంది పిల్లలు లోపాలతో పుడుతున్నారని, చికిత్స చేయడానికి నిమ్స్ వైద్యులు సామర్థ్యం పెంపొందించడం చాలా అవసరమన్నారు. యూకే వైద్య బృందానికి శనివారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయా వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిమ్స్ అడిషనల్ డీన్ డాక్టర్ సాయిసతీష్, నిమ్స్ సిటీ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ అమరేష్ రావు, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ డి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల్లో నైతిక పాఠాలు బోధించాలి



- మదీనా ఎడ్యుకేషన్ సెంటర్‌లో నైతిక విలువలపై సదస్సు

లక్డీకాపూల్: తరగతి గదుల్లో నీతి పాఠాలు బోధించాలని, నేటి విద్యా వ్యవస్థలో నైతిక విలువలు లోపించడం వల్లనే చదువుకున్న వాళ్లు సైతం నేరాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అంశంపై మదీనా ఎడ్యుకేషన్ సెంటర్లో ముస్లిం మహిళా విద్యావేత్తల సమావేశం శనివారం నిర్వహించారు. జమాతె ఇస్లామీ హింద్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఆ సంస్థ నేషనల్ సెక్రటరీ షయిస్తా షగుఫ్తా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీతినియమాలు లేని చదువులు సమాజానికి ఏవిధంగానూ ఉపయోగపడవన్నారు. నైతిక విలువలు మనిషి వ్యక్తిత్వాన్ని, నడవడికను తీర్చిదిద్దుతాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లల ఐక్యూ అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నారే కానీ మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక విలువలు లోపించడం వల్లనే నేడు సమాజాన్ని అవినీతి, వరకట్నం, లంచాలు వగైరా రుగ్మతలు పీడిస్తున్నాయన్నారు. సమాజంలో మంచిని పెంచడానికి, చెడును నివారించడానికి ఉపయోగపడేదే నిజమైన విద్య, తరగతి గదుల్లో నైతికాంశాలతో కూడుకున్న విద్యాబోధన చేయాల్సిన అవసరాన్ని తెలిపారు. సమావేశంలో ముస్లిమ్ మహిళా విద్యావేత్తలు అర్షియా యాస్మీన్, ఫౌజియా బేగం, డాక్టర్ రఫత్ సీమా, మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ మారియా తబస్సుమ్, క్యాంపెయిన్ కన్వీనర్ డాక్టర్ అస్రా ముఫ్సినా పాల్గొన్నారు.

నగరంలో నేడు

- చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో బాలచెలిమి గ్రంథాలయంపై హిమాయత్ నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుంది.
- సుధారెడ్డి ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 6 గంటలకు బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనకు పింక్ పవర్ రన్ జరుగుతుంది.
- కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఉదయం 7.30 గంటలకు 3 కిలోమీటర్ల వాక్ ప్రారంభమవుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

దేహంపై కొంత పెట్టుబడి అవసరం

నటి, యాంకర్ సుమ కనకాల



న్యూగట్‌లో దేశీ న్యూట్రీ కిట్‌ను ఆవిష్కరిస్తున్న నటి, యాంకర్ సుమ తదితరులు

గచ్చిబౌలి: జీవన శైలిలో మార్పులకు అనుగుణంగా దేహంపై కొంత పెట్టుబడి పెడితేనే ఆరోగ్యంగా ఉంటారని నటి, యాంకర్ సుమా కనకాల పేర్కొన్నారు. గచ్చిబౌలిలో న్యూగట్ క్లౌడ్ కిచెన్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడుతూ కిచెన్ నుంచి హాల్ వరకు నడిస్తే అది వ్యాయామం చేసినట్లు కాదన్నారు. మనం నిత్యం ఎలాంటి ఆహారం తీసుకుంటున్నామో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో పరిశోధనలు చేసిన అనంతరం మీ శరీరానికి ఏ ఆహారం అవసరమో న్యూగట్‌లో నిర్ధారిస్తారని తెలిపారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులతో భోజనం, టిఫిన్ అందిస్తారని చెప్పారు. మీ జీవన శైలికి అనుగుణంగా మీకు అవసరమైన డైట్ అందించడమే న్యూగట్ లక్ష్యమని అన్నారు. న్యూగట్‌లో న్యూ నారిష్ యువర్‌హెల్త్ కౌన్సెలింగ్ సెంటర్ ఉంటుందని, హెల్త్ ప్రొఫైల్ ఆధారంగా న్యూట్రిషియనిస్ట్ డైట్‌ను ఎంపిక చేస్తామన్నారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన దేశీ న్యూట్రీ ఉత్పత్తులతో క్లౌడ్ కిచెన్‌లో వంటలు చేస్తారని వివరించారు. డయాబెటిస్, పీసీఓడీ, థైరాయిడ్ కేర్, స్కిన్‌హెల్త్, హెయిర్ ఫాల్‌పై సూచనలు ఇస్తామని అన్నారు. క్లౌడ్ కిచెన్ ఆహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ధరణి, జగతి రెడ్డి, దయాకర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయండి

కలెక్టరేట్ ఎదుట టీపీటీఎఫ్ ఆందోళన



హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యుఎస్‌పీసీ నేతలు

లక్డీకాపూల్: ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు శనివారం జీవో 25ను సవరించాలని, బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడితో పాటు ప్రతి పాఠశాలకు ఒక హెచ్‌ఎం ఉండేలా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అసంబద్ధమైన జీవో నెం.25ను సవరించకపోతే భవిష్యత్‌లో రాష్ట్ర స్థాయి పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ వెంకటాచారికి వినతిపత్రం సమర్పించారు. నిరసనలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శారద, రాజారావు, శ్యామ్‌సుందర్, విశాలి, టీపీటీఎఫ్ నాయకులు రాంబాబు, ప్రసాద్, శాస్త్రి, వెంకటరమణ, డీటీఎఫ్ నాయకులు వినోద్ కుమార్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

హజ్ కమిటీలో ఆర్థిక సంక్షోభం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర హజ్ కమిటీకి ఇంకా బడ్జెట్ విడుదల కాలేదు. బడ్జెట్ రిలీజ్ ఆడర్ విడుదల అయ్యి కూడా దాదాపు ఆర్నెళ్లు గడుస్తోంది. కమిటీలో నిధులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు చెప్పారు. హజ్ క్యాంప్ కోసం యాత్రికుల సౌకర్యార్థం భోజనాలు, రవాణా, షామియానాలు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్లకు ఇంకా డబ్బులు చెల్లించలేదు. హజ్ క్యాంప్ విజయవంతంగా పూర్తిచేయాలని, యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలు కల్పించడానికి ఇతర మైనార్టీ సంక్షేమ శాఖలోని విభాగాలతో డబ్బులు అప్పుగా తీసుకొని శిబిరం నిర్వహించారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తామని నెలలు గడుస్తున్నా ఇవ్వడం లేదని శనివారం అధికారులను నిలదీశారు. యాత్ర పూర్తయ్యి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా, యాత్రకు వెళ్లిన వారు తిరిగి వచ్చినా ఇంకా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మైనార్టీల పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రేమ అర్థమవుతోందని మైనార్టీ సంఘాలు అంటున్నాయి. ప్రతి సంవత్సరం హజ్ యాత్ర క్యాంప్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేస్తోంది. ప్రతిసారి యాత్ర ప్రారంభానికి ముందే డబ్బులు విడుదల చేస్తారు. కానీ ఈ ఏడాది యాత్ర పూర్తయ్యి నెలలు గడుస్తున్నా బిల్లులు విడుదల చేయకపోవడంతో హజ్ కమిటీ సంక్షోభంలో పడింది. వచ్చే నెల మొదటి వారంలో డబ్బులు చెల్లించకపోతే కాంట్రాక్టర్లు ధర్నాకు దిగాలని అనుకుంటున్నారు. అధికారుల మాటలు పట్టించుకునేది లేదని, మూడు నెలల నుంచి డబ్బులు ఇవ్వకుండా తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

అపర కుబేరులు.. ఆ తహసీల్దార్లు!

- సర్కారు భూ సంతర్పణలో సిద్ధహస్తులు
- ముంబై హైవే మండలాల్లో సైతం పనిచేసిన కొందరి తీరుపై సర్వత్రా చర్చ
- తహసీల్దార్లతో నేడు రెవెన్యూ మంత్రి పొంగులేటి సమావేశం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల్లో పనిచేసిన కొందరు తహసీల్దార్ల పనితీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ భూములు, చెరువుల్లో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేస్తున్న నేపథ్యంలో ఈ తహసీల్దార్ల నిర్వాకాలు తెరపైకి వస్తున్నాయి. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తహసీల్దార్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలు, ఎస్‌డీసీ, సివిల్ సప్లయ్ ఆఫీసుల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని చాలా ఏళ్లుగా కీలక మండలాల్లో తిష్ట వేసిన కొందరు అధికారుల తీరుపై సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆ మండలాల్లో..

జిల్లాలో హెచ్‌ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలో పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, సంగారెడ్డి, కంది, హత్నూర, గుమ్మడిదల, జిన్నారం మండలాలున్నాయి. మండలాల్లో కొందరు చాలా ఏళ్లుగా తిష్టవేసిన ఈ అధికారులు సర్కారు భూముల అన్యాక్రాంతానికి ప్రత్యక్షంగానే సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.వేల కోట్లు విలువ చేసే సర్కారు భూముల సంతర్పణలో కీలక హస్తం ఉన్న ఈ అధికారులు రూ.వందల కోట్లు వెనుకేసుకున్నారనేది బహిరంగ రహస్యంగా మారింది. సమీప బంధువులు, ఇతర బినామీల పేర్లతో విల్లాలు, ఫాంహౌస్‌లు.. సకల హంగులతో భారీ భవనాలు నిర్మించుకుని విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. సర్కారు భూముల్లో అక్రమ నిర్మాణాలంటూ హైడ్రా సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తోంది. వీటిని సర్కారు భూముల్లో కట్టినప్పుడు ఈ అధికారులు కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడకుండా వంత పాడారు. వందల సంఖ్యలో స్థానికుల నుంచి ఫిర్యాదులు అందినా కూడా సాకులు చెప్పి చేతులు దులుపుకున్నారు. తీరా ఇప్పుడు హైడ్రా కూల్చివేతలతో సామాన్యులు రోడ్డున పడి విలపిస్తుంటే.. ఈ అక్రమార్కులు మాత్రం విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. కేవలం హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల తర్వాత, జిల్లాలోని ముంబై హైవేపై ఉన్న మండలాల్లో కూడా డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది.

రికార్డులు సైతం మాయం..

సర్కారు భూములను, వాటి రికార్డులను కాపాడటం తహసీల్దార్ల ప్రాథమిక విధి. అయితే ఈ అక్రమాల్లో ఆరితేరిన ఈ తహసీల్దార్లు సర్కారు భూములనే కాదు. ఆ భూములకు సంబంధించిన రికార్డులనే కార్యాలయం నుంచి మాయం చేశారు. అమీన్‌పూర్, పటాన్‌చెరుతో పాటు, కంది, సంగారెడ్డి వంటి మండలాల కార్యాలయంలో కూడా కొన్ని రికార్డులు మాయమయ్యాయి.

విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకే ఎగ్జిబిషన్లు





ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న రెడ్డి ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతదేవి

కాచిగూడ: చిన్నారుల్లో మేధావులను గుర్తించడానికి వీలుగా తెలంగాణ సైన్స్ ఫెయిర్ అకాడమీ ఆధ్వర్యంలో నారాయణగూడలోని రెడ్డి మహిళా కళాశాలలో 17వ రీజినల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్ డాక్టర్ అమీర్ ఉల్లాఖాన్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. నేటితరం విద్యార్థులు ఆర్యభట్ట, అబ్దుల్‌కలాం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతదేవి, మరియా ఆరీఫుద్దీన్, డాక్టర్ ఖాజీ ఎస్.అజ్గర్, సుమేయిర నాసర్, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీస ర్ సి.ధర్మేందర్‌రావు, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ ప్రభాకర్ గాంధారి, ఓయూ ఫిజిక్స్ విభాగం డాక్టర్ వి.నతానియల్ పాల్గొన్నారు.





హైదరాబాద్ వైబ్స్

పెడల్ పవర్..
సైకిల్ ఫర్ ఎవర్
టెక్ వీధుల్లో.. సైకిల్ ట్రాక్స్..

- నగర వీధుల్లో జీహెచ్ఎంసీ అధునాతన ట్రాక్స్
- సోలార్ హంగులతో కిలోమీటర్లమేర నిర్మాణం
- ఇటు పర్యావరణం, అటు ఆరోగ్యానికీ మేలు
- ట్రాఫిక్ సమస్యలకు ప్రత్యామ్నాయ మార్గం
- వారాంతాల్లో క్లబ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్స్

ఎటువైపు చూసినా ఆకాశమంత ఎత్తైన అద్దాల భవనాలు.. నిత్యం ట్రాఫిక్‌తో కిక్కిరిసిన రహదారులు.. కిలోమీటర్ల మేర బారులు తీరే వాహనాలు.. ఇది నగరంలోని రహదారుల పరిస్థితి.. దీంతో పాటు నగర శివారులోని టెక్ పార్కుల్లోనూ లక్షలాది మంది ఉద్యోగులతో ట్రాఫిక్ సమస్యలు తప్పడంలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇటీవల కొంత కాలంగా వీధుల్లో సైక్లింగ్ ట్రెండ్ నడుస్తోంది. రహదారులకు సమాంతరంగా సైక్లింగ్ ట్రాక్‌లను జీహెచ్ఎంసీ అభివృద్ధి చేసింది. దీంతో టెకీల్లో చాలా మంది సైక్లింగ్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వారంలో కొన్ని రోజులైనా సైకిల్‌పై కార్యాలయానికి వెళ్లాలని కొంత మంది రూల్ పెట్టుకుంటున్నారు. క్లబ్‌లుగా ఏర్పడి వారాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలుకు శ్రీకారం చుడుతున్నారు. ఫలితంగా ఆరోగ్యం మెరుగుపడటం, ట్రాఫిక్‌లో సమయం, డబ్బు ఆదా, వాతావరణ కాలుష్య నివారణకు ఈ విధానం సహాయపడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

\- సాక్షి, సిటీబ్యూరో

టెక్కీలుగా స్థిరపడిన చాలా కుటుంబాల ఇళ్లల్లో కారు, మోటారు సైకిల్‌తో పాటు ఎలక్ట్రిక్, గేర్, సాధారణ సైకిల్ తప్పనిసరిగా ఉంటోంది. మెట్రో స్టేషన్లకు, కూరగాయల మార్కెట్‌కు, వాకింగ్‌కో వెళ్లడానికి, ఐదు కిలో మీటర్ల లోపు పనులకు సైకిల్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. వివిధ సైక్లింగ్ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఒక్కో వారం ఒక్కో రకమైన థీమ్ ఉండేలా సెట్ చేసుకుంటున్నారు. వందలాది కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణాలు చేస్తున్నారు. ఆపై ట్రెక్కింగ్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇదిలా ఉంటే వారాంతంలో కుటుంబ సభ్యులతో కలసి టూర్ ప్లాన్ చేసుకున్నప్పుడు కూడా కారు వెనకన తమ సైకిల్ కట్టుకుని పోతున్నారు. రిసార్ట్, ఫాం హౌస్, ఇతర డెస్టినేషన్‌లో సైక్లింగ్ చేస్తున్నారు.



ఏడేళ్ల నుంచి సైక్లింగ్..

చిన్న చిన్న ప్రయాణాలకు సైకిల్‌పైనే వెళతాను. ఏడేళ్ల నుంచి క్రమం తప్పకుండా సైక్లింగ్ చేస్తున్నాను. ప్రతి మహిళ సైక్లింగ్ చేయాలి. ఆరోగ్యం పరంగా చాలా ఉపయోగాలున్నాయి. ఇతరులపై ఆధారపడకుండా స్వతహాగా బయటకు వెళ్లి కూరగాయలు, పాలు, ఇతర సామాగ్రి తెచ్చుకుంటా. ఆఫీస్‌కి వెళ్లేందుకు మెట్రో వరకూ సైకిల్‌పైనే వెళతాను.

\- నేహ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, బంజారాహిల్స్

డెడికేటెడ్ ట్రాక్స్ కోసం..

నగరంలోని సైక్లిస్టులంతా ప్రస్తుతం ఉన్న సైకిల్ ట్రాక్‌లను డెడికేటెడ్ ట్రాక్‌లుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. కేబీఆర్ పార్క్, హైటెక్ సిటీలోని కొన్ని ప్రాంతాల్లో సైకిల్ ట్రాక్‌లకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. అయితే సాధారణ వాహనాలు సైతం ఈ సైకిల్ ట్రాక్‌పై నడిపిస్తున్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ట్రాక్‌పై పదుల సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌తో నిండిన రహదారిపై సైకిల్ తొక్కాలంటే భయమేస్తుదని పలువురు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న సైక్లింగ్ ట్రాక్స్‌కు బారికేడ్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇలా చేయడంతో మోటారు సైకిళ్లు, ఇతర వాహనాలు సైకిల్ ట్రాక్‌పైకి వచ్చే అవకాశం ఉండదు. దీంతో సైక్లిస్టులు వేగంగా, ధైర్యంగా ముందకు సాగేందుకు వీలుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓఆర్ఆర్ సమీపంలో సోలార్ రూఫ్‌తో ఏర్పాటు చేసిన సైకిల్ ట్రాక్ దేశంలోనే ప్రత్యేకమైనదిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆ తరహాలో నగరాన్ని సైక్లింగ్ సిటీగా తీర్చిదిద్దాలనే డిమాండ్ వినిపిస్తోంది.





సరికొత్త మోడళ్లు..

ప్రధానంగా టెక్ వీధుల్లో వివిధ మోడల్ సైకిళ్ల హవా కనిపిస్తోంది. మెట్రో స్టేషన్ల నుంచి తమతమ కార్యాలయాలకు వెళ్లేందుకు ఉద్యోగులు సైకిళ్లను వినియోగిస్తున్నారు. ఎత్తుపల్లాలు ఉన్నా సైక్లిస్టులకు ఇబ్బంది లేకుండా బ్యాటరీ, గేర్ సైకిళ్లు అందుబాటులో ఉంటున్నాయి. రహదారికి సమాంతరంగా ఉన్నప్పుడు సైకిల్ తొక్కడం, ఎత్తు ఉన్నప్పుడు బ్యాటరీతో నడిపిస్తున్నారు. ఈ విధానం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. కొనుక్కోవడం ఇష్టం లేకుండా, తమకు నచ్చినప్పుడు సైకిల్ సవారీ చేయడానికి అద్దె ప్రాతిపదికన వందలాది సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి.

టైం పాస్ కోసం..

సైక్లింగ్ టైం పాస్ కోసం ప్రారంభించాను. 10 కిలో మీటర్లు సైకిల్‌పై వెళ్లడానికి కష్టంగా ఉండేది. క్రమంగా అసోసియేషన్ సభ్యులతో సంబంధాలు ఏర్పడ్డాయి. సైక్లింగ్ వల్ల లాభాలపై అవగాహన వచ్చింది. ఇప్పుడు 100 కిలో మీటర్ల వరకూ వెళ్లిపోతున్నాం. వీలైతే ట్రెక్కింగ్ చేస్తున్నాం. సొంతంగా ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ క్లబ్ స్థాపించాను. వారాంతంలో టూర్ ప్లాన్ చేస్తుంటాం.

\- అశోక్, ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ నిర్వాహకులు





21 వేల మంది సభ్యులు..

2011లోనే సైక్లింగ్ రివల్యూషన్ ప్రారంభించాము. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పర్యావరణం, ఆరోగ్యం, సమయం, డబ్బు ఆదాపై అవగాహన కల్పించాం. హైదరాబాద్ బైస్కిల్ క్లబ్‌ను స్థాపించాం. ప్రస్తుతం ఇందులో 21 వేల మంది సభ్యులున్నారు. 60 ఏళ్ల వయసులో లండన్ నుంచి పారిస్ వరకూ 518 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లాను. మూడున్నర రోజులు పట్టింది. ఢిల్లీ, ఛండీఘర్, చెన్నైలోనూ సైక్లింగ్ అసోసియేషన్స్ స్థాపించాం. సుమారు 6 వేల సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. ఏడేళ్ల క్రితం ఓఆర్ఆర్ సమీపంలో సైకిల్ ట్రాక్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం. 23 కిలోమీటర్ల సోలార్ రూఫ్ ట్రాక్ సిద్ధమైంది. - మనోహర్, ప్రపంచ సైక్లింగ్ సమాఖ్య వైస్ ప్రెసిడెంట్



బ్రెస్ట్ కేన్సర్‌పై పింక్ పవర్ రన్ 2024

- గచ్చిబౌలి స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నం
- నేడు సుధా రెడ్డి, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మారథాన్



సాక్షి, సిటీబ్యూరో, లక్డీకాపూల్: రొమ్ము కేన్సర్ (బ్రెస్ట్ కేన్సర్)పై అవగాహన కల్పించడంలో భాగంగా సుధారెడ్డి ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు అతి పెద్ద పింక్ పవర్ రన్ 2024ను నిర్వహించనున్నారు. గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించే ఈ రన్లో 3 కిమీ, 5 కిమీ, 10 కిమీ విభాగాల పరుగు పందెంలో 5000 మందికిపైగా పాల్గొనున్నారని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించే వినూత్న ప్రయత్నాన్ని చేస్తున్నామని సుధారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధారెడ్డి వివరించారు. మారథాన్ అనంతరం పక్షి ఆకారంలో మారథాన్ రన్నర్స్ మానవహారాన్ని నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనే ఔత్సాహికులకు ప్రత్యేక న్యూట్రిషన్ కిట్లను అందించనున్నారు. అంతేకాకుండా రేసుకు ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయామ చిట్కాలు, పూర్తి చేసిన వారికి మెడల్స్ అందజేయనున్నారు. ఈ రన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సినీతారలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

'వేగన్' ఎగ్జిబిషన్

- ఆకట్టుకున్న ఫుడ్ స్టాల్స్,
- అలరించిన యువత నృత్యాలు
- పెద్దసంఖ్యలో చేరుకున్న పర్యావరణ, జంతు ప్రేమికులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వరుసగా రెండో ఏడాది నిర్వహిస్తున్న హైదరాబాద్ వేగన్ ఫెస్టివల్ శనివారం ప్రారంభమైంది. మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జంతు, పర్యావరణ ప్రేమికులు బారులు తీరారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో స్వచ్ఛమైన శాఖాహారం గురించి సందర్శకులకు వివరించారు. ఆసక్తి ఉన్న వారు వివిధ రకాల వంటకాలను రుచి చూశారు. వాటి తయారీ విధానంపైనా స్టాల్ యజమానులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలి రోజు సుమారు 3 వేల మందికిపైగా అతిథులు హాజరయ్యారని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐటీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లో పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తాను కూడా గత ఏడాది కాలంగా జంతువుల నుంచి సేకరించే కొన్ని ఉత్పత్తులకు దూరంగా ఉన్నాని తెలిపారు. అక్కినేని అమల మాట్లాడుతూ మానవతావాదులందరూ వేగన్‌లు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు మాట్లాడుతూ హైదరాబాద్‌లో వేగనిజం ప్రజల ఆదరణ పొందుతోందనడానికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. జంతువుల నుంచి సేకరించే ఏ రకమైన వస్తువైనా అది మాంసాహారంగానే భావిస్తామన్నారు. చివరికి పాలు సైతం అదే కోవకు చెందినవిగా నిర్ధారిస్తామని తెలిపారు. చెట్లు నుంచి సేకరించిన వస్తువులు, ఉత్పత్తులు మాత్రమే వినియోగించాలని, అవి ప్రకృతికి మేలు చేస్తాయన్నారు. ఈ పద్ధతిని మార్చుకోవడానికి అందరం ప్రయత్నించాలన్నారు. శాకాహారి వంటలు, యోగా, కుండల తయారీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, బంతి పూలతో అగరబత్తీల తయారీ విధానం, వేగన్ ఫ్యాషన్ మొదలైన వాటిపై వర్క్‌షాపులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పర్యావరణ సమస్యలపై సినిమా ప్రదర్శించారు. మధ్యాహ్నం యువత నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో సీపీఆర్ఈఈసీ డైరెక్టర్ పి.సుధాకర్, పర్యావరణవేత్త వెంకటరత్నం, వైబ్రెంట్ లివింగ్ నిర్వాహకురాలు శ్రీదేవి పాల్గొన్నారు.



ఆసియా ఐకాన్‌గా తెలుగమ్మాయి

అవార్డు పొందిన మొట్టమొదటి ఇండియన్ గా గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: ఆసియా ఖండంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డుగా భావించే ఆసియా ఐకాన్ 2024 అవార్డును తెలుగమ్మాయి డా. కలశనాయుడు గెలుచుకుంది. సోషల్ సర్వీస్ కేటగిరీలో 11 ఏళ్ల చిన్నారి ఈ ఆసియా ఐకాన్ అవార్డును అందుకుని అందరి మన్ననలూ పొందుతోంది. శ్రీలంక రాజధాని కొలంబో వేదికగా జరిగిన అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమంలో కొలంబో గవర్నర్ సెంథిల్ అవార్డును కలశనాయుడుకు అందజేశారు. కలశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో కలశనాయుడు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గానూ ఈ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో అతి చిన్న వయసులో సోషల్ సర్వీస్ కేటగిరిలో అవార్డు సాధించింది. ఆసియా ఐకాన్ అవార్డు దక్కించుకున్న మొట్టమొదటి ఇండియన్‌గా చరిత్ర సృష్టించింది. నగరం వేదికగా ప్రాథమిక చదువులు పూర్తి చేసిన కలశనాయుడు ప్రస్తుతం లండన్‌లోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేస్తోంది. 11 ఏళ్ల కలశనాయుడును యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఇంటర్నేషనల్ యూనివర్శిటీ, యుఎస్ జీపీసీ సంయుక్తంగా గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయి. గ్లోబల్లీ యంగెస్ట్ సోషల్ వర్కర్‌గా గుర్తించాయి. డా.కలశనాయుడు సేవారంగంలోనే కాదు చదువుల్లోనూ అపర సరస్వతీ దేవి. ఏమాత్రం తడబాటు లేకుండా అనర్గళంగా తెలుగు, ఇంగ్లిష్, హిందీ, స్పానిష్‌తో పాటు ఫ్రెంచ్ భాషలో కూడా మాట్లాడుతుంది. క్లాసికల్ సంగీతంలో అద్భుతంగా పాటలు పాడటంతో పాటు చెస్, రూబిక్స్, సూకర్, స్విమ్మింగ్‌లో టాప్‌లో ఉంది. 128 యోగాసనాలను అద్భుతంగా వేస్తూ భారతీయ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తోంది. ఆసియా ఖండంలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన వ్యక్తులు, సంస్థలు, కంపెనీలకు ఈ అవార్డులను ప్రతి ఏటా ఇవ్వడం జరుగుతుంది. విద్య, వైద్యం, ఆరోగ్యం, వాణిజ్యంతో పాటు, అన్ని రకాల వృత్తులు, ఫ్యాషన్, లైఫ్ స్టైల్ వంటి వివిధ రకాల కేటగిరీలతో పాటు సోషల్ సర్వీస్ కేటగిరీ నుంచి ఈ అవార్డు కోసం ఆసియాలోని ప్రతి దేశం నుంచి ఎంతోమంది ప్రతిభావంతులు పోటీ పడతారు.

'ఆద్యం'తం.. చేనేతల అందం..

సాక్షి, సిటీబ్యూరో: చేనేత విశిష్టతకు అద్దం పట్టిన వస్త్ర వైభవం ఆకట్టుకుంది. భారతీయ సంప్రదాయ హస్తకళల తళుకుల్ని ఇముడ్చుకున్న ఫర్నిషింగ్ సోయగం కట్టిపడేసింది. భారతదేశంలోని అగ్రగామి కంపెనీ ఆదిత్య బిర్లా గ్రూప్‌కి చెందిన కార్పొరేట్ సామాజిక సంస్థ.. ఆద్యం హ్యాండ్ వోవెన్ నగరంలో తొలి స్టోర్‌ను బంజారాహిల్స్ రోడ్ నెం.7లో ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆద్యం ఉత్పత్తులను ప్రదర్శించారు. అనంతరం బ్రాండ్ లీడ్ బిజినెస్ కన్సల్టెంట్, లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్.. మనీష్ సక్సేనా తమ స్టోర్ విశేషాలను పంచుకున్నారు.

నేత కళాకారులతో కలిసి..

మరుగునపడిన భారతీయ చేనేతలు, హస్తకళల వైభవాన్ని పరిరక్షించడంతో పాటు 300 మందికి పైగా నేత కళాకారులను స్వయం సమృద్ధి దిశగా నడిపించడమే ఆద్యం లక్ష్యమన్నారు. వారణాసి, భుజ్, పోచంపల్లి, కాశ్మీర్, భదోహి తదితర ప్రాంతాల్లోని నేత కళాకారులను భాగస్వాములుగా పరిగణిస్తామన్నారు. అంతర్జాతీయ ట్రెండ్‌తో సంప్రదాయ పని తనాన్ని మిళితం చేసి ఉత్పత్తులను రూపొందిస్తామన్నారు.





మిద్దెతోట.. ఆరోగ్యానికి బాట..

- స్వయంగా కూరగాయలు, పండ్ల సాగు
- మిద్దెపై అతి తక్కువ ప్రదేశంలో అధిక లాభం
- ఓవైపు ఆరోగ్యం.. మరోవైపు ఆదాయం..

కుషాయిగూడకు చెందిన ప్రముఖ రచయిత, మిద్దెతోట నిర్వాహకురాలు, ప్రచారకులు లత కృష్ణమూర్తి 2019లో ఈ తరహా సాగును ప్రారంభించారు. మార్కెట్‌లో దొరికే కలుషిత ఆహారం, కూరగాయలు, పళ్లతో విసిగిపోయిన ఆమె మిద్దెమీద సాగు ప్రారంభించారు. తద్వారా పూలు, పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కల సాగుతో ఇంటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఓవైపు ఆరోగ్యం.. మరోవైపు కుటుంబ అవసరాలు, అధిక ఖర్చులను తగ్గించుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అద్దె ఇంటి నుంచి సొంత ఇంటికి...

మొదట్లో ఆమె మిద్దె తోటలో సాగు ప్రారంభించినప్పుడు అద్దె ఇంట్లో ఉండేవారు.. 2019 నుంచి కుషాయిగూడ, శివసాయినగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ ఆమె ఇంటి ఖర్చును తగ్గించుకుంటూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆస్వాదించారు. ప్రస్తుతం ఆమె సొంత ఇంటి నిర్మాణం చేపట్టి అందులోనే మిద్దెతోట ఏర్పాటు చేసుకున్నారు.

వందకుపైగా రకాలు...

తన ఇంటి ఆవరణలో మిద్దెపై సుమారు వందకుపైగా రకాల పండ్లు, కూరగాయలు, పూలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలు ఉన్నట్లు లత తెలిపారు. గతంలో అనేక మొక్కలు మార్కెట్‌లో అందుబాటులో ఉండేవి కావని, ప్రస్తుతం అన్ని రకాల మొక్కలూ లభ్యమవుతున్నాయని తెలిపారు.

రోజుకు రెండు గంటలు..

మిద్దెతోట సాగుకు రోజుకు రెండు గంటల పాటు పనిచేసి తన ఇంటి అవసరాలను తీర్చుకుంటున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు తనను సంప్రదిస్తే మిద్దెతోట సాగుపై పూర్తి అవగాహన కల్పించి తోడ్పాటునందిస్తానన్నారు.

మిద్దెతోట ప్రచారకులుగా...

సొంతంగా మిద్దెతోట నిర్వహిస్తూ.. నలుగురికీ మిద్దెతోట పెంపకంపై అవగాహన కల్పిస్తూ ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. తద్వారా అనేక మందికి సూచనలు ఇస్తూ రచయితగానూ గర్తింపు పొందారు. ఇటీవల నూతన ఇంట్లో ఏర్పాటు చేసిన మిద్దె తోటను మిద్దెతోట నిపుణులు, ప్రచారకులు తుమ్మేటి రఘోత్తంరెడ్డి, రైతు నేస్తం వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.

మార్కెట్‌లో లభించే కూరగాయలు వివిధ రకాల క్రిమిసంహారకాలు, నిల్వచేయడం కోసం వినియోగించే రసాయనాలతో కలుషితమవుతున్నాయి. దీంతో అప్పుడే మనసులో ఓ ఆలోచన వచ్చింది. వెంటనే ఆచరణలో పెట్టి స్వయంగా కూరగాయలు, పండ్లు సాగుచేసుకోవడం ప్రారంభించామని చెబుతున్నారు నగరంలోని కుషాయిగూడకు చెందిన పలువురు మిద్దెతోట నిర్వాహకులు.

\- కుషాయిగూడ




రుషికొండ టీటీడీ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్


తాడేపల్లిగూడెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తదితరులు


గుంటూరు శ్రీకళ్యాణ రామాలయంలో పూజలు చేస్తున్న అంబటి రాంబాబు, విడదల రజిని, చంద్రగిరి ఏసురత్నం, మోదుగుల వేణుగోపాలరెడ్డి, బాలవజ్రబాబు


విజయవాడ లబ్బీపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ తదితరులు


విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు


శ్రీకాకుళంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తదితరులు


నంద్యాల జిల్లా డోన్‌లోని వేంకటేశ్వరాలయంలో పూజలు చేసేందుకు పాదయాత్రగా వెళ్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దేవుడా.. ఏపీని రక్షించు!

తిరుమల పవిత్రతను మంటగలుపుతూ సీఎం చంద్రబాబు ఘోర అపచారం

బాబు పాపాల ప్రక్షాళన కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల పూజలు

సాక్షి నెట్‌వర్క్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అపచారం ప్రభావం రాష్ట్ర ప్రజలపై పడకుండా చూడాలని వేడుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు.. హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లోని ఆలయాలు ప్రత్యేక పూజలతో కిటకిటలాడాయి. అనంతపురం మొదలు ఇచ్ఛాపురం వరకు హోమాలు, అభిషేకాలతో ఆలయాలు హోరెత్తాయి. పరమ పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన నిరాధార ఆరోపణలతో దేవదేవుడికి కలిగే ఆగ్రహం చంద్రబాబు వరకే పరిమితమయ్యేలా చూడాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు స్వామి వారిని వేడుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజలు, అభిమానులు భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. బాబు పాపాలకు ప్రక్షాళన గావించాలని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా భక్తులు, తెలుగు ప్రజలందరూ హారతులిచ్చారు. మత రాజకీయాలు చేస్తున్న సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేస్తూ విద్వేషాలు సృష్టిస్తున్నారని, తిరుమల పవిత్రతను 'మంట'గలుపుతూ చలి కాచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ పేరు ప్రఖ్యాతులకు విఘాతం కల్పిస్తూ భక్తులను రెచ్చగొడుతున్నారని, బాబు వ్యాఖ్యలకు మంత్రులు, టీడీపీ నేతలు, ఎల్లో మీడియా తందానా అంటుండటం బాధాకరమని అన్నారు. కల్తీ జరిగిందని చెబుతున్న నెయ్యిని అసలు ఉపయోగించనప్పుడు తప్పు జరగడానికి ఆస్కారమే లేదని, అయినా ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని.. బాబు మహాపచారం ప్రభావం రాష్ట్రంపై పడకుండా చూడాలని పదే పదే వేడుకున్నారు. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మద్దతుగా ప్రజలు తరలివచ్చి పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై 30న సుప్రీంలో విచారణ

- జస్టిస్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ బెంచ్‌కు వచ్చిన లడ్డూ కేసు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపిన తిరుమల లడ్డూ వివాదంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. లడ్డూలలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు చేయడంపై యావత్ ప్రజానీకం నివ్వెరపోయింది. ఈ వ్యవహారంలో నిజానిజాలు నిగ్గు తేల్చాలని కోరుతూ.. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుబ్రహ్మణియన్ స్వామి ఇటీవల సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఈ నెల 30న విచారణ ప్రారంభం కానుంది. జస్టిస్ బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్ బెంచ్ లడ్డూ వివాదంపై విచారణ జరపనున్నారు. చంద్రబాబు తిరుమల లడ్డూ వ్యవహారాన్ని రాజకీయ స్వార్థం, స్వలాభం కోసం వాడుకునే అవకాశం ఉందనే తాను సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు సుబ్రమణియన్‌స్వామి తెలిపారు.


వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం రెడ్డిపల్లి పోలేరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ


వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని శ్రీరస్తు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి చిత్రపటాన్ని చేతబట్టి చంద్రబాబు బూట్లు ధరించి ఉన్న ఫొటోను మీడియాకు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ఒంగోలు సంతపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు

ఎస్సీ వర్గీకరణకు వన్‌మెన్ జ్యుడీషియల్ కమిషన్

- వర్గీకరణ కమిటీ సమావేశంలో ప్రాథమికంగా నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేకంగా వన్‌మెన్ జ్యుడీషియల్ కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఎస్సీ వర్గీకరణ కమిటీ నిర్ణయించింది. ఇప్పటికే వర్గీకరణ అమలు చేస్తున్న హరియాణా, పంజాబ్, తమిళనాడులలో ఇదే తరహాలో కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలోనూ అదే విధానాన్ని అనుసరించాలనే అభిప్రాయాన్ని వర్గీకరణ కమిటీ వ్యక్తం చేసింది. శనివారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలువురు అధికారులు పంజాబ్, తమిళనాడు, హరియాణాలలో అమల్లో ఉన్న విధానాన్ని కమిటీకి నివేదించడంతో కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌తో కమిటీ సోమవారం భేటీ కానుంది. మరోవైపు రాష్ట్రంలో 2011 జనగణన ఆధారంగా వర్గీకరణ చేపట్టే అంశంపైనా కమిటీ చర్చించింది. రాష్ట్రంలో 1999 నుంచి 2004 మధ్య ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన నేపథ్యంలో ఆ సమయంలో ఎస్సీ ఉపకులాలకు ఏ మేరకు లబ్ధి జరిగిందనే అంశంపైనా కమిటీ సభ్యులు చర్చించారు.

అమ్మా సారీ.. నాకు బతకాలని లేదు

- జీవితంపై విరక్తితోనే చనిపోతున్నా.. సర్వీస్ గన్‌తో కాల్చుకుని ఏఆర్ కానిస్టేబుల్ సూసైడ్
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘటన



ఇబ్రహీంపట్నం రూరల్: 'అమ్మానాన్నా.. నేను చేస్తున్నది తప్పే.. .. నాకు బతకాలని లేదు. రోజొక నరకంగా ఉంది. నేను ఎంత కంట్రోల్ చేసుకుంటున్నా.. జీవితంలో ఏదో కోల్పోయాననే బాధ ఉంది. జీవితంలో మొదటిసారి ఆత్మహత్య యత్నంచేసి తప్పుచేశా. దాని వల్ల గ్రామంలో, ఫ్రెండ్స్ సర్కిల్‌లో నామీద లేనిపోని నిందలు వేస్తున్నారు. వాటిని భరించలేకపోతున్నా. నాకు జీవితం మీద విరక్తి పుట్టింది. అందుకే చనిపోతున్నా. నా చావుకు నేనే కారణం. సారీ అమ్మా.. బై'అని సూసైడ్ నోట్ రాసి.. ఓ ఏఆర్ కానిస్టేబుల్ సర్వీస్ గన్‌తో కాల్చుకుని మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం తెల్లవారుజామునఈ ఘటన చోటుచేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మంచాల మండల కేంద్రానికి చెందిన దూసరి బాలకృష్ణగౌడ్ (28) ఏఆర్ కానిస్టేబుల్. ప్రస్తుతం కలెక్టరేట్‌లో సెంట్రీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఉదయం 3 గంటలకు డ్యూటీకి హాజరయ్యాడు. ఆ తర్వాత గంటసేపటికి కలెక్టరేట్‌లోని బాత్రూంలోకి వెళ్లి తలుపు వేసుకుని ఎస్ఎల్ఆర్ తుపాకీతో కాల్చుకున్నాడు. గదవ కింద గన్ పెట్టుకుని ట్రిగ్గర్ నొక్కడంతో తలను ఛిద్రం చేస్తూ బయటకు వచ్చిన బుల్లెట్ షెల్ బాత్‌రూం స్లాబ్‌ను తగిలింది. అదే తుపాకీపై ఒరిగిన బాలకృష్ణ రక్తం మడుగులో పడి మృతిచెందాడు. తోటి పోలీసులు వచ్చి చూసేసరికి విగత జీవిగా కనిపించాడు. బాలకృష్ణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు రెండేళ్ల క్రితం కూడా పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు.

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సర్కారు ఓకే

- మంత్రి శ్రీధర్‌బాబు కమిటీ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) పునరుద్ధరణ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పునరుద్ధరణ విధి విధానాలపై కసరత్తు వేగం పుంజుకుంది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీ త్వరలో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకోనుంది. మూతపడిన యూనిట్లను తెరిచిన తర్వాత నిర్వహణ బాధ్యతను ఎవరికి అప్పగించాలనే అంశంపైనా కమిటీ స్పష్టత ఇవ్వనుంది. మరోవైపు అవసరమైన రోడ్ మ్యాప్ రూపొందించేందుకు కన్సల్టెంట్ ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

ఎన్నికల హామీ మేరకు కమిటీ

ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణపై ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది జనవరి 12న ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ వైస్ చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీలో మరో 8 మంది సభ్యులుగా ఉన్నారు. పునరుద్ధరణకు విధి విధానాలను సూచిస్తూ నివేదిక ఇచ్చేందుకు కమిటీకి ప్రభుత్వం 2 నెలలు గడువు ఇచ్చింది. బోధన్ చక్కెర కర్మాగారం సందర్శన, చెరుకు రైతులు, రైతు సంఘాలు తదితర వర్గాల నుంచి సమాచారం సేకరించి గడువులోగా ఈ కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం ఆగస్టు 1న ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణకు పచ్చజెండా ఊపినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది.

యూనిట్లు తెరిచినా నడిపేది ఎలా?

ఎన్‌డీఎస్ఎల్‌లో డెల్టా పేపర్‌మిల్స్‌కు 51%, నిజాం షుగర్స్ లిమిటెడ్‌కు 49% వాటా ఉంది. ఎన్‌డీఎస్ఎల్ పరిధిలో బోధన్, మంభోజిపల్లి, మెట్‌పల్లి యూనిట్లతో పాటు బోధన్‌లో డిస్టిలరీ కూడా ఉంది. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న 2002–03లో నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ జరిగి ఎన్‌డీఎస్ఎల్‌గా ఆవిర్భవించింది. అయితే నష్టాలతో ఎన్‌డీఎస్ఎల్ 2015లో యూనిట్లను మూసివేసింది. తాజాగా పునరుద్ధరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా తాము యూనిట్లను నడపలేమని ప్రైవేటు భాగస్వామి చేతులు ఎత్తేసినట్లు సమాచారం.

మార్చికల్లా యాదగిరిగుట్ట గోపురానికి బంగారు తాపడం

సాక్షి, హైదరాబాద్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం విమాన గోపురానికి త్వరలో బంగారు తాపడం చేయనున్నారు. ఆలయంలో ఉన్న బంగారం, వెండి నిల్వలను కరిగించి తాపడానికి వినియోగించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలోనే బంగారు తాపడం కోసం విరాళాల రూపంలో బంగారాన్ని సేకరించారు. కొందరు భక్తులు నగదు కూడా సమర్పించారు. ఇలా మొత్తం కలిపి రూ.75 కోట్ల వరకు ఉన్నట్టు సమాచారం. అలా సేకరించిన బంగారంతోపాటు హుండీలో భక్తులు సమర్పించిన బంగారు ముక్కలను కూడా ఇందుకు వినియోగించేందుకు ప్రభుత్వం ఇప్పుడు అనుమతించింది. దీంతోపాటు ఆలయంలో ఉన్న వెండి నిల్వలను కూడా మింట్ ఆధ్వర్యంలో కరిగించి దాని విలువకు తగిన బంగారాన్ని సేకరించి తాపడానికి వినియోగించాలని కూడా నిర్ణయించారు. ఈ బాధ్యతను స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారు. తాపడం పనులకు చదరపు అడుగుకు రూ.3,900 చొప్పున ఆ సంస్థకు చెల్లించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అభ్యంతరాలకు గడువు పొడిగించం!

- విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలపై ఈఆర్సీ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదిస్తూ ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సమర్పించిన టారిఫ్ ప్రతిపాదనలతో పాటు.. జెన్‌కో, ట్రాన్స్‌కోల ఇతర ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు సమర్పించడానికి వచ్చే నెల 11 వరకు ఇచ్చిన గడువును పొడిగించబోమని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) స్పష్టం చేసింది. డిస్కంలు రాష్ట్రంలో రూ.1,200 కోట్ల విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదిస్తూ ఇటీవల టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించాయి. జెన్‌కో 2022–23కి సంబంధించిన ట్రూఅప్ చార్జీలతో పాటు 2024–29 మధ్య కాలానికి సంబంధించిన మల్టీ ఈయర్ టారిఫ్ ప్రతిపాదనలను సమర్పించింది. ట్రాన్స్‌కో సైతం 2024–29 మధ్యకాలానికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్ బిజినెస్/ఎస్ఎల్‌డీసీ కార్యకలాపాలకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించింది. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలు ఒకేసారి ప్రతిపాదనలు సమర్పించడంతో వాటిని చదివి అర్థం చేసుకోవడానికి సమయం సరిపోదని, గడువును పొడిగించాలని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థతో పాటు చాలా మంది ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిని తిరస్కరిస్తూ ఈఆర్సీ వారికి బదులిచ్చింది. వచ్చే నెలాఖరులోగా ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు, ఇద్దరు సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా బహిరంగ విచారణలు ముగించి కొత్త టారిఫ్ ఆర్డర్‌ను పదవీ కాలం ముగింపునకు ముందే జారీ చేసేందుకు ఈఆర్సీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలపై ప్రతిస్పందించడానికి సరైన సమయం కేటాయించలేదని విద్యుత్‌రంగ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలపై వచ్చే నెల 23న హైదరాబాద్‌లోని ఈఆర్సీ ఆడిటోరియంలో, 24న వరంగల్‌లోని జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్టు ఇప్పటికే ఈఆర్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వచ్చే నెలాఖరులోగా కొత్త టారిఫ్ ఉత్తర్వులు జారీ చేసేందుకు ఈఆర్సీ పూర్తిగా సన్నద్ధమైనట్టు తెలుస్తోంది.

ఎందుకీ రాద్ధాంతం?

ఏ నివేదికలో నిరూపణ కాకుండానే తిరుమల లడ్డూపై దుష్ప్రచారం తగదు

చంద్రబాబు పచ్చి అవకాశవాది.. తన స్వార్థ ప్రయోజనాలే ముఖ్యం

సాక్షి ఇంటర్వ్యూలో ప్రముఖ ఆర్థిక వేత్త, సామాజిక కార్యకర్త మోహన్ గురుస్వామి

సీఎం చంద్రబాబు తిరుమలను వివాదాస్పదంగా మార్చడం సరికాదు

అయినా ఆ నెయ్యి వాడనేలేదు.. అపచారం ఎక్కడ?

నెయ్యిలో కల్తీ జరిగిందనేది కేవలం రాజకీయ ఆరోపణలే


వాటికి ప్రభుత్వ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం.. అత్యున్నత పదవుల్లో ఉన్న వారికి లౌకికవాదమంటే అర్థం తెలుసా?

సాక్షి, హైదరాబాద్: 'సెక్యులర్ రాజ్యంలో మతానికి చోటుండదు. మతపరమైన విశ్వాసాలు అనేవి వ్యక్తిగతం. అసలు ప్రభుత్వంలో మతం అనే దానికి చోటే లేదు. ఇలాంటి విషయాలను అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమలను వివాదాస్పదంగా మార్చడం సరికాదు' అని ప్రముఖ ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త మోహన్ గురుస్వామి అన్నారు. మతపరమైన విశ్వాసాలపై వివాదం సృష్టించి, తద్వారా రాజకీయ ప్రయోజనం పొందేందుకే తిరుమల లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చినట్టు కనిపిస్తోందని చెప్పారు. పాలకులకు ఇబ్బంది కలిగించే విషయాలను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి వివాదాలు తెరపైకి తెస్తుంటారని, ఏపీలో ఇప్పుడదే జరుగుతోందన్నారు. తిరుమల లడ్డూ వివాదం, జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాజకీయ పరిణామాలు, ఆర్థిక రంగంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై సాక్షి ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అవన్నీ రాజకీయ ఆరోపణలే

- లడ్డూల తయారీకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందనే రాజకీయ ఆరోపణలు, వాటికి ప్రభుత్వ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేయడం మినహా అది నిజమని ఏ నివేదికలోనూ వెల్లడి కాలేదు. ఈ అంశం అమూల్‌తో సహా ఏ నివేదికలోనూ నిరూపితం కాకుండానే అయినట్టుగా ప్రచారం చేస్తున్నారు.
- పాలు జంతువుల ఉత్పత్తితో ముడిపడినవే. శాస్త్రీయంగా చూస్తే.. ఆవు, బర్రె, మేక ఆ మాటకొస్తే ఏదైనా మొక్క నుంచి వచ్చే కొవ్వును మార్పిడి చేస్తే నెయ్యి తయారవుతుంది. ఆవు అధికంగా మేత మేసినా, లేక తక్కువగా తిన్నా ఫలితాల్లో మార్పులు కనిపిస్తాయి. ఇదే విషయాన్ని అమూల్ టెస్ట్ రిజల్ట్ నిర్ధారించింది. కల్తీ అయిందని చెబుతున్న నెయ్యే లడ్డూ తయారీలో వాడనప్పుడు అపచారం జరిగిందనడానికి ఎక్కడ తావుంది?

ఆ నెయ్యిలో ఏదో జంతువు కొవ్వు కలిసిందని జరుగుతున్న ప్రచారం కేవలం ఊహాజనితం. దీనికి ఎలాంటి శాస్త్రీయ కొలబద్ద లేదు. ఇలాగైతేనే ప్రజలు నమ్ముతారని మూఢ నమ్మకం మాటున చెబుతున్నదే. ఏదైనా విషయాన్ని ఉద్దేశ పూర్వకంగా అశాస్త్రీయంగా అంచనా వేయడంలో భాగంగానే ఇది జరిగింది. అంటే ఏదో ఆశించి ఇలా చేశారని స్పష్టమవుతోంది. ఇది 'బ్యాడ్ కేస్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటేషన్'గా నిలుస్తుంది.
- ప్రముఖ ఆర్థిక వేత్త, సామాజిక కార్యకర్త మోహన్ గురుస్వామి



- ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పచ్చి అవకాశవాది. తన స్వార్థ ప్రయోజనాలు, రాజకీయ ప్రయోజనాలే ఆయనకు అత్యంత ముఖ్యం. ఇందుకోసం ఏం చేయడానికైనా ఆయన వెనుకాడరని చరిత్ర చెబుతోంది. గతంలో మోదీని నంబర్ వన్ శత్రువుగా ప్రకటించిన చంద్రబాబు.. ఇప్పుడు ఆయనకు నంబర్ వన్ మిత్రుడు ఎలా అయ్యారు?
- అత్యున్నత పదవుల్లో ఉన్న వారికి లౌకికవాదమంటే అసలైన అర్థం తెలుసా? వారికి ఆ పదవిలో కొనసాగే అర్హత ఉందా? (ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను ఉద్దేశించి) అన్న అనుమానం కలుగుతోంది.

చంద్రబాబు స్వార్థ రాజకీయాలే చేస్తారు

- గతంలో చంద్రబాబు మనుషులు సైబరాబాద్ చుట్టూ భూములు కొని లాభ పడ్డారు. అప్పుడు అక్కడ భూముల పేరిట చేసిందే ఇప్పుడు అమరావతిలో పెద్ద ఎత్తున చేయబోతున్నారు. అందుకే అమరావతే ఏకైక రాజధానిగా ఉండాలని పట్టుబడుతున్నారు. తన అనుయాయులు కొన్ని భూములన్నీ కూడా అక్కడే ఉండటం గమనించాల్సిన విషయం. చంద్రబాబు ఎప్పుడూ స్వార్థ రాజకీయాలే చేస్తారు.
- అయితే అక్కడ మౌలిక, ఇతర అవసరాల కోసం పెట్టుబడులు పెట్టడానికి వేల కోట్ల రూపాయలు కావాలి. మోదీ ప్రభుత్వం కూడా ఆ మేరకు ఇచ్చే పరిస్థితి లేదు. ఏపీకి కేంద్రం 'ప్రత్యేక హోదా కల్పన' ఇవ్వడం అనేది అసాధ్యం. ఏపీలో బీహార్ మాదిరిగా వెనుకబాటుదనం లేదు. ఈశాన్య రాష్ట్రాల లాగా భౌగోళికంగా దూరప్రాంతాల్లోనూ లేదు. ప్రతిసారి కేంద్రం నుంచి గ్రాంట్లు కావాలని, డబ్బులు ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేసినా అది రావడం కూడా కష్టమే. సాధ్యం కాదు.
- అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే చంద్రబా బు.. అమరావతిలో మెట్రో, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, పరిపాలనా కేంద్రం సచివాలయం, గవర్నమెంట్ ఉద్యోగుల క్వార్టర్లు, ఇతర ఆధునిక సదుపాయాలు, ముఖ్యమైన సంస్థలన్నీ అమరావతిలోనే ఉండాలంటున్నారు. ఇలా అన్నీ అక్కడే ఎందుకో.. దాని వెనుక ఏం ప్రయోజనాలు ఆశిస్తున్నారో లోతుగా గమనించాలి. ముందుగా ఓ కమర్షియల్ సెంటర్‌గా ఎదిగాక అవన్నీ సమకూరాలని కోరుకుంటే మంచిది.
- కేంద్రంలో రాజకీయ స్థిరత్వం అనేది చంద్రబాబు, నితీష్‌కుమార్ వంటి నమ్మకం లేని (అన్ ట్రస్ట్ వర్తీ) వ్యక్తులపై ఆధారపడి ఉంది. వీరిద్దరూ మద్దతు ఉపసంహరించినా కేవలం ఆరుగురు ఎంపీల మెజారిటీతో ప్రభుత్వం మనగలుగుతుంది. అయితే గత రెండు పర్యాయాలతో పోల్చితే మోదీ ప్రభుత్వం బలహీనంగానే ఉంది. దేశంలో నిరుద్యోగ శాతం, ఉద్యోగాలు, ఉపాధి కోరుకుంటున్న యువత సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ విధానాలను, విపక్షాలను మోదీ 'మిస్ మేనేజ్' చేశారు. తప్పుడు గణాంకాలతో మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తున్నారు. 'కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్' అనుకున్న విధంగా జరగలేదు. కార్పొరేట్ కంపెనీలు విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయి.

వైఎస్ జగన్ వికేంద్రీకరణ ఆలోచన బాగుంది

- రాష్ట్ర రాజధానిని వికేంద్రీకరించాలనే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన ఎంతో బాగుంది. గతంలో కర్నూలులో రాజధాని ఉండేది. హైకోర్టు, రాష్ట్ర సచివాలయం రెండూ రాజధానిలోనే ఎందుకుండాలి? రాష్ట్ర రాజధానిలోనే మెట్రోరైల్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వంటివి ఎందుకుండాలి? భోపాల్, రాయ్‌పూర్, రాంచీ, లఖ్‌నవూ, పాట్నా వంటి రాజధానుల్లో మెట్రో, అంతర్జాతీయ విమానాశ్రయాలు లేవు.
- జగన్ సీఎంగా ఉన్నపుడు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు.. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలపై దృష్టి సారించడం బాగుంది. మంచి ఫలితాలు వచ్చాయి. వివిధ వర్గాల ప్రజలకు, ముఖ్యంగా పేదలకు నేరుగా నగదు బదిలీ (డీబీటీ) అనేది మంచి ఆలోచన. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ఇలా చేయడం, ఇళ్ల దగ్గరే ప్రజలకు అందించడం ఎంతో మేలు చేసింది. డీబీటీ విధానాన్ని నేను పూర్తిగా సమర్థిస్తున్నాను. ఇది ఉత్పాదకతను పెంచేదే. ఆర్థిక రంగానికి మేలు చేస్తుంది.
- ఎవరైనా సంక్షేమ పథకాలు సరైనవి కాదు అనడం, వీటిపై డబ్బు ఖర్చు చేయడం వృథా అనడం తప్పు. విద్య, వైద్య సేవలకు కూడా చార్జ్ చేస్తారా? ఇవన్నీ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి. ప్రభుత్వాలు ఏవైనా విద్యా రంగం, పబ్లిక్ హెల్త్‌కేర్‌పై ఎక్కువ నిధులు ఖర్చు చేయాలి. ప్రజలకు మేలు చేకూర్చడం అనేది ఓ మంచి ఆర్థిక కార్యక్రమంగా భావించాలి.


మోక్షా సేన్ గుప్తా

స్ట్రీట్‌లో స్టెప్పులు నిరసన నిప్పులు


మోక్షా సేన్ గుప్తా వైరల్ డ్యాన్స్ వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

స్త్రీ అమ్మ... అన్యాయం జరిగితే ఆదిపరాశక్తి. స్త్రీ భూదేవి... సహనం కోల్పోతే అపరకాళి. ఈ జగత్తును తల్లిలా ఆదరించే ప్రతి స్త్రీ ఈ జగత్తులో తానొక భాగం అనుకుంటుంది. తనకు గౌరవప్రదమైన ఉనికి కోరుకుంటుంది. కానీ, మనుషులు ఘోరంగా వ్యవహరించి ఆమె విశ్వాసాన్ని ధ్వంసం చేస్తుంటారు. ఆమె సహనాన్ని పరీక్షిస్తుంటారు. కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన ఘోరకలి ఈ దేశంలో ప్రతి స్త్రీని భద్రకాళిని చేసింది. ఆ సమయంలో ఎగసిన నిరసనల్లో కోల్‌కతా వీధుల్లో ఉగ్రతాండవం చేసింది మోక్షా సేన్ గుప్తా. 'సాక్షి'తో ఆమె మాట్లాడింది.

''సమాజంలోని చీడపురుగులకు చికిత్స చేయాలి. లేకపోతే వైద్యులనే కబళించేస్తాయి. చికిత్స ఎంత తీవ్రంగా ఉంటే సమాజానికి అంత మేలు'' అంటున్నారు మోక్షా సేన్ గుప్తా. కోల్‌కతా డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా మోక్షా సేన్ గుప్తా స్ట్రీట్ డ్యాన్స్‌తో పాటు ఇంకా పలు ర్యాలీల్లో పాల్గొంటున్నారు. 'అలనాటి రామచంద్రుడు'తో తెలుగు తెరపై కనిపించిన ఆమె త్వరలో విడుదల కానున్న 'రామం రాఘవం'లోనూ నటించారు. బెంగాలీ, మలయాళ భాషల్లోనూ సినిమాలు చేస్తున్నారు. ఇక 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోక్షా సేన్ గుప్తా చెప్పిన విషయాలు.

■ వీధుల్లో కళా ప్రదర్శన మా సంస్కృతి

వీధుల్లో కళా ప్రదర్శన అనేది చాలా సంవత్సరాల నుండి వస్తున్న మా బెంగాల్ సంస్కృతి. వర్ధీనియా ఉద్యమం ప్రారంభమైనప్పుడు విభజనకు ముందు బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో బెంగాల్ కూడా రాజధానిగా ఉండేది. మన పూర్వీకులు వీధి కళ, వీధి నాటకం, వీధి నృత్యం, వీధి పాటల ద్వారా వీధి ప్రదర్శనలు చేసేవారు. దర్శకుడు సత్యజిత్ రే ఏదైనా సమస్య అంటే బెంగాలీలు అందరూ ఎలా ఒక్కటవుతారో కూడా తన సినిమాల్లో చూపించారు. మన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో బెంగాలీ స్వాతంత్ర్య సమరయోధులు వీధుల్లోకి వచ్చి, నిరసనలు చేశారు. నా రాష్ట్రం, నా కుటుంబం నేర్పిన, పెంపకం నుంచి నాకు సామాజిక బాధ్యత వచ్చింది. పూర్వీకులు చేసిన నిరసనలే నాకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తితోనే కోల్‌కతా వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా వీధుల్లో కళా ప్రదర్శనలు చేశాను.

■ సత్యం కోసం...

కవి ఖాజీ నజ్రుల్ ఇస్లాం స్వాతంత్ర్య సమయంలో తన కవితలు, పాటల ద్వారా బెంగాల్‌లో పునరుజ్జీవనం తేవడానికి ప్రయత్నించిన గొప్ప వ్యక్తి. ఆయన్ను నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద వంటి మహానుభావులు స్ఫూర్తిగా తీసుకున్నారు. ఇక నేను వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా కవి ఖాజీ నజ్రుల్ ఇస్లాం పాటను స్ఫూర్తిగా తీసుకున్నాను. నేను రామకృష్ణ పరమహంస ఆరాధకురాలిని. ఆ విధంగా మంచి కోసం నిలబడటం అనేది నా రక్తంలోనే ఉంది. ఏ కళాకారుడైనా... అది వీధి కళాకారుడైనా 'సత్యమేవ జయతే' అంటూ నిజం వైపు నిలబడే ధైర్యం ఆ ఆర్టిస్ట్‌కి ఉండాలి. నేను డ్యాన్స్ చేసిన పాట అర్థం కూడా దాదాపు ఇలానే ఉంటుంది. 'ఒకవేళ నువ్వు చెరసాలలో ఉన్నట్లయితే నిజం కోసం గొంతు ఇవ్వడానికి ఆ చెరసాలను బద్దలు కొట్టి బయటకు రావాలి. సత్యం కోసం స్వరం వినిపించాలి' అన్నట్లుగా ఆ పాట ఉంటుంది.

> అభయ అనేది అంతర్గతంగా, బాహ్యంగా నన్ను మార్చేసింది. ఇక ఇప్పుడు నేను దేని గురించీ పట్టించుకోను. ఎంత దూరం అయినా ఏ మార్గంలో అయినా వెళ్లగలను. ఇది 'మోక్ష 2.ఓ' వెర్షన్. ఈ మారిన మోక్ష డాక్టర్లకు సపోర్టివ్‌గా ఉంది... న్యాయం పక్షాన ఉంటుంది.

■ వ్యవస్థకి వ్యతిరేకంగా..

మృత్తిక అనే స్వచ్ఛంద సేవా సంస్థ, ఇంకా మరికొన్ని అలాంటి సంస్థలు అణగారిన స్త్రీలు, పిల్లల సంక్షేమం కోసం పని చేస్తుంటాయి. వారితో మేం కలిసి పని చేస్తాం. అభయ సంఘటన విషయంలో వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాడే వైద్యులతో మేం నిలబడ్డాం. నేను మాత్రమే కాదు... ఎందరో కళాకారులు మాతో వీధుల్లోకి వచ్చారు. అభయ కుటుంబానికి, వైద్యుల కోసం, న్యాయం కోసం మేం అంతా ఉన్నామని చూపించడానికి నాట్యాన్ని ఎన్నుకున్నాం. మేం చేస్తున్న నిరసన కార్యక్రమాలు చాలామందిని ప్రభావితం చేస్తున్నాయని నమ్ముతున్నాను.

> పార్టీలకు తటస్థంగా ఉంటే కొన్ని ప్రశ్నలు లేవనెత్తలేం. అయితే ప్రశ్నలు వేస్తే మీరు ప్రతిపక్ష పార్టీ కేడర్ అని అర్థం... ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటనల ప్రభావం నేనో కొత్త కల కనేలా చేశాయి. 'మానవ హక్కు'ల గురించి క్షుణ్ణంగా చదవాలన్నదే ఆ కల.

■ డ్యాన్స్ కాదు... నిరసన

నేను చేసినది డ్యాన్స్ అని నాకనిపించలేదు. ఎందుకంటే సరైన కొరియోగ్రఫీ లేదు. నిజానికి నేను వేరొక నిరసన ప్రదర్శన నుండి నేరుగా అక్కడికి వెళ్లాను. ఓ 20, 25 కిలోమీటర్ల నిరసన కార్యక్రమం అది. ఆ నిరసన పూర్తయ్యాక అక్కడికి వెళ్లాను. ఒక బలమైన విషయాన్ని నృత్యరూపంలో చెప్పాలనుకున్నప్పుడు సరైన వేదిక అక్కర్లేదు... కెమెరా, యాక్షన్, లైట్లు అవసరంలేదు. ఓ ఆర్టిస్ట్ సత్యం కోసం ఎక్కడ నిలబడితే అదే పెద్ద వేదిక అవుతుంది. ఆ వేదిక సత్యం, న్యాయం కోసం మాత్రమే నిలబడే వేదిక అయితే చాలు... ముందస్తు ప్రిపరేషన్ లేకుండా చేసేయొచ్చు.

■ ఐక్యత కోసమే...

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని స్థానిక పార్టీ సమర్థిస్తోంది. అంటే... కొందరు రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కౌన్సిలర్లు, స్థానికులు. నా డ్యాన్స్ గురించి కూడా చాలా అవమానకరంగా మాట్లాడారు. ఇది నిరసనా లేక మీరు రెచ్చగొడుతున్నారా? అన్నారు. అయితే ఇప్పుడు కామన్ మేన్ కూడా తన గొంతు విప్పడానికి సిద్ధమయ్యాడు. సో... ఎక్కడో చోట మొదలయ్యే నిరసనలు సాధారణ వ్యక్తులను ప్రభావితం చేసేందుకూ ఉపయోగపడతాయి. కొన్నేళ్లుగా బెంగాలీల మధ్య ఉన్న ఐక్యత కాస్త సన్నగిల్లింది. అభయ రూపంలో మళ్లీ ఆ ఐక్యతను తిరిగి తేగలిగాం.

■ తలో చేయి వేద్దాం

రాష్ట్ర ప్రభుత్వం 21 మంది లాయర్లను నియమించింది. వారికి వ్యతిరేకంగా డాక్టర్లు, అభయ కుటుంబం పోరాడుతోంది. ఎందరో పెద్దలు ఇన్వాల్వ్ అయి ఉన్నారు. వారిని ఎదిరించి పోరాడాలంటే ఆర్థిక బలం అవసరం. వెస్ట్ బెంగాల్ డాక్టర్స్ నిధిని సమకూర్చాలని అనుకుంటున్నారు. నా వంతుగా నేనూ ఫండ్ రైజ్ చేస్తున్నాను. 100 రూపాయలు కూడా మాకు ఎక్కువే. 50 మంది 100 రూపాయలు ఇస్తే... అదే పెద్ద మొత్తం అవుతుంది. అలా తలో చెయ్యా వేసి, ముందుకొస్తే ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే వీలుంటుంది. అభయ కేసుని ఓ ఉదాహరణగా నిలపగలిగితే ఇలాంటి వెయ్యి సమస్యలను అధిగమించగలం. 'మేం భారతీయులమని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాం' అని ప్రపంచానికి చెప్పగలుగుతాం.

■ అవసరమైతే మళ్లీ డ్యాన్స్

మలయాళంలో నేను చేసిన 'చిత్ని' ఈ 27న రిలీజైంది. ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. అలాగే తెలుగులో నా ఫస్ట్ మూవీ 'అలనాటి రామచంద్రుడు' శుక్రవారం నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవుతోంది. థియేటర్లలో ఈ సినిమాని చూడనివాళ్లు ఓటీటీలో చూడాలని కోరుకుంటున్నాను. ఇలా నా సినిమా విషయాలను ఫోకస్ చేస్తూనే డిజిటల్‌గా బాధితుల పక్షాన వీలైనంతగా ప్రచారం చేస్తున్నాను. అవసరమైతే మళ్లీ 'స్ట్రీట్ డ్యాన్స్' చేస్తా. ఆ ప్రదర్శనతో ఐదు రూపాయలు లాంటి చిన్న మొత్తం వచ్చినా అది 'అభయ క్లినిక్'కి, అది ఏర్పాటు చేసిన డాక్టర్లకు వెళుతుంది. ఎందుకంటే ఈ క్లినిక్ నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి ఉపయోగపడాలన్నది మా ఆశయం. అందుకే సాయం చేయాలనుకునేవారు ఈ ఫోను నంబరు +91 6291485209 లేదా wbjuniordoctorsfront@gmail.comని సంప్రదించాలని కోరుకుంటున్నాను'' అని మోక్ష విజ్ఞప్తి చేశారు.

– డి.జి. భవాని

నివాళి మాగీ స్మిత్

షేక్‌స్పియర్ నుంచి హ్యారీపోటర్ దాకా


'హ్యారీ పోటర్'లో మాగీ స్మిత్

ఆక్స్‌ఫర్డ్ నుంచి 'ఆస్కార్' వరకు ఎదిగిన ప్రస్థానం ఆమెది. రంగస్థలం మీద ఎంతగా రాణించిందో, సినిమాల్లోనూ, టీవీ సిరీస్‌లలోనూ అంతకు మించి రాణించిన ఘన చరిత్ర ఆమెది. ప్రపంచ నటీమణుల్లో మాగీ స్మిత్ ఒక అపరంజి అభినేత్రి. షేక్‌స్పియర్ నాటకాలు మొదలుకొని, హ్యారీ పోటర్ సిరీస్ వరకు కొనసాగిన ఏడు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో తాను నటనా రంగంలోకి అడుగుపెట్టిన నాటి నుంచి నేటి వరకు మూడు తరాల ప్రేక్షకులను అలరించిన అరుదైన ఘనత ఆమె సొంతం.

మాగీ స్మిత్ పూర్తి పేరు డేమ్ మార్గరెట్ నటాలీ స్మిత్. ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చదువుకుంటున్న కాలంలోనే ఆమె తొలిసారిగా 'ఆక్స్‌ఫర్డ్ ప్లేహౌస్' రంగస్థలంపై 1952లో తొలి నాటకంలో నటించింది. చదువు పూర్తయ్యాక నటననే వృత్తిగా ఎంచుకుని, 1956లో 'బ్రాడ్‌వే' థియేటర్‌లో 1956లో జూడీ డెంచ్ వంటి దిగ్గజ నటీమణులకు పోటీగా తన ప్రతిభను చాటుకుంది. బ్రిటన్‌లోని నేషనల్ థియేటర్, రాయల్ షేక్‌స్పియర్ కంపెనీ వంటి దిగ్గజ రంగస్థల సంస్థలు ప్రదర్శించిన నాటకాల్లో నటించింది. ఆమె తొలి సినిమా 'చైల్డ్ ఇన్ ది హౌస్' 1956లో విడుదలైంది. ఆ సినిమాలో ఆమెది చాలా చిన్న పాత్ర. దిగ్గజ నటుడు, దర్శకుడు లారెన్స్ ఆలివర్ సరసన 'ఒథెల్లో'లో నటించడంతో మాగీకి సినిమాల్లో గుర్తింపు వచ్చింది. 'ఒథెల్లో'లోని నటనకు గాను ఆమె తొలిసారిగా ఉత్తమ సహాయనటిగా 'ఆస్కార్'కు నామినేట్ అయింది. సినిమాలు, టీవీ సిరీస్‌లలో అవకాశాలు పుష్కలంగా వస్తున్నా, ఆమె రంగస్థలాన్ని విడిచిపెట్టలేదు. ఆమె నటించిన చివరి సినిమా 'ది మిరాకిల్ క్లబ్' గత ఏడాది విడుదలైంది, 'ఒథెల్లో'లోని డెస్డమోనా, 'ది ప్రైమ్ ఆఫ్ మిస్ జీన్ బ్రాడీ'లోని జీన్ బ్రాడీ, 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్'లోని బెట్సీ ట్రాట్‌వుడ్, 'హ్యారీ పాటర్' లోని ప్రొఫెసర్ మెక్ గొనగల్, 'డౌన్‌టన్ అబీ'లోని వయొలెట్ క్రాలీ, 'ది లేడీ ఇన్ ది వ్యాన్'లోని మేరీ షెఫర్డ్ వంటి పాత్రలు మాగీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయి. ముఖ్యంగా 'హ్యారీ పోటర్' సిరీస్‌తో ఆమెకు ఇప్పటి తరంలోనూ కోట్లాది మంది అభిమానులు ఏర్పడ్డారు.


'ఒథెల్లో'లో మాగీ స్మిత్

మాగీకి తన నటజీవితంలో రెండు ఆస్కార్ అవార్డులతో పాటు అనేకసార్లు బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అవార్డులు (బాఫ్టా అవార్డులు), ఎమ్మీ, గోల్డెన్ గ్లోబ్, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డులు దక్కాయి. రంగస్థల నటనలోనూ ఆమె అసంఖ్యాకమైన అవార్డులను పొందింది. 'ది ప్రైమ్ ఆఫ్ మిస్ జీన్ బ్రాడీ'లో నటనకు ఉత్తమ నటిగా 1969లో ఆస్కార్ అవార్డు అందుకుంది. 'కాలిఫోర్నియా స్వీట్'లో ఉత్తమ సహాయ నటిగా 1978లో ఆస్కార్ అవార్డు అందుకుంది.

మాగీ స్మిత్ తన 89 ఏళ్ల వయసులో శుక్రవారం లండన్‌లో కన్నుమూసిన వార్త యావత్ యునైటెడ్ కింగ్‌డమ్‌ను విషాదంలో ముంచేసింది. బ్రిటిష్ రాజు చార్లెస్, ప్రధాని కీర్ స్టార్మర్ సహా పలువురు ప్రముఖులు మాగీ మృతికి సంతాపం ప్రకటించారు.

హెల్త్

నేడు వరల్డ్ హార్ట్ డే

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఈ వారం ఫన్‌డే లో 'కుర్రాళ్ల గుండెలకు ఏమవుతోంది?' వంటి ప్రత్యేక కథనాలు






ఓ డాక్టర్ హార్ట్ బీట్

ఆ గుండె చప్పుడు మా గుండెల్లో నిండింది

గుండెకు రూపం ఉంటుంది. హృదయానికి కాదు. గుండెకు వైద్యం చేసేటప్పుడు వైద్యుడు తన హృదయం చేసే ఉద్వేగాలను అదుపు చేసుకోవాలి. అయితే అన్నిసార్లూ అలా ఉండదు. ఒక్కోసారి గుండెకు వైద్యం చేసేటప్పుడు వైద్యుడి గుండె కొట్టుకులాడుతుంది. ఆ గుండెను ఎలాగైనా కాపాడాలని పెనుగులాడుతుంది. పరితపిస్తుంది. అలాంటి ఒక అరుదైన కేసు వివరాలివి...

దాదాపు రెండేళ్ల కిందట మా దగ్గరికి 32 ఏళ్ల సతీష్ (పేరు మార్చాం) తీవ్రమైన ఛాతీనొప్పి, గుండెదడతో వచ్చాడు. వెంటనే హాస్పిటల్‌లో అడ్మిట్ చేసుకుని చూస్తే అతడి గుండె నార్మల్ కంటే చాలా వేగంగా కొట్టుకుంటూ, ఆగిపోయింది. ఇలాంటప్పుడు కరెంట్‌తో షాక్ ఇచ్చి మళ్లీ కొట్టుకునేలా చేస్తుంటాం. గుండె మరీ బలహీనంగా కొట్టుకుంటున్నప్పుడు లేదా హార్ట్ అటాక్‌తో గుండె ఆగిపోయినప్పుడు కరెంట్‌తో షాక్ ఇచ్చి తిరిగి స్పందించేలా చేయడం మామూలే. సతీష్‌కూ ఇలాగే షాక్ ఇచ్చి ఆగిపోయిన గుండె మళ్లీ స్పందించేలా చేశాం.

ఆ తర్వాత వెంటనే అతణ్ని కాథ్ ల్యాబ్‌కు తీసుకెళ్లి యాంజియోగ్రామ్ చేసి చూస్తే అందులో ఏమీ తేడా లేదు గానీ, వేగంగా కొట్టుకుంటున్న అతడి గుండె స్పందనలు నార్మల్ కాలేదు. గుండె బాగా బలహీనంగా ఉంది. లంగ్స్‌లోకి నీరు చేరింది. వెంటిలేటర్ మీద ఉంచాల్సి వచ్చింది. గుండె ఇలా వేగంగా కొట్టుకునే కండిషన్‌ను 'వెంట్రిక్యులార్ ట్యాకికార్డియా – వీటీ' అంటారు. ఒకసారి షాక్ తర్వాత... గుండె స్పందించడం మొదలయ్యాక మళ్లీ మునుపటి పరిస్థితి రాకుండా ఉండటానికి అనేక ఇంజెక్షన్లు ఇచ్చాం. కానీ వీటీ అదుపులోకి రాలేదు. మల్టీపుల్ ఇంజెక్షన్స్ తర్వాత కూడా అతడి పరిస్థితి చక్కబడకపోవడంతో చాలా బాధేసింది. పాపం... పెళ్లి వయస్సుకు వచ్చిన కుర్రాడు. సాధారణంగా వెంట్రిక్యులార్ ట్యాకికార్డియా (వీటీ)ని చక్కదిద్దడానికి పేస్ మేకర్ అమర్చుతారు. ఇది గుండె స్పందనల్లో మార్పులు వచ్చినప్పుడల్లా ఓ చిన్న షాక్‌ను ఉత్పన్నం చేసి, గుండె స్పందనలను సాధారణ స్థితిలోకి వచ్చేలా చేస్తుంది. కానీ అతడికి వస్తున్నది వీటీల పరంపరం. దాన్ని వీటీ స్టార్మ్ అంటారు. అంటే వీటీల తుఫాను. ఇలా ఆగకుండా వస్తున్న వీటి పరంపరకు పేస్‌మేకర్ అమర్చినా లాభం ఉండదు. అది వేగంగా మాటిమాటికీ కరెంట్‌తో షాక్‌లిస్తూ పోతుంటే అందులోని బ్యాటరీ అయిపోతుంది తప్ప... ఇంక పెద్దగా ప్రయోజనం ఉండదు. బయటి నుంచే ఓవర్ డ్రైవ్ పేసింగ్ చేసే ఓ చిన్న పేస్‌మేకర్ పెట్టి చూశాం. లాభం లేదు. వైద్య చికిత్సల్లో ఇలాంటి పరిస్థితిని ఎన్ని రకాలుగా ట్యాకిల్ చేయవచ్చో అన్నీ చేశాం. సిటీలోని ఇతర కార్డియాలజిస్టులతోనూ మాట్లాడాం.



ఇలా వీటీ వచ్చినప్పుడల్లా బ్లడ్‌ప్రెషర్ డౌన్ అయిపోతోంది. కొన్నిసార్లు 50కు కూడా పడిపోయింది. వీటీలు ఆగడం లేదు. ఊపిరితిత్తుల్లో నీరు. పేషెంట్ వెంటిలేటర్ మీద. అలా వెంటిలేటర్ మీద ఉంచాల్సిరావడంతో కిడ్నీలు పనిచేయడం మానేశాయి. డయాలసిస్ చేయాల్సి వచ్చింది. ఎక్కడెక్కడి మెడిసిన్స్ ఇచ్చాం. ఎన్నెన్నో ఇంజెక్షన్లు చేశాం. నార్మలైజ్ చేయడానికి ఎన్ని ప్రక్రియలు ఉన్నాయో అన్నీ చేసి చూశాం. ఏమీ ప్రయోజనం కనిపించలేదు. చిన్న వయసు. లోకం అంతగా చూడని కుర్రాడు కళ్ల ముందే చనిపోతున్నాడనిపించింది. చనిపోవడం ఖాయం.

ఒక చివరి ప్రయత్నంగా మెడికల్ లిటరేచర్ అంతా చదివా. ''సింపథెక్టమీ'' అనే ఓ ప్రొసీజర్ ఉంటుంది. ఇందులో నెర్వ్‌కు సంబంధించిన గ్యాంగ్లియాన్స్‌కు ఇంజెక్షన్ ఇస్తే సింపాథెటిక్ నర్వస్ సిస్టమ్‌లోని నరాలు నెమ్మదిస్తాయి. దాంతో వీటీ ఆగుతుంది అని లిటరేచర్‌లో ఉంది. పేషెంట్ బంధువులను అడిగితే 'ఎలాగూ చనిపోయేలా ఉన్నాడు. ఆ ప్రొసీజర్ చేస్తే బతుకుతాడేమో చేయండి సర్' అన్నారు. దాంతో సింపథెక్టమీ చేసే నా జూనియర్... డాక్టర్ విజయభాస్కర్ అని ఉన్నాడు. అతణ్ని పిలిపించాం.

వెంట్రిక్యులార్ ట్యాకికార్డియాకు సింపథెక్టమీ చేయడం మెడికల్ లిటరేచర్‌లో రాసి ఉన్న చాలా అరుదైన ప్రొసీజర్. నిత్యం మెడికల్ ప్రాక్టీస్‌లో అనుసరించేది కాదు. కేవలం ప్రయోగాత్మకంగా చేయాలనుకున్నది మాత్రమే. ప్రపంచం మొత్తమ్మీద 'వీటీ'కి అప్పటికి జరిగిన సింపథెక్టమీ ప్రొసీజర్లు చాలా తక్కువ.


డా. ఎమ్.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

పేషెంట్‌ను క్యాథ్‌ల్యాబ్ లోకి తీసుకెళ్లాం. వెంటనే సింపథెక్టమీకి పూనుకున్నాం. వెన్నుపూస ఇరువైపులా ఉన్న గ్యాంగ్లియాన్స్‌కు ఇంజెక్షన్ ఇవ్వడం కోసం డాక్టర్ విజయభాస్కర్ సహాయంతో 'బై లేటరల్ సర్వైకల్ సింపథెక్టమీ' అనే ప్రొసీజర్ చేశాం. ఒకసారి సింపథెక్టమీ చేశాక... ఒకటి రెండు సార్లు వీటీ వచ్చింది. అయితే 'ఓవర్‌డ్రైవ్ పేసింగ్'తో తగ్గిపోయాయి. ఆ తర్వాత మళ్లీ వీటీ రాలేదు. వీటీ ఆగిపోగానే నెమ్మదిగా బాధితుడి కండిషన్ మెరుగవ్వడం మొదలైంది. మూత్రం రావడం మొదలైంది. డయాలసిస్ ఆపేశాం. వెంటిలేటర్ కూడా తీసేశాం. ఆ తర్వాత పేస్‌మేకర్ అమర్చాం. రెండేళ్ల తర్వాత మొన్ననే ఓసారి అతడు వచ్చాడు. పరీక్షల్లో గుండె కండిషన్ బాగా మెరుగైనట్లు కనిపించింది. ఈమధ్య పెళ్లి చేసుకున్నానని చెప్పాడు.

ఇదో టీమ్ వర్క్. ఓ బృందంలా చాలా ఫోకస్డ్‌గా పనిచేశాం. చావు తప్ప మరో దారే లేదనుకున్న ఓ బాధితుడి జబ్బును పూర్తిగా నార్మల్ చేయడం మా కార్డియాలజిస్టులకు దేవుడిచ్చిన ఒక అరుదైన అవకాశమని భావిస్తున్నాం.

టేస్ట్

స్వీట్ హార్ట్‌కు హెల్తీ డైట్








గుండెకు బలం పెంచేందుకూ... టేస్టీ టేస్టీగానే తింటూ, గుండెను ఆరోగ్యంగా ఉంచేందుకు ఈ పదార్థాలను తీసుకోవచ్చు.

● టొమాటోలలో ఉండే లైకోపిన్ అనే పోషకం గుండెకు చాలా మంచిది. ● బచ్చలి, పాలకూర లాంటి ఆకుకూరలన్నీ గుండెకు మంచి బలాన్నిస్తాయి. ● విటమిన్ 'సి' ఎక్కువగా ఉండే బత్తాయిలు, కమలా పండ్ల వంటి నిమ్మజాతి పండ్లు తినాలి. అయితే, ఈ పండ్ల రసాల్లో మళ్లీ పైనుంచి చక్కెర కలుపుకోకూడదు. దానిమ్మ గుండెకెంతో మేలు చేస్తుంది. యాపిల్ పండ్లు కూడా గుండెకు మంచివే. ● బాదంపప్పు, అక్రోటు (వాల్‌నట్స్), వేరుసెనగ లాంటివి తగు మోతాదులో తినవచ్చు. వాటిలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే విటమిన్ 'ఇ' ఉంటుంది. ● స్ట్రా బెర్రీలు, బ్లూ బెర్రీల వంటి బెర్రీజాతి పండ్లు రక్తనాళాల్ని వెడల్పు చేసి, గుండె పోటు వచ్చే అవకాశాలు తగ్గిస్తాయి. ● చేపల్లో గుండెకు మేలు చేసే ఒమెగా 3-ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి అన్ని చేపలూ గుండె మేలు చేస్తాయి. అయితే సాల్మన్ ఫిష్ లాంటివి మరింత ఆరోగ్యకరం. వారానికి కనీసం రెండు సార్లయినా చేపలు... అందునా సాల్మన్‌ఫిష్ తింటే మేలు అని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సిఫార్సు చేస్తోంది ● పరిమితంగా తినే డార్క్ చాక్లెట్లతో గుండెకు మేలు జరుగుతుంది. వాటితో హైబీపీ, రక్తం గట్టకట్టుకుపోయే రిస్కులు తగ్గుతాయి. అయితే, మామూలు మిల్క్ చాక్లెట్లు, క్యాండీలతో గుండెకు మేలు చేకూరదు. ● రోజూ రెండు కప్పుల గ్రీన్ టీ తాగడం గుండెకు మేలు చేస్తుందని ఒక అధ్యయనంలో తేలింది.

టెస్ట్

ఆటు పోటు ఇట్టే చెప్పొచ్చు



గుండెపోట్లు ఇప్పుడు మరీ చిన్న వయసులోనూ వస్తున్నాయి. ఆ ముప్పునుంచి రక్షించుకోవడానికి అందుబాటులో ఉన్న పరీక్షలూ, వాటి ప్రయోజనాలను తెలుసుకుందాం.


ఈసీజీ : ఛాతీ నొప్పి వచ్చిన ప్రతి వ్యక్తికీ తప్పనిసరి. ఇందులో గుండెపోటు 80, 90 శాతం నిర్ధారణ అవుతుంది. గతంలో గుండెపోటు వచ్చి ఉండి, అప్పుడా విషయం బాధితుడికి తెలియకపోయినా ఈ పరీక్షతో తెలిసిపోతుంది. అయితే కొన్నిసార్లు గుండె పోటు వచ్చిన వెంటనే ఈసీజీ తీయించినా ఒక్కోసారి గుండె పోటు వల్ల కలిగే మార్పులను ఈసీజీ పరీక్ష నమోదు చేయలేకపోవచ్చు. అందుకే గుండెనొప్పి / ఛాతీనొప్పి వచ్చాక 45 నిమిషాల తర్వాత కనీసం 2 లేదా 3 ఈసీజీలను తీసిచూడాలి.

2 డీ ఎకో పరీక్ష : ఇది గుండెస్పందనల్లో, గుండె కండరంలో వచ్చిన మార్పులను తెలుపుతుంది. ఛాతీ నొప్పి వచ్చినప్పుడు అది గుండెజబ్బు కారణంగానే అని తెలుసుకునేందుకు 'ఎకో' పరీక్షలో 95 శాతం కంటే ఎక్కువే అవకాశాలుంటాయి.

టీఎమ్‌టీ పరీక్ష : ట్రెడ్‌మిల్ టెస్ట్ అని పిలిచే ఈ పరీక్షను 'కార్డియాక్ స్ట్రెస్ టెస్ట్' అని కూడా అంటారు. నడకలో గుండెపని తీరు తెలుసుకునేందుకు ఉపయోగపడే పరీక్ష ఇది. బాధితులకు గుండెపోటుకు కారణమైన కరొనరీ ఆర్టరీ డిసీజ్ (సీఏడీ) ఉందా లేదా అని తెలియజెప్పే పరీక్ష ఇది. గుండెకు వెళ్లే రక్తనాళాల్లోని అడ్డంకులనూ ఈ పరీక్ష గుర్తిస్తుంది. గుండె లయ (రిథమ్)లో ఉన్న లోపాలను పసిగడుతుంది.

యాంజియోగ్రామ్ : గుండెపోటు అని డౌట్ వచ్చినప్పుడు కచ్చితంగా నిర్ధారణ చేసే మరో పరీక్ష యాంజియోగ్రామ్. కొన్నిసార్లు ఈసీజీలో మార్పులు స్పష్టంగా లేకపోయినా, 2 డీ ఎకో సరైన క్లూస్ ఇవ్వలేకపోయినా అవన్నీ ఈ పరీక్షలో తెలిసిపోతాయి. అంతేకాదు గుండె రక్తనాళాల కండిషన్, వాటిల్లోని అడ్డంకులు కచ్చితంగా తెలుస్తాయిగానీ ఈసీజీ, ఎకోలతో పోలిస్తే ఈ పరీక్షకు అయ్యే ఖర్చు ఎక్కువ. యాంజియోగ్రామ్‌లో వచ్చే ఫలితాలు 99 శాతం కంటే ఎక్కువగా నమ్మదగినవి.

హైసెన్సిటివిటీ ట్రోపోనిన్‌లు : గుండెపోటు వచ్చిన నాలుగు గంటల లోపు రక్తంలో హైసెన్సిటివిటీ ట్రోపోనిన్ అనే రసాయనాలు పెరుగుతాయి. ఈ రక్త పరీక్ష ద్వారా ఎంత చిన్న గుండెపోటు అయినా అది కచ్చితంగా నిర్ధారణ అవుతుంది.


డా. ఇమ్రాన్ ఉల్ హక్
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్



5 వేల మీటర్లలో గుల్‌వీర్ సింగ్ కొత్త జాతీయ రికార్డు

యోగిబో అథ్లెటిక్స్ చాలెంజ్ కప్ టోర్నీలో భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ 5000 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకం నెగ్గడంతోపాటు కొత్త జాతీయ రికార్డును కూడా నెలకొల్పాడు. జపాన్‌లో శనివారం జరిగిన ఈ రేసులో 26 ఏళ్ల గుల్‌వీర్ 5000 మీటర్ల దూరాన్ని 13 నిమిషాల 11.82 సెకన్లలో పూర్తి చేశాడు. తద్వారా 13 నిమిషాల 18.92 సెకన్లతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును గుల్‌వీర్ బద్దలు కొట్టాడు. ఈ ఏడాది ఆరంభంలో పోర్ట్‌లాండ్ ట్రాక్ ఫెస్టివల్‌లో గుల్‌వీర్ ఈ సమయాన్ని నమోదు చేశాడు.

బోపన్న జోడీకి చుక్కెదురు

చైనా ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. బీజింగ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో రెండో సీడ్ బోపన్న (భారత్)–ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జంట తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–డోడిగ్ జంట 5–7, 6–7 (4/7)తో సెరున్‌డొలో (అర్జెంటీనా)–నికోలస్ జారీ (చిలీ) ద్వయం చేతిలో ఓడిపోయింది. బోపన్న–డోడిగ్‌లకు 15,960 డాలర్ల (రూ. 13 లక్షల 35 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



ఒక్క బంతి పడకుండానే...





భారత్, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టును వరుణుడు వదిలేలా లేడు. భారీ వర్షానికి తోడు వెలుతురులేమి కారణంగా తొలి రోజు 35 ఓవర్ల ఆటే సాధ్యం కాగా... శనివారం రెండో రోజు ఒక్క బంతి కూడా పడకుండానే ఆట రద్దయింది. ఉదయంనుంచి భారీ వర్షం కురుస్తుండటంతో ఆట నిర్ణీత సమయానికి ప్రారంభం కాకపోగా... లంచ్ విరామ సమయంలో వరుణుడు కాస్త శాంతించాడు. దీంతో గ్రౌండ్స్‌మెన్ మైదానాన్ని సిద్ధం చేసే పనిలో పడగా... మరోసారి వర్షం ముంచెత్తింది. ఫలితంగా అంపైర్లు రెండో రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం కూడా వర్ష సూచన ఉండటం అభిమానులను కలవరపెట్టే అంశం!

రెండో రోజు ఆట రద్దు • భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు నేడూ వర్షం ముప్పు

కాన్పూర్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా భారత్, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టుకు వర్షం అంతరాయం కొనసాగుతోంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు ముందు బంగ్లాదేశ్‌పై పూర్తి ఆధిపత్యం కనబరుస్తూ డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలని భావించిన టీమిండియాను కాన్పూర్‌లో వరుణుడు అడ్డుకున్నాడు. తొలి రోజు భారీ వర్షం కారణంగా కేవలం 35 ఓవర్ల ఆట సాధ్యం కాగా... శనివారం ఆ కాస్త కూడా తెరిపినివ్వలేదు. అసలు ఆటగాళ్లు మైదానంలోకి వచ్చే అవకాశమే లేకుండా వర్షం ముంచెత్తడంతో పలు సమీక్షల అనంతరం రెండో రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. చిరుజల్లులుగా మొదలైన వర్షం ఆ తర్వాత మైదానాన్ని ముంచెత్తింది. మధ్యలో కాసేపు వరుణుడు శాంతించడంతో గ్రౌండ్స్‌మెన్ సూపర్ సాపర్‌లతో మైదానాన్ని సిద్ధం చేసే ప్రయత్నాలు ప్రారంభించగా... మరోసారి భారీ వాన దంచి కొట్టింది. దీంతో ఆట సాధ్యపడలేదు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఆదివారం, సోమవారం కూడా కాన్పూర్‌లో వర్షం పడే అవకాశం ఉంది. ఇదే జరిగితే మ్యాచ్ 'డ్రా'గా ముగియడం లాంఛనమే. తొలి రోజు ఆటలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హసన్ (31; 6 ఫోర్లు), షాద్‌మన్ ఇస్లామ్ (24; 4 ఫోర్లు), జాకీర్ హసన్ (0) ఔట్ కాగా... మోమినుల్ హక్ (81 బంతుల్లో 40 బ్యాటింగ్; 7 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 2, రవిచంద్రన్ అశ్విన్ ఒక వికెట్ పడగొట్టారు. డబ్ల్యూటీసీ 2023–25 సీజన్‌లో ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లాడిన భారత్ అందులో 7 విజయాలు, 2 పరాజయాలు, ఒక 'డ్రా'తో మొత్తం 71.67 విజయ శాతంతో 'టాప్'లో కొనసాగుతోంది. 12 మ్యాచ్‌లాడిన ఆస్ట్రేలియా (62.50 విజయ శాతం) ఎనిమిది విజయాలతో రెండో స్థానంలో ఉంది. బంగ్లాదేశ్‌తో సిరీస్ అనంతరం భారత జట్టు స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్టులు, ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ రెండింట్లో కూడా ఇదే జోరు కొనసాగిస్తే... టీమిండియా వరుసగా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరడం ఖాయమే! బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు వర్షం కారణంగా చివరకు 'డ్రా'గా ముగిస్తే అది రోహిత్ బృందం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే మార్గంపై స్వల్ప ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో ఆట సాగితే సంపూర్ణ ఆధిపత్యం కనబర్చాలని భారత జట్టు ఉవ్విళ్లూరుతోంది.

భారత జట్టులో నితీశ్ కుమార్ రెడ్డి

బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌కు టీమిండియా ప్రకటన



ముంబై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును శనివారం రాత్రి ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహిస్తాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి జట్టులో స్థానం లభించింది. ఐపీఎల్‌లో తన పేస్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న మయాంక్ యాదవ్‌కు కూడా తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. ఆఫ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడేళ్ల తర్వాత భారత టి20 జట్టులోకి పునరాగమనం చేశాడు. విశాఖపట్నంకు చెందిన 21 ఏళ్ల నితీశ్ కుమార్ రెడ్డి గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టి20 సిరీస్‌కు ఎంపికయ్యాడు. అయితే జట్టును ప్రకటించాక నితీశ్ గాయపడటంతో అతను జింబాబ్వే పర్యటనకు దూరం కావాల్సి వచ్చింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నితీశ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. 13 మ్యాచ్‌లు ఆడిన నితీశ్ 142.92 స్ట్రయిక్‌రేట్‌తో 303 పరుగులు సాధించి 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డును గెల్చుకున్నాడు. మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ అక్టోబర్ 6న గ్వాలియర్‌లో... రెండో మ్యాచ్ అక్టోబర్ 9న న్యూఢిల్లీలో... మూడో మ్యాచ్ అక్టోబర్ 12న హైదరాబాద్‌లో జరుగుతాయి. ఈ మూడు మ్యాచ్‌లు రాత్రి 7 గంటలకు మొదలవుతాయి.

ఆరు మార్పులు...

గత నెలలో శ్రీలంకతో జరిగిన టి20 సిరీస్‌లో పాల్గొన్న ఆరుగురు భారత క్రికెటర్లను బంగ్లాదేశ్‌తో జరిగే సిరీస్ కోసం ఎంపిక చేయలేదు. శ్రీలంకతో సిరీస్‌లో శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, అక్షర్ పటేల్, రిషభ్ పంత్, సిరాజ్, ఖలీల్ అహ్మద్ ఆడారు. వీరి స్థానాల్లో అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్‌లకు చోటు దక్కింది.

భారత టి20 జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ సామ్సన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), అర్‌్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్.

ఐపీఎల్‌లో భారత క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు!

మ్యాచ్‌కు రూ. 7 లక్షల 50 వేలు చొప్పున చెల్లింపు • బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటన

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఇకపై కాంట్రాక్టులతో పాటు కొత్తగా మ్యాచ్ ఫీజుల్ని ఇవ్వనున్నారు. వచ్చే సీజన్ నుంచే ఈ మేరకు ఆటగాళ్లకు చెల్లింపులు ఉంటాయని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ప్రతీ సీజన్‌కు ముందు నిర్వహించే ప్లేయర్ల వేలంలో ఆటగాళ్లపై రూ. కోట్లు కురుస్తున్నాయి. దీంతో పాటు ఇకపై మ్యాచ్‌కు రూ.7 లక్షల 50 వేలు చొప్పున ఫీజుగా చెల్లిస్తారు. అన్నట్లు... షరతులు వర్తిస్తాయి! అంటే ఇది కేవలం భారత ఆటగాళ్లకు మాత్రమే! లీగ్‌లో పాల్గొనే వారందరికీ ఈ చెల్లింపులుండవు. ఈ చెల్లింపుల్లో ఫ్రాంచైజీ వాటా కూడా ఉంటుందని జై షా తెలిపారు. ఒక సీజన్‌కు ఒక్కో ఫ్రాంచైజీ రూ. 12 కోట్ల 60 లక్షలు క్రికెటర్ల మ్యాచ్ ఫీజుల కోసం వెచ్చించనుంది. ఇది వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు వెచ్చించే గరిష్ట మొత్తానికి అదనం. దీనికి సంబంధించిన విధి విధానాలు కూడా ఖరారయ్యాయి. ప్రతి మ్యాచ్‌కు 12 మంది ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసి రూ. 90 లక్షలు చొప్పున 14 మ్యాచ్‌లకుగాను మొత్తం రూ.12 కోట్ల 60 లక్షలు ఖర్చు చేస్తారు. దీని ప్రకారం ఒక ఆటగాడు వేలం మొత్తంతో పాటు అదనంగా రూ. 1 కోటీ 5 లక్షలు సొంతం చేసుకుంటాడు. అయితే దీనిపై ఫ్రాంచైజీల తుది ఆమోదం రావాల్సి ఉంది. ప్రస్తుతం రిటెయినింగ్ పాలసీ (ఆటగాళ్లను అట్టిపెట్టుకునే అంశం)పై ఐపీఎల్ పాలక మండలి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఒక్కో ఫ్రాంచైజీ గరిష్టంగా నలుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకొని మిగతా అందరిని విడుదల చేయాల్సి వస్తోంది. ఇకపై ఈ సంఖ్యను ఆరుగురికి పెంచాలని పాలకమండలి భావిస్తోంది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

నచ్చిన కథ దొరక్క కొందరు, చేసే పాత్రకు తగ్గట్టు మేకోవర్ అవ్వాలని మరికొందరు, వ్యక్తిగత జీవితంతో ఇంకొందరు... ఇలా కారణాలు ఏమైనా యాక్టర్స్ కెరీర్‌లో కొన్నిసార్లు గ్యాప్‌లు వస్తుంటాయి. వారికి ఇష్టం ఉన్నా లేకున్నా ఈ గ్యాప్‌ను ఫిల్ చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. ఇలాంటి గ్యాప్‌ల కారణంగా ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై కనిపించకుండా 'గ్యాప్ ఇవ్వలా... వచ్చింది' అంటున్న కొందరు బాలీవుడ్ హీరోల గురించి తెలుసుకుందాం.

గ్యాప్ ఇవ్వలా... వచ్చింది


• షారుక్ ఖాన్


• సల్మాన్ ఖాన్


• ఆమిర్ ఖాన్


• రణ్‌బీర్ కపూర్


• రణ్‌వీర్ సింగ్


• సన్నీ డియోల్

స్పీడ్ బ్రేకర్

గత ఏడాది బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేశారు షారుక్ ఖాన్. 2023లో షారుక్ ఖాన్ హీరోగా చేసిన 'పఠాన్, జవాన్' రూ. వెయ్యి కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను అధిగమించగా, 'డంకీ' రూ. 450 కోట్ల కలెక్షన్స్‌ను సాధించిందని లెక్కలు చెబుతున్నాయి. ఇలా ఈ మూడు చిత్రాలతో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద గత ఏడాది రూ. 2,500 కోట్ల కలెక్షన్స్ పైగా రాబట్టగలిగారు షారుక్. కానీ ఈ ఏడాది షారుక్ జోరుకు స్పీడ్ బ్రేకర్ పడింది. 2024లో సిల్వర్ స్క్రీన్‌ని మిస్ చేసుకున్నారు షారుక్. సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో షారుక్ ఖాన్ హీరోగా 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో షారుక్ తనయ సుహానా ఖాన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కాకపోవడంతో ఇంకా ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లలేదు. 'కింగ్' 2025 ద్వితీయార్ధంలో విడుదలయ్యే అవకాశం ఉంది.

ది బుల్ మిస్ అయ్యాడు

'కిసీ కీ భాయ్ కిసీ కీ జాన్, టైగర్ 3'... ఈ రెండు సినిమాలతో సల్మాన్ ఖాన్ గత ఏడాది వెండితెరపై కనిపించారు. ఇదే జోష్‌లో ఈ ఏడాది ఈద్‌కు సల్మాన్ ఖాన్ సినిమా ఒకటి రిలీజ్ అవుతుందని అనుకున్నారు ఆయన ఫ్యాన్స్. కానీ కుదర్లేదు. 'షేర్షా' ఫేమ్ విష్ణువర్ధన్‌తో సల్మాన్ ఖాన్ చేయాల్సిన 'ది బుల్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా సరైన సమయంలో సెట్స్ పైకి వెళ్లలేదు. దాంతో ఈ ఏడాది సల్మాన్ ఖాన్ వెండితెరపై కనిపించలేకపోయారు. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ఏఆర్ మురుగదాస్‌తో సల్మాన్ ఖాన్ 'సికందర్' అనే యాక్షన్ ఫిల్మ్ చేస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఈద్ సందర్భంగా రిలీజ్ కానున్నట్లు యూనిట్ ప్రకటించింది. మరోవైపు దర్శకుడు విష్ణువర్ధన్‌తో సల్మాన్ చేయనున్న చిత్రం కూడా 2025లోనే రిలీజ్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది. సో.. వచ్చే ఏడాది రెండుసార్లు సల్మాన్ తెరపై కనిపిస్తారని ఊహించవచ్చు.

రెండేళ్లు పూర్తయినా...

రెండేళ్లు దాటిపోయింది ఆమిర్ ఖాన్ బాలీవుడ్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించి. 2022లో చేసిన 'లాల్ సింగ్ చద్దా' సినిమా (హాలీవుడ్ ఫిల్మ్ 'ఫారెస్ట్ గంప్'కి హిందీ రీమేక్) తర్వాత ఆమిర్ వెంటనే మరో సినిమా ఒప్పుకోలేదు. మరోవైపు తన కుమార్తె ఐరా ఖాన్ పెళ్లి పనులతో కొన్నాళ్లు ఆమిర్ ఖాన్ బిజీ అయ్యారు. దాంతో ఆయన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' లేట్‌గా సెట్స్‌పైకి వెళ్లింది. ఆర్‌ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబరులో రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ వచ్చే ఏడాదికి వాయిదా వేశారని సమాచారం.

భారీ చిత్రంతో...

'యానిమల్' సినిమాతో గత ఏడాది బ్లాక్ బస్టర్ అందుకున్నారు రణ్‌బీర్ కపూర్. అయితే గత ఏడాది 'తు ఝూఠీ మై మక్కర్' చిత్రంతో ఓ ఫ్లాప్ కూడా అందుకున్నారు ఈ హీరో. ఇక ఈ ఏడాది థియేటర్స్‌లో కనిపించకుండా బ్రేక్ తీసుకున్నారు. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా రూపొందుతున్న 'రామాయణ్' సినిమాతో ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్ బిజీగా ఉన్నారు. నితీష్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి, యశ్ వంటి స్టార్స్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇది భారీ చిత్రం కాబట్టి షూట్‌కి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో ఈ ఏడాది తెరపై కనిపించలేదు రణ్‌బీర్. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతోందని, తొలి భాగం 2025లో రిలీజ్ అవుతుందని సమాచారం. అలాగే సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రణ్‌బీర్ హీరోగా నటిస్తున్న 'లవ్ అండ్ వార్' 2026లో విడుదల కానుంది.

పర్సనల్ టైమ్

రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన ఏ చిత్రం కూడా ఈ ఏడాది రిలీజ్ కావడం లేదు. 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ' చిత్రం గత ఏడాది జూలైలో రిలీజ్ అయింది. అయితే వెంటనే మరో మూవీకి సైన్ చేయలేదు రణ్‌వీర్. ఫిబ్రవరి చివర్లో తాము తల్లిదండ్రులం కాబోతున్న విషయాన్ని రణ్‌వీర్ సింగ్–దీపికా పదుకోన్ వెల్లడించారు. సో... పర్సనల్ లైఫ్‌కు రణ్‌వీర్ టైమ్ కేటాయించారు. ఆ తర్వాత ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ 'డాన్ 3' సినిమాను ప్రకటించారు. కానీ ఈ చిత్రం 2025లోనే రిలీజ్ అవుతుంది. కాగా అజయ్ దేవగన్ హీరోగా నటించిన 'సింగమ్ ఎగైన్' సినిమాలో మాత్రం రణ్‌వీర్ ఓ గెస్ట్ రోల్ చేశారు. ఈ చిత్రం దీపావళికి రిలీజ్ కానుంది. ఇక దీపికా పదుకోన్ ఈ ఏడాది సెప్టెంబరులో ఓ పాపకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే,.

బిజీ బిజీ... కానీ!

'గదర్ 2'తో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించి, మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు సీనియర్ హీరో సన్నీ డియోల్. 2023లో రిలీజైన 'గదర్ 2' సక్సెస్‌తో సన్నీ డియోల్‌కు వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం 'బోర్డర్ 2, లాహోర్ 1947, రామాయణ్' (కీలక పాత్రధారి)లతో పాటు తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న సినిమాలతో బిజీగా ఉన్నారు సన్నీ. ఈ సినిమాల చిత్రీకరణ ఈ ఏడాదే ఆరంభమైంది. కానీ ఈ ఏడాది సన్నీ థియేటర్స్‌లోకి వచ్చే చాన్సెస్ కనిపించడం లేదు. అయితే 2025లో ఆయన మూడు చిత్రాలతో కనిపించే అవకాశం ఉంది.

– ముసిమి శివాంజనేయులు


• జయప్రద

ఫౌజీలో...

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ తమిళనాడులోని మధురై, కారైకుడి లొకేషన్స్‌లో ప్రారంభమైంది. అయితే ప్రభాస్ పాల్గొనని సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలిసింది. కాగా ఈ సినిమాలో జయప్రద ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని, ఆల్రెడీ మధురై షెడ్యూల్‌లో ఆమె జాయిన్ అయ్యారని, ఇమాన్వీ–జయప్రదల కాంబినేషన్‌లో కొన్ని సన్నివేశాల చిత్రీకరణ జరిగిందని సమాచారం. అక్టోబరు చివర్లో ఈ సినిమా చిత్రీకరణలో ప్రభాస్ కూడా పాల్గొంటారట. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

గ్యాంగ్ వార్


• చంద్రశేఖర్

చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. ఈ చిత్రంలో కాశ్వీ కాంచన్ హీరోయిన్‌గా నటించారు. అభినవ్ జనక్, అడ్ల సతీష్ కుమార్, సూర్యనారాయణ ఇతర లీడ్ రోల్స్ చేసిన ఈ చిత్రం అక్టోబరు 25న రిలీజ్ కానుంది. ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ– ''టీజర్, ట్రైలర్ బాగున్నాయి'' అన్నారు. ''అన్నపూర్ణ స్టూడియోస్‌లో డీఎఫ్‌టీ కోర్సు చేశాను. 'దిల్' రాజుగారు మా సినిమా ట్రైలర్ చూసి బాగుందన్నారు'' అన్నారు చంద్రశేఖర్. ''రెండు గ్యాంగ్స్ మధ్య జరిగే వార్ ఈ సినిమా'' అన్నారు అభినవ్.

లగ్గం రెడీ


• 'లగ్గం' పోస్టర్

సాయి రోనక్, ప్రగ్యా నగ్రా, రాజేంద్ర ప్రసాద్, ఎల్బీ శ్రీరామ్, రఘుబాబు, రోహిణి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'లగ్గం'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 25న ఏషియన్ సురేష్ సంస్థ ద్వారా రిలీజ్ అవుతోంది. ఈ రిలీజ్ పోస్టర్‌ను ఆవిష్కరించి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు హీరో సుధీర్‌బాబు. ''తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నటీనటులు పూర్తి తెలంగాణ యాస మాట్లాడకుండా వాడుక భాషలో మాట్లాడతారు'' అన్నారు రమేష్ చెప్పాల. ''ప్రతి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చూడాల్సిన చిత్రం ఇది'' అన్నారు వేణుగోపాల్ రెడ్డి.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'రఘు తాత' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మాతృభాష పై మమకారం... పరభాష పై పోరాటం



ఈ భూమి పై జీవన ఉనికికి భాష అనేది ఆయువు. ప్రస్తుత ప్రపంచంలో 7000కు పైచిలుకు భాషలు ఉండగా వాటిలో 200 నుండి 300 వరకు అధికారికంగా గుర్తించబడ్డాయి. కానీ ఈ భాషల వల్ల కూడా కొన్ని ప్రాంతాల్లో పోరాటాలు జరిగాయి... జరుగుతున్నాయి కూడా. ఇటువంటి సున్నితమైన అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని దర్శకుడు సుమన్ కుమార్ ఇటీవల 'రఘు తాత' చిత్రాన్ని రూపొందించారు. తీసుకున్న పాయింట్ సీరియస్ అయినా చక్కటి స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను అలరించారు దర్శకుడు. సినిమాలోని పాత్రధారులందరూ వారి వారి పాత్రలకు ప్రాణం పోశారనే చెప్పాలి. ఈ సినిమాలో నాయకురాలి పాత్రలో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన కీర్తీ సురేష్ నటించారు. తన అద్భుతమైన నటనా ప్రతిభతో ఈ సినిమాలోని ప్రధాన పాత్ర అయిన కయల్‌విళి పాండియన్ పాత్రకు ప్రాణం పోశారు కీర్తీ సురేష్. మరో ప్రధాన పాత్ర అయిన రఘు తాత పాత్రలో యం.యస్. భాస్కర్ ఇమిడిపోయారు. ఇక కథాంశానికొస్తే... కయల్‌విళి పాండియన్ మద్రాస్ సెంట్రల్ బ్యాంక్‌లో క్లర్కు ఉద్యోగం చేస్తూ ఉంటుంది. ఉద్యోగం చేసుకుంటూనే కా పాండియన్ అనే కలం పేరుతో రచనలు కూడా చేస్తుంటుంది. అంతేనా హిందీ భాష వద్దు, మన భాష ముద్దు అనే పేరుతో ఉద్యమాలు చేస్తూ సమాజంలో భాషాభివృద్ధికి చేస్తున్న పోరాటంలో కీలక పాత్ర వహిస్తుంది. కయల్‌విళికి ఓ తాత ఉంటాడు. ఆయనే రఘు తాత. కయల్ చేసే ఉద్యమమంతా రఘు తాత నుండి వచ్చిందే. అంతవరకు కథ బాగున్నా కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల తన బ్యాంక్ ప్రమోషన్ కోసం హిందీ పరీక్ష దొంగతనంగా రాయవలసి వస్తుంది. ఓ పక్క హిందీ ఉద్యమం చేస్తూ మరో పక్క హిందీ పరీక్ష రాయడం కయల్‌విళి పెళ్ళిలో అందరికీ తెలిసిపోతుంది. అసలు కయల్ హిందీ పరీక్ష ఎందుకు రాయాల్సి వచ్చింది ? రాసినది అందరికీ తెలిసిన తరువాత తన పెళ్ళిలో ఏం జరిగింది? ఇలాంటివన్నీ జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'రఘు తాత'లోనే చూడాలి. కొసమెరుపేంటంటే... ఈ సినిమా మాతృక తమిళం, పోరాటం చేసింది హిందీ భాషపై, కానీ మనం మాత్రం మన తెలుగు భాషలో ఈ సినిమా చూడడం. ఎందుకంటే భాష ఏదైనా భావం ముఖ్యం కాబట్టి.

– ఇంటూరు హరికృష్ణ



శనివారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ధ్వజ స్తంభానికి మొక్కుతున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు

ఫార్మా హబ్‌గా తెలంగాణ: దుద్దిళ్ల



సాక్షి, హైదరాబాద్: ఔషధ ఉత్పత్తులు, ఎగుమతుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్ర స్థానంలో ఉండగా, తెలంగాణ ఫార్మా మ్యాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఎదుగుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైటెక్స్‌లో గురువారం జరిగిన 'ఇండియా ల్యాబ్ ఎక్స్ పో-2024'ను ప్రారంభించి ఆయన మట్లాడారు. కరోనా సమయంలో దేశంలో నాలుగు వ్యాక్సిన్లు తయారుకాగా, మూడు హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. దేశంలో మూడో వంతు అన్ని రకాల వ్యాక్సిన్లు ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయని, 30 శాతం ఔషధ ఉత్పత్తులు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. విదేశాలకు ఎగుమతయ్యే ఔషధాల్లో 40 శాతం వాటా రాష్ట్రానిదేనని అన్నారు. బల్క్ డ్రగ్ ఎగుమతుల్లో 50 శాతం వాటాను తెలంగాణ కలిగి ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు.

జీనోమ్ వ్యాలీ 4వ దశ విస్తరణ..

జీనోమ్ వ్యాలీ నాలుగో దశ విస్తరణకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి సద్వినియోగం చేసుకోవాలని శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. పారిశ్రామిక అనుకూల వాతావరణం దృష్ట్యా ఫార్మా, లైఫ్ సైన్సెస్ సంస్థలు తెలంగాణను ముఖ్యమైన గమ్యస్థానంగా భావిస్తున్నాయని వెల్లడించారు. ల్యాబ్ ఎక్స్‌పోలో 25 దేశాల నుంచి 25 వేల ఉత్పత్తులు ప్రదర్శనకు రావడం సంతోషకరమన్నారు.

గురుకుల నియామకాల బోర్డు చైర్మన్‌గా సైదులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) చైర్మన్‌గా బి.సైదులు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీని యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు ప్రభుత్వం బోర్డు చైర్మన్‌ను నియమించింది. ఈ బోర్డులో గురుకుల సొసైటీ కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఇందులో సీనియర్ కార్యదర్శి చైర్మన్‌గా.. మరో కార్యదర్శి లేదా బోర్డు అనుమతించిన గురుకుల సొసైటీల్లోని అదనపు కార్యదర్శి కన్వీనర్‌గా కొనసాగుతారు. ఈ బోర్డులో నిర్ణయాధికారం చైర్మన్‌కు ఉండగా.. కార్యనిర్వహణ అధికారం అంతా కన్వీనర్‌కు ఉంటుంది. ఇదిలా ఉండగా సైదులు శనివారం మధ్యాహ్నం టీఆర్ఈఐఆర్‌బీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్ కుర్చీ ఆరు నెలలుగా ఖాళీగా ఉంది. ఈ ఏడాది మార్చి వరకు బోర్డు కార్యదర్శిగా మల్లయ్యభట్టు కొనసాగారు. ఆయనను ప్రభుత్వం బదిలీ చేయడంతో కన్వీనర్ బాధ్యతలనుంచి కూడా రిలీవ్ అయ్యారు. దీంతో అప్పటినుంచి కన్వీనర్ పోస్టును భర్తీ చేయలేదు. కాగా, త్వరలోనే కన్వీనర్ పోస్టును కూడా భర్తీ చేస్తారని సమాచారం.

రూ.3.7 కోట్ల విలువైన స్మగ్లింగ్ బంగారం పట్టివేత

కోయంబత్తూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా



స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీలు

షాద్‌నగర్ రూరల్: అక్రమంగా తరలిస్తున్న రూ.3.7 కోట్ల విలువైన స్మగ్లింగ్ బంగారాన్ని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజావద్ద బంగారాన్ని స్వాధీనం చేసుకుని, ఈ కేసుతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులను శనివారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం కోయం బత్తూరు నుంచి కొందరు వ్యక్తులు విదేశీ బంగారాన్ని కారులో ప్రత్యేకంగా తయారుచేయించిన అరలో దాచి అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. 24 క్యారెట్ల 18 బంగారు కడ్డీలను కోయంబత్తూరు నుంచి నగరానికి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు రాయికల్ టోల్ ప్లాజా వద్ద నిఘా ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో నిందితులు ప్రయాణిస్తున్న కారును చెక్ చేయగా 4,778 గ్రాముల బంగారాన్ని గుర్తించారు. వాహనం, బంగారంతోపాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గోల్డ్ విలువ రూ.3,71,25,060 ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కస్టమ్స్ చట్టం ప్రకారం ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

రేబిస్ నిరోధానికి సరికొత్త యాంటీబాడీ అభివృద్ధి

ఇండియన్ ఇమ్యునొలాజికల్స్ ఎండీ డా.ఆనంద్



సాక్షి, హైదరాబాద్: రేబిస్ వ్యాధి నిరోధానికి మానవ ఆధారిత బై-వాలెంట్ మోనోక్లోనల్ యాంటీబాడీ (ఎంఏబీ)ని అభివృద్ధి చేస్తున్నట్లు ప్రముఖ టీకాల తయారీ సంస్థ ఇండియన్ ఇమ్యునొలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) తెలిపింది. శనివారం ప్రపంచ రేబిస్ డే సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఐఎల్ ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్ మాట్లాడారు. కేంద్ర బయోటెక్నాలజీ విభాగం రూపొందించిన నేషనల్ బయో ఫార్మా మిషన్‌తోపాటు బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ సహకారంతో ఎంఏబీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రేబిస్ కట్టడి, చికిత్స విధానాన్ని సమూలంగా మార్చగల సామర్థ్యం ఎంఏబీకి ఉందని చెప్పారు. రేబిస్ నియంత్రణ, నిరోధానికి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాల్లో తమ పరిశోధన కీలక మైలురాయి కాగలదన్నారు.

నేటి నుంచి బీడీఎస్ కన్వీనర్ సీట్లకు వెబ్ కౌన్సెలింగ్

- రెండ్రోజులపాటు వెబ్ ఆప్షన్లకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, మైనార్టీ వైద్య కళాశాలల్లో యూజీ డెంటల్ కోర్సుల్లో (బీడీఎస్) మొదటి ఏడాది ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్‌యూహెచ్‌ఎస్) శనివారం విడుదల చేసింది. వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 29వ తేదీ ఉదయం 6గంటల నుంచి అక్టోబర్ 1వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వర్సిటీ వెల్లడించింది. https://tsmedadm.tsche.in వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుంది. సీటు పొందిన అభ్యర్థులు వర్సిటీ ఫీజు రూ.12 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన తర్వాత అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు అభ్యర్థులకు కేటాయించిన కాలేజీకి ట్యూషన్ ఫీజు కూడా చెల్లించాలి. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అయితే ఏడాదికి రూ.10 వేలు, ప్రైవేట్ మెడికల్ కాలేజీకి అయితే ఏడాదికి రూ.45 వేలు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 12 డెంటల్ కాలేజీల్లో సీట్లు భర్తీ చేయనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

ఔషధ ఉత్పత్తిలో సాంకేతికతపై 'ఏఎల్ ఐడియాథాన్'



చావా సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఫార్మా దిగ్గజ సంస్థలన్నీ ఒకే వేదికపైకి వచ్చాయి. ఔషధ ఉత్పత్తిలో సాంకేతికత వాడకంపై పరస్పరం ఆలోచనలను పంచుకున్నాయి. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు సాఫ్ట్‌వేర్ సేవలు అందించే హైదరాబాదీ సంస్థ యాంపిల్ లాజిక్ శనివారం రాత్రి హైటెక్స్‌లోని నోవాటెల్‌లో 'ఏఎల్ ఐడియాథాన్'నిర్వహించింది. ఫార్మా రంగం అభివృద్ధికి తగిన సూచనలు చేయాలని ఫార్మా నిపుణులను, కంపెనీలను కోరింది. ఎంపికైన సృజనాత్మక ఆలోచనలకు బహుమతులు అందించింది. ముఖ్యఅతిథులుగా లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ, హెటిరోకు చెందిన భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. వచ్చే ఏడాది ఐడియాథాన్‌ను ముంబైలో నిర్వహిస్తామని యాంపిల్ లాజిక్ వ్యవస్థాపకుడు, సీఈవో మన్నె వెంకట్ చౌదరి తెలిపారు.

మీరు చెప్పింది అబద్ధం!

- నిజాలే చెప్తానని ప్రమాణం చేసి తప్పుడు సాక్ష్యం ఇస్తారా?
- మేడిగడ్డలో సికెంట్ పైల్స్ వాడాలని సీడీఓ సూచించిందని ఎలా అంటారు?
- ఓవర్ స్మార్ట్‌గా ప్రవర్తిస్తే పర్యవసానాలు తప్పవు
- మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఫైర్



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరవుతున్న మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: 'మీ సమాధానం పూర్తి అబద్ధం. నిజాలే చెప్తానని ప్రమాణం చేసి తప్పుడు సాక్ష్యం ఇస్తారా? మేడిగడ్డ బరాజ్‌లోని 1, 2వ నంబర్ బ్లాకుల్లో ఆర్‌సీసీ కటాఫ్‌లు, 3-7 నంబర్ బ్లాకుల్లో సికెంట్ పైల్స్ వినియోగించాలని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) చీఫ్ ఇంజనీర్ సూచించినట్టు ఏవైనా డాక్యుమెంట్లు మీ దగ్గర ఉన్నాయా?'అని కాళేశ్వరం ప్రాజెక్టు రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు స్మార్ట్‌గా ఉంటే ఫర్వాలేదు.. ఓవర్ స్మార్ట్‌గా ప్రవర్తిస్తే సహించేది లేదని స్పష్టం చేసింది. కమిషన్‌ను తప్పుదోవపట్టించే ప్రయత్నాలు చేస్తే పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లపై విచారణలో భాగంగా కమిషన్ శనివారం మూడున్నర గంటలపాటు నల్లా వెంకటేశ్వర్లుకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి 71 ప్రశ్నలను సంధించింది. తనకు ఆంగ్లంలో అంతగా ప్రావీణ్యం లేదని, మేడిగడ్డ నిర్మాణంలో సికెంట్ పైల్స్ వినియోగంపై అంతకుముందు ఇచ్చిన సమాధానాన్ని సరిదిద్దడానికి అవకాశం కల్పించాలని ఆయన కోరగా.. కమిషన్ తిరస్కరించింది. ఆంగ్లం రాకుండా ఈఎన్సీగా ఎలా పనిచేశారని మండిపడింది. తనకు జ్ఞాపకం ఉన్న వివరాలు చెప్పానని, అందులో కొన్ని తప్పులు దొర్లి ఉండవచ్చంటూ వెంకటేశ్వర్లు క్షమాపణ కోరారు.

తమ్మిడిహట్టి వద్దు అన్నది ప్రభుత్వ అధినేతనా? హైపవర్ కమిటీనా?

తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు లొకేషన్ మార్పి బరాజ్ నిర్మించడానికి డీపీఆర్ తయారీ బాధ్యతను ఏప్రిల్ 2015లో వ్యాప్కోస్‌కు కట్టబెట్టినట్టు నల్లా వెంకటేశ్వర్లు కమిషన్‌కు తెలిపారు. లొకేషన్ మార్పుపై నిర్ణయం ఎవరిదని ప్రశ్నించగా, ప్రభుత్వ అధినేతది అని బదులిచ్చారు. ఇలాంటి నిర్ణయాలు మంత్రివర్గం తీసుకోవాలి కదా? అని కమిషన్ ప్రశ్నించగా, మంత్రివర్గంలో ప్రాజెక్టుల రీఇంజనీరింగ్‌పై చర్చ జరిగిందని బదులిచ్చారు. '2016 మార్చి 27న నాటి సీఎం (కేసీఆర్) నిర్వహించిన ఓ సమావేశంలో వ్యాప్కోస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ డీపీఆర్ సమర్పించారు. తమ్మడిహెట్టి నుంచి మేడిగడ్డకు లొకేషన్‌ను మార్చాలని డీపీఆర్‌లో వ్యాప్కోస్ ప్రతిపాదించింది. వ్యాప్కోస్ ప్రతిపాదనలను హైపవర్ కమిటీ ఆమోదించింది'అని వెంకటేశ్వర్లు చెప్పారు. లొకేషన్ మార్పుపై సీఎం నిర్ణయం తీసుకున్నట్టు అంతకుముందు చెప్పారు కదా.. అని కమిషన్ నిలదీయగా, సీఎం రీఇంజనీరింగ్ చేయాలని సూచించారని మళ్లీ వివరణ ఇచ్చారు. వ్యాప్కోస్ ప్రతిపాదించిన ప్రాంతానికి 5.4 కి.మీ. దిగువన అన్నారం, 2.20 కి.మీ. దిగువన సుందిళ్ల బరాజ్‌లను నిర్మించాలన్న ప్రతిపాదనల ఆధారంగా హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మార్పులను హైపవర్ కమిటీ భేటీలో వ్యాప్కోస్ కూడా సమ్మతించిందని ఆయన పేర్కొనగా, దానికి రుజువులు ఉన్నాయా? అని కమిషన్ ప్రశ్నించింది. సమావేశం మినిట్స్‌లో ఈ విషయం ఉన్నప్పటికీ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన వ్యాప్కోస్ ప్రతినిధి దానిపై సంతకం చేయాల్సిన అవసరం లేదని ఆయన బదులివ్వగా.. కమిషన్ అసహనం వ్యక్తం చేసింది. వ్యాప్కోస్ ఇచ్చిన కొలతలు, సాంకేతిక ప్రమాణాల ప్రకారమే బరాజ్‌లు నిర్మించారా? అన్న ప్రశ్నకు.. మేడిగడ్డ బరాజ్ గేట్ల సైజు మినహా ఇతర మార్పులేమీ చేయలేదన్నారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల గేట్ల సంఖ్యతోపాటు వాటి సైజుల్లో మార్పులను సీఈ సీడీఓ సూచించారన్నారు. నిర్మాణంలో డిజైన్లను వక్రీకరించాల్సి రావడంతో 2018, 2021లో రెండుసార్లు బరాజ్‌ల అంచనాలను సవరించినట్టు తెలిపారు.

డిజైన్లలో లోపంతోనే...

బరాజ్‌ల నిర్మాణం 2019 జూన్‌లో పూర్తికాగా, సెప్టెంబర్‌లో వచ్చిన వరదల్లో దెబ్బతినడానికి కారణాలేమిటి? అని కమిషన్ ప్రశ్నించింది. బరాజ్‌ల నుంచి విడుదలయ్యే వరద భీకర వేగంతో బయటకి దూసుకొచ్చి నేలను తాకే చోట నీటినిల్వలు లేకపోవడంతో ఆ వేగానికి అక్కడ ఉన్న లాంచింగ్ అప్రాన్ కొట్టుకుపోయి నష్టం జరిగిందని వెంకటేశ్వర్లు అన్నారు. నిల్వతో ఏర్పడే పీడనశక్తి విడుదలకి డిజైన్లలో సరైన పరిష్కారాలను చూపకపోవడంతోనే బరాజ్‌ల పునాదుల కింద నుంచి ఇసుక కొట్టుకుపోయి నష్టం జరిగిందని చెప్పారు. పంపింగ్ కోసం బరాజ్‌లో కనీస నిల్వలను నిర్వహించాల్సి రావడమూ ఒక కారణమన్నారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో 'జెడ్'ఆకృతి షీట్‌పైల్స్‌కి బదులు సికెంట్ పైల్స్‌ను వాడాలని ఎన్ఐటీ-వరంగల్‌తోపాటు ఐఐటీ-చెన్నై రిటైర్డ్ ప్రొఫెసర్ సిఫారసు చేశారన్నారు.

రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేవాలి

- బీజేపీ రాష్ట్ర నేతలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిశానిర్దేశం
- ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతూనే పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని స్పష్టీకరణ
- సభ్యత్వ నమోదుపై సమీక్ష.. 50 లక్షలకుపైగా సభ్యత్వాలకు కృషి చేయాలని సూచన



సభ్యత్వ నమోదుపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున నడ్డా.. హాజరైన పార్టీ నేతలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతూనే సభ్యత్వ నమోదును కూడా పూర్తిస్థాయిలో చేపట్టాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పార్టీ రాష్ట్ర నేతలను ఆదేశించారు. ఈ కార్యక్రమాలను సమాంతరంగా చేపడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తెచ్చేలా కృషి చేయాలని సూచించారు. శనివారం బేగంపేటలోని ఓ హోటల్‌లో సభ్యత్వ నమోదుపై సమీక్షలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎన్నికల్లో పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలతో నడ్డా సమావేశమయ్యారు.

అత్యధిక సభ్యత్వాలు చేసిన వారికే పదవులు

గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఎంపీలు, ఎమ్మెల్యేలుగానే పార్టీ పరిగణిస్తోందని చెప్పారు. అందువల్ల ఎన్నికల్లో ఓడిన నేతలు కూడా పార్టీ పటిష్టానికి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 10 లక్షల మందిని సభ్యులుగా చేర్చారని.. అక్టోబర్ 15 వరకు చేపడుతున్న సభ్యత్వ నమోదులో భాగంగా 50 లక్షల మందికిపైగా సభ్యులను చేర్పించేలా కృషి చేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు 77 లక్షల ఓట్లు రావడంతోపాటు 8 ఎంపీ సీట్లు గెలిచినందున... పడిన ఓట్లలో 75 శాతం మందిని పార్టీ సభ్యులుగా చేర్పించడం పెద్ద కష్టమేమి కాకూడదన్నారు. అత్యధిక సభ్యత్వాలను చేయించిన వారికే పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ పరిస్థితులు, పార్టీ పటిష్టానికి చేపడుతున్న చర్యలను గురించి పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీని చేయనందున ఈ నెల 30న పార్టీ ఆధ్వర్యంలో రైతు హామీల సాధన పేరిట దీక్ష నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నేతలు నడ్డాకు వివరించారు. ఈ సమావేశం ముగిశాక బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తోందని నడ్డా ప్రశంసించారన్నారు. నడ్డాతో భేటీలో పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె. లక్ష్మణ్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, గోడెం నగేష్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

నియంత్రణలోనే నిరుద్యోగిత

'లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేషియో'లో మహిళలు, పురుషుల శాతం ఏడేళ్లలో అధికంగా నమోదు

- 2021-22లో మినహా ఎల్ఎఫ్‌పీఆర్ క్రమంగా వృద్ధి నమోదు
- పురుషులు, మహిళల వేతనాల్లో భారీ అంతరాలు
- పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే వార్షిక నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగిత శాతం 3.2గా నమోదైంది. 2023 జూలై నుంచి 2024 జూన్ వరకు.. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్‌వో) విడుదల చేసిన పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) వార్షిక నివేదికలో 'లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేషియో'(ఎల్ఎఫ్‌పీఆర్)లో మహిళలు, పురుషుల శాతం.. ఏడేళ్లలో అధికంగా నమోదైంది. 2017-18లో మొదలుపెట్టిన ఈ సిరీస్‌కు అనుగుణంగా గణాంకాల విడుదల మొదలయ్యాక తొలిసారిగా నిరుద్యోగిత శాతం అత్యల్పంగా నమోదైంది. దీంతో వార్షిక నిరుద్యోగ శాతం 3.2 శాతంగా మార్పు లేకుండా కొనసాగుతున్నట్టు స్పష్టమైంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్యలో పెరుగుదల నమోదైనా కూడా నిరుద్యోగిత శాతం తక్కువగానే ఉన్నట్టుగా తేలింది. తాజాగా విడుదల చేసిన పీఎల్ఎఫ్ఎస్ నివేదిక ప్రకారం చూస్తే.. భారత్‌లో నిరుద్యోగ శాతం 3.2 శాతం వద్ద ఆగినట్టు తెలుస్తోంది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ రిపోర్ట్ ప్రకారం గమనిస్తే.. లేబర్ మార్కెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. 2017లో సర్వే ప్రారంభించినప్పటి నుంచి చూస్తే లేబర్ ఫోర్స్ భాగస్వామ్యం పెరుగుదల అనేది అత్యధికంగా నమోదైంది. 'లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేషియో'ను బట్టి.. 2023-24లో జనాభాలో పనిచేస్తున్నవారు, ఉద్యోగాలు కోరుకుంటున్నవారు 45.1 శాతానికి చేరుకున్నారు. అంతకుముందు ఏడాదితో పోల్చితే ఇది 2.7 శాతం పెరుగుదల నమోదైంది. 2021-22 సంవత్సరంలో మినహా ఎల్ఎఫ్‌పీఆర్ క్రమంగా వృద్ధి నమోదవుతూ వస్తోంది. ఒక వైపు నిరుద్యోగిత శాతం కొనసాగుతూనే లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ పెరగడాన్ని బట్టి.. జాబ్ మార్కెట్‌లో కొత్త అవకాశాలతో పాటు కొత్తగా కార్మికులు ప్రవేశించినట్టు స్పష్టమౌతోంది. అయితే నాణ్యతతో కూడిన ఉపాధి అవకాశాల కల్పన విషయంలో మాత్రం నీలినీడలు కమ్ముకోవడం మాత్రం గమనార్హం.

పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక

పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికను బట్టి చూస్తే మాత్రం కొన్ని జాబ్ క్వాలిటీ ఇండికేటర్స్‌లో పురోగతి కనిపిస్తోంది. ఉద్యోగుల్లో.. శాలరీడ్ క్లాస్, రెగ్యులర్ పే వర్కర్లలో పీఎల్ఎఫ్ఎస్‌లో అత్యధిక ఆదాయం పొందే కేటగిరీల జీతాలు 21.7 శాతానికి (0.8 శాతం పెరుగుదల).. ఇది 2019-20తో పోల్చితే అధికంగా అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో క్యాజువల్ కార్మికుల భాగస్వామ్యం క్రమంగా తగ్గుదల నమోదైంది. గతంతో పోల్చితే 2 శాతం తగ్గుదలతో 19.8 శాతానికి ఇది చేరుకుంది. కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పీఎల్ఎఫ్ఎస్ అధ్యయనంలో ఈ కేటగిరీకి చెందినవారు తిరోగమన దిశలోనే కొనసాగుతుండడం గమనార్హం. అదే సమయంలో.. 2023-24లో సెల్ఫ్ ఎంప్లాయ్‌డ్ వర్కర్లు, ఎంప్లాయర్స్ శాతం మాత్రం 39 శాతంగానే కొనసాగుతోంది.



పురుషులు, మహిళల వేతనాల్లో భారీ అంతరాలు...
(వివిధ కేటగిరీల వర్కర్ల నెలవారీ సగటు వేతనాలు)

	రెగ్యులర్ ఉద్యోగులు పురుషులు/స్త్రీలు	క్యాజువల్‌లేబర్ పురుషులు/స్త్రీలు	సెల్ఫ్ ఎంప్లాయ్‌డ్ పురుషులు/స్త్రీలు
2023 జూలై-సెప్టెంబర్	21,478/15,790	13,170/8,790	15,317/5,297
2023 అక్టోబర్-డిసెంబర్	21,963/16,621	13,530/8,790	15,654/5,384
2024 జనవరి-మార్చి	22,554/16,546	13,530/8,790	16,334/5,503
2024 ఏప్రిల్-జూన్	22,375/17,034	13,770/9,180	16,723/5,803

మంచి వార్తే కానీ..

లేబర్ ఫోర్స్, వర్క్‌ఫోర్స్ భాగస్వామ్య పెరుగుదల, నిరుద్యోగ శాతం తగ్గుదల అనేది మంచి వార్తలాగే కనిపిస్తోంది. ఆరేళ్లుగా ఉద్యోగ, ఉపాధి కాంపోజిషన్ అనేది గణనీయంగా తగ్గింది. అన్‌పెయిడ్ ఫ్యామిలీ లేబర్ షేర్ అనే ఒక్క కేటగిరీలోనే వృద్ధి గోచరిస్తోంది. అన్‌పెయిడ్ ఫ్యామిలీ లేబర్‌లో మహిళల సంఖ్య అధికం. వ్యవసాయ రంగంలోనే మహిళలు అన్‌పెయిడ్ లేబర్‌గా ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది.

– ఇషాన్ ఆనంద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ ఢిల్లీ

జాబ్ మార్కెట్‌లో..

జాబ్ మార్కెట్‌లో.. వివిధ రంగాల వారీగా (సెక్టార్-వైస్ ఎంప్లాయ్‌మెంట్) ఉద్యోగుల విభజనను పరిశీలిస్తే వరుసగా రెండేళ్ల పాటు వ్యవసాయ రంగంలో ఉపాధి శాతం అనేది పెరుగుదల నమోదైంది (30 బేసిస్ పాయింట్ల పెరుగుదలతో 46.1 శాతానికి చేరుకుంది). ఇది 2020-21లో 46.5 శాతంగా ఉంది. సర్వీసెస్ సెక్టార్‌లో 80 బేసిస్ పాయింట్లు పెరిగి 29.7 శాతానికి చేరుకోవడంతో వృద్ధి నమోదైంది. ట్రేడ్, హోటల్స్, ట్రాన్స్‌పోర్ట్, స్టోరేజీ, కమ్యూనికేషన్స్ ఇండస్ట్రీస్‌లో ప్రాథమికంగా వృద్ధి నమోదుతో 40 బేసిస్ పాయింట్లు పెరుగుదలతో ఎంప్లాయ్‌మెంట్ షేర్ కూడా పెరిగింది. మొత్తంగా ఎంప్లాయ్‌మెంట్ షేర్‌లో నిర్మాణరంగంలో 1.1 శాతం పాయింట్ల తగ్గుదల నమోదైంది.

విద్యారంగంలో కొత్త సమస్యలు సృష్టిస్తున్న ప్రభుత్వం

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

సాక్షి, హైదరాబాద్ : విద్యారంగంలో పాత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ఆపకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ కొత్త సమస్యలు సృష్టిస్తోందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో అధ్యయనం చేయకుండానే విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలల్ని మూసేస్తున్నారని శనివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. దీనిపై అక్టోబర్ 3న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని వెల్లడించారు.

ముగిసిన గురుకుల ఉద్యోగుల నిరసనలు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గురుకుల విద్యా జేఏసీ తలపెట్టిన నిరసన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈనెల 17, 18వ తేదీల్లో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు, 19వ తేదీ నుంచి కార్యదర్శులకు వినతుల సమర్పణ, 23వ తేదీన ప్రభుత్వ ఉన్నతాధికారులకు విజ్ఞాపనలు, 24వ తేదీన ప్రజాభవన్‌లో జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రాల సమర్పణ, 28వ తేదీన పెన్‌డౌన్, చాక్‌డౌన్ కార్యక్రమాలు చేపట్టినట్లు గురుకుల విద్యా జేఏసీ ప్రతినిధులు సీహెచ్.బాలరాజు, కె.యాదయ్య, పి.రుషికేశ్ కుమార్, వి.ప్రభుదాస్, కేవీ చలపతి, డి.బాలస్వామి తదితరులు శనివారం ఒక ప్రకటనలో వివరించారు. త్వరలో గురుకుల విద్య జేఏసీ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.







శనివారం హైదరాబాద్ మలక్‌పేట శంకర్‌నగర్‌లో తమ ఇళ్లకు మార్కింగ్ వేయడంతో ఖాళీ చేసి వెళుతున్న స్థానికులు

భగత్ సింగ్‌కు సీఎం నివాళి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని శనివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు.

- సాక్షి, హైదరాబాద్



శనివారం బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ముకు స్వాగతం పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మేయర్ విజయలక్ష్మి తదితరులు



శనివారం సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ తొలి ఎడిషన్‌ను ప్రారంభించిన సందర్భంగా మగ్గం నేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

మండీ లేబర్ చార్జీల పెంపుపై కమిటీ

సాక్షి, హైదరాబాద్: ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు సంబంధించి మండీ లేబర్ చార్జీల పెంపుపై ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ కమిటీకి కమిషనర్ చౌహాన్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) చెన్నై ఈడీ, ఎఫ్‌సీఐ తెలంగాణ రీజియన్ జీఎం, రాష్ట్ర మండీబోర్డ్ చైర్మన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండీ, కేంద్ర గిడ్డంగుల సంస్థ ఆర్ఎం, వ్యవసాయ శాఖ డైరెక్టర్, కార్మిక శాఖ ప్రతినిధి, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉండనున్నారు.

నకిలీ క్లినిక్‌లపై డీసీఏ కొరడా

ఎనిమిది చోట్ల నకిలీ వైద్యులను గుర్తింపు

- రూ.2.60 లక్షల విలువైన మందుల స్వాధీనం
- డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి వెల్లడి



సాక్షి,హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నకిలీ క్లినిక్‌లపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించిన సోదాల్లో అనధికారిక క్లినిక్‌లు, అనుమతులు లేకుండానే ఆర్ఎంపీలుగా కొనసాగుతున్న వారిపై డీసీఏ చర్యలు తీసుకుంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లో ముల్లగిరి రవి, హనుమకొండ మండలం న్యూ రాయిపురాలో నందిని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో కురిమిల్లా వేణుకుమార్, నిజామాబాద్ జిల్లా కోటగల్లీలో ఏడుగాని వెంకటేశ్వర్, నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో కంచి ధనుంజయ్, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం, దత్తప్పగూడ గ్రామంలో పోలెబోయిన భిక్షపతి, హయత్‌నగర్ మండలం బంజారాకాలనీలో రాజబాబు, ఖమ్మం జిల్లా తాళ్లగూడ మండలం కుర్నవల్లీ గ్రామంలో గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజ్‌గిరి జిల్లా ఓల్డ్ బోయిన్‌పల్లిలో అనంత సుదర్శన్‌రెడ్డి నకిలీ క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు డీసీఏ గుర్తించింది. ఈ తనిఖీల్లో భాగంగా రూ.2.06 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా నేతాజీచౌక్‌లో అనుమతి లేకుండానే ఔషధాలు విక్రయిస్తున్న మందుల దుకాణాన్ని సీజ్ చేయడంతోపాటు రూ.40వేల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

కగార్‌తో కంగారు

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల ఉక్కిరిబిక్కిరి

- ఒకప్పుడు దండకారణ్యంపై ఆధిపత్యం
- ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో సడలిన పట్టు
- పారా మిలిటరీ క్యాంపులపై దాడులు
- వ్యూహాత్మకంగా తిప్పికొడుతున్న భద్రతా దళాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టులు తమకు పట్టున్న ప్రాంతాల్లో ఆధిపత్యం చేజారకుండా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా పారా మిలిటరీ దళాల క్యాంపులపై దాడులు చేస్తున్నారు. కానీ మావోయిస్టు దాడులను భద్రతా దళాలు వ్యూహాత్మకంగా తిప్పి కొడుతున్నాయి.

నలువైపులా 'హంట్'

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం – ములుగు జిల్లాలతో సరిహద్దు పంచుకుంటున్న ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల్లో మావోయిస్టులదే ఆధిపత్యం. దండకారణ్యంలో జనతన సర్కార్ పేరుతో దాదాపు ప్రత్యామ్నాయ ప్రభుత్వం నిర్వహించే స్థాయికి వారు చేరుకున్నారు. అయితే 2009లో కేంద్రం ఆరంభించిన ఆపరేషన్ గ్రీన్ హంట్‌తో ఒక్కొక్క ప్రాంతంపై పట్టు కోల్పోతూ వస్తున్నారు. నలువైపులా క్యాంపులు ఏర్పాటు చేస్తూ.. మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలను బలగాలు చుట్టుముడుతున్నాయి. గతేడాది పూసుగుప్పలో పారా మిలటరీ క్యాంపు ఏర్పాటు కాగా.. ఈ ఏడాది ఆరంభంలో పువ్వర్తిలో క్యాంపు ఏర్పాటైంది. అంతకుముందు పామేడు, చింతవాగు, నంబిలలో క్యాంపులు వెలిశాయి. ఒకప్పుడు క్యాంపుల ఏర్పాటుకు నెలల తరబడి సమయం తీసుకునే భద్రతా దళాలు.. ఇప్పుడు మూడు నెలల్లోనే కొత్త శిబిరాలు ఏర్పాటు చేసుకుంటూ అడవుల్లోకి చొచ్చుకుపోతున్నాయి. ఇదే జోరు కొనసాగితే ఏడాదిలోపే.. దండకారణ్యంపై మావోయిస్టులు తమ పట్టు కోల్పోయే అవకాశం ఉంది.

రాత్రి వేళే దాడులు..

గతంలో పగటి వేళలో జవాన్లు ప్రయాణించే వాహనాలు లక్ష్యంగా మావోయిస్టులు అంబూష్ దాడులకు పాల్పడేవారు. కానీ మారిన పరిస్థితుల కారణంగా పగటి వేళ క్యాంపులపై దాడులకు వారు సాహసించడం లేదు. ఇటీవలి దాడులన్నీ రాత్రి 7 గంటల తర్వాత జరిగినవే కావడం గమనార్హం. చీకటి పడిన తర్వాత భోజనాలు, వ్యక్తిగత పనుల్లో జవాన్లు నిమగ్నమయ్యే సమయాల్లో మావోయిస్టులు దాడులకు పాల్పడుతున్నారు. ఎదురుకాల్పుల్లో తమవైపు ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు.. క్యాంప్ సమీపానికి వెళ్లకుండా రెండు నుంచి నాలుగు వందల మీటర్ల రేంజ్ ఉండే అండర్ బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లతో దాడులు చేస్తున్నారు.

అంబూష్ దాడులు..

ప్రస్తుతం సుక్మా, బీజాపూర్ జిల్లాల పరిధిలో పామేడు, చింతవాగు, ధర్మారం, కవరుగట్ట, కొండపల్లి, బట్టిగూడెం, పువ్వర్తి, గుండాల, నంబి, కర్రెగుట్టలు, పూసుగుప్పల నడుమ ప్రాంతమే మావోయిస్టులకు దండకారణ్యంలో ప్రధాన అడ్డాగా ఉంది. పైగా నంబి జలపాతం నుంచి మొదలై గోదావరిలో కలిసే తాలిపేరు నది ప్రధాన పాయ పరీవాహక ప్రాంతంపై భద్రతా దళాలు పట్టు సాధిస్తే.. మావోయిస్టులకు ఇక్కట్లు తప్పవు. దీంతో భద్రతా దళాలను అడ్డుకునేందుకు, తమకు అనుకూలమైన వానాకాలం సీజన్‌లో భద్రతా దళాల క్యాంపులపై అంబూష్ దాడులకు మావోయిస్టులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెలలో పువ్వర్తి, ధర్మారం, పూసుగుప్ప క్యాంపుల మీద వరుసగా దాడులు చేశారు. ప్రతిచోట 200 నుంచి 300 మంది మావోయిస్టులు విల్లులు, బాణాలు, గ్రెనేడ్లు, ఇన్సాస్, ఏకే 47 వంటి ఆయుధాలతో దాడులకు పాల్పడినట్టు సమాచారం.



పక్కా ప్రణాళికతో భద్రతా దళాలు

మావోయిస్టుల మెరుపుదాడులను ముందుగానే అంచనా వేసిన భద్రతా దళాలు పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నాయి. గతానికి భిన్నంగా అడవిలో ఏర్పాటు చేసిన క్యాంప్ చుట్టూ కనీసం వంద నుంచి రెండు వందల మీటర్ల వరకు ఉన్న చెట్లను పూర్తిగా తొలగించి మైదానంలా మార్చేస్తున్నారు. అడవుల్లో దాక్కొని నక్కుతూ క్యాంప్ సమీపానికి వచ్చి మెరుపు దాడులు చేసే అవకాశం మావోయిస్టులకు లేకుండా చేశారు. దీంతోపాటు క్యాంపు చుట్టూ ఉండే ఇనుప కంచెకు ఖాళీ బీరు సీసాలను అమర్చడం ద్వారా ఏ చిన్న శబ్దం వచ్చినా అప్రమత్తమవుతున్నారు. రాత్రివేళ మావోయిస్టులు చేపట్టే కవ్వింపు చర్యలకు తీవ్రంగా స్పందించడం తగ్గించారు. ఇలా ఇరువర్గాలు పట్టు కోసం వ్యూహాత్మకంగా కదులుతుండటంతో భారీ ప్రాణనష్టం తప్పుతోంది.

క్లుప్తంగా...

'ఎయిడెడ్' సమస్యలను పరిష్కరించాలి: టీచర్స్ గిల్డ్

సాక్షి, అమరావతి: ఎయిడెడ్ ఉపాధ్యాయులు గత 24 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది.1998 నుంచి మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం, 2008 నుంచి ఆరోగ్య కార్డులు, జిల్లా యూనిట్‌గా కారుణ్య నియామకాలు నిలిపివేశారని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వంలో విలీనమైన 3,258 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యలు సైతం విద్యాశాఖ కమిషనర్ పరిష్కరించాలని కోరారు. కరోనా సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 169 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు మరణించారని, వారి కుటుంబ సభ్యుల సమస్యను జీవో నం.423 ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ, ఏపీలకు సాయం చేద్దాం

ఎస్సీఏఓఆర్ఏ వెల్ఫేర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సిద్దార్థ లూథ్రా

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల వరదల వలన రెండు తెలుగు రాష్ట్రాలు అతలాకుతలం అయ్యాయని సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ (ఎస్సీఏఓఆర్ఏ) వెల్ఫేర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రెండు రాష్ట్రాల్లో ఉన్న వరద బాధితులకు చేయూతనిద్దామని ఓ లేఖలో సభ్యులను కోరారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సహాయక చర్యలకు మద్దతుగా నిలిచేందుకు సహకరించాలని ట్రస్ట్ సభ్యులకు పిలుపునిచ్చారు. సభ్యులు ట్రస్టుకైనా లేదా రెండు రాష్ట్రాల సీఎం సహాయ నిధి, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కి నేరుగానైనా ఆర్థిక సాయం చేయవచ్చని స్పష్టం చేశారు.

ఈస్ట్రన్ కోస్ట్‌గార్డ్ కమాండర్‌గా డోనీ మైఖేల్ బాధ్యతలు



సింధియా: తూర్పు సముద్ర తీరానికి కోస్ట్‌గార్డ్ కమాండర్‌గా ఏడీజీ డోనీ మైఖేల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2023లో ఇండియన్ కోస్ట్‌గార్డ్ రీజియన్ ఈస్ట్‌కు కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను ఏడాది కంటే తక్కువ వ్యవధిలోనే తూర్పు సముద్రతీరానికి కోస్ట్‌గార్డ్ కమాండర్‌గా పదోన్నతిపై నియమించారు. కొత్త బాధ్యతల్లో భాగంగా డోనీ మైఖేల్ చెన్నై, ట్యూటికోరిన్‌లో వరద పరిస్థితి, తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలితో సమన్వయం, అక్రమ వలసలను నిరోధించడం, భారత్–శ్రీలంక సముద్ర సరిహద్దు సమీపంలో మాదకద్రవ్యాలతో సహా నిషిద్ధ వస్తువులపై నియంత్రణ, స్వాధీన విధులు నిర్వర్తించనున్నారు.

ఏపీలో ఎన్‌సీసీఎఫ్ ద్వారా ధాన్యం సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)తో పాటు అదనంగా నేషనల్ కో–ఆపరేటివ్ కన్జూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీసీఎఫ్) ద్వారానూ ధాన్యం సేకరించాలని కేంద్రం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ఎన్‌సీసీఎఫ్ ద్వారా 20.12లక్షల సేకరణను లక్ష్యంగా పెట్టుకుంది. ఈ అక్టోబర్ ఒకటి నుంచే సేకరణను మొదలు పెట్టనుంది. ఈ మేరకు రెండ్రోజుల కిందటే వరి అదనపు సేకరణకు ఎన్‌సీసీఎఫ్ ఆసక్తి చూపిందని, దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ, ఐదు రాష్ట్రాలకు కేంద్రం లేఖలు రాసింది. మొత్తం సేకరణలో ఏపీలో 1.44 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సామాన్యులకు బియ్యాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు నేషనల్ కో–ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా బియ్యం ఎగుమతులు చేయాలని గతేడాది కేంద్రం నిర్ణయించింది. ఈ నిర్ణయానికి అనుగుణంగానే ఐదు రాష్ట్రాల్లో కొనుగోళ్లకు కేంద్రం నిర్ణయం తీసుకుంది.

ప్రజా సమస్యలను విస్మరించిన చంద్రబాబు

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



తిరుపతి కల్చరల్: ప్రజా సమస్యలను, నిరుద్యోగ సమస్యలను సీఎం చంద్రబాబు విస్మరించారని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు.నివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి మరణం వెనుక బీజేపీ కుట్ర ఉందన్నారు. ఢిల్లీ ఎయిమ్స్ అనారోగ్యంతో ఏచూరి చేరారని, ఆయనకు సరైన చికిత్స అందలేదన్నారు. ఏచూరి ఉన్న వార్డులో స్పైన్ ఫ్లూ పేషెంట్‌ను ఎలా ఉంచుతారని ఆయన ప్రశ్నించారు.

2న ఉక్కు పరిరక్షణకు భారీ ర్యాలీ

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 2న జరిగే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి విశాఖలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల ప్రజా సంఘాలన్నీ కలిసి మహా ఉద్యమంలా డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపడతామని వివరించారు.

కాసులిస్తేనే నచ్చిన చోటు

పరిశ్రమల శాఖలో పైసలిస్తేనే బదిలీలు

- 22వ తేదీతో ప్రక్రియ ముగిసినా.. బదిలీ చేయకుండా తొక్కిపెట్టిన వైనం
- అధిక మొత్తం చెల్లించిన వారికి వెనుక తేదీలతో బదిలీ అంటూ బేరం
- గృహ నిర్మాణ శాఖ బదిలీల్లో సిఫార్సులు, సొమ్ములకు పెద్దపీట
- రాజకీయ బదిలీల కోసం ఇంధన శాఖపై తీవ్ర ఒత్తిళ్లు



రాష్ట్రంలో అధికారికంగా బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగిసినప్పటికీ పరిశ్రమల శాఖలో కీలక పోస్టుల బదిలీ ప్రక్రియ పూర్తికాలేదు. పైసలు ఇస్తేనే బదిలీ ఆర్డర్లు ఇస్తామంటూ కీలకస్థాయి అధికారి బేరం పెట్టడంతో ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. జనరల్ మేనేజర్ స్థాయి నుంచి కిందిస్థాయి అధికారుల బదిలీల వరకు ఎన్నడూ లేనివిధంగా గడువు ముగిసినా ఆర్డర్లు జారీ చేయకపోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడిగిన మొత్తం చెల్లించిన వారికి నచ్చిన చోటకు బదిలీ చేస్తూ పాత తేదీ (బ్యాక్ డేట్)తో ఉత్తర్వులు ఇస్తామంటూ ఉద్యోగులతో నేరుగా బేరాలు సాగిస్తుండటంతో జిల్లాస్థాయి అధికారులు లబోదిబోమంటున్నారు. పిల్లల చదువుల నిమిత్తం ఎప్పటినుంచో బదిలీ కోసం ఎదురుచూస్తుంటే కేవలం డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో ఆర్డరు కాపీని తొక్కిపెట్టారంటూ ఒక ఉద్యోగి వాపోయారు. ఈ విధంగా పైస్థాయి అధికారి నేరుగా జిల్లాస్థాయి అధికారులకు ఫోన్లు చేసి అడగడం ఇప్పటివరకు ఎప్పుడూ లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఈసారి నేరుగా ఆయనే ఫోన్లు చేసి బెదిరిస్తుండటంతో భయభ్రాంతులకు లోనవుతున్నారు.

సాక్షి, అమరావతి

గృహ నిర్మాణ శాఖలో కాసుల పంట

గృహ నిర్మాణ శాఖలో సాధారణ బదిలీలు కూటమి ప్రజాప్రతినిధులకు కాసుల పంట పండించాయి. సీనియారిటీ, స్పౌజ్ వంటి నిబంధనలను పక్కనపెట్టి రాజకీయ సిఫార్సులు, వసూళ్లకు పెద్దపీట వేశారని ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. తన ఓఎస్డీ ద్వారా కీలక ప్రజాప్రతినిధి వసూళ్లకు తెరలేపారు. ఓఎస్డీ నేరుగా డీఈఈ, ఈఈ, ఎస్ఈలకు ఫోన్లు చేసి వసూళ్ల వ్యవహారం చక్కబెట్టినట్టు తెలుస్తోంది. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు ఆపైన ముట్టచెప్పిన వారికే కోరిన స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఏ రాజకీయ నాయకుడు సిఫార్సు, డబ్బు ఇవ్వని వారికి అప్రాధాన్య పోస్టుల్లోకి నెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పోస్టింగ్ కావాల్సిన చోట స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ సిఫార్సు తీసుకోవడం కోసం అక్కడ కూడా రూ.లక్షల్లోనే ఉద్యోగులు ముట్టజెప్పారు. రాజకీయ సిఫార్సులు, డబ్బు చెల్లించిన ఉద్యోగులకు పోస్టింగ్ ఇవ్వడం కోసం ఏడాది, రెండేళ్ల క్రితం నియమించిన వారిని వేరే చోటకు బదిలీ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వాస్తవానికి ఆదివారంలోగా బదిలీల ప్రక్రియ ముగియాల్సి ఉంది. అయితే, సిఫార్సులు, వసూళ్ల ఆధారంగా కోరుకున్న చోట ఉద్యోగులను సర్దుబాటు ప్రక్రియ ఆలస్యం అవ్వడంతో సోమవారానికి తుది జాబితా గృహ నిర్మాణ శాఖకు అందినట్టు తెలిసింది.

పోరుబాటలో ఇంధన శాఖ ఉద్యోగులు!

విద్యుత్ సంస్థల్లో బదిలీలకు ముందే సిఫారసు లేఖలు ఇచ్చిన వైనం బయట పడటంతో ఉలిక్కిపడ్డ ఉన్నతాధికారులు కనీస అర్హత ఉన్నవారికే సిఫారసులను అన్వయించేలా తీవ్రంగా కసరత్తు చేశారు. అయినప్పటికీ.. తాము అనుకున్న విధంగానే బదిలీలు జరగాలని, తమ సిఫారసు లేఖలు పరిగణనలోకి తీసుకోవాలని కూటమి నేతలు పట్టుబట్టారు. ఒకే పోస్టుకు ఇద్దరు ముగ్గురు ప్రజాప్రతినిధులు తమ వారిని ప్రతిపాదించడం కూడా అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో 22వ తేదీకే పూర్తవ్వాల్సిన బదిలీలు 23న కూడా కొనసాగాయి. డిస్కంలలో జూనియర్ లైన్‌మెన్ స్థాయి నుంచి డిప్యూటీ ఇంజనీర్ స్థాయి వరకూ వందల మందిని బదిలీ చేశారు. రాజకీయ నేతల కోరిక మేరకు కొందరిని బదిలీ చేసినప్పటికీ డిప్యుటేషన్ పేరుతో ప్రస్తుత స్థానంలోనే కొనసాగేలా ఆదేశాలిచ్చారు. బీసీ, ఓసీ సంఘాల నేతలకు బదిలీ నుంచి మినహాయింపు (ప్రొటెక్షన్) ఇవ్వలేదు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు రెండు సంఘాల ఉద్యోగులు సోమవారం ప్రకటించారు.

రైతు సేవా కేంద్రాల్లో ఏఈవోలను నియమించవద్దు

సాక్షి, అమరావతి: ఏపీలోని కొన్ని జిల్లాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)ను నియమించడాన్ని ఉపసంహరించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ ఏపీఎన్జీవోహోంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్ స్థాయిలో పనిచేయాల్సిన విస్తరణ అధికారులను శ్రీకాకుళం, కడప, చిత్తూరు, విజయనగరం తదితర జిల్లాల్లో గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల స్థానంలో ఇన్‌చార్జులుగా నియమించడం సరికాదన్నారు. రాష్ట్ర జేఏసీ సెక్రటరీ జనరల్‌గా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌ను ఎన్నుకోవడంపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది.

ఇంటర్ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇస్తున్నట్టుగానే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకూ ఇంటర్ విద్యా మండలి ప్రోగ్రెస్ కార్డులు జారీ చేయనుంది. ఈ మేరకు కార్డు నమూనాను ఇంటర్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలకు పంపారు. ఇందులో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 4 యూనిట్ టెస్టులు, క్వార్టర్లీ, అర్థ వార్షిక పరీక్షలు, ప్రీ పబ్లిక్ పరీక్షల మార్కులతో పాటు, కళాశాల పనిచేసిన రోజులు, విద్యార్థి ఏ నెలలో ఎన్ని రోజులు హాజరయ్యారనే అంశాలున్నాయి.

శ్రీశైలానికి 1,21,737 క్యూసెక్కుల వరద



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి శనివారం జూరాల, సుంకేసుల నుంచి 1,21,737 క్యూసెక్కుల వరద నీరు చేరుకుంది. శుక్రవారం నుంచి శనివారం వరకు జలాశయానికి ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 1,41,703 క్యూసెక్కుల నీరు వచ్చింది. శ్రీశైలం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 50,030 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 2.721 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 13.745 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 185.9926 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 879.60 అడుగులకు చేరుకుంది.

వృత్తి విద్య బోధనకు అవకాశమివ్వండి

మంత్రి లోకేశ్‌కు సమగ్ర శిక్ష యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష ప్రాజెక్టు కింద పాఠశాల విద్యలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయులకు తరగతి గదిలో బోధించేందుకు అవకాశం కల్పించాలని సమగ్ర శిక్ష యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విభాగంలో గత 12 ఏళ్లుగా సేవలు అందిస్తున్నప్పటికీ పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ హోదా కారణంగా తాము తరగతి గదుల్లో బోధించేందుకు అవకాశం కల్పించకుండా పాలనాపరమైన పనులు అప్పగిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

పెట్టుబడుల ఆకర్షణకు సీఐఐ కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే విధంగా సీఐఐతో రాష్ట్ర ప్రభుత్వం కన్సల్టేటివ్ ఫోరంను ఏర్పాటు చేసింది. గవర్నమెంట్ ఆఫ్ ఏపీ సీఐఐ కన్సల్టేటివ్ ఫోరం పేరుతో ఏర్పాటుచేసిన ఈ కమిటీలో 16 మందిని సభ్యులుగా నియమిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులిచ్చారు. ఆర్టీజీఎస్ మంత్రి చైర్మన్‌గా ఉండే ఈ ఫోరంలో పలు శాఖలకు చెందిన కార్యదర్శులతో పాటు ముగ్గురు సీఐఐ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

పోలేరమ్మ తల్లీ.. మన్నించవా

సవాలక్ష తప్పులతో ముగిసిన జన జాతర • జాతర ఆది నుంచి అన్నీ తప్పిదాలే



వెంకటగిరి (సైదాపురం): తిరుపతి జిల్లా వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతరలో ఆది నుంచి అన్నీ తప్పిదాలతో ముగిసింది. సాక్షాత్తు ఆశాఖ మంత్రే జాతర వైఫల్యం జరిగిందంటూ నిర్మొహమాటంగా వ్యాఖ్యానించారు. స్థానిక ప్రజాప్రతినిదే తమను మన్నించాలంటూ..క్షమాపణలు కోరారు. గతేడాది వైభవంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జన జాతర అన్నీ హంగులు, ఆర్భాటాలతో నిర్వహించారు. అప్పట్లో 2 రోజులు జరిగే జన జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి నేదురుమల్లి పర్యవేక్షణలో గతేడాది 5రోజుల పాటు ప్రతిరోజు పండుగగానే జాతరను నిర్వహించారు. ఆ ఏడాదిలోనే సామాన్య భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం మహా అద్భుతంగా జరిగేందుకు వీఐపీ క్యూ దర్శనాలు నిలిపివేశారు. ఈ ఏడాది దర్శన భాగ్యం సామాన్యులకు మాత్రం నిరాశే మిగిలింది.

ఈ ఏడాది తప్పిదాలు ఇలా..

ఘటోత్సవంలో గత దశబ్దాలు ఆనవాయితీగా వస్తోన్న రాజా కుటుంబీకులు సాంగ్యం, అమ్మవారి బలి దున్నపోతుకు పూజలు ఈ ఏడాది నోచుకోలేదు. వాస్తవానికి అమ్మవారి ఘటం కుండలతోపాటు దున్నపోతును జీనుగుల వారి వీధినుండి ఊరేగిస్తూ రాజాగారి వంటశాల వద్ద రాజాలు పంపిన సాగ్యంతో తొలుత పూజలు నిర్వహించడ ఆనవాయితీ. ఈ ఏడాది జరిగిన ఘటోత్సవంలో రాజాగారి వంట శాలవద్దకు పోలేరమ్మతల్లి దున్నపోతును తీసుకురాకపోవడంతో అక్కడ దున్నపోతు ప్రత్యేక పూజలకు నోచుకోలేదు. గతేడాది సామాన్య భక్తులకోసం వీఐపీ దర్శనం పూర్తిగా రద్దుచేశారు. ఈ ఏడాది స్థానిక ప్రత్యేక వీఐపీ దర్శన క్యూ ఏర్పాటు చేయడంతో టికెట్లను కొనుగోలు చేసిన భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే

- అక్టోబర్ 13 నుంచి ద్వారకాతిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- 17 న రాత్రి 8 గంటలకు స్వామివారి తిరుకల్యాణం
- 18 న రాత్రి 7 గంటలకు రథోత్సవం



ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 13 నుంచి 20 వరకు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి శనివారం తెలిపారు. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో శ్రీవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలను జరుపుతామన్నారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 13 నుంచి 20 వరకు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. అక్టోబర్ 13న ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారునిగాను, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆ రోజు రాత్రి గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. 14 న రాత్రి ధ్వజారోహణ, రాత్రి 9 హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం చేపడతారు. 16 న ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని రాత్రి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. 17 న రాత్రి శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. 18 న రాత్రి రథోత్సవాన్ని, 19న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణ చేపడతారు. 20న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపుసేవ, శ్రీపుష్పయాగం కార్యక్రమాలు జరుగుతాయి. వీటితో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఆలయ భూముల్లో అక్రమ సాగుకు యత్నం

• జేసీబీలతో పామాయిల్ చెట్ల కూల్చివేత • టీడీపీ నేత నిర్వాకం



జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెంలో కోదండ రామాలయానికి చెందిన భూములపై అక్రమార్కుల కన్ను పడింది. టీడీపీకి చెందిన ఓ నేత ఆలయానికి చెందిన ఈ భూముల్లో 2 రోజులుగా జేసీబీలతో పామాయిల్ చెట్లను కూల్చివేసి భూమి చదును చేసే పనులు చేపట్టారు. ఇప్పటికే ఈ భూముల్లో అక్రమ సాగు చేసేందుకు పొగాకు నారు సిద్ధం చేశారు. చల్లవారిగూడెంలో కోదండ రామాలయానికి 1957లో పెండ్యాల వెంకట రామారావు 42 ఎకరాల 79 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాలువ తవ్వకాలకు అధికారులు భూసేకరణ చేపట్టారు. రామాలయం భూముల మీదుగా ఈ కాలువ వెళ్లడంతో 2015 మే 2న 12 ఎకరాల వరకు ఆలయ భూములను కాలువకు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటన ద్వారా తెలిపింది. అప్పట్లో కొంతమంది అక్రమార్కులు ఎత్తిపోతల పథకం పరిహారం కాజేసేందుకు ప్రయత్నించారు. దీంతో అప్పట్లో దేవదాయ శాఖ అప్రమత్తమై ఆలయానికి చెందిన ఈ భూములకు సంబంధించి పరిహారం రామాలయానికే చెందాలంటూ కోర్టును ఆశ్రయించింది. దాంతో ఆలయానికి చెందిన ఈ భూముల్లో ఎత్తిపోతల పథకం కాలువ పనులు చేపట్టలేదు. ఈ భూముల్లో ఎన్నో ఏళ్ల నుంచి భారీగా పెరిగిన పామాయిల్ చెట్లు ఉన్నాయి. వీటిని 2 రోజుల నుంచి నేలకూల్చి అక్రమ సాగుకు సిద్ధం చేస్తున్నారు.

జీఎస్‌డీపీ పెరగడానికి సూచనలు ఇవ్వండి

- 2047 నాటికి రూ.199 లక్షల కోట్లకు పెంచడమే లక్ష్యం
- పారిశ్రామికవేత్తలను కోరిన పరిశ్రమల శాఖ



సాక్షి, అమరావతి: పేదరికం లేని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుందని, ఇందులో భాగస్వాములు కావాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చింది. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని రూ.199 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపింది. ఇదే సమయంలో రాష్ట్ర తలసరి ఆదాయాన్ని రూ.35,69,000కు పెంచాలని లక్ష్యం నిర్దేశించుకున్నామని వెల్లడించింది. ఇందుకోసం చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి పారిశ్రామికవేత్తలు సూచనలు, సలహాలు ఇవ్వాలని పరిశ్రమల శాఖ కోరింది. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోందని తెలిపింది. ప్రతి సూచన, సలహాను పరిగణనలోకి తీసుకోవడమే కాకుండా పారిశ్రామికవేత్తల చొరవను గుర్తిస్తూ ఈ–సర్టిఫికెట్‌ను కూడా ప్రదానం చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ, ఏపీ ఎకనమిక్ బోర్డు, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) సామాజిక మాధ్యమాల ద్వారా పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చాయి. సూచనలు, సలహాలను http:// swamandhra.ap.gov.in/-Suggestions ద్వారా తెలియజేయొచ్చు.

ఆధ్యాత్మిక సమాచారం

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల తాకిడి



పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూల మాలికలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2,29,160 ఆదాయం సమకూరినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.. 9వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి



సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మదనగోపాల స్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠింపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు రంగనాథాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో శనివారం ఉదయం గరుడ సేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠింజేశారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ అర్చన చేశారు. విశేష హారతి అందించారు. భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

నేటి నుంచి కృష్ణమయ్య జయంతి ఉత్సవాలు



సింహాచలం: సింహగిరిపై ఆదివారం నుంచి మూడు రోజుల పాటు శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిపై కృష్ణమయ్య చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారని, ఏటా భాద్రపద చతుర్దశిరోజు కృష్ణమయ్య జయంతిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై కృష్ణమయ్య పటం ఆవిష్కరణ, సాయంత్రం 4 గంటల నుంచి కృష్ణమయ్య సాహిత్య సంకీర్తనల నృత్య ప్రదర్శన, కోలాటం ఏర్పాటు చేశామన్నారు. 30న ఉదయం 10 గంటల నుంచి కృష్ణమయ్య సాహిత్య సంకీర్తనలు, సాయంత్రం 4 గంటల నుంచి నృత్య, కోలాటం ప్రదర్శనలు ఉంటాయన్నారు. అక్టోబరు 1న ఉదయం 9 గంటల నుంచి ఆలయ బేడా మండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద జయంతి పూజలు నిర్వహిస్తామని వివరించారు.

విద్యా సమాచారం

ఏయూ విజిలెన్స్ అధికారిగా చిట్టిబాబు



విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విజిలెన్స్ అధికారిగా కెమికల్ ఇంజనీరింగ్ ఆచార్యుడు ఎస్.చిట్టిబాబు నియమితుడయ్యారు. ఈ మేరకు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు శనివారం చిట్టిబాబుకు ఉత్తర్వులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కృత్తివెంటి విద్యార్థినులు



రామచంద్రపురం: ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్ఎం టి.రాఘవరెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 26న కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ పోటీల ఎంపికలు జరిగాయన్నారు. అండర్– 19 విభాగంలో పాఠశాలకు చెందిన జి.పావనికుమారి, అండర్ –17 విభాగంలో డి.అపర్ణ, అండర్– 14 విభాగంలో సీహెచ్ ఐశ్వర్యాంబికలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ముగిసిన తెలుగు భాషా వారోత్సవాలు

కాజులూరు: కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో గతవారం రోజులుగా జరుగుతున్న తెలుగు భాషా వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. పాఠశాలలో ఈ నెల 21వ తేదీ శనివారం ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా వారోత్సవాలు ప్రారంభించిన ఉపాధ్యాయులు 28వ తేదీ శనివారం మరో ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి పురస్కరించుకుని ముగింపు పలికారు.

ముగిసిన సిమ్లా-2024 సదస్సు

కాకినాడ క్రైం: వైద్య రంగంలో ఫోరెన్సిక్ ప్రాధాన్యత నానాటికీ పెరుగుతోందని రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, డాక్టర్ ఎన్టీఆర్ యూహెచ్ఎస్ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. 3 రోజులుగా కాకినాడ ఆర్ఎంసీ ఫోరెన్సిక్ హెచ్‌వోడీ, ఆర్గనైజింగ్ చైర్మన్ ఉమామహేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ సదస్సు సిమ్లా-2024 శనివారం ముగిసింది.



● కమల్ హాసన్ ● అల్లు అర్జున్ ● వెంకటేశ్, వరుణ్ తేజ్

ముందుంది మూడో భాగం



● నాని ● యశ్ ● నిఖిల్ ● సిద్ధు జొన్నలగడ్డ

ఒకటో సారి... రెండో సారి... మూడో సారి... అంటూ వేలం పాట నిర్వహించడం చూస్తుంటాం. అయితే ఇప్పుడు చిత్ర పరిశ్రమలో ఒకటో భాగం.. రెండో భాగం... మూడో భాగం... ఇలా సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తోంది. కొన్ని సినిమాలు మొదటి భాగం హిట్ అయితే రెండో భాగం తీస్తున్నారు. సెకండ్ పార్ట్ కూడా సూపర్ హిట్ అయ్యిందంటే మూడో భాగం రూపొందిస్తున్నారు. మరికొన్నేమో రెండో భాగం షూటింగ్ దశలో ఉండగానే ముందుంది మూడో భాగం అంటూ ప్రకటించేస్తున్నారు. మూడో భాగం సీక్వెల్స్ విశేషాల్లోకి వెళదాం...

పుష్ప: ది రోర్

'తగ్గేదే లే..' అంటూ 'పుష్ప: ది రైజ్' చిత్రంలో హీరో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్ ప్రేక్షకుల మనసుల్లో నాటుకపోయింది. తాము కూడా తగ్గేదే లే అంటూ ఆ సినిమాకి పాన్ ఇండియా హిట్‌ని అందించారు ఆడియన్స్. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన చిత్రం 'పుష్ప: ది రైజ్'. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ వంటివారు కీలక పాత్రలు చేశారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం 2021 డిసెంబరు 17న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'పుష్ప: ది రైజ్' సూపర్ హిట్ కావడంతో సేమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టే సినిమాని పక్కాగా తీసుకురావాలని అల్లు అర్జున్, సుకుమార్ అండ్ టీమ్ కష్టపడుతున్నారు. లేటుగా వచ్చినా బ్లాక్‌బస్టర్ కొట్టాలనే ఆలోచనతో పని చేస్తోంది టీమ్. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా డిసెంబరు 6న విడుదల కానుంది. అయితే ఈ సినిమాకి మూడో భాగం ఉంటుందని, 'పుష్ప: ది రోర్' అనే టైటిల్‌ని కూడా ఖరారు చేశారనే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇదిలా ఉంటే... ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ఫిబ్రవరి 25వరకు జర్మనీలో జరిగిన 74వ బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో హీరో అల్లు అర్జున్ పాల్గొన్నారు. అక్కడ 'పుష్ప: ది రైజ్'ని ప్రదర్శించారు. అనంతరం అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''అన్నీ అనుకూలంగా ఉంటే 'పుష్ప' మూడో భాగం తీసే అవకాశాలున్నాయి. ఈ సినిమాను ఒక ఫ్రాంచైజీలా ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్నాం'' అన్నారు. ఇలా మూడో భాగంపై ఆయన ఓ స్పష్టత ఇచ్చారు. అయితే 'పుష్ప 2: ది రూల్' తర్వాత ఇటు అల్లు అర్జున్ అటు సుకుమార్ ఇతర ప్రాజెక్టులు చేశాక 'పుష్ప' మూడో భాగం చేస్తారని, ఇందుకు చాలా టైమ్ పట్టవచ్చని టాక్.

ఆర్య 3

అల్లు అర్జున్, సుకుమార్‌ల కాంబినేషన్‌లో వచ్చిన మొదటి చిత్రం 'ఆర్య' (2004) హిట్ అయింది. వారి కాంబినేషన్‌లో ఆ మూవీకి సీక్వెల్‌గా వచ్చిన 'ఆర్య 2' (2009) కూడా విజయం అందుకుంది. ఈ సినిమాకి మూడో భాగం కూడా రానుంది. ఓ సందర్భంలో సుకుమార్ మాట్లాడుతూ– ''ఆర్య 3' సినిమా ఉంటుంది... అయితే ఎప్పుడు సెట్స్‌కి వెళుతుందనేది చెప్పలేను'' అని పేర్కొన్నారు.

నాలుగింతల వినోదం

వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'ఎఫ్ 2– ఫన్ అండ్ ఫ్రస్టేషన్'. ఇందులో తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు నిర్మించిన ఈ సినిమా 2019 జనవరి 12న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. సేమ్ కాంబినేషన్‌లో ఈ మూవీకి సీక్వెల్‌గా రెండో భాగం 'ఎఫ్ 3'ని తెరకెక్కించారు. 2022 మే 27న రిలీజైన ఈ సినిమా కూడా ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తింది. 'ఎఫ్–3'కి కొనసాగింపుగా 'ఎఫ్– 4' ఉంటుందని మేకర్స్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ మూవీ ఎప్పుడు పట్టాలెక్కుతుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూశారు. కాగా వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మాతగా ఓ సినిమా ప్రకటన 'వెంకీఅనిల్ 03' (వర్కింగ్ టైటిల్) రావడంతో అందరూ 'ఎఫ్–4' అనుకున్నారు. అయితే ఇది 'ఎఫ్–4' కాదని చిత్రయూనిట్ స్పష్టత ఇచ్చింది. క్రైమ్ డ్రామాగా రూపొందుతోన్న 'వెంకీఅనిల్03' సినిమా 2025 సంక్రాంతికి విడుదల కానుంది. ఈ సినిమా తర్వాతే 'ఎఫ్ 4' సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ చిత్రంలో వెంకటేశ్, వరుణ్ తేజ్ పాటు మరో అగ్ర హీరో కూడా నటిస్తారని ఫిల్మ్‌నగర్ టాక్. 'ఎఫ్–2', 'ఎఫ్–3'తో పోలిస్తే 'ఎఫ్–4' లో వినోదం నాలుగింతలు ఉంటుందని మేకర్స్ ప్రకటించారు.

మూడో కేసు ఆరంభం

'హిట్: ది ఫస్ట్ కేస్' (2020), 'హిట్: ది సెకండ్ కేస్' (2022) వంటి చిత్రాల తర్వాత ఆ ఫ్రాంచైజీలో రూపొందుతున్న మూడో చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. 'హిట్' ఫ్రాంచైజీలో తొలి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలను 'హిట్: ది థర్డ్ కేస్'ని కూడా తెరకెక్కిస్తున్నారు. అయితే 'హిట్: ది ఫస్ట్ కేస్'లో విశ్వక్ సేన్ హీరోగా నటించగా, 'హిట్: ది సెకండ్ కేస్'లో అడివి శేష్ కథానాయకుడిగా నటించారు. తొలి రెండు భాగాలను వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించిన హీరో నాని 'హిట్: ది థర్డ్ కేస్'లో తానే లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రంలో ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నారు నాని. 2025 మే 1న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే 'హిట్' ఫ్రాంచైజీలో మొత్తం 7 భాగాలు ఉంటాయని శైలేష్ కొలను స్పష్టం చేశారు.

అడ్వెంచరస్ థ్రిల్లర్

హీరో నిఖిల్ సిద్ధార్థ్, దర్శకుడు చందు మొండేటిలది సూపర్ హిట్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో వచ్చిన తొలి చిత్రం 'కార్తికేయ' (2014) సూపర్ హిట్‌గా నిలవడంతో సెకండ్ పార్ట్ 'కార్తికేయ 2' సినిమాపై ఫుల్ క్రేజ్ నెలకొంది. 2022 ఆగస్టు 13న విడుదలైన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్ అయింది. రూ. వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో పాటు 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. 'కార్తికేయ, కార్తికేయ 2' సూపర్ హిట్స్ కావడంతో నిఖిల్, చందు కలయికలో రానున్న 'కార్తికేయ 3' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'కార్తికేయ 3' ఉంటుందంటూ ఈ ఏడాది మార్చి 16న సోషల్ మీడియా వేదికగా స్పష్టత ఇచ్చారు నిఖిల్. ''చందు మొండేటి అడ్వెంచరస్ థ్రిల్లర్ మూడవ ఫ్రాంచైజీ ('కార్తికేయ 3') సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌పై పని చేస్తున్నారు. స్పాన్, స్కేల్ పరంగా 'కార్తికేయ 3' చాలా పెద్దగా ఉండబోతోంది. డా. కార్తికేయ సరికొత్త సాహసం త్వరలోనే ప్రారంభం కానుంది'' అంటూ మేకర్స్ ప్రకటించారు. కాగా ప్రస్తుతం నిఖిల్ హీరోగా 'స్వయంభూ' సినిమా తెరకెక్కుతోంది. మరో వైపు నాగచైతన్య హీరోగా 'తండేల్' మూవీ తీస్తున్నారు చందు మొండేటి. అటు నిఖిల్ 'స్వయంభూ', ఇటు చందు 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' రెగ్యులర్ షూటింగ్ పట్టాలెక్కే అవకాశం ఉంది.



● సత్యం రాజేశ్ ● ఫరియా, శ్రీ సింహా, సత్య

నవ్వులు ట్రిబుల్

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' (2022) సినిమా ఎంతటి ఘనవిజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. విమల్ కృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నేహా శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాకి సీక్వెల్‌గా వచ్చిన రెండో భాగం 'టిల్లు స్క్వేర్' ఈ ఏడాది మార్చి 29న రిలీజై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ దాదాపు రూ. 125 కోట్ల వసూళ్లు సాధించి సిద్ధు కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ రెండు చిత్రాలకు కొనసాగింపుగా 'టిల్లు క్యూబ్' సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఓ ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ– ''టిల్లు పాత్రపై ప్రేక్షకులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. అందుకే 'టిల్లు క్యూబ్'లో టిల్లు పాత్రను సూపర్ హీరోగా చూపిద్దామనే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డకి జోడీగా పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లు ఫిల్మ్‌నగర్ టాక్. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మత్తు కొనసాగుతుంది

శ్రీ సింహా కోడూరి, నరేశ్ అగస్త్య, సత్య లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మత్తు వదలరా'. రితేష్ రానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2019లో విడుదలై, హిట్‌గా నిలిచింది. దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మత్తు వదలరా 2'. శ్రీ సింహా కోడూరి, ఫరియా అబ్దుల్లా, సత్య ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కూడా రితేష్ రానా దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. మొదటి, ద్వితీయ భాగాలు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. 'మత్తు వదలరా' ఫ్రాంచైజీలో 'మత్తు వదలరా 3' సినిమా కూడా ఉంటుందని ప్రకటించారు మేకర్స్. అటు ఇంటర్వ్యూలో, ఇటు సక్సెస్ మీట్‌లో పాల్గొన్న డైరెక్టర్ రితేష్ రానా 'మత్తు వదలరా 3' ఉంటుందని స్పష్టత ఇచ్చారు.

పొలిమేరలో ట్విస్టులు

'సత్యం' రాజేష్ కీలక పాత్రలో నటించిన 'పొలిమేర' (2021), 'మా ఊరి పొలిమేర 2' (2023) సినిమాలు హిట్‌గా నిలవడంతో 'పొలిమేర 3'కి శ్రీకారం చుట్టారు మేకర్స్. 'సత్యం' రాజేష్, బాలాదిత్య, కామాక్షీ భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, 'చిత్రం' శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పొలిమేర 3'. మొదటి రెండు భాగాలకి దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ మూడో భాగాన్ని కూడా తెరకెక్కిస్తున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మాత భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి ఈ మూవీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో చేతబడితో పాటు ప్రస్తుతం సమాజంలోని ఓ బర్నింగ్ ఇష్యూని టచ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. క్రేజీ థ్రిల్లర్‌గా రూపొందిన తొలి రెండు భాగాలతో పోలిస్తే 'పొలిమేర 3'లో ప్రేక్షకుల ఊహకందని ట్విస్టులు ఉంటాయని 'సత్యం' రాజేష్ తెలిపారు.

- దేరంగుల జగన్

వేసవిలో భారతీయుడు

కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇండియన్ 3' ('భారతీయుడు). కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'భారతీయుడు' సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లో తాజాగా వచ్చిన 'భారతీయుడు 2' సినిమా జూలై 12న విడుదలైంది. అయితే తొలి భాగం అందుకున్న విజయాన్ని మలి భాగం అందుకోలేకపోయింది. ఇదిలా ఉంటే రెండో భాగం సమయంలోనే 'భారతీయుడు 3' చిత్రీకరణ కూడా దాదాపు పూర్తి చేసిందట యూనిట్. 2025 వేసవిలో ఈ సినిమాని పాన్ ఇండియా రేంజ్‌లో రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

కేజీఎఫ్

యశ్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'కేజీఎఫ్: చాప్టర్ 1' (2018) సినిమా పాన్ ఇండియా హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ చివర్లో రెండో భాగం ఉంటుందని ముందే ప్రకటించింది యూనిట్. యశ్- ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లోనే వచ్చిన 'కేజీఎఫ్: చాప్టర్ 2' 2022లో విడుదలై భారీ వసూళ్లు రాబట్టింది. అయితే 'కేజీఎఫ్' ఫ్రాంచైజీలో 'కేజీఎఫ్: చాప్టర్ 3' కూడా ఉంటుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనుల్ని దాదాపు పూర్తి చేశారట ప్రశాంత్ నీల్. 'కేజీఎఫ్: చాప్టర్ 1', 'కేజీఎఫ్: చాప్టర్ 2' సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో 'కేజీఎఫ్: చాప్టర్ 3' పై కర్నాటకలోనే కాదు... పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్నాయి.



● సత్యదేవ్

క్రైమ్ ఎంటర్‌టైనర్

సత్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన మల్టీస్టారర్ మూవీ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ట్యాగ్‌లైన్. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిక్కినాటో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో నటుడు సత్యరాజ్ కీలక పాత్ర చేశారు. పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 31న విడుదల కానుంది. కాగా ఈ నెల 30న 'జీబ్రా' మూవీ గ్లింప్స్‌ని రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జీబ్రా'. ఇటీవల విడుదల చేసిన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఎస్. శ్రీలక్ష్మి రెడ్డి, కెమెరా: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్.

వేడుకలో ఉన్నది కాలం... వేదిక ఈ కల్యాణం...



● సుధీర్‌బాబు, సాయి చంద్

సుధీర్‌బాబు హీరోగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మా నాన్న సూపర్ హీరో'. ఈ చిత్రంలో ఆర్ణ హీరోయిన్‌గా నటించారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సీఏఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వీ సెల్యూలాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు నిర్మించారు. ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబరు 11న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి 'వేడుకలో ఉన్నది కాలం... వేదిక ఈ కల్యాణం... ఏడడుగుల మొదటి ప్రయాణం... జతగా ప్రారంభం..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శనివారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు సాహిత్యం రాయగా, ఐశ్వర్య దరూరి, బృందా, చైతు సత్సంగి, అఖిల్ చంద్ర పాడారు. జై క్రిష్ ఈ సినిమాకు సంగీతం అందించారు. సాయి చంద్, సాయాజీ షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని, అన్నీ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు కెమెరా: సమీర్ కల్యాణి.



● షాలినీ పాండే

ధనుష్ ఇడ్లీ కొట్టులో...?

ధనుష్ 'ఇడ్లీ కొట్టు'లో షాలినీ పాండే జాయిన్ కానున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ధనుష్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించనున్న సినిమా 'ఇడ్లీ కడై' (తెలుగులో 'ఇడ్లీ కొట్టు' అని అర్థం). ధనుష్ కెరీర్‌లోని ఈ 52వ సినిమాను డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిలింస్ పతాకాలపై ఆకాష్ భాస్కరన్ నిర్మించనున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రకు హీరోయిన్ షాలినీ పాండేని సంప్రదించారని, ఆమె కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. మరి... ధనుష్ 'ఇడ్లీ కడై'లో షాలినీ భాగం అవుతారా? లేదా అనే విషయంపై క్లారిటీ రావాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.



బిగ్ బాస్ కోపం... అభయ్‌కు శాపం

బిగ్ బాస్ హౌస్‌లోని మూడవ వారం మూడు క్యాబేజీ కుమ్ములాటలు, ఆరు బెలూన్ల బంతాటలతో వాడి వేడిగా నామినేషన్స్ కొనసాగాయి. కానీ ఈ వారం విచిత్రమేమిటంటే నామినేషన్స్‌తో సంబంధం లేకుండా అభయ్ అనే కంటెస్టెంట్ ఎలిమినేట్ అవ్వడం. అది ఎలా అయిందో చెప్పుకుందాం. బిగ్ బాస్... ఈ పేరు వినడమే కానీ ఈ కార్యక్రమం చరిత్రలో ఎవ్వరూ బిగ్ బాస్‌ని చూసి ఉండరు. కానీ బిగ్ బాస్ కంఠం ప్రపంచ ప్రేక్షకులకు సుపరిచితం. కేవలం కంఠంతోనే ఓ కార్యక్రమం నడిపిస్తున్న తీరు అద్భుతమనే చెప్పాలి. అలాగే ఆ కంఠానికి కూడా భావావేశాలున్నాయన్న విషయం ఈ వారం ఎపిసోడ్‌లో తేలింది. అదెలాగో చూద్దాం. హౌస్‌లో బిగ్ బాస్ పెట్టిన టాస్కుల వల్లనో లేకపోతే అవి ఫుడ్ కోసం పెట్టిన కారణాలో ఏమో కానీ అభయ్ అనే కంటెస్టెంట్ విపరీతమైన చిరాకు, కోపంతో సదరు బిగ్ బాస్‌నే మితిమీరిన మాటలతో దుర్భాషలాడాడు. అదే విషయం నాగార్జున వీడియోతో సహా వారాంతం కార్యక్రమంలో ప్రేక్షకులతో పాటు మిగతా కంటెస్టెంట్స్‌కి చూపించారు. ఆ వెంటనే నాగార్జున కోపంతో బిగ్ బాస్ రాజ్యంలోనే బిగ్ బాస్‌ని అంటావా అంటూ హౌస్ డోర్లు ఓపెన్ చేయించి తక్షణమే బయటకు వెళ్ళమన్నారు. కానీ అభయ్‌తో పాటు మిగతావారందరూ క్షమించి మరో అవకాశమివ్వని వేడుకొనగా నాగార్జున శాంతించి అప్పటికైతే అభయ్‌ని హౌస్‌లో ఉండనిచ్చారు. కానీ బిగ్ బాస్ మాత్రం లోపల రగిలిపోయి నామినేషన్స్‌లో ఉన్న అభయ్‌ని ఎలిమినేట్ చేయించాడు. దీనిని బట్టి బిగ్ బాస్ ప్రోగ్రాం చూస్తున్న ప్రేక్షకులు మరియు హౌస్‌లోని కంటెస్టెంట్స్ బిగ్ బాస్‌కి కూడా కోపమొస్తుందని కచ్చితంగా అనుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ నోరు అదుపులో ఉంటే ఊరు మంచిదవుతుందన్నట్టు ఎలిమినేట్ అయి, నాగార్జున దగ్గరకు వచ్చిన తరువాత గానీ తెలియలేదు సదరు అభయ్ అనే కంటెస్టెంట్‌కి. హౌస్‌లో కంటెస్టెంట్స్ అరుపులు, కేకలతో విరుచుకుపడతారు. మరి వాళ్లని కంట్రోల్ చేసే బిగ్ బాస్ ఎలిమినేట్ చేసి తన ప్రతీకారాన్ని తీర్చుకుంటాడు. ఇప్పటికైతే బిగ్ బాస్ కోపాన్ని చూశాం... ముందు ముందు ఎపిసోడ్లలో బిగ్ బాస్ నవరసాల్లో ఇంకెన్ని రసాలు పలికిస్తాడో చూడాలి.

- ఇంటూరు హరికృష్ణ



● రణ్‌బీర్ కపూర్ ● సూర్య

రణ్‌బీర్ వర్సెస్ సూర్య?

బాలీవుడ్ సక్సెస్‌ఫుల్ యాక్షన్ ఫ్రాంచైజీ 'ధూమ్' నుంచి 'ధూమ్ 4' రాబోతున్నట్లుగా కొన్ని రోజుల్నుంచి వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. 'ధూమ్ 4'లో హీరోలుగా నటిస్తారనే వారిలో ఇప్పటికే షారుక్ ఖాన్, ప్రభాస్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా రణ్‌బీర్ కపూర్ పేరు తెరపైకి వచ్చింది. 'ధూమ్' ఫ్రాంచైజీలోని ప్రతి భాగానికి కథ అందించి, నిర్మించిన ఆదిత్యా చోప్రా తాజాగా 'ధూమ్ 4' కథను కూడా రెడీ చేస్తున్నారని, ఈ సినిమా స్క్రిప్ట్ పూర్తిగానే నటీనటుల గురించిన వివరాలను ప్రకటిస్తారని బాలీవుడ్ సమాచారం. అయితే 'ధూమ్ 4' సినిమాలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తే బాగుంటుందని ఆదిత్యా చోప్రా అనుకుంటున్నారట. రణ్‌బీర్ కపూర్‌ను కలిసి ఆదిత్య మాట్లాడారని, ఈ హీరో కూడా 'ధూమ్ 4' పట్ల ఆసక్తిగా ఉన్నారని భోగట్టా. అంతే కాదు... ఈ సినిమాలో సూర్య విలన్‌గా నటిస్తారట. రణ్‌బీర్ కపూర్ కెరీర్‌లో 25వ చిత్రంగా రానున్న 'ధూమ్ 4'కు దర్శకత్వం వహించే వారిలో అయాన్ ముఖర్జీ, సిద్దార్థ్ ఆనంద్ వంటి వార్ల పేర్లు వినిపిస్తున్నాయి. ఇక శనివారం (సెప్టెంబరు 28) రణ్‌బీర్ బర్త్ డే. ఈ సందర్భంగా 'ధూమ్ 4' వార్తలు తెరపైకి వచ్చాయి. ప్రస్తుతం 'రామాయణ్' చిత్రంతో బిజీగా ఉన్న రణ్‌బీర్ త్వరలోనే 'లవ్ అండ్ వార్' చిత్రీకరణలో పాల్గొంటారు. ఆ తర్వాత 'యానిమల్' సీక్వెల్ 'యానిమల్ పార్క్' సెట్‌లోకి అడుగుపెడతారు. దీన్నిబట్టి 'ధూమ్ 4' గురించిన క్లారిటీ రావాలంటే మరింత టైమ్ పట్టేలా కనిపిస్తోంది.

బిజినెస్ రీల్

రూ.9,000 కోట్లతో టాటా మోటార్స్ ప్లాంట్



రాణిపేట్ (తమిళనాడు): వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ మరో ప్లాంటుకు శ్రీకారం చుట్టింది. తమిళనాడులోని రాణిపేట్ జిల్లా పనపక్కం వద్ద రూ.9,000 కోట్లతో ఈ కేంద్రాన్ని నెలకొల్పుతోంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చేతుల మీదుగా టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ సమక్షంలో ప్రతిపాదిత ప్లాంటుకు శంకుస్థాపన కార్యక్రమం శనివారం జరిగింది. టాటా మోటార్స్‌తోపాటు జాగ్వార్ ల్యాండ్ రోవర్ కార్లను ఇక్కడ ఉత్పత్తి చేస్తారు. దశలవారీగా 5–7 ఏళ్లలో ఏటా 2.5 లక్షల యూనిట్ల స్థాయికి ఈ కేంద్రం ఉత్పత్తి సామర్థ్యం చేరుకుంటుందని టాటా మోటార్స్ వెల్లడించింది. ఈ ఫెసిలిటీ ద్వారా 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించింది. భారత్‌తోపాటు విదేశాలకూ ఇక్కడ తయారైన వాహనాలను ఎగుమతి చేస్తారు. ఎలక్ట్రిక్, లగ్జరీ వాహనాలతోపాటు తదుపరితరం కార్లు, ఎస్‌యూవీల తయారీకి పనపక్కంను కేంద్రంగా తీర్చిదిద్దుతామని చంద్రశేఖరన్ ఈ సందర్భంగా తెలిపారు.

అపోలో మైక్రోసిస్టమ్స్‌కు కొత్త ఆర్డర్

ప్రచండ్ మ్యునిషన్ హార్డ్‌వేర్‌కు ఎంపిక



హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లలోని అపోలో మైక్రోసిస్టమ్స్ 'ప్రచండ్ మ్యునిషన్ హార్డ్‌వేర్ టీవోటీకి ఎంపికైనట్టు ప్రకటించింది. ప్రచండ్ మ్యునిషన్ హార్డ్‌వేర్ తయారీకి వీలుగా టెక్నాలజీ బదిలీకి డీఆర్‌డీవోకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్‌డీఈ) తమను ఎంపిక చేసినట్టు అపోలో మైక్రోసిస్టమ్స్ తెలిపింది. ఈ ఉత్పత్తికి భారీ మార్కెట్ అవకాశాలున్నాయని, పెద్ద మొత్తంలో తయారీకి సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది. మరోవైపు ఎలక్ట్రానిక్స్ మాడ్యూళ్ల సరఫరా నిమిత్తం రెలియబుల్ టెక్నోసిస్టమ్స్ ఇండియా నుంచి రూ.5.72 కోట్ల విలువైన ఆర్డర్ అందుకున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇటీవలి కాలంలో అపోలో మైక్రోసిస్టమ్స్ రక్షణ రంగ సంస్థల నుంచి పలు కీలక ఆర్డర్లు గెలుచుకోవడం గమనార్హం.

స్పామ్ కాల్స్‌కు బీఎస్ఎన్ఎల్ చెక్!

అక్టోబర్ నుంచి టెక్నాలజీ అందుబాటులోకి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్పామ్ కాల్స్ కట్టడికి ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/మెషీన్ లెర్నింగ్ ఆధారిత సాంకేతికతను త్వరలో వినియోగించనుంది. 'ఈ టెక్నాలజీ తుది దశలో ఉంది. స్పామ్‌లు మిమ్మల్ని చేరుకోవడానికి ముందే వాటిని గుర్తించి, తటస్థీకరించి, తొలగించడానికి ఇది రూపొందింది' అని ఎక్స్ వేదికగా బీఎస్ఎన్ఎల్ ట్వీట్ చేసింది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అక్టోబర్ 15–18 మధ్య జరిగే ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ఈ పరిష్కారాన్ని బీఎస్ఎన్ఎల్ పరిచయం చేయనుంది. స్పామ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లను నిలువరించే టెక్నాలజీని ఈ నెల 25న ఎయిర్‌టెల్ ప్రకటించిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. అయాచిత వాణిజ్య సమాచార మార్పిడి యొక్క పెరుగుతున్న ముప్పును అరికట్టడానికి టెల్కోలు కఠిన చర్యలు తీసుకోవాలని టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

సంక్షోభంలో వజ్రాల పరిశ్రమ

- మూతపడుతున్న పరిశ్రమలు
- ఉపాధి కోల్పోతున్న పరిస్థితులు
- తక్షణ చర్యలు అవసరమన్న జీటీఆర్ఐ



న్యూఢిల్లీ: దేశ వజ్రాల పరిశ్రమ తీవ్ర సంక్షోభంతో కుదేలవుతోందని, పరిశ్రమలు మూత పడుతుండడంతో ఎంతో మంది ఉపాధి కల్పోతున్న పరిస్థితులు నెలకొన్నాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అనే స్వతంత్ర సంస్థ వెల్లడించింది. ఆర్డర్లు తగ్గడంతో ముడి వజ్రాల నిల్వలు పెరుగుతున్నాయని, ల్యాబ్‌లో తయారైన వజ్రాల నుంచి పోటీ ఎక్కువగా ఉందని వివరించింది. ''ఈ పరిస్థితులు రుణ ఎగవేతలు, పరిశ్రమల మూతకు, ఉపాధి నష్టానికి కారణమవుతోంది. గుజరాత్ వజ్రాల పరిశ్రమకు చెందిన 60 మంది ఇప్పటి వరకు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇది దేశ వజ్రాల పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను తెలియజేస్తోంది''అని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, అప్పుడే ఈ పరిశ్రమ భవిష్యత్‌కు రక్షణ కల్పించినట్టు అవుతుందన్నారు.

ఎగుమతుల్లో క్షీణత..

జీటీఆర్ఐ నివేదిక ప్రకారం 2021–22లో ముడి వజ్రాల దిగుమతులు 18.5 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023–24 నాటికి 25 శాతం మేర క్షీణించి 14 బిలియన్ డాలర్లకు తగ్గిపోయాయి. ఇక్కడి నుంచి చేసిన ముడి వజ్రాల ఎగుమతులను సర్దుబాటు చేసి చూస్తే, నికర దిగుమతులు 25 శాతం తగ్గి 17.5 బిలియన్ డాలర్ల నుంచి 13.1 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కట్, పాలిష్డ్ వజ్రాల ఎగుమతులు 35 శాతం మేర తగ్గాయి. 2021–22లో 24.4 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023–24లో 13.1 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. పైగా ఇదే కాలంలో విక్రయం కాని వజ్రాలను భారత్‌కు తిప్పిపండం అన్నది 35 శాతం నుంచి 45.6 శాతానికి పెరిగింది. నికర కట్, పాలిష్డ్ వజ్రాల ఎగుమతులు 45 శాతం మేర తగ్గి 15.9 బిలియన్ డాలర్ల నుంచి 8.7 బిలియన్ డాలర్లకు తగ్గిపోయినట్టు జీటీఆర్ఐ నివేదిక వివరించింది. నికర ముడి వజ్రాల దిగుమతులు, నికర కట్, పాలిష్ పట్టిన వజ్రాల ఎగుమతుల మధ్య అంతరం 2021–22లో 1.6 బిలియన్ డాలర్లు ఉంటే, 2024 మార్చి నాటికి 4.4 బిలియన్ డాలర్లకు పెరిగిపోయినట్టు తెలిపింది. ముడి వజ్రాలను దిగుమతి చేసుకుని, ఇక్కడి పరిశ్రమలు కట్, పాలిష్డ్ రూపంలో, ఆభరణాల రూపంలో విదేశాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటాయి.

సవాళ్లకు ఎన్నో కారణాలు..

నియంత్రణపరమైన అంశాలకుతోడు, పరిశ్రమలో అంతర్గతంగా ఉన్న సామర్థ్యాల లేమి ప్రస్తుత సవాళ్లకు కారణమని జీటీఆర్ఐ వివరించింది. యూఎస్, చైనా, యూరప్‌లో ఆర్థిక అనిశ్చితులు, ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు లగ్జరీ ఉత్పత్తులపై వినియోగం తగ్గేందుకు దారితీసినట్టు తెలిపింది. ''అంతర్జాతీయంగా వజ్రాల ధరల్లో అస్థిరతలు అనిశ్చితికి కారణమయ్యాయి. ధరలు మరింత తగ్గుతాయన్న అంచనాతో పరిశ్రమలు ముడి వజ్రాల కొనుగోలుకు దూరంగా ఉన్నాయి''అని ఈ నివేదిక తెలిపింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం సైతం అంతర్జాతీయంగా వజ్రాల సరఫరా వ్యవస్థలో అవరోధాలకు దారితీసినట్టు శ్రీవాస్తవ తెలిపారు. తక్కువ ధరలకు వచ్చే ల్యాబ్ వజ్రాలవైపు కస్టమర్లు మొగ్గు చూపిస్తుండడం సహజ వజ్రాల డిమాండ్‌ను ప్రభావం చేస్తున్నట్టు చెప్పారు. పెరిగిపోతున్న కార్మిక, ఇంధన, మెటీరియల్స్ వ్యయాలతో చాలా యూనిట్లు మనుగడ సాగించలేని పరిస్థితులు నెలకొన్నట్టు వివరించారు. ఇదే పరిశ్రమల మూతకు దారితీస్తున్నట్టు పేర్కొన్నారు. ఎగుమతులకు సంబంధించి రుణ సాయం, విదేశీ ముడి వజ్రాల విక్రేతలకు కార్పొరేట్ పన్ను నుంచి మినహాయించడం, ల్యాబ్ వజ్రాల పరిశ్రమను నియంత్రించడం, దుబాయి నుంచి కట్, పాలిష్డ్ వజ్రాల దిగుమతులపై సున్నా టారిఫ్ వంటి చర్యలను పరిశీలించాలని ప్రభుత్వానికి జీటీఆర్ఐ సూచించింది.

వజ్రాల పరిశ్రమకు గడ్డుకాలం

దశాబ్ద కనిష్టానికి ఆదాయం: క్రిసిల్

దేశ వజ్రాల పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోందని ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ రేటింగ్స్ సైతం తెలిపింది. వజ్రాల పాలిషింగ్ పరిశ్రమ ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24)లో 25–27 శాతం మేర క్షీణించి, దశాబ్ద కనిష్ట స్థాయి అయిన 12 బిలియన్ డాలర్లకు పరిమితం అవుతుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. కీలక ఎగుమతి మార్కెట్లు అయిన యూఎస్, చైనాలో డిమాండ్ తక్కువగా ఉండడం, వినియోగదారులు ల్యాబ్ తయారీ వజ్రాల వైపు మొగ్గు చూపడాన్ని కారణాలుగా ప్రస్తావించింది. దీంతో వజ్రాల సరఫరా పెరిగి ధరలు 10–15 శాతం వరకు తగ్గినట్టు తెలిపింది. ఈ మేరకు పరిశ్రమపై ఒక నివేదికను తాజాగా విడుదల చేసింది. సహజ వజ్రాలను సానబట్టే పరిశ్రమ ఆదాయం తగ్గడం వరుసగా ఇది మూడో ఆర్థిక సంవత్సరం అవుతుందని పేర్కొంది. 2023–24లోనూ 29 శాతం, 2022–23లో 9 శాతం చొప్పున ఆదాయం క్షీణించినట్టు తెలిపింది. తాజా పరిణామాల నేపథ్యంలో వజ్రాల పాలిషర్లు ముడి వజ్రాల కొనుగోళ్లను తగ్గించినట్టు, దీంతో వజ్రాల మైనింగ్ సంస్థలు ఉత్పత్తిని తగ్గించుకున్నట్టు వివరించింది. ఇది ధరల పతనాన్ని కొంత వరకు అడ్డుకున్నట్టు పేర్కొంది. పరిశ్రమ ఆపరేటింగ్ మార్జిన్లు 2024–25లో 4.5–4.7 శాతం మధ్య స్థిరపడొచ్చని తెలిపింది. మొత్తం మీద మూలధన అవసరాలు తగ్గడంతో రుణాలపై ఆధారపడడం తగ్గుతుందని, ఇది కంపెనీల రుణ పరపతికి మద్దతుగా నిలుస్తుందని అంచనా వేసింది.

ఫ్యూచర్ లైఫ్‌స్టైల్‌కు పరిష్కారం!

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా స్పేస్ మంత్ర, సందీప్ గుప్తా, షాలినీ గుప్తా కన్సార్షియం నుండి దాఖలైన బిడ్‌ను ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ లిమిటెడ్ రుణదాతలు ఆమోదించారు. కన్సార్షియం సమర్పించిన రిజొల్యూషన్ ప్లాన్‌కు ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ లిమిటెడ్ యొక్క కమిటీ ఆఫ్ క్రెడిటార్స్ అనుకూలంగా ఓటు వేసింది. అయితే రుణదాతలు ఆమోదించిన ప్రణాళిక వివరాలను కంపెనీ వెల్లడించలేదు. ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ కోసం కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ వ్యవధి 2024 ఆగస్ట్ 26తో ముగిసిందని తెలిపింది. ప్రాసెస్ వ్యవధిని పొడిగించాలని కోరుతూ 2024 ఆగస్టు 24న నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో రిజొల్యూషన్ ప్రొఫెషనల్ దరఖాస్తు చేశారు. కాగా, మల్టీ బ్రాండ్ రిటైల్ చైన్స్ అయిన సెంట్రల్, బ్రాండ్ ఫ్యాక్టరీని గతంలో ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ నిర్వహించింది. లీ కూపర్, ఛాంపియన్, ఆల్, ఇండిగో నేషన్, జియోవానీ, జాన్ మిల్లర్, స్కల్లర్స్, కన్వర్స్, అర్బానా వంటి బ్రాండ్ల ఔట్‌లెట్స్ సైతం ఏర్పాటు చేసింది. 22.51 శాతం ఓటింగ్ షేర్‌తో ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ యొక్క కమిటీ ఆఫ్ క్రెడిటార్స్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుంది. ఎస్‌బీఐకి ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ రూ.476.59 కోట్లు బాకీ ఉంది. 12 రుణ సంస్థలకు మొత్తం రూ.2,155.53 కోట్ల క్లెయిమ్స్ ఉన్నాయని ఫ్యూచర్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ 2023 జూన్‌లో వెల్లడించింది.



ఏఐ గ్లోబల్ మార్కెట్ @ 990 బిలియన్ డాలర్లు

- ఏటా 40–55 శాతం వృద్ధి రేటు
- 2027 నాటికి అంచనాలు
- బెయిన్ అండ్ కంపెనీ నివేదిక


న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్ల పాటు అంతర్జాతీయంగా కృత్రిమ మేధ (ఏఐ) ఉత్పత్తులు, సర్వీసుల మార్కెట్ ఏటా 40–55% మేర వృద్ధి చెందనుంది. 2027 నాటికి 780 బిలియన్ డాలర్లు–990 బిలియన్ డాలర్ల స్థాయి వరకు చేరే అవకాశం ఉంది. ఈ క్రమంలో సరఫరా, డిమాండ్‌పరమైన సమస్యల వల్ల ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ దీర్ఘకాలికంగా ఏఐ మార్కెట్ వృద్ధి పటిష్టంగానే ఉండనుంది. బెయిన్ అండ్ కంపెనీ విడుదల చేసిన 5వ వార్షిక గ్లోబల్ టెక్నాలజీ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఏఐకి విస్తృతంగా కంప్యూటింగ్ సామర్థ్యాలు అవసరమవుతాయి కాబట్టి వచ్చే ఐదు నుంచి పదేళ్లలో డేటా సెంటర్ల స్థాయి కూడా భారీగా పెరగనుంది. ప్రస్తుతమున్న 50–200 మెగావాట్ల సామర్థ్యం నుంచి గిగావాట్ స్థాయికి డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతుందని నివేదిక వివరించింది. ప్రస్తుతం భారీ డేటా సెంటర్ల వ్యయం 1 బిలియన్ డాలర్ల నుంచి 4 బిలియన్ డాలర్ల వరకు ఉండగా ఏఐ కారణంగా అయిదేళ్ల తర్వాత ఇది 10 బిలియన్ డాలర్ల నుంచి 25 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని పేర్కొంది. అలాగే గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కి (జీపీయూ) సైతం డిమాండ్ 30 శాతానికి పైగా పెరుగుతుందని వివరించింది.



సెమీకండక్టర్లకు కొరత: ఈ పరిణామాలన్నింటి వల్ల సెమీకండక్టర్లకు కొరత ఏర్పడవచ్చని నివేదిక తెలిపింది. ఒకవేళ జీపీయూలకు డిమాండ్ రెట్టింపైతే కీలక విడిభాగాలు సరఫరా చేసే సంస్థలు ఉత్పత్తిని రెట్టింపు చేస్తే సరిపోవచ్చు, కానీ సెమీకండక్టర్ల తయారీ సంస్థలు మాత్రం ఉత్పత్తి సామర్థ్యాలను మూడింతలు పెంచుకోవాల్సి వస్తుందని వివరించింది. భారీగా వృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ కారణంగా టెక్నాలజీ రంగంలో గణనీయంగా మార్పులు వస్తాయని పేర్కొంది. చిన్న స్థాయి క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు, సాఫ్ట్‌వేర్ వెండార్లు తదితర విభాగాల్లోనూ కొత్త ఆవిష్కరణలు వచ్చే అవకాశం ఉందని నివేదిక తెలిపింది. ఏఐని వినియోగించుకోవడం, డేటా ఆధునీకరణ కోసం కస్టమర్లకు అంతగా అవసరమైన నైపుణ్యాలు, అనుభవం లేనందున మధ్యకాలికంగా టెక్ సర్వీసులకు డిమాండ్ భారీగా ఉంటుందని పేర్కొంది. అయితే, క్రమంగా చాలా మటుకు టెక్ సర్వీసుల స్థానాన్ని సాఫ్ట్‌వేర్ భర్తీ చేస్తుందని వివరించింది.

ఈవీలపై పెరుగుతున్న ఆసక్తి!

2030 నాటికి గణనీయంగా ఆమోదయోగ్యత ● సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వంటి కొత్త ఇంధన వాహనాలపై (ఎన్ఈవీ) క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. 2030 నాటికి వాటికి గణనీయంగా ఆమోదయోగ్యత పెరగనుందని ఒక సర్వే నివేదికలో వెల్లడైంది. అర్బన్ సైన్స్ సంస్థ తరపున ది హ్యారిస్ పోల్ నిర్వహించిన ఈ సర్వే ప్రకారం అప్పటికి, పెట్రోల్/డీజిల్ వాహనాల ధరతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలపై 49 శాతం వరకు అధికంగా చెల్లించేందుకు కొనుగోలుదారులు సిద్ధంగా ఉంటారని తేలింది. సర్వేలో పాల్గొన్న 1,000 మందిలో 83 శాతం మంది ఈ దశాబ్దం ఆఖరునాటికి ఎన్ఈవీని కొనుగోలు చేసే అంశం పరిశీలిస్తామని తెలిపారు. భారత్ సహా అమెరికా, ఆస్ట్రేలియా, చైనా, జర్మనీవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించారు. ఇందులో భారత్‌కి సంబంధించిన విశేషాలు చూస్తే..

- ప్రధాన నగరాలు, వర్ధమాన ద్వితీయ శ్రేణి పట్టణాల్లో చెప్పుకోతగ్గ స్థాయిలో పబ్లిక్ ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్ వేగవంతంగా విస్తరిస్తుండటంతో ఎన్ఈవీలపై భారత్‌లో సానుకూల అభిప్రాయం నెలకొంది. ప్రస్తుతం ప్రధాన నగరాలు, హైవేల వెంబడి 6,000 పైచిలుకు చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. 2027 నాటికి ఈ సంఖ్య ఒక లక్షకు పైగా పెరగనుంది.
- ఈవీ సెగ్మెంట్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రియాశీలక విధానాలు అమలు చేస్తుండటం కూడా ఎలక్ట్రిక్ వాహనాలపై సానుకూలతకు దోహదపడుతోంది.
- ఈ విభాగంలో చైనా స్థాయిలో భారత్ కూడా అధునాతన టెక్నాలజీ, ఉత్పత్తి సామర్థ్యాలను సాధించాలి. అవకాశాలు భారీగా ఉన్నప్పటికీ, చైనా ఆధిపత్యం కారణంగా భారత్‌లో ఈవీల తయారీకి సవాళ్లు ఉంటున్నాయి. ఈవీలకు కీలకమైన లిథియం అయాన్ బ్యాటరీలు .. ఎలక్ట్రిక్ మోటర్లను ఉత్పత్తి చేయడంలోనూ, చార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటు విషయంలోనూ చైనా అధిపత్యం కనిపిస్తోంది. ఈ విభాగాల్లో నైపుణ్యాలు సాధించకుండా ముందుకెళ్లడంలో భారత్ కష్టపడాల్సి రావచ్చు.
- భారత్‌లో ఈవీ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో, ఎలక్ట్రిక్ కార్లను మరింత చౌకగా అందరికీ అందుబాటులోకి తేవడంలో చైనా కంపెనీలతో కలిసి పనిచేయడం కీలకంగా ఉండవచ్చు. చైనా అనుభవాల నుంచి నేర్చుకుని, భారత్ మరింత వేగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మళ్లవచ్చు.

చార్జీలు విధిస్తే .. వాడటం ఆపేస్తాం..

యూపీఐపై లోకల్‌సర్కిల్స్ సర్వేలో మెజారిటీ యూజర్లు వెల్లడి



న్యూఢిల్లీ: చెల్లింపు లావాదేవీలకు యూపీఐని గణనీయంగా వాడుతున్నప్పటికీ చార్జీలు గానీ విధిస్తే మాత్రం దాన్ని వినియోగించడం ఆపేయాలని చాలా మంది భావిస్తున్నారు. లోకల్‌సర్కిల్స్ సర్వేలో పాల్గొన్న వారిలో 75 శాతం మంది యూజర్లు తమ అభిప్రాయం వెల్లడించారు. కేవలం 22% మందే ఫీజును చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. సర్వే ప్రకారం 38% మంది యూజర్లు తమ చెల్లింపుల్లో 50% లావాదేవీల కోసం డెబిట్, క్రెడిట్ లేదా ఇతరత్రా డిజిటల్ విధానాలు కాకుండా యూపీఐనే ఉపయోగిస్తున్నారు. జూలై 15 నుంచి సెప్టెంబర్ 20 మధ్య నిర్వహించిన సర్వేలో వేసిన ప్రశ్నలకు 308 జిల్లాల నుంచి 42,000 సమాధానాలు వచ్చాయి. యూపీఐ లావాదేవీలపై చార్జీల అంశంపై 15,598 సమాధానాలు వచ్చాయి. మర్చంట్ డిస్కౌంట్ రేట్లను వి.దించే ముందు ఈ అంశాలన్నింటినీ కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకునేలా, ఈ సర్వే వివరాలను వాటి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు లోకల్ సర్కిల్స్ తెలిపింది. ఎన్‌పీసీఐ లెక్కల ప్రకారం 2023–24లో యూపీఐ లావాదేవీలు 57% పెరిగాయి. తొలిసారిగా 100 బిలియన్ల దాటి 131 బిలియన్లకు చేరాయి. విలువపరంగా చూస్తే 44% ఎగిసి రూ. 199.89 లక్షల కోట్లకు చేరాయి.



91 శాతం ఎఫ్అండ్‌వో ట్రేడర్లకు నష్టాలే

- ఒక్కో ఇన్వెస్టర్ వంతు రూ.1.2 లక్షలు
- మూడేళ్లలో రూ.1.8 లక్షల కోట్లు ఆవిరి
- 2023–24లోనే రూ.75,000 కోట్ల నష్టం
- సెబీ అధ్యయనంలో విస్తుపోయే నిజాలు

న్యూఢిల్లీ: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) విభాగంలో 91 శాతం ట్రేడర్లు గత ఆర్థిక సంవత్సరంలో నష్టపోయినట్టు సెబీ తాజా అధ్యయనం స్పష్టం చేసింది. 73 లక్షల వ్యక్తిగత ట్రేడర్లు.. ఒక్కొక్కరు సగటున రూ.1.2 లక్షల చొప్పున 2023–24లో మొత్తం రూ.75,000 కోట్ల మేర నష్టపోయారు. ఈ వివరాలను సెబీ తాజాగా విడుదల చేసింది. అంతేకాదు 2021–22 నుంచి 2023–24 వరకు వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లో కోటి మందికి పైగా (93 శాతం) వ్యక్తిగత ట్రేడర్లు నికరంగా నష్టపోవడమే కానీ, వెనకేసింది ఏమీ లేదని స్పష్టమవుతోంది. లావాదేవీల చార్జీలతో కలిపి ఒక్కో ఇన్వెస్టర్ సగటున రూ.2 లక్షల మేర కోల్పోయారు. వీరంతా కలసి గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో కోల్పోయిన మొత్తం రూ.1.8 లక్షల కోట్లు కావడం గమనార్హం. రాబడుల కాంక్షతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులపై అధిక రిస్క్ తీసుకుంటున్నట్టు ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయి.

తగ్గేదే లేదు..!

2023–24లో నష్టపోయిన ట్రేడర్లలో అగ్రభాగాన ఉన్న 3.5 శాతం మంది (4 లక్షల మంది) లావాదేవీలను గమనిస్తే.. ఒక్కొక్కరు సగటున రూ.28 లక్షల మేర కోల్పోయినట్టు తెలుస్తోంది.

లక్కీ ట్రేడర్లు

2021–22 నుంచి 2023–24 వరకు మూడు ఆర్థిక సంవత్సరాల్లో 7.2 శాతం మేర ఎఫ్అండ్‌వో ట్రేడర్లు నికరంగా లాభాలు ఆర్జించారు. లావాదేవీల చార్జీలను సర్దుబాటు చేసి చూస్తే.. రూ.లక్షపైన లాభం సంపాదించిన వారు ఒక శాతం మించి లేరు. రిటైల్ ట్రేడర్లు రెండేళ్ల కాలంలో రెట్టింపై 2024 మార్చి నాటికి 96 లక్షలకు చేరారు. 2022 మార్చి నాటికి వీరి సంఖ్య 51 లక్షలుగా ఉంది. 2023–24లో ఎఫ్అండ్‌వో టర్నోవర్‌లో వీరి వాటా 30 శాతంగా ఉంది. ఈక్విటీ ఎఫ్అండ్‌వోలో మొత్తం ట్రేడర్లలో 99.8 శాతం మంది రిటైల్ ట్రేడర్లే ఉన్నారు.

వీరికి లాభాలు..

ఎఫ్అండ్‌వోలో రిటైల్ ఇన్వెస్టర్లు నష్టపోతుంటే.. మరోవైపు ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు), ప్రొప్రయిటరీ ట్రేడర్లు (సంస్థలు) లాభపడుతున్నారు. 2023–24లో ప్రొప్రయిటరీ ట్రేడర్లు రూ.33,000 కోట్ల మేర ఎఫ్అండ్‌వో లాభాలను మూటగట్టుకున్నారు. వీరి తర్వాత ఎఫ్‌పీఐలకు రూ.28,000 కోట్ల లాభాలు వచ్చాయి. అదే ఏడాది వ్యక్తిగత ట్రేడర్లు రూ.61,000 కోట్లు (లావాదేవీల చార్జీలు కలపకుండా) నష్టపోయారు.

ఇతర అంశాలు..

- → 75 శాతానికి పైగా వ్యక్తిగత ట్రేడర్లు తమ వార్షిక ఆదాయం రూ.5లక్షల్లోపు ఉన్నట్టు ప్రకటించారు. 2022 మార్చి నాటికి ఈ ఆదాయం పరిధిలోని ట్రేడర్లు 71 శాతంగా ఉంటే, 2024 మార్చి నాటికి 76 శాతానికి పెరిగారు.
- → ఎఫ్అండ్‌వో ట్రేడింగ్‌లో మహిళా ట్రేడర్ల భాగస్వామ్యం 2022 మార్చి నాటికి ఉన్న 14.9 శాతం నుంచి 2024 మార్చి నాటికి 13.7 శాతానికి తగ్గారు.
- → 2023–24లో 91.9 శాతం పురుష ట్రేడర్లు నష్టపోగా, మహిళా ట్రేడర్లలో 86.3 శాతమే నష్టాలు ఎదుర్కొన్నారు.

ఇన్వెస్టర్లకు అవగాహన అవసరం..

ఎఫ్అండ్‌వో ట్రేడింగ్ కార్యకలాపాలు గణనీయంగా పెరిగిపోవడం ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై తగిన పరిజ్ఞానం, రిస్క్ నిర్వహణ విధానాలపై అవగాహన అవసరాన్ని తెలియజేస్తున్నట్టు సెబీ పేర్కొంది. అధునాతన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లతోపాటు, లావాదేవీల చార్జీలు తక్కువగా ఉండడంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఆప్షన్లు, ఫ్యూచర్ కాంట్రాక్టుల్లో చురుగ్గా పాల్గొంటున్నట్టు, ఇది మార్కెట్ లిక్విడిటీని పెంచుతున్నట్టు తెలిపింది.

బ్యాంకులకు డిపాజిట్ల కష్టాలు

- 80 శాతానికి చేరిన సీడీ రేషియో
- ప్రత్యామ్నాయాల వైపు యువతరం
- ఇన్ఫోమెరిక్స్ రేటింగ్స్ వెల్లడి

న్యూఢిల్లీ: గడిచిన రెండు సంవత్సరాల్లో పెరిగిన రుణ డిమాండ్ స్థాయిలో డిపాజిట్ల సమీకరణకు బ్యాంక్‌లు సమస్యలు ఎదుర్కొన్నట్టు ఇన్ఫోమెరిక్స్ రేటింగ్స్ తెలిపింది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్‌లు 2023–24లో జారీ చేసిన రుణాలు రూ.1,64,98,006కోట్లుగా ఉన్నాయి. క్రెడిట్ టు డిపాజిట్ రేషియో (సీడీ రేషియో) ఈ కాలంలో 75.8 శాతం నుంచి 80.3 శాతానికి పెరిగింది. త్రైమాసికం వారీగా చూసిన కానీ షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల డిపాజిట్ల కంటే రుణాల వృద్ధి ఎక్కువగా ఉన్నట్టు ఇన్ఫోమెరిక్స్ నివేదిక తెలిపింది. 2018–19 నుంచి 2023–24 మధ్య కాలంలోనూ డిపాజిట్ల కంటే రుణాల వృద్ధి ఎక్కువగా ఉన్నట్టు వెల్లడించింది. ప్రత్యామ్నాయ పెట్టుబడుల సాధనాలు, అసంఘటిత రంగంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నగదు ఎక్కువగా ఉండడం డిపాజిట్ల సమీకరణపై ప్రభావం చూపించినట్టు ఈ నివేదిక తెలిపింది. 30 ఏళ్లలోపు ఇన్వెస్టర్ల సంఖ్య 2018–19 నాటికి 22.6 శాతంగా ఉంటే, 2025 జూలై నాటికి 39.9 శాతానికి పెరగడాన్ని ప్రస్తావించింది. యువ ఇన్వెస్టర్లలో ఈక్విటీ మార్కెట్ల పట్ల పెరిగిన ఆసక్తిని ఈ ధోరణి తెలియజేస్తున్నట్టు పేర్కొంది. ఇదే కాలంలో 30–39 వయసులోని ఇన్వెస్టర్ల బేస్ (సంఖ్య) స్థిరంగానే ఉన్నట్టు తెలిపింది.



సంయుక్త కృషి అవసరం: డిపాజిట్ల నిష్పత్తి పెరగాలంటే బ్యాంక్‌లు, ప్రభుత్వం ఉమ్మడిగా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ట్రూనార్త్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో రోచక్ బక్షి అభిప్రాయపడ్డారు. సాధారణ ప్రజల నుంచి చిన్న మొత్తాల్లో డిపాజిట్లు సమీకరించే వెనుకటి ధోరణి నుంచి బయటకు రావాలని.. పెద్ద మొత్తంలో కార్పొరేట్ డిపాజిట్లను ఆకర్షించడంపై దృష్టి సారించాలని సూచించారు. బ్యాంక్ టర్మ్ డిపాజిట్లలో 47 శాతం 60 ఏళ్లు నిండిన వృద్ధులవే ఉన్నట్టు, యువతరం బ్యాంక్ డిపాజిట్ల పట్ల ఆసక్తి చూపించడం లేదన్న దానికి నిదర్శనమని చెప్పారు. కనీసం ఆదాయపన్ను అధిక శ్లాబులోని వారికి అయినా బ్యాంక్ డిపాజిట్ల వడ్డీపై పన్ను భారాన్ని తగ్గించాలని బక్షి సూచించారు. ఏటా వడ్డీపై టీడీఎస్ మినహాయించడం కాకుండా, డిపాజిట్ కాల వ్యవధి ముగిసిన సమయంలోనే పన్నును పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-9-2024	
విశాఖ	535–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	535–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

సాక్షి ప్లస్
ఆదివారం। 29-9-2024

సినెర్ మెడకు 'వాడా' ఉచ్చు



- చిక్కుల్లో ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్
- ఇటలీ స్టార్‌పై నిషేధం విధించాలన్న ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ
- సీఏఎస్‌లో అప్పీలు చేసిన 'వాడా'

హతవిధి... సినెర్‌ను అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) కరుణించినా... డోపింగ్ మరక మాత్రం నీడలా వెంటాడుతోంది. మార్చిలో దొరికినా... ఆగస్టు దాకా గోప్యంగా ఉంచేందుకు జాగ్రత్త పడినా... ఒక్క విన్నపంతో ఆశ్చర్యకరంగా నిషేధం బారిన పడకపోయినా... ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) డేగకన్ను నుంచి తప్పించుకోలేకపోయాడు. దీంతో ఈ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది.

రోమ్: ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ యానిక్ సినెర్‌ను పాత వివాదం కొత్తగా చుట్టుకుంటోంది. డోపింగ్‌లో దొరికిపోయినా కనీసం ప్రొవిజనల్ సస్పెన్షన్ (తాత్కాలిక నిషేధం), తదుపరి సస్పెన్షన్ నుంచి తప్పించుకున్న ఈ ఇటలీ స్టార్ ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) కన్నుగప్పలేకపోయాడు. నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు రెండుసార్లు పరీక్షల్లో తేలినా నిషేధం విధించకపోవడం ఏంటని 'వాడా' రంగంలోకి దిగింది. తాజా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ చాంపియన్‌ను ఒకటి లేదా రెండేళ్ల పాటు నిషేధించాల్సిందేనని 'వాడా' కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తలుపు తట్టింది. ఈ మేరకు స్విట్జర్లాండ్‌లోని సీఏఎస్‌లో 'వాడా' అప్పీలు చేసింది. నిజానికి 23 ఏళ్ల సినెర్ దోషిగా తేలాడు. తాజా అప్పీలుపై జరిగే విచారణలో సీఏఎస్ సస్పెన్షన్‌కు గురైతే మాత్రం యూఎస్ ఓపెన్ టైటిల్‌ను కోల్పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం బీజింగ్‌లో చైనా ఓపెన్ ఆడుతున్న సినెర్... 'వాడా' అప్పీలుకు వెళ్లడంపై విచారం వ్యక్తం చేశాడు. 'ఇది నన్ను చాలా నిరాశపరుస్తోంది. అంతేకాదు ఆశ్చర్యానికి గురయ్యేలా చేస్తోంది. నిజాయితీగా చెబుతున్నా... నేను ఇదివరకే మూడు విచారణలకు హాజరయ్యా. అన్నింటిలోనూ నాకు అనుకూలంగానే తీర్పు వచ్చింది. 'వాడా' అప్పీలును నేను ఊహించలేదు. దీని గురించి నాకు రెండు రోజుల క్రితమే తెలిసింది' అని సినెర్ అన్నాడు. మరోవైపు 'వాడా' అధికారి ఒకరు మాట్లాడుతూ ఇందులో ఎలాంటి తప్పు జరగలేదని, నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించలేదని తెలుసుకోవడం 'వాడా' లక్ష్యమని అన్నాడు.

అప్పుడేం జరిగింది?

ఈ ఏడాది మార్చిలో ఇండియన్ వెల్స్ టోర్నీ జరిగింది. ఆ సమయంలో, టోర్నీ ముగిశాక... ఈ రెండు సందర్భాల్లోనూ సినెర్ ఇచ్చిన శాంపిల్స్‌లో నిషిద్ధ ఉత్ప్రేరకం 'క్లోస్టెబల్' ఉన్నట్లు తేలింది. అంటే ఏకంగా ఒకే నెలలో రెండుసార్లు డోపింగ్‌లో పట్టుబడ్డాడు. దీంతో ఆ టోర్నీలో సెమీస్ చేరడంతో వచ్చిన ప్రైజ్‌మనీని వెనక్కి తీసుకోవడంతో పాటు, 400 ర్యాంకింగ్ పాయింట్లను కోతగా విధించారు. దీనిపై అప్పీలుకు వెళ్లిన సినెర్ ఉద్దేశపూర్వకంగా తీసుకోలేదదని, తన ఫిజియో మసాజ్ చేసే సమయంలో కొట్టిన స్ప్రేతో శరీరంలోకి ప్రవేశించిందని, ఇకపై ఇలాంటి పొరపాట్లు జరగకుండా డోపింగ్ నిబంధనల్ని నిక్కచ్చిగా పాటిస్తానని విన్నవించాడు. ఐటీఐఏ ఏర్పాటు చేసిన ఇండిపెండెంట్ ప్యానెల్ అతని విన్నపాన్ని మన్నించి... క్లీన్‌చిట్ ఇవ్వడం అప్పట్లోనే వివాదాస్పదమైంది. అలనాటి అమెరికా టెన్నిస్ దిగ్గజం క్రిస్ ఎవర్ట్ సహా షపవలోవ్ (కెనడా), కిరియోస్ (ఆస్ట్రేలియా) సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఒక్కొక్కరికి ఒక్కోలా నిబంధనలుంటాయా అని ప్యానెల్ నిర్ణయాన్ని తప్పుబట్టారు.

సూపర్ ఫామ్‌లో...

ఈ ఏడాది సినెర్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో (ఆస్ట్రేలియన్, యూఎస్ ఓపెన్) విజేతగా నిలువడంతో పాటు మరో నాలుగు టోర్నీల్లో టైటిల్స్ సాధించాడు. ప్రస్తుతం బీజింగ్‌లో జరుగుతున్న చైనా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరుకున్న సినెర్ ఈ ఏడాది 57 మ్యాచ్‌ల్లో గెలిచి, కేవలం ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు.



రన్నరప్ రిత్విక్ జోడీ

సాక్షి, హైదరాబాద్: బ్యాంకాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రిత్విక్–అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6–3, 5–7, 8–10తో 'సూపర్ టైబ్రేక్'లో బ్లేక్ ఇలిస్–ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. గంటా 47 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో రిత్విక్–అర్జున్ ద్వయం ఏడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. రెండు జోడీలు తమ సర్వీస్‌ను ఒక్కోసారి కోల్పోయాయి. నిర్ణాయక టైబ్రేక్‌లో ఆసీస్ ద్వయం కీలకదశలో పాయింట్లు నెగ్గి టైటిల్‌ను సొంతం చేసుకుంది. రిత్విక్–అర్జున్ జోడీకి 4,400 డాలర్ల (రూ. 3 లక్షల 68 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 60 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది రిత్విక్ చౌదరీ ఏటీపీ సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. ఈ సీజన్‌లో రిత్విక్ ఏడు టోర్నీల్లో ఫైనల్‌కు చేరాడు. రెండు టోర్నీల్లో టైటిల్స్ నెగ్గి, ఐదు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

ముగిసిన 'ఐటా' ఎన్నికలు ఫలితాలు సీల్డ్ కవర్‌లో

న్యూఢిల్లీ: అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) అధ్యక్షుడు అనిల్ జైన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలనుకున్న రాష్ట్ర సంఘాలు తీరా అసలైన సమయంలో వెనక్కి తగ్గాయి. శనివారం వార్షిక సర్వ సభ్య సమావేశానికి (ఏజీఎం) ముందే సాధారణ సభ్య సమావేశం (ఈజీఎం) నిర్వహించేందుకు గత వారం నోటీసు ఇచ్చిన ఎనిమిది రాష్ట్ర సంఘాలు తమ మనసును అనూహ్యంగా మార్చుకోవడంతో ఏజీఎంలో కొత్త కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. సాయంత్రంలోగా ఫలితాలు కూడా వచ్చేవే! కానీ ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఫలితాలను బహిరంగంగా వెల్లడించేందుకు వీల్లేదు. సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించాలి. తుది తీర్పునకు లోబడి ఫలితాలను వెల్లడిస్తారు. నిజానికి 'ఐటా'లో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో ఏ పదవికి పోటీ లేనే లేదు. రిటర్నింగ్ ఆఫీసర్ స్వీకరించిన నామినేషన్లలో ఒక్కో పదవికి ఒక్కరే నామినేషన్ వేశారు. కొత్త అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, ఎనిమిది మంది ఉపాధ్యక్షులు, నలుగురు సంయుక్త కార్యదర్శులు, పది మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులకు ఎన్నికలు జరిగాయి. భారత డేవిస్ కప్ నాన్ ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ లోగడ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేసినా... తర్వాత అతనే ఉపసంహరించుకున్నాడు.

విజయానికి 5 వికెట్ల దూరంలో

- ఆరు వికెట్లతో మెరిసిన ప్రభాత్ జయసూర్య
- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 88 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్ 199/5


కాన్వే


ప్రభాత్

గాలె: న్యూజిలాండ్‌పై చారిత్రక సిరీస్ క్లీన్‌స్వీప్‌నకు శ్రీలంక జట్టు ఐదు వికెట్ల దూరంలో నిలిచింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే తొలి టెస్టు నెగ్గి జోరు మీదున్న శ్రీలంక... రెండో టెస్టులోనూ విజయానికి చేరువైంది. శనివారం మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 22/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... లంక లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య ధాటికి విలవిలలాడి 39.5 ఓవర్లలో 88 పరుగులకే ఆలౌటైంది. శ్రీలంకపై న్యూజిలాండ్‌కు ఇదే అత్యల్ప స్కోరు. మిషెల్ సాన్‌ట్నర్ (51 బంతుల్లో 29; 4 ఫోర్లు, ఒక సిక్సర్) టాప్ స్కోరర్ కాగా... రచిన్ రవీంద్ర (10), డారిల్ మిషెల్ (13) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. టామ్ లాథమ్ (2), డ్వేన్ కాన్వే (9), కేన్ విలియమ్సన్ (7), ఎజాజ్ పటేల్ (8), టామ్ బ్లండెల్ (1), గ్లెన్ ఫిలిప్స్ (0) విఫలమయ్యారు. లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 6, నిషాన్ మూడు వికెట్లు పడగొట్టారు. లంక సారథి ధనంజయ ఐదు క్యాచ్‌లు అందుకోవడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో 514 పరుగుల భారీ ఆధిక్యం దక్కించుకున్న శ్రీలంక... న్యూజిలాండ్‌ను ఫాలోఆన్ ఆడించగా.. శనివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 41 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆత్మరక్షణ ధోరణిలో ఆడి దెబ్బతిన్న న్యూజిలాండ్.. రెండో ఇన్నింగ్స్‌లో ఎదురుదాడికి దిగింది. డ్వేన్ కాన్వే (62 బంతుల్లో 61; 10 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధసెంచరీ సాధించగా.. కేన్ విలియమ్సన్ (58 బంతుల్లో 46; 4 ఫోర్లు), బ్లండెల్ (50 బంతుల్లో 47 బ్యాటింగ్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్ (41 బంతుల్లో 32 బ్యాటింగ్; 2 సిక్సర్లు) పర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో నిషాన్ మూడు వికెట్లు తీశాడు. అంతకుముందు శ్రీలంక 602/5 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండగా... చేతిలో 5 వికెట్లు ఉన్న న్యూజిలాండ్ జట్టు... ఇన్నింగ్స్ పరాజయాన్ని తప్పించుకోవాలంటే ఇంకా 315 పరుగులు చేయాల్సి ఉంది. వెలుతురులేమి కారణంగా మూడోరోజు ఆట నిర్ణీత సమయం కంటే ముందే ముగిసింది. మొత్తంగా న్యూజిలాండ్ శనివారం ఇక్క రోజే రోజు 13 వికెట్లు కోల్పోయింది. తొలి సెషన్‌లోనే 9 వికెట్లు నేలకూలాయి.

రోడ్డు ప్రమాదంలో ముషీర్ ఖాన్‌కు గాయాలు

ఇరానీ కప్, రంజీ ట్రోఫీలకు దూరం • కోలుకునేందుకు 3 నెలలు పట్టే అవకాశం


ముషీర్ ఖాన్



లక్నో: భారత టెస్టు క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడు, ముంబై యువ ఆల్‌రౌండర్ ముషీర్ ఖాన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఇటీవల దులీప్ ట్రోఫీలో చక్కటి ప్రదర్శన కనబర్చిన 19 ఏళ్ల ముషీర్ ఖాన్... ఇరానీ కప్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో శనివారం కారు ప్రమాదానికి గురయ్యాడు. స్వగ్రామమైన ఆజంగఢ్ నుంచి లక్నోకు వెళ్తున్న సమయంలో పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వే పై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో కారులో ముషీర్‌తో పాటు తండ్రి నౌషాద్ ఖాన్ ఉన్నాడు. డివైడర్‌ను ఢీకొట్టిన కారు బోల్తా కొట్టడంతో ముషీర్ ఖాన్ మెడ భాగంలో గాయలయ్యాయి. దీంతో అతడిని తక్షణమే ఆసుపత్రికి తరలించగా... ప్రమాదం లేదని వైద్యులు ధ్రువీకరించారు. 'ముషీర్‌కు పరీక్షలు చేశాం. మెడ భాగంలో కాస్త నొప్పిగా ఉన్నట్లు తెలిపాడు. ఆందోళన చెందాల్సిన పని లేదు' అని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ భోళా సింగ్ తెలిపారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ముంబై క్రికెట్ సంఘం (ఎమ్‌సీఏ) వైద్య బృందాలు పరిస్థితిని పరిశీలిస్తున్నాయి. ప్రాథమిక చికిత్సలు పూర్తయి వైద్యుల అనుమతి లభిస్తే... ముషీర్‌ను మరింత మెరుగైన వైద్యం కోసం ముంబై తరలించనున్నట్లు ఎమ్‌సీఏ ప్రతినిధులు తెలిపారు. దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్న ముషీర్ ఖాన్ తాజాగా దులీప్ ట్రోఫీలో భారీ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ ప్రమాదం కారణంగా అతడు అక్టోబర్ 1 నుంచి రెస్ట్ ఆఫ్ ఇండియా, రంజీ చాంపియన్ ముంబై జట్ల మధ్య లక్నోలో ప్రారంభం కానున్న ఇరానీ కప్ మ్యాచ్‌తో పాటు... ఆ తర్వాత జరగనున్న ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీలోని ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది. గాయం తీవ్రత ఎక్కువగా లేకపోయినా... ముషీర్ తిరిగి మైదానంలోకి దిగేందుకు కనీసం మూడు నెలల సమయం పట్టొచ్చని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో ముషీర్ తండ్రి నౌషాద్ ఖాన్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు.

గాయత్రి-ట్రెసా జోడీ ఓటమి

న్యూఢిల్లీ: మకావ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట నిష్క్రమించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 17–21, 21–16, 10–21తో సెయి పె షాన్–హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) ద్వయం చేతిలో ఓడింది. గతవారం చైనా ఓపెన్ టోర్నీ తొలి రౌండ్‌లోనే సెయి పె షాన్–హుంగ్ ఎన్ జు చేతిలో ఓడిన గాయత్రి–ట్రెసాకు ఈసారీ ఓటమి తప్పలేదు.

బెంగళూరు 'హ్యాట్రిక్' గెలుపు

64వ గోల్‌తో ఐఎస్ఎల్ టాప్ స్కోరర్‌గా సునీల్ ఛెత్రి


సునీల్ ఛెత్రి

బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' నమోదు చేసింది. మోహన్ బగాన్ సూపర్ జెయింట్ క్లబ్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 3–0 గోల్స్ తేడాతో గెలిచింది. బెంగళూరు తరఫున ఎడ్గర్ మెండెజ్ (9వ ని.లో), సురేశ్ సింగ్ (20వ ని.లో), భారత మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి (51వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఐఎస్ఎల్ చరిత్రలో సునీల్ ఛెత్రికిది 64వ గోల్ కావడం విశేషం. ఈ గోల్‌తో ఐఎస్ఎల్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా సునీల్ ఛెత్రి అవతరించాడు. 63 గోల్స్‌తో బార్ట్ ఒగ్బెచె (నైజీరియా; హైదరాబాద్ ఎఫ్‌సీ) పేరిట ఉన్న రికార్డును సునీల్ ఛెత్రి అధిగమించాడు. శనివారం జరిగిన మరో మ్యాచ్‌లో ఒడిశా ఎఫ్‌సీ 2–1తో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ జట్టును ఓడించింది. గువాహటిలో నేడు జరిగే మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టుతో కేరళ బ్లాస్టర్స్ జట్టు తలపడుతుంది.

రఫ్ఫాడించిన రికెల్టన్


రికెల్టన్

ఐర్లాండ్‌పై దక్షిణాఫ్రికా విజయం

అబుదాబి: ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (48 బంతుల్లో 76; 3 ఫోర్లు, 6 సిక్సర్లు), రీజా హెండ్రిక్స్ (33 బంతుల్లో 51; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ శతకాలతో అదరగొట్టారు. ఫలితంగా ఐర్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన తొలి టి20లో దక్షిణాఫ్రికా 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. కర్టిస్ కాంఫెర్ (36 బంతుల్లో 49; 6 ఫోర్లు, ఒక సిక్సర్), నీల్ రాక్ (28 బంతుల్లో 37; 4 ఫోర్లు, ఒక సిక్సర్) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ప్యాట్రిక్ కర్గర్ 4 వికెట్లు పడగొట్టాడు. కర్గర్‌కు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 17.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. రికెల్టన్, హెండ్రిక్ హాఫ్ సెంచరీలు బాదగా... కెప్టెన్ మార్క్‌రమ్ (17 బ్యాటింగ్), మాథ్యూ బ్రీట్జ్‌కె (19 బ్యాటింగ్) అజేయంగా నిలిచి జట్టును గెలిపించారు. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో టి20 జరగనుంది.

హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్ మెరుపులు

నాలుగో వన్డేలో ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్ ఘనవిజయం


లివింగ్‌స్టోన్


హ్యారీ బ్రూక్

లండన్: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ 2–2తో సమమైంది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన నాలుగో వన్డేలో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఇంగ్లండ్ 186 పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించగా... మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 5 వికెట్ల నష్టానికి 312 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ హ్యారీ బ్రూక్ (58 బంతుల్లో 87; 11 ఫోర్లు, ఒక సిక్సర్), లివింగ్‌స్టోన్ (27 బంతుల్లో 62 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్సర్లు), బెన్ డకెట్ (62 బంతుల్లో 63; 6 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా బ్రూక్, లివింగ్‌స్టోన్, జెమీ స్మిత్ (28 బంతుల్లో 39; ఒక ఫోర్, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. స్టార్క్ వేసిన చివరిదైన 39వ ఓవర్‌లో లివింగ్‌స్టోన్ నాలుగు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 28 పరుగులు సాధించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 24.4 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌటైంది. ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), మిషెల్ మార్ష్ (28; 2 ఫోర్లు, ఒక సిక్సర్) మినహా తక్కినవాళ్లంతా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో మాథ్యూ పాట్స్ 4, బ్రైడన్ కార్స్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక ఐదో మ్యాచ్ ఆదివారం జరగనుంది.



జస్ట్ 80!

మిస్ యూనివర్స్ కొరియా ఫైనలిస్ట్

సియోల్: పేరు: చోయి సూన్ హ్వా, వయస్సు:80. ఇటీవలే మిస్ యూనివర్స్ కొరియాఫైనలిస్ట్‌ల్లో ఒకరిగా నిలిచిరికార్డు బద్దలు కొట్టారు. త్వరలో జరగబోయే మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొని, వయోధికురాలిగా చరిత్ర సృష్టించబోతున్నారు. మిస్ యూనివర్స్ పోటీలు ప్రారంభమవ్వడానికి దశాబ్దం ముందు 1952లో ఈమె జన్మించారు. ఈ నెలారంభంలో మిస్ యూనివర్స్ కొరియా పోటీలో ఫైనలిస్ట్‌గా నిలిచారు. సోమవారం మరో 31 మంది పోటీదారులతో 'మిస్ యూనివర్స్ కొరియా'కిరీటం కోసం పోటీ పడనున్నారు. ఇందులో విజేతగా నిలిస్తే నవంబర్‌లో మెక్సికోలో జరిగే మిస్ యూనివర్స్ ఫైనల్స్‌లో దక్షిణ కొరియాకు ప్రాతినిధ్యం వహించే ఛాన్స్ కొట్టేయనున్నారు. '80 ఏళ్ల మహిళ ఇంత ఆరోగ్యంగా ఎలా ఉండగలిగారు? శరీర సౌష్టవాన్ని ఎలా నిలుపుకోగలిగారు? ఏ ఆహారం తీసుకుంటున్నారు? అని ఈ ప్రపంచాన్ని ఆశ్చర్యపరచాలనుకుంటున్నా'అని ఆమె సీఎన్ఎన్‌తో అన్నారు. హాస్పిటల్‌లో చిన్న ఉద్యోగం చేసి రిటైరైన చోయి..ఆర్థిక ఇబ్బందుల కారణంగా మళ్లీ ఆ ఉద్యోగంలో చేరారు. మోడలింగ్ రంగంలోకి వెళ్లాలని తన వద్దకు వచ్చే రోగి ఒకరు ప్రోత్సహించారని ఆమె చెప్పారు. 'మొదట్లో ఆమె సలహా అర్థం లేనిదిగా అనిపించింది. ఆ తర్వాత నా చిన్ననాటి అభిరుచిని నెరవేర్చుకునేందుకు ఇదే సమయమని తోచింది'అని తెలిపారు. అదే సమయంలో అప్పులు ఆమెకు భారంగా మారాయి. అలా, 72 ఏళ్ల వయసులో మోడలింగ్ రంగంలోకి ప్రవేశించారు. 2018లో 74 ఏళ్ల వయస్సులో సియోల్ ఫ్యాషన్ వీక్‌లో మొట్టమొదటిసారిగా కనిపించారు. ఆ తర్వాత హార్పర్స్ బజార్, ఎల్ల్ మ్యాగజీన్లలో కనిపించారు. ఇప్పుడు, కొరియన్ ఫ్యాషన్ ప్రపంచంలో ఆమె తనకంటూ స్థానం సంపాదించుకున్నారు.



125 మొసళ్లను షాకిచ్చి చంపేశాడు..!

వరదలతో బలహీనపడిన ఎన్‌క్లోజర్

- అది ధ్వంసమైతే అవి జనావాసాల్లో ప్రవేశిస్తాయని భయం..
- అందుకే పెంచుతున్న మొసళ్లను చంపేయాలని నిర్ణయం
- థాయ్‌ల్యాండ్‌లో మొసళ్ల పెంపకందారు ముందుచూపు

బ్యాంకాక్: థాయ్‌ల్యాండ్‌కు చెందిన మొసళ్ల పెంపకందారు ప్రజల హితం కోరి ఎవరూ ఊహించని సాహసం చేశారు. ఇటీవల సంభవించిన వరదలతో మొసళ్లను పెంచుతున్న ఎన్‌క్లోజర్ గోడ దెబ్బతిని, బలహీనపడింది. ఆ గోడ ఏ క్షణాన్నైనా కూలొచ్చని, అదే జరిగితే అందులోని ప్రమాదకర మొసళ్లన్నీ జనవాసాల్లోకి ప్రవేశిస్తాయని ఆయన ఊహించారు. జరగబోయే ప్రమాదంపై అధికారులకు సమాచారమిచ్చారు. వారు చెప్పిన సూచనల ప్రకారం 125కు పైగా మొసళ్లను కరెంటుషాకిచ్చి చంపేశారు. జనం కోసం తన సొంతలాభాన్ని త్యాగం చేసిన నత్థపక్ ఖుంకడ్(37)ను అందరూ 'కోకడైల్ ఎక్స్'గా పిలుచుకుంటారు. లుంపున్ ప్రాంతంలో 17 ఏళ్లుగా సియామీస్ అనే అరుదైన రకం మొసళ్లను ఈయన పెంచుతున్నారు. వీటిని చర్మాన్ని పరిశ్రమలకు, మాంసాన్ని థాయ్‌ల్యాండ్‌తోపాటు ఇతరదేశాలకు పంపిస్తుంటారు. ఏమైందంటే.. సెప్టెంబర్ 21వ తేదీన థాయ్‌ల్యాండ్ ఉత్తర ప్రాంతాన్ని వరదలు ముంచెత్తాయి. నత్థపక్ ఫాంను కూడా వరద తాకింది. ఆ తీవ్రతకు మొసళ్ల ఎన్‌క్లోజర్ గోడ దెబ్బతింది. అది పూర్తిగా కూలితే మొసళ్లు సమీపంలోని ఆవాసాల్లోకి, పొలాల్లో ప్రవేశించి, జనాన్ని చంపేస్తాయని నత్థపక్ ఆందోళన చెందారు. మొసళ్లను వేరే చోటుకు తరలించాలని ప్రయత్నించినా వీలు పడలేదు. కుటుంబసభ్యులతో ఆలోచించిన మీదట..ప్రజలకు హాని కలిగించకుండా తామే వాటిని చంపేయడమే మేలనే నిర్ణయానికి వచ్చారు. ఈ విషయమై స్థానిక అధికారుల సలహా మేరకు మర్నాడు మొత్తం 125 మొసళ్లను విద్యుత్ షాకిచ్చి చంపేశారు. ఇందులో అతిపెద్దదైన నాలుగు మీటర్ల పొడవుండే బ్రీడర్ మొసలి 'అయి హార్న్'కూడా ఉంది. నత్థపక్ నిర్ణయం ధైర్యంతో కూడిన బాధ్యతాయుతమైన నిర్ణయమని అధికారులు కూడా ప్రశంసిస్తున్నారు. నత్థపక్ వద్ద ఇంకా అడుగు నుంచి నాలుగడుగుల వరకు పొడవైన 500 దాకా పిల్ల మొసళ్లున్నాయి. పిల్ల మొసళ్లతో కలిసి ఎన్‌క్లోజర్‌లో గడపటం వంటి మొసళ్లతో చేసే విన్యాసాలతో ఈయన వీడియోలు ఇంటర్నెట్‌లో బాగా పాపులర్ అయ్యాయి కూడా. థాయ్‌ల్యాండ్‌లో మొసళ్ల పెంపకం ఆకర్షణీయమైన పరిశ్రమగా భారీ ఎత్తున సాగుతోంది. దేశంలో 1,100 మొసళ్ల పెంపకం దారులున్నారు.

నీ రాక కోసం!

- సునీతను తిరిగి తెచ్చేందుకు అంతరిక్ష కేంద్రానికి స్పేస్-ఎక్స్



కేప్‌కనవెరాల్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకున్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను సురక్షితంగా భూమికి తిరిగి తెచ్చేందుకు శనివారం స్పేస్-ఎక్స్ క్యాప్సూల్ డ్రాగన్ బయలుదేరింది. ఈ ఏడాది జూన్ 5న బోయింగ్ నిర్మిత స్టార్‌లైనర్ తొలి ప్రయోగంలో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, విల్మోర్‌లు ఎనిమిది రోజులకు భూమికి తిరిగి రావాల్సి ఉండగా.. స్టార్‌లైనర్‌లో హీలియం లీక్, థ్రస్టర్ల సమస్యలు తలెత్తడంతో అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. మానవసహిత తిరుగు ప్రయాణానికి స్టార్‌లైనర్ సురక్షితం కాదని నాసా తేల్చడంతో అది ఖాళీగానే తిరిగివచ్చింది. సునీత, విల్మోర్‌లను భూమికి తేవడానికి వీలుగా డ్రాగన్‌లో రెండు సీట్లను ఖాళీగా ఉంచారు. ఇద్దరు వ్యోమగాములతో శనివారం ఇది ప్రయాణమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సునీత, విల్మోర్‌లను తీసుకొని భూమికి తిరిగి వస్తుంది. ఎనిమిది రోజుల్లో రావాల్సిన వీరు ఏకంగా ఎనిమిది నెలల తర్వాత భూమికి వస్తారు.

సమాజాన్ని చూసే తీరును నా కూతుళ్లు మార్చేశారు



సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు

- దివ్యాంగుల పట్ల మన తీరు మారాలి
- లైంగిక దాడికి వాళ్లు సులువైన లక్ష్యాలు
- బాధితులకు వ్యవస్థే అండగా నిలవాలి

న్యూఢిల్లీ: దివ్యాంగుల పట్ల, ముఖ్యంగా దివ్యాంగ బాలల పట్ల సమాజం వ్యవహరించే తీరులో మార్పు రావాల్సిన అవసరముందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. దివ్యాంగ బాలలు లైంగిక హింసకు సులువైన లక్ష్యాలుగా మారుతున్నారంటూ ఆవేదన వెలిబుచ్చారు. ఈ దారుణాల నుంచి కాపాడుకోవడం, వాటి బారిన పడేవారి పట్ల సహానుభూతితో వ్యవహరించడం మనందరి బాధ్యత అన్నారు. శనివారం ఆయన దివ్యాంగ బాలల హక్కుల పరిరక్షణపై 9వ జాతీయ సదస్సులో పాల్గొన్నారు. దివ్యాంగుల హక్కులపై సుప్రీంకోర్టు హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. అనంతరం ప్రారంభోపన్యాసం చేశారు. ''దివ్యాంగ బాలల భద్రత, సంక్షేమానికి నా హృదయంలో ప్రత్యేక స్థానముంది. నేను దివ్యాంగులైన ఇద్దరు ఆడపిల్లల తండ్రిని. సమాజం పట్ల నా దృక్కోణాన్ని నా కూతుళ్లు పూర్తిగా మార్చేశారు'' అని చెప్పారు. నైపుణ్యం, సామర్థ్యాలతో నిమిత్తం లేకుండా బాలల హక్కులను పరిపూర్ణంగా పరిరక్షించే ఆదర్శ సమాజమే మనందరి లక్ష్యం కావాలని సూచించారు. ఇందుకోసం పలు కీలకాంశాలపై దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. ''దివ్యాంగ బాలల సమస్యలను గుర్తించాలి. లైంగిక దాడుల వంటి హేయమైన నేరాల బారిన పడే దివ్యాంగ బాలికలను అక్కున చేర్చుకుని వారిలో ధైర్యం నింపాలి. పూర్తిగా కోలుకునేందుకు అన్నివిధాలా దన్నుగా నిలవాలి. పోలీస్‌స్టేషన్ మొదలుకుని కోర్టు దాకా ప్రతి దశలోనూ వారి పట్ల అత్యంత సున్నితంగా, సహానుభూతితో వ్యవహరించాలి. ఇందుకు అవసరమైన మేరకు బాలల న్యాయ వ్యవస్థకు, దివ్యాంగుల హక్కుల చట్టానికి మార్పులు చేయాలి. ఇందుకు అంతర్జాతీయ చట్టాల నుంచి స్ఫూర్తి పొందాలి. వారిపై అకృత్యాలను నివారించడంపై ప్రధానంగా దృష్టి సారించాలి. ఆ బాలలకు నాణ్యతతో కూడిన విద్య, అనంతరం మెరుగైన ఉపాధి తదితర అవకాశాలు కల్పించాలి. తద్వారా అడుగడుగునా అండగా నిలవాలి. ఈ విషయమై వారి తల్లిదండ్రులతో పాటు పోలీసులకు, లాయర్లకు, న్యాయమూర్తులకు కూడా మరింత అవగాహన కల్పించాలి'' అని సీజేఐ పిలుపునిచ్చారు.

నేపాల్‌లో వరదలు.. 66 మంది మృతి

కఠ్మాండు: నేపాల్‌లో రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలతో వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 66 మంది ప్రాణాలు కోల్పోయారు. వర్షం సంబంధిత ఘటనల్లో ఒక్క కఠ్మాండు లోయలోనే 34 మంది మృతి చెందారని పోలీసు విభాగం ప్రతినిధి బిష్ణో అధికారి వెల్లడించారు. మరో 60 మంది గాయపడగా, 79 మంది గల్లంతయ్యారన్నారు. 'దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు 63 ప్రాంతాల్లో ధ్వంసమయ్యాయి. మూడు వేల మంది పోలీసులు రక్షణ, సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. నీట మునిగిన 226 నివాసాల నుంచి వెయ్యి మందిని రక్షించాం'అని వివరించారు. వరదల కారణంగా ప్రధాన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ దెబ్బతినడంతో ఒక రోజంతా రాజధాని కఠ్మాండుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా సంస్థలకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించింది. అన్ని రకాల పరీక్షలను వాయిదావేసింది.

రెబెల్స్ దడ

హరియాణాలో తిరుగు'బావుటా' | కాంగ్రెస్, బీజేపీలకు ఇక్కట్లు | ఎవరి పుట్టి ముంచుతారోనని భయం

హరియాణాలో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. ముఖ్యనేతలు ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ప్రదర్శన (10 సీట్లలో ఐదు నెగ్గింది) కనబర్చిన కాంగ్రెస్ హరియాణాను తమ ఖాతాలో వేసుకోగలమనే ధీమాలో ఉంది. రైతుల అసంతృప్తి, నిరుద్యోగం, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై రెజ్లర్ల లైంగిక వేధింపుల ఆరోపణలు, అగ్నివీర్ పథకంపై యువతలో నెలకొన్న ఆగ్రహం.. కాంగ్రెస్ అవకాశాలను మెరుగుపరిచాయి. అయితే పార్టీలోని ఆధిపత్య పోరు కాంగ్రెస్‌ను కలవరపెడుతోంది. మరోవైపు బీజేపీ గడిచిన పదేళ్లలో చేసిన అభివృద్ధిపై ఆశలు పెట్టుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

20 స్థానాల్లో రెబెల్స్ ప్రభావం

అయితే రెండు పార్టీలకూ తిరుగుబాటు అభ్యర్థులు దడ పుట్టిస్తున్నారు. టికెట్లు నిరాకరించడంతో.. పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు. మరికొందరు ఇతర పార్టీల నుంచి నామినేషన్ వేశారు. మొత్తం మీద సొంత పార్టీలకు సవాల్ విసురుతున్నారు. హోరాహోరీ పోరులో రెబెల్స్ ఎవరి పుట్టిముంచుతారోననే దడ రెండు పార్టీల్లోనూ ఉంది. హరియాణా అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలు ఉండగా.. కనీసం 20 నియోజకవర్గాల్లో రెబెల్స్ ఫలితాలను తారుమారు చేసే స్థితిలో ఉన్నారు. 15 స్థానాల్లో 19 మంది బీజేపీ తిరుగుబాటు అభ్యర్థులు బరిలో నిలిచారు. 20 నియోజకవర్గాల్లో 29 మంది కాంగ్రెస్ రెబెల్స్ పోటీలో ఉన్నారు. 7 స్థానాల్లో 12 మంది అసంతృప్త నేతలను కాంగ్రెస్ బుజ్జగించింది. అలాగే 6 నియోజకవర్గాల్లో బీజేపీ తిరుగుబాటు అభ్యర్థులు పార్టీ సీనియర్ల విజ్ఞప్తులను మన్నించి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. హరియాణా ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు గణనీయమైన ఓట్ల శాతాన్ని రాబట్టుకుంటూ వస్తున్నారు. ఇది ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారింది. గెలుపోటములను ప్రభావితం చేయగలిగే స్థాయిలో వీరు ఓట్లను చీల్చితే.. తాము నష్టపోతామని కాంగ్రెస్, బీజేపీ నాయకులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

అందరి దృష్టి హిసార్ పైనే..

బీజేపీ రెబెల్స్‌లో దేశవ్యాప్తంగా రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తున్నది సావిత్రి జిందాల్. ఓ.పి.జిందాల్ గ్రూపు చైర్‌పర్సన్ అయిన సావిత్రి భారత్‌లోనే అత్యంత సంపన్న మహిళ. హిసార్‌లో ఆమె స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి ఆరోగ్యశాఖ మంత్రి కమల్ గుప్తాకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఆమె కుమారుడు నవీన్ జిందాల్ ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గూటికి చేరి.. కురుక్షేత్ర ఎంపీగా గెలిచారు. కమల్ గుప్తా గడిచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో హిసార్ నుంచి విజయం సాధించారు. 2009లో ఇక్కడ సావిత్రి జిందాల్ కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. గనౌర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి దేవేందర్ కౌశిక్‌కు రెబెల్ అభ్యర్థి దేవేందర్ కద్యాన్ నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. బీజేపీ ఓటు బ్యాంకును వీరిద్దరూ పంచుకుంటుండడంతో కాంగ్రెస్ అభ్యర్థి కుల్దీప్ శర్మకు కలిసివస్తోంది. కుల్దీప్ 2009, 2014లలో రెండుసార్లు గనౌర్ నుంచి గెలుపొందారు. బీజేపీ టికెట్‌ను నిరాకరించడంతో మాజీ విద్యుత్‌శాఖ మంత్రి రంజిత్‌సింగ్ చౌతాలా రైనా నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేస్తున్నారు. 2009, 2014లలో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయిన రంజిత్‌సింగ్.. 2019లో రైనా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ చేరారు. గురుగావ్‌లో బీజేపీ ట్రేడ్ సెల్ మాజీ కన్వీనర్ నవీన్ గోయల్ రెబెల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. సఫిదాన్‌లో బీజేపీ అభ్యర్థి రామ్‌కుమార్ గౌతమ్‌కు తిరుగుబాటు అభ్యర్థి బచన్‌సింగ్ ఆర్య చెమటలు పట్టిస్తున్నారు. సఫిదాన్‌లో బచన్‌సింగ్ 2009, 2019లలో రెండోస్థానంలో నిలువడం గమనార్హం.

కాంగ్రెస్‌కూ సెగ..


అంబాలా కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ తరఫున బలమైన నేత అనిల్ విజ్ మరోసారి బరిలో నిలువగా.. కాంగ్రెస్‌ను చిత్ర సర్వరా భయం వెంటాడుతోంది. 2009, 2014లలో అనిల్ విజ్ చేతిలో ఓటమి చవిచూసిన చిత్ర 2019లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి రెండోస్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిని మూడోస్థానానికి నెట్టారు. దాంతో కాంగ్రెస్ ఆమెను ఆరేళ్ల పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. జగధారి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుడు ఆదర్శపాల్ గుర్జార్ పార్టీ మారి ఆప్ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అక్రమ్ ఖాన్‌కు గట్టి సవాల్ విసురుతున్నారు. ఇది బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కన్వర్‌పాల్‌కు అడ్వాంటేజ్‌గా మారింది. అక్రమ్‌ఖాన్ 2009లో బీఎస్పీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచారు. 2014, 2019లలో రెండోస్థానానికి పరిమితమయ్యారు. సదౌరా నియోజకవర్గంలో బ్రిజ్‌పాల్ చప్పర్ బీఎస్పీ తీర్థం పుచ్చుకొని కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేణు బాలాపై పోటీచేస్తునానరు. రేణు 2019లో 17 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అయితే సదౌరాలో బీఎస్పీ 2009, 2019లలో 18–19 శాతం ఓట్లు సాధించడం.. కాంగ్రెస్ అభ్యర్థి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మొత్తం మీద ఏ పార్టీని రెబెల్స్ ఎంతమేరకు దెబ్బతీస్తారనేది అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు తర్వాత తేలనుంది. హరియాణా అసెంబ్లీకి అక్టోబరు 5న పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే.



చిత్ర సర్వరా



సావిత్రీ జిందాల్



రంజిత్ చౌతాలా



దేవేందర్ కద్యాన్

స్వతంత్రుల ప్రదర్శన

	2009	2014	2019
పోటీచేసిన వారు	513	603	377
ఒక స్థానానికి సగటున	5.7	6.7	4.2
డిపాజిట్లు కోల్పోయినవారు	493	587	358
గెలిచిన స్వతంత్రులు	7	5	7
ఓట్ల శాతం	13	11	9


కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు.. ఇద్దరు ముష్కరులు హతం

పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మృత్యువాత

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ ఎదురుకాల్పుల ఘటనల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఒకరు ప్రాణాలు కోల్పోగా మరో ఐదుగురు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. శనివారం ఉదయం కుల్గామ్ జిల్లా దేవ్‌సర్ ప్రాంతంలోని అడిగామ్‌లో భద్రతా సిబ్బంది కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో గుర్తు తెలియని ఇద్దరు ముష్కరులు హతమయ్యారు. ఎన్‌కౌంటర్ సమయంలో అక్కడే ఉన్న అదనపు ఎస్పీ(ట్రాఫిక్)ముంతాజ్ అలీ అనుకోకుండా బుల్లెట్ తగిలి గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఎదురుకాల్పుల్లో పాల్గొన్న నలుగురు జవాన్లకు కూడా గాయాలయ్యాయన్నారు. మరో ఘటన..కథువా జిల్లా బిల్లావర్ తహశీల్ పరిధిలోని కొగ్-మండ్లి సమీపంలో శనివారం కార్డన్ సెర్చ్ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో హెడ్ కానిస్టేబుల్ ఒకరు నేలకొరగ్గా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు డీఎస్పీ గాయపడ్డారు.

వాళ్లు ఢిల్లీ పంపిన వ్యక్తులు..జాగ్రత్త!

జమ్మూకశ్మీర్ ఓటర్లకు ఫరూక్ అబ్దుల్లా హెచ్చరిక




శ్రీనగర్: 'ఆత్మగౌరవాన్ని కాపాడుకోండి..ఢిల్లీ పంపిన వ్యక్తులతో జాగ్రత్త ఉండండి..! మారువేషంలో ఉన్న దయ్యాలను తిరస్కరించండి' అంటూ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ)చీఫ్ ఫరూక్ అబ్దుల్లా ఓటర్లను హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో ఎన్సీ, కాంగ్రెస్‌ల కూటమి అసెంబ్లీలో మెజారిటీ సీట్లు గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి రాలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి అక్టోబర్ ఒకటో తేదీన జరిగే మూడో, చివరి విడత ఎన్నికలు ఆదివారం సాయంత్రంతో ప్రచారం గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు విజ్ఞతతో ఓటేయాలన్నారు. 'చేయి (కాంగ్రెస్ ఎన్నికల గుర్తు) కనిపిస్తే చేతికే ఓటేయండి. నాగలి(ఎన్సీ ఎన్నికల గుర్తు) కనిపిస్తే నాగలికే ఓటేయండి'అని కోరారు. బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్‌ను కేంద్రంలోని బీజేపీయే రంగంలోకి దించిందని ఫరూక్ అబ్దుల్లా ఆరోపించారు. ఓటర్లలో విభజనలు తెచ్చేందుకే ఆయన ప్రయత్నిస్తున్నారన్నారు. 'దేశంలోని ముస్లింలను ఎలా చూస్తున్నారో ఆయనకు తెలుసు. అదే వైఖరిని ఇక్కడా తేవాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్న విషయం రషీద్ గ్రహించడం లేదు. చివరికి ఆయనకు కూడా అదేగతి పట్టొచ్చు. రషీద్‌ను చూస్తే జాలేస్తోంది.'అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్‌కు ఎన్నికల తర్వాత రాష్ట్ర హోదా ఇస్తామన్న బీజేపీ వ్యాఖ్యలపై ఆయన..బీజేపీ చెప్పేదొకటి, చేసేదొకటి అని పేర్కొన్నారు.

చర్చలతోనే కశ్మీర్‌కు పరిష్కారం

'ఉగ్రవాదం తీవ్రస్థాయిలో ఉంది. దీనిని అంతం చేయాలంటే ఒక్కటే మార్గం. ప్రజలందరినీ మనతో కలుపుకుని ముందుకు వెళ్లడం'అని వ్యాఖ్యానించారు. సమస్య పరిష్కారానికి పొరుగుదేశాలతో చర్చలు మేలన్న అభిప్రాయాన్ని ఆయన పునరుద్ఘాటించారు. 'పొరుగు దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తే పురోగమిస్తాం, వేగంగా ముందుకు సాగుతాం .. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌పై డబ్బు ఖర్చు చేయడం కంటే మన ప్రజలను మరింత అభివృద్ధి చేయడం ఉత్తమం. ఈ విషయంలో సార్క్‌ను బలోపేతం చేయాలి. భారత్ పెద్దన్న పాత్ర పోషించాలి. ఇరుగుపొరుగుతో స్నేహ సంబంధాలు సాగించలేకుంటే ఇప్పుడున్న పరిస్థితులే కొనసాగుతాయి'అని అబ్దుల్లా అభిప్రాయపడ్డారు. కశ్మీర్ ఎన్నికలకు విదేశీ ప్రతినిధులు రావడంపై ఆయన..కశ్మీర్ భారత్‌లో భాగమని వారనుకుంటున్నారా? భారత్‌లో మేం భాగమే అయితే, కశ్మీర్‌కు మాత్రమే వాళ్లు ఎందుకొస్తున్నట్లు? హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్రల్లో ఎన్నికలప్పుడు ఎందుకు వెళ్లరు?'అని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. 'విదేశీ ప్రతినిధులను అనుమతిస్తున్న ప్రభుత్వం..విదేశీ జర్నలిస్టులపై ఆంక్షలు పెడుతోంది. నిజాలు బయటకొస్తాయని కేంద్రం భయపడుతోంది'అని వ్యాఖ్యానించారు.

మురుగు ఫౌంటెయిన్..!



బీజింగ్: మానవ విసర్జితాలతో కూడిన డ్రెయినేజీ పైపు అధిక ఒత్తిడి కారణంగా పగిలింది. ఆ తీవ్రతకు 33 అడుగుల ఎత్తున ఫౌంటెయిన్‌లా ఎగజిమ్మింది. ఆ దారిన పోయే వాహనాలు, వాహన చోదకులు, పాదచారులను తడిపేసింది. మానవ విసర్జితాలతో తడిచిన పాదచారులు పసుపు రంగులోకి మారారు. ట్రక్కులు, కార్ల అద్దాలపై మలం పడి దుర్గంధం వెదజల్లుతుండగా ఏం చేయాలో తెలియక నిశ్చేష్టులయ్యారు. కడుపులో తిప్పే ఈ ఘటన చైనాలోని గ్వాంగ్జి ప్రావిన్స్ రాజధాని నానింగ్‌లో నాలుగు రోజుల క్రితం చోటుచేసుకుంది. ఈ ఘటనతో రద్దీగా ఉండే ఆ మార్గంలో రాకపోకలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. పైప్‌లో ఒత్తిడిని పరీక్షిస్తుండగా అనూహ్యంగా ఇలా జరిగిందని అధికారులు తెలిపారు. తక్షణమే మున్సిపల్ సిబ్బంది రంగంలోకి దిగి, ఆ రహదారిని, వాహనాలను శుభ్రం చేసే పనిలో పడ్డారు.

దక్షిణాఫ్రికాలో కాల్పుల ఘటనలు..17 మంది మృతి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో ఒకే ప్రాంతంలో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో 15 మంది మహిళలు సహా 17 మంది చనిపోయారు. ఈస్టర్న్ కేప్ ప్రావిన్స్‌లోని లుసికిసికి పట్టణంలో శుక్రవారం ఈ దారుణం చోటుచేసుకుంది.

మృదు మధుర రసాభరిత వచన రచనకు ప్రసిద్ధులు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మార్కండేయ పురాణం గ్రంథాన్ని అంకితం పుచ్చుకున్న గన్నయ నాయకుడి జీవితం ఆసక్తికరమైంది. ప్రతాపరుద్రుడు 1323లో ఢిల్లీ సైన్యాలకు పట్టుబడిన తర్వాత చాలామంది కాకతీయ సేనానులను కూడా బంధించారు. వీరిలో గన్నయ నాయకుడు ఒకరు. కొందరు సేనానులు ఇస్లాం మతాన్ని స్వీకరించి విముక్తులయ్యారు. గన్నయ కూడా మల్లిక్ మక్బూల్ అనే పేరుతో మతం మార్చుకొని ఓరుగల్లుకు పాలకుడిగా వచ్చాడు.

తెలంగాణ - ప్రసిద్ధ కవులు

పాల్కురికి సోమనాథుడు

కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతి దేవుడు క్రీ.శ. 1199 నుంచి 1262 వరకు పాలించారు. దీని రాజధాని ఓరుగల్లుకు 30 మైళ్ల దూరంలో ఉన్న 'పాలకుర్తి' గ్రామంలో 1240 ప్రాంతంలో సోమనాథుడు జన్మించారు. ఈయన తండ్రిపేరు విష్ణురామిదేవుడు, తల్లి శ్రియాదేవమ్మ. వీరిది సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. సోమనాథుడు వేద వేదాంగాలను అధ్యయనం చేశారు. 'కరస్థలం విశ్వనాథయ్య' అనే గురువు వద్ద ఈయన కవితా రచనకు సంబంధించిన అంశాలను నేర్చుకున్నారు. ఆ రోజుల్లో తెలుగు కావ్యాలు సంస్కృత సమాస భూయిష్ఠంగా ఉండేవి. ఛందస్సు కూడా సంస్కృతంలోనే ఉండేది. నన్నెచోడుని 'కుమార సంభవం', మల్లికార్జున పండితారాధ్యుడి 'శివతత్వసారం', యథావాక్కుల అన్నమయ్య 'సర్వేశ్వర శతకం' లాంటివాటిని సోమనాథుడు అభ్యసించారు.

సోమనాథుడు వీరశైవ మతాన్ని స్వీకరించారు. ఈ మతంలో భక్తులకు జాతి భేదాలు, స్త్రీ - పురుష తారతమ్యాలు, కుల-గోత్రాలు, కలిమి-లేముల పట్టింపులు లేవు. సమాజంలోని తారతమ్యాలను నిర్మూలించి, సమానత్వాన్ని ప్రతిపాదించే మతం ఇది. ఈ కారణంగానే సోమనాథుడు వీర శైవ మతాన్ని స్వీకరించి, పండితారాధ్యుడి రచనలను ప్రచారం చేశారు. లింగార్యుడనే మతగురువు వద్ద సోమనాథుడు శివదీక్ష తీసుకున్నాడు. సోమనాథుడు 'అనుభవసారం' అనే కృతిని రచించి, గోడగి త్రిపురారికి అంకితమిచ్చారు. ఈయన తొలి రచన ఇదే. సోమనాథుడిపై కర్ణాటక ప్రాంతానికి చెందిన బసవన్న మహిమలు, తమిళనాడులో ప్రచారంలో ఉన్న 63 మంది నాయనార్ల శివభక్తి కథలు ప్రభావం చూపాయి. ఈ కథల ఆధారంగా ఆయన అచ్చ తెలుగు ద్విపదలు రాశారు. భక్తుల కథలతో 'బసవ పురాణం' రచించారు. ఇది ఏడు ఆశ్వాసాల కావ్యం. ఇందులో శివభక్తుల కథలు ఉన్నాయి. కన్నడ దేశంలో శైవ మతాన్ని ప్రచారం చేసిన 'బసవన్న' కథతో తమిళ దేశంలో విశేష ఖ్యాతి పొందిన 'అరువత్తు మూవరు' నాయనార్ల కథలను జోడించి సోమనాథుడు తెలుగులో ఒక కావ్యం రాశారు. బసవడిపైనే బసవగద్యం, బసవాష్టకం, బసవోదాహరణం, బసవాబసవా అనే వృషాధిప శతకం రచించారు. తేట తెనుగులో 11,810 ద్విపదల్లో పండితారాధ్య చరిత్ర రాశారు. దీన్ని తెలుగు జాతికి 'తొలి విజ్ఞాన సర్వస్వం'గా పేర్కొంటారు. దీనికి చిలుకూరి నారాయణరావు 348 పేజీల ఉపోద్ఘాతం రాశారు. ఈ గ్రంథంలో సోమనాథుడు నాటి ప్రజల జీవన విధానం, వేషధారణ, పాడుకునే పాటలు, నాటకాలు, జరుపుకునే పండగలు, మాట్లాడే భాషలు, ఉపయోగించే పలుకుబడులు, సామెతల గురించి వివరించారు.

పాల్కురికి రచనలు


1) అనుభవసారం 2) చతుర్వేదసారం
3) పండితారాధ్య చరిత్ర
4) బసవపురాణం 5) వృషాధిప శతకం
6) రుద్రభాష్యం 7) సోమనాథ భాష్యం
8) సోమనాథ స్తవం 9) వృషభాష్టకం
10) మల్లమదేవి పురాణం
11) బసవాష్టకం 12) చెన్నబసవ రగడ
13) చెన్నమల్లు సీసాలు
14) అక్షరాంక పద్యాలు
15) పంచరత్నాలు 16) పంచప్రకార గద్య
17) నమస్కార గద్య 18) గంగోత్పత్తి రగడ
19) అష్టోత్తర నామగద్య
20) సద్గురు రగడ (కన్నడ)
21) బెజ్జమహాదేవి కథ
22) బసవోదాహరణం

ప్రతాపరుద్రుడి కాలం (1289-1323)లో 1303లో మహమ్మదీయులు మొదటిసారి వరంగల్‌పై దండెత్తారు. ఆ తర్వాత సోమనాథుడు ఓరుగల్లు విడిచి వెళ్లిపోయారు.

మరింగంటి సింగాచార్యులు

సింగాచార్యులు నవాబుల యుగానికి చెందిన పండితులు. కుతుబ్ షాహీల కొలువులో పేరు పొందారు. వీరికి మొదట 'ఆసూరి' అనే ఇంటి పేరుండేది. కాలక్రమంలో మరింగంటి అనే పేరు వచ్చిందని ఆయన రచనల్లో పేర్కొన్నారు. మరింగంటి సింగాచార్యులు రాసిన 'దశరథ రాజనందన చరిత్ర' తెలుగులో తొలి నిరోష్ఠ్య కావ్యం. ఈయనకు విజయనగర పాలకులు 'కవిసార్వభౌమ' అనే బిరుదు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఇబ్రహీం కుతుబ్ షా (మల్కిభరాముడు) గోల్కొండను పాలించే రోజుల్లో మరింగంటి వంశానికి చెందిన ఎనిమిది మంది అన్నదమ్ములు చాలా ప్రసిద్ధి పొందారు. మరింగంటి అప్పన్న.. పొన్నెగంటి తెలగనాచార్యుని అచ్చ తెనుగు రామాయణం రాసి పఠాన్ చెరువు పాలకుడైన 'అమీన్‌ఖాన్'కు అంకితమివ్వమని చెప్పినట్లు మరింగంటి సింగాచార్యుల రచనల ద్వారా తెలుస్తోంది. నేబతి కృష్ణయామాత్యుడు 'రాజనీతి రత్నాకరం' అనే పంచతంత్రంలో మరింగంటి జగన్నాథసూరి కనకాభిషేకం పొందిన పండితుడు, శతావధాని, బహు గ్రంథకర్త అని పేర్కొన్నారు.



సింగాచార్యుల రచనలు

1) వరదరాజ స్తుతి 2) శ్రీ రంగ శతకం
3) చక్రలాంఛన విధి 4) కవి కదంబం
5) శత సంహిత
6) రామకృష్ణ విజయం (రెండర్థాల కావ్యం)
7) నాటకశాస్త్రం
8) ధనాభిరామం 9) ప్రేమాభిరామం
10) నలయాదవ రాఘవ పాండవీయం (నాలుగర్థాల కావ్యం)
11) సకలాలంకార సంగ్రహారాధా సుధాపూరణం
12) ఆంధ్రభాషా భూషణం
13) దశరథ రాజనందనం (నిరోష్ఠ్య రామాయణం)
14) శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణం
15) తారక బ్రహ్మ రామశతకం
16) శ్రీ కృష్ణ శతానందీయం
17) కృష్ణ తులాభారం
18) రతీమన్మథాభ్యుదయం
19) రామాభ్యుదయం

మారన

మారన మార్కండేయ పురాణాన్ని అనువదించారు. తెలుగు సాహిత్యంలో పురాణాన్ని అనువాదం చేసిన మొట్టమొదటి కవి ఈయనే. ఈయన తిక్కన శిష్యుడు. మారన ఆంధ్రీకరించిన మార్కండేయ పురాణంలోని గాథలే శంకర కవి 'హరిశ్చంద్రో పాఖ్యానం', అల్లసాని పెద్దన 'మనుచరిత్ర', మట్ల అనంతభూపాలుడి 'బహుళాశ్వ చరిత్ర'కు మార్గదర్శకమైనట్లు భావిస్తున్నారు. మారన గ్రంథంలోని యమలోక వర్ణనను సంగ్రహించి ప్రౌఢ కవి మల్లన తన 'రుక్మాంగద చరిత్ర'లో పొందుపరిచాడని వావిళ్ల ప్రచురించిన 'మార్కండేయ పురాణం' పీఠికలో శేషాద్రి రమణ కవి పేర్కొన్నారు.

మారన 'మార్కండేయ పురాణం' గ్రంథాన్ని కాకతీయ ప్రతాపరుద్రుడి సేనాని గన్నయ నాయకుడికి అంకితమిచ్చారు. ప్రతాపరుద్రుడు 1289 నుంచి 1323 వరకు ఓరుగల్లును పాలించారు. ఓరుగల్లు కటక పాలకుడు (కమిషనర్) గన్నయ్యకు గ్రంథాన్ని అంకితం ఇవ్వడం వల్ల మారన ఏకశిలా నగరానికి చెందినవారని సాహిత్యకారులు భావిస్తున్నారు. ఈయన తెలంగాణలోని గోదావరి ప్రాంతంలో ఉండేవారని ఆరుద్ర 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' గ్రంథంలో అభిప్రాయపడ్డారు.

మార్కండేయ పురాణంలో భూగోళం గురించి వర్ణించారు. ప్రపంచంలో ప్రముఖ ద్వీపాలు, ఖండాలు, నదులు, పర్వతాల వివరాలు ఇందులో ఉన్నాయి. గోదావరి నదీ తీర ప్రదేశాలు ప్రపంచంలో అత్యంత పవిత్రమైనవని మారన ఒక పద్యంలో వివరించారు. మారన మార్కండేయ పురాణాన్ని 2,547 గద్య పద్యాలుగా అనువదించారు. ఇందులో వర్ణాశ్రమ ధర్మాలు, శ్రాద్ధ నియమాలు, ధర్మ ప్రసంగాలు, పురాతన వంశావళి లాంటి వివరాలున్నాయి. మార్కండేయ పురాణం ధర్మ సందేహాలను నివృత్తి చేయడానికే ఆవిర్భవించిందని భావిస్తారు. మారన ఇందులో కథలను రసవత్తరంగా రచించారు. తెలుగువారి ఆచారాలను విశదీకరిస్తూ, మూలానికి భంగం వాటిల్లకుండా అనువదించారు. మార్కండేయ పురాణం ముఖ్యంగా దేవీ మాహాత్మ్యాన్ని వివరిస్తుంది. మహిషాసురమర్దనం, శుంభనిశుంభుల వధ అంశాలను మారన ఉత్తేజకరంగా వివరించారు.

కృష్ణమాచార్యులు

ఆధునిక యుగంలో 'వచన పద్యాలు' బహుళ ప్రజాదరణ పొందాయి. పద్యాల లాంటి వచనాలు రాయడం తెలుగు సాహిత్యంలో కాకతీయ ప్రతాపరుద్రుడి కాలంలోనే ప్రారంభమైంది. ఈ కాలానికి చెందిన కృష్ణమాచార్యులు 'సింహగిరి వచనాలు' అనే కృతిని రచించారు. వచన రచన మృదు మధుర రసా భరితంగా ఉంటుందని తెలుగులో 'మహాభారతం' గ్రంథాన్ని రాసిన నన్నయ్య పేర్కొన్నారు. కాకతీయ యుగానికి పూర్వమే వచన రచన విశారదులు ఉండేవారని నన్నయ తన భారత అవతారికలో రాసినట్లు ఆరుద్ర పేర్కొన్నారు. నన్నెచోడుని కాలంలో విస్తర, మార్గ, దేశి, వస్తు కవితలు ఉండేవని సాహిత్యకారుల అభిప్రాయం.

కాకతీయుల యుగంలో 'మధుర కవితలు' ప్రచారంలో ఉండేవి. కృష్ణమాచార్యులు వీటి రచనలోనే ప్రజాదరణ పొందారు. 'మధుర' కవిత రచనకు ఈయనను ఆద్యుడిగా పేర్కొంటారు. కాకతీ ప్రతాపరుద్రుడి కాలంలో కృష్ణమాచార్యులు తన కవితలను తామ్ర పత్రాలపై వేయించినట్లు తెలుస్తోంది. ఈ విధానాన్నే తాళ్లపాక అన్నమాచార్యులు అనుసరించారు.

'ప్రతాపరుద్ర చరిత్ర' ప్రకారం కృష్ణమాచార్యులు 'సంతూరు' గ్రామానికి చెందినవారని, 'ఏకశిలా నగరం' (వరంగల్)లోని 50 గ్రామాలకు కరణంగా పనిచేశారని తెలుస్తోంది. వచన రచనలో భాగమైన ఒక ప్రక్రియ 'చూర్ణిక'లో కూడా కృష్ణమాచార్యులు రచనలు చేసినట్లు ఆధారాలున్నాయి. వీటితోపాటు వచనాలు, విన్నపాలు కూడా రచించారు.

కృష్ణమాచార్యులు కొంతకాలం విశాఖపట్నం సమీపంలోని 'సింహాచలం' వద్ద ఉన్నట్లు ఆయన రాసిన 'సింహగిరి వచనాలు' ద్వారా తెలుస్తోంది. ఈయన ద్రావిడ వేదమైన 'తిరుక్కురల్'ను 'శఠకోప విన్నపాలు' పేరుతో తెలుగులోకి అనువదించారు. తాళ్లపాక చిన్నన్న రాసిన 'పరమయోగి విలాసం'లో కృష్ణమాచార్యులు చూర్ణికలు, వచనాలు, విన్నపాలు, కీర్తనలు రచించినట్లు పేర్కొన్నారు. తెలుగులో తొలిసారిగా వచన రచన చేసింది కృష్ణమాచార్యులే.

ఈయన రాసిన 'సింహగిరి వచనాలు' తదితర కీర్తనలు, మధుర కవితలు తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీ, మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో ఉన్నాయి. ఈ వచన రచనలపై తిమ్మావజ్ఝల కోదండరామయ్య, వేటూరి ఆనందమూర్తి, ఆరుద్ర విశేష పరిశోధనలు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. 'బసవ పురాణం' రచయిత?
ఎ) నన్నెచోడుడు
బి) యథావాక్కుల అన్నమయ్య
సి) మల్లికార్జున పండితుడు
డి) పాల్కురికి సోమనాథుడు
2. పాల్కురికి సోమనాథుడు ఏ కాకతీయ పాలకుడి కాలంలో విశేష ఖ్యాతి గడించారు?
ఎ) గణపతి దేవుడు బి) ప్రతాపరుద్రుడు
సి) రుద్రమదేవి డి) రుద్రదేవుడు
3. 'వృషాధిప శతకం' ఎవరు రచించారు?
ఎ) మారన బి) గౌరన
సి) కేతన డి) పాల్కురికి సోమనాథుడు
4. మహమ్మదీయ పాలకులు మొదటిసారిగా వరంగల్‌పై ఎప్పుడు దాడి చేశారు?
ఎ) 1310 బి) 1303
సి) 1296 డి) 1323
5. 'దశరథ రాజ నందన చరిత్ర' అనే తెలుగు నిరోష్ఠ్య కావ్య రచయిత ఎవరు?
ఎ) నేబది కృష్ణయామాత్యుడు
బి) శాకల్యమల్ల
సి) పొన్నెగంటి తెలగనాచార్యుడు
డి) మరింగంటి సింగాచార్యులు
6. మరింగంటి సింగాచార్యులు ఏ రాజవంశం కాలంలో ప్రసిద్ధి చెందారు?
ఎ) పద్మనాయకులు బి) రెడ్డిరాజులు
సి) గోల్కొండ కుతుబ్‌షాహీలు
డి) కాకతీయులు
7. 'రతీ మన్మథాభ్యుదయం'కావ్య రచయిత ఎవరు?
ఎ) మరింగంటి సింగాచార్యులు
బి) నేబది కృష్ణయామాత్యుడు
సి) మల్లినాథసూరి
డి) పొన్నెగంటి తెలగనార్యుడు
8. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి పురాణాన్ని (మార్కండేయ పురాణం) అనువాదం చేసిన కవి ఎవరు?
ఎ) గౌరన బి) కేతన
సి) మారన డి) పోతన
9. మారన తెలుగులో రచించిన మార్కండేయ పురాణాన్ని ఎవరికి అంకితమిచ్చాడు?
ఎ) గణపతిదేవుడు
బి) గన్నయ నాయకుడు
సి) ప్రతాపరుద్రుడు డి) రెండో ప్రోలరాజు
10. 'ఈశ్వర అల్లా తేరో నాం' అనే శ్రవ్య నాటక రచయిత?
ఎ) ఆరుద్ర బి) దాశరథీ రంగాచార్యులు
సి) గౌరన డి) శ్రీనాథుడు
11. 'సింహగిరి వచనాలు' రచయిత?
ఎ) పోతన బి) కేతన
సి) మారన డి) కృష్ణమాచార్యులు
12. మధుర కవితకు ఆద్యుడైన 'కృష్ణమాచార్యులు' ఏ కాకతీయ చక్రవర్తి కాలానికి చెందినవారు?
ఎ) ప్రతాపరుద్రుడు బి) గణపతిదేవుడు
సి) రుద్రమదేవి డి) ప్రోలరాజు

సమాధానాలు

1) డి 2) ఎ 3) డి 4) బి
5) డి 6) సి 7) ఎ 8) సి
9) బి 10) ఎ 11) డి 12) ఎ

భావి జీవన మార్గాన్ని నిర్ణయించుకోవడం ఏ శాస్త్ర బోధనాశయం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ స్టడీస్ మెథడ్స్



బోధనా లక్ష్యాలు- స్పష్టీకరణాలు

వినియోగం:
సమస్యా పరిష్కారంలో అవగాహన చేసుకున్న జ్ఞానాన్ని ఉపయోగించడాన్ని వినియోగం అంటారు.జ్ఞానం, అవగాహన తర్వాత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బోధనలో వినియోగం అనే లక్ష్యాన్ని సాధించాలి.

వినియోగం స్పష్టీకరణాలు:
ఎత్తయిన ప్రాంతాలు చల్లగా ఉంటాయా? లేదా? అనే సమస్యను ఇచ్చినపుడు విద్యార్థి ప్రతిస్పందనలో కింది అంశాలను గమనించ వచ్చు.

1. **సమస్యా పరిష్కారానికి నూతన జ్ఞానం ఎంపిక:** ఎత్తయిన ప్రాంతాలు, అక్కడి ఉష్ణోగ్రత మొదలైన అంశాలను వార్తా పత్రికలు, పాఠ్య గ్రంథాల ద్వారా అధ్యయనం చేసి తగిన జ్ఞానాన్ని పొందుతాడు.
2. **పరికల్పన రూపొందించుకోవడం:** పరికల్పన అంటే సమస్యా పరిష్కారంలో తాత్కాలిక పరిష్కార మార్గం.
3. **పరికల్పన పరీక్షించడం:** విద్యార్థులు ఎత్తయిన ప్రాంతాలకు సంబంధించిన ఉష్ణోగ్రతలు సేకరించడం.
4. **దత్తాంశాలను విశ్లేషించడం:** విశ్లేషించడం ఒక ఆలోచన ప్రక్రియ. విడివిడిగా పరిశీ లించడమే విశ్లేషణ. ఇది సుదీర్ఘమైన ప్రక్రియ. సమస్యా పరిష్కారంలో ఇదే మొదటిది.
ఉదా: విద్యార్థి తిరుమల, ఊటీ, సిమ్లా డార్జిలింగ్, ముస్సోరి, సింహాచలం కొండలు మొదలైన ఎత్తయిన ప్రాంతాలకు సంబంధించిన ఉష్ణోగ్రతలను విడివిడిగా పరిశీలిస్తారు.
5. **సంశ్లేషణ:** సంశ్లేషణ ఒక ఆలోచన ఫలితం, కలుపుకోవడం. సమస్యా పరిష్కారంలో విశ్లేషణ తర్వాత రెండోది సంశ్లేషణ.
ఉదా: విద్యార్థి కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఉన్న ప్రాంతాలన్నింటినీ కలుపుకుంటాడు.
6. **పరస్పర సంబంధాలు స్థాపించడం:**
పరస్పర సంబంధాలను గుర్తించడం అనేది అవగాహనకు సంబంధించిన స్పష్టీకరణం అయితే విద్యార్థి తనంతట తాను పరిశోధన చేసి రెండు భావనల మధ్య సంబంధాలను ఏర్పరిస్తే అది వినియోగానికి సంబంధించిన స్పష్టీకరణ.
ఉదా: విద్యార్థి ఎత్తయిన ప్రాంతాల మధ్య ఉష్ణోగ్రత తక్కువగా ఉండడానికి పరస్పర సంబంధాలను ఏర్పరచడం.
7. **సాధారణీకరించడం:** సాధారణీకరణంలో ఒక అంశం గురించి తుది నిర్ణయానికి వస్తారు. సాధారణీకరణం చేసేటపుడు సమస్యా పరిష్యార మార్గంలో రూపొందించుకున్న పరికల్పన ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు.
ఉదా: ఎత్తయిన ప్రాంతాలు చల్లగా ఉంటాయి.

నైపుణ్యం:
ఏదైనా ఒక పనిని సమర్థంగా చేయడాన్ని నైపుణ్యం అంటారు. విద్యార్థి సాంఘికశాస్త్ర భావనలను తన చేతితో వేగంగా, స్పష్టంగా, కచ్చితంగా చేయడాన్ని నైపుణ్యంగా చెప్పవచ్చు.

ఏదైనా పనిని పలుసార్లు ఆచరించడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు.

నైపుణ్యం- స్పష్టీకరణాలు:

1. **విద్యార్థి చార్టులు, మ్యాపులు గీయడం:** ఉదా: వంశ వృక్ష చార్టులు, బడ్జెట్ సంబంధించిన సర్కిల్ గ్రాఫ్, భారతదేశ పటాన్ని గీయడం.
2. **చార్టులు, గ్రాఫ్‌లు మ్యాప్‌లలో సంబంధిత సమాచారాన్ని గుర్తించడం:**
ఉదా: విద్యార్థి భారతదేశ పటంలో లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలి, చండీగఢ్, డామన్ డయ్యూ మొదలైన కేంద్రపాలిత ప్రాంతాలను గుర్తించడం.
3. **విద్యార్థి నమూనాలను తయారు చేయడం:**
ఉదా: సౌరకుటుంబం పాఠం విన్న తర్వాత దాని నమూనాను తయారు చేయడం.
4. **పరికరాలను ఉపయోగించడం:**
ఉదా: విద్యార్థి వర్షమాపని, ఉష్ణమాపని వంటి పరికరాలను ఉపయోగించడం.
5. **సేకరించిన సమాచారాన్ని నివేదికగా తయారు చేసి విద్యార్థి చక్కగా ప్రదర్శించడం:**
ఉదా: సమాచారాన్ని సేకరించి చిత్రాల రూపంలో విద్యార్థి నివేదించడం

మాదిరి ప్రశ్నలు

1. బ్లూమ్స్ విద్యా లక్ష్యాల విలువల వర్గీకరణలో స్పష్టత, సంతృప్తి లేదని పేర్కొన్నవారు?
1) క్రాత్‌హోల్ 2) ఆర్వెల్
3) జాన్సన్ 4) డివే
2. గాంధీజీ పాఠ్యాంశం విన్న తర్వాత ఆయన త్యాగాన్ని కొనియాడిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) అభిరుచులు 2) వైఖరులు
3) ప్రశంస 4) వినియోగం
3. పత్తి, పొగాకు నగదు పంటలకు ఉదాహరణ అని పేర్కొన్న విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) నైపుణ్యం 4) వైఖరులు
4. ప్రపంచశాంతిని పెంపొందించడంలో ఏర్పడిన ఐక్యరాజ్యసమితిని నానాజాతి సమితితో పోల్చిన విద్యార్థుల్లో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
5. దేశ ఆదాయ పంపిణీ అసమానత్వాన్ని లారెంజ్ వక్రరేఖ ద్వారా విద్యార్థి గీయడం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
6. 'కృష్ణా, గోదావరి, మహానది, కావేరి మొద లైన నదులను పరిశీలించి ద్వీపకల్ప నదులే ఎక్కువగా బంగాళాఖాతంలో కలుస్తాయి' అని సామాన్యీకరించిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
7. జాతీయ సమైక్యతకు కులతత్వం, మతతత్వం, ప్రాంతీయతత్వం కారణాలని విశ్లేషించిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
8. కిందివాటిలో వైఖరులు అనే లక్ష్యానికి సంబంధించిన స్పష్టీకరణం?
1) ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం
2) భౌగోళిక, చారిత్రక స్థలాలు సందర్శించడం
3) ప్రజల సమస్యలను సానుభూతితో పరిశీలించడం
4) దేశభక్తిని కలిగిఉండటం
9. భారతదేశ చరిత్రను ప్రాచీన యుగం, మధ్యయుగం, ఆధునిక యుగమని వర్గీ కరించిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
10. ఆంధ్రప్రదేశ్ పటంలో అటవీ ప్రాంతం ఉన్న జిల్లాలను గుర్తించిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
11. ప్రత్యక్ష, పరోక్ష, ప్రజాస్వామ్యం మధ్య తేడాలే మిటో వివరించిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
12. ఉపాధ్యాయుడు సూర్యకుటుంబం అనే పాఠ్యాంశం బోధించిన తర్వాత 'ఎ' అనే విద్యార్థి గ్రహానికి, నక్షత్రానికి తేడాను గ్రహించాడు. 'బి' అనే విద్యార్థి గ్రహాలు, ఉపగ్రహాలు, లఘు గ్రహాలను విశ్లేషించాడు. 'సి' అనే విద్యార్థి సమీపంలోని నక్షత్రశాలను సందర్శించాడు. 'డి' అనే విద్యార్థి సూర్యకుటుంబం నమూనా తయారు చేశాడు. పై విద్యార్థుల్లో నెరవేరిన లక్ష్యాలు?
1) ఎ- జ్ఞానం, బి- అవగాహన, సి- వినియోగం, డి-నైపుణ్యం
2) ఎ-అవగాహన, బి-వినియోగం, సి- జ్ఞానం డి- నైపుణ్యం
3) ఎ-అవగాహన, బి-వినియోగం, సి- అభిరుచి, డి-నైపుణ్యం
4) ఎ- వినియోగం, బి- అవగాహన, సి- అభిరుచి, డి- నైపుణ్యం
13. విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేయాలి అనే వాక్యం సూచించే భావన?
1) విలువ 2) ఆశయం
3) లక్ష్యం 4) స్పష్టీకరణం
14. భారత రాజ్యాంగ రచనా సంఘ అధ్యక్షుడు ఎవరు? అని ప్రశ్నిస్తే రాజు అనే విద్యార్థి డా. బి.ఆర్. అంబేద్కర్ అని పునఃస్మరణ చేసుకున్నాడు. రాజులో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
15. జైన, బౌద్ధ మతాల మధ్య పోలికలు చెప్పిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
16. పాఠశాలలో కురిసిన వర్షాన్ని కొలవడానికి రాహుల్ అనే విద్యార్థి వర్షమాపకం (రెయిన్ గేజ్) ఉపయోగించాడు. రాహుల్ లో నెరవేరిన లక్ష్యం?
1) వినియోగం 2) జ్ఞానం
3) అవగాహన 4) నైపుణ్యం
17. భారత దేశం ఉపఖండం అనడానికి కారణాలు విశ్లేషించి, సంశ్లేషించి సాధారణీ కరించిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) వినియోగం 2) జ్ఞానం
3) అవగాహన 4) నైపుణ్యం
18. ఆదాయం, పొదుపుల మధ్య సంబంధం గుర్తించిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) వైఖరులు
19. వీటిలో జ్ఞానం లక్ష్యాన్ని పరీక్షించడానికి ఉపయోగపడని ప్రశ్న?
1) ఘాటకం అంటే ఏమిటి?
2) అపహేళి అంటే ఏమిటి?
3) చెక్, డ్రాఫ్ట్‌ల మధ్య వ్యత్యాసాన్ని వివరించండి?
4) విక్టోరియా జలపాతం ఏ నదిపై ఉంది?
20. సహజ ఉద్భిజ సంపద అనే పాఠ్యాంశాన్ని బోధించడం ద్వారా సాధించే మౌలికాంశం?
1) శాస్త్రీయ దృక్పథం
2) పరిసరాల రక్షణ
3) భారతీయ సంస్కృతి, సంప్రదాయ పరంపర
4) జాతీయ భావనా వికాసం
21. భారతదేశం- మతసహనం పాఠ్యాంశం ద్వారా ఏ మౌలికాంశాన్ని సాధించొచ్చు?
1) రాజ్యాంగంలోని హక్కులు, బాధ్యతలు
2) సమానత్వం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం
3) జాతీయ భావనా వికాసం
4) భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర
22. మానవజాతి అభివృద్ధిపై వివిధ సంస్కృతుల ప్రభావాన్ని అవగాహన చేసుకో వడం ఏ శాస్త్రం బోధనాశయం?
1) భూగోళం 2) చరిత్ర
3) పౌరశాస్త్రం 4) అర్థశాస్త్రం
23. భావి జీవన మార్గాన్ని నిర్ణయించుకోవడం ఏ శాస్త్ర బోధనాశయం?
1) పౌరశాస్త్రం 2) అర్థశాస్త్రం
3) చరిత్ర 4) భూగోళశాస్త్రం
24. భారతదేశ ఎగుమతులు-దిగుమతులు పాఠ్యాంశం ద్వారా సాధించే ఆశయం?
1) అంతర్జాతీయ అవగాహన
2) సామాజిక అర్హతను ఏర్పర్చడం
3) ప్రజాస్వామ్య పౌరసత్వ నిర్మాణం
4) నాది అనే భావన కలిగించడం
25. విద్యా విధానం, విద్యా లక్ష్యాల వైపు పయనిస్తున్నపుడు ఆ మార్గంలో ఆచరణ ద్వారా సాధించగలిగే స్థాయిని సూచించే బిందువును ఏమంటారు?
1) ఆశయం 2) లక్ష్యం
3) స్పష్టీకరణం 4) విలువ
26. ధర-డిమాండ్‌ల సంబంధమేమిటి? అనే ప్రశ్నలో పరిశీలించదలచుకున్న లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
27. విద్యుచ్ఛక్తి ఉపయోగాలు విశ్లేషించండి? అనే ప్రశ్నతో ఏ లక్ష్యాన్ని పరిశీలించవచ్చు?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
28. అభిరుచి ఒక?
1) ఆశయం
2) జ్ఞానాత్మక రంగంలోని లక్ష్యం
3) లక్ష్యం 4) స్పష్టీకరణం
29. ప్రపంచశాంతి- భారతదేశ పాత్ర అనే పాఠ్యాంశం ద్వారా ఉపాధ్యాయుడు ఏ ఆశయాన్ని సాధించవచ్చు?
1) నాది అనే భావన కలిగించడం
2) అంతర్జాతీయ అవగాహన
3) ప్రజాస్వామ్య పౌరసత్వ నిర్మాణం
4) సాంస్కృతిక వారసత్వ అభినందన
30. పరస్పర సంబంధాలను స్థాపించడం అనేది?
1) భావావేశ రంగానికి సంబంధించిన లక్ష్యం
2) మానసిక చలనాత్మక రంగానికి సంబంధించిన స్పష్టీకరణం
3) జ్ఞానాత్మక రంగానికి సంబంధించిన స్పష్టీకరణం
4) జ్ఞానాత్మక రంగానికి సంబంధించిన లక్ష్యం
31. దర్శనీయ ప్రదేశాలు అనే పాఠ్యాంశం విన్న తర్వాత రాజు మిత్రులతో కలిసి హైదరాబాద్ సందర్శించాడు. రాజులో నెరవేరిన లక్ష్యం?
1) వైఖరి 2) వినియోగం
3) అభిరుచి 4) అవగాహన
32. నాణేనికి బొమ్మ బొరుసు లాంటివి ఏవి?
1) ఆశయం-లక్ష్యం
2) లక్ష్యం-విలువ
3) లక్ష్యం- స్పష్టీకరణ
4) ఆశయం- స్పష్టీకరణం
33. ఉపన్యాస పద్ధతి ద్వారా ఎక్కువగా తరగతి గదిలో సాధించలేని లక్ష్యం?
1) జ్ఞానం 2) నైపుణ్యం
3) వినియోగం 4) అవగాహన
34. 'గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల విధుల్లో పోలికలు, భేదాలను తెలపండి?' ప్రశ్న ఏ లక్ష్యానికి చెందింది?
1) వినియోగం 2) జ్ఞానం
3) వైఖరి 4) అవగాహన
35. విధేయత, వ్యక్తిగత సామాజిక బాధ్యత వంటి అంశాలను పెంపొందించడం ఏ లక్ష్యం?
1) అవగాహన 2) జ్ఞానం
3) నైపుణ్యం 4) వైఖరి
36. ప్రశంస ఒక?
1) రంగం 2) స్పష్టీకరణ
3) ఆశయం 4) లక్ష్యం

సమాధానాలు

1) 2	2) 3	3) 2	4) 2	5) 4
6) 3	7) 3	8) 2	9) 2	10) 4
11) 2	12) 3	13) 2	14) 1	15) 2
16) 4	17) 1	18) 2	19) 3	20) 2
21) 3	22) 2	23) 2	24) 1	25) 2
26) 2	27) 3	28) 3	29) 2	30) 3
31) 3	32) 3	33) 2	34) 4	35) 4
36) 4				

మానవుడి సాధారణ హృదయ స్పందన రేటు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మానవ హృదయం

హృదయం అధ్యయనాన్ని కార్డియాలజీ అంటారు. శరీరంలోని అన్ని భాగాల నుంచి చెడు రక్తాన్ని సేకరించి తిరిగి మంచి రక్తాన్ని శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా చేసే కండర నిర్మాణాన్ని గుండె అంటారు. గుండె పిడికిలి పరిమాణంలో, శంఖం ఆకారంలో ఉంటుంది. రేడియో ధార్మిక వికిరణాల ప్రభావం దరిచేరని అవయవం గుండె.

- వరల్డ్ హార్ట్ డే సెప్టెంబర్ 29.
- హృదయం బరువు ప్రౌఢ పురుషుల్లో 300 గ్రాములు, స్త్రీలలో 250 గ్రాములు.
- కృత్రిమ గుండె బరువు 400 గ్రాములు.
- మొదటి ప్రయోగాత్మక కృత్రిమ గుండె పేరు జార్విక్-7 (1981).
- ప్రపంచంలో మొదటిసారిగా గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చేసింది క్రిస్టియన్ బెర్నార్డ్ (దక్షిణాఫ్రికా, కేప్‌టౌన్ - 1967).
- ఇండియాలో మొదటిసారి గుండె మార్పిడి నిర్వహించింది డాక్టర్ వేణుగోపాల్ (1994 ఎయిమ్స్ - ఢిల్లీ).
- అకశేరుకాల్లో నాడీజన్య హృదయం (న్యూరోజెనిక్ హార్ట్) ఉంటుంది.
- సకశేరుకాల్లో కండర నిర్మిత హృదయం (మయోజెనిక్ హార్ట్) ఉంటుంది.
- మానవ హృదయం ఒక కండర నిర్మితం, నాడీ జనితం.
- మానవుడిలో రెండు ఊపిరితిత్తుల మధ్య 'మీడియాస్టినం' అనే ఖాళీ ప్రదేశంలో గుండె ఉంటుంది.
- హృదయం ఎరుపు రంగులో ఉండటానికి కారణం మయోగ్లోబిన్ అనే వర్ణ పదార్థం. మయోగ్లోబిన్‌లో మెగ్నీషియం అయాన్లు ఉంటాయి.
- డెక్స్‌ట్రో కార్డియా అంటే గుండె కుడి రొమ్ము కింద ఉండటం.
- హృదయాన్ని ఆవరించి మూడు పొరలతో ఏర్పడిన హృదయావరణ త్వచం (పెరికార్డియం) ఉంటుంది.
- గుండె గోడలోని మూడు పొరలు వరుసగా వెలుపలి పొర.. ఎపికార్డియం, మధ్యపొర మీసోకార్డియం, చివరి/ లోపలి పొర ఎండోకార్డియం.
- హృదయావరణ త్వచం మధ్య ఉండే హృదయావరణ ద్రవం అఘాతాలు, షాక్‌ల నుంచి హృదయాన్ని రక్షిస్తుంది.
- మానవుడి హృదయంలో మొత్తం నాలుగు గదులుంటాయి. పై రెండు గదులను కర్ణికలు, కింది రెండు గదులను జఠరికలు అంటారు.
- కర్ణికలు చిన్న గదులు, జఠరికలు పెద్ద గదులు. కుడి కర్ణిక, ఎడమ జఠరిక మిగతా వాటి కంటే పెద్దవి.
- కర్ణికలు, జఠరికలను వేరు చేసేది కర్ణికాంతర జఠరికాంతర విభాజకం.
- గుండె ఎడమ భాగం అంటే ఎడమ కర్ణిక, ఎడమ జఠరికలో మంచిరక్తం (ఆమ్లజని సహిత రక్తం) ఉంటుంది.
- గుండె కుడి భాగం అంటే కుడి కర్ణిక, కుడి జఠరికలో చెడు రక్తం (ఆమ్లజని రహిత / కార్బన్ డై ఆక్సైడ్ సహిత రక్తం) ఉంటుంది.
- కర్ణికల గోడలు పలచగా ఉంటాయి. ఇవి సిరలతో సంబంధం కలిగి ఉంటాయి.
- జఠరికల గోడలు మందంగా ఉంటాయి. ఇవి ధమనులతో సంబంధం కలిగి ఉంటాయి.
- ఎక్కువ గుండెలు ఉన్న జీవి వానపాము. దీనిలో 8 జతల పార్శ్వ హృదయాలుంటాయి.
- బొద్దింకలో 13 గదులు కలిగిన గుండె ఉంటుంది.

హార్దిక వలయం (కార్డియాక్ సైకిల్)

- పిండం (భ్రూణం)లో మొదట ఏర్పడే అవయవం గుండె.
- మానవుడి గుండె పిండాభివృద్ధి దశలో 21వ రోజు నుంచి స్పందిస్తుంది.
- కర్ణికలు, జఠరికలు ఒకసారి సంకోచించి తిరిగి యథాస్థితికి వస్తే దాన్ని ఒక హృదయ స్పందన వలయం లేదా హార్దిక వలయం అంటారు.

హార్దిక వలయంలో 3 దశలు ఉంటాయి.

ఎ) కర్ణికలు జఠరికల విశ్రాంత స్థితి (ఊహాస్థితి)
బి) శరీర భాగాల నుంచి కర్ణికల్లోకి రక్త ప్రవాహం ..

మొదటి దశ: కర్ణికల సంకోచం (సిస్టోల్) .. రక్తం జఠరికల్లోకి ప్రవహిస్తుంది.

రెండో దశ: జఠరికల సంకోచం (సిస్టోల్).. కవాటాలు మూసుకుంటాయి(లబ్). రక్తం ధమనుల్లోకి ప్రవహిస్తుంది.

మూడో దశ: జఠరికల కర్ణికల యథాస్థితి (డయాస్టోల్) ధమనుల్లోని కవాటాలు



మూసుకుంటాయి (డబ్).

సిస్టోల్

- గుండె కండరాలు చురుగ్గా పాల్గొనే సంకోచ క్రియను సిస్టోల్ అంటారు.

డయాస్టోల్

- గుండె కండరాలు విశ్రాంతి తీసుకునే యథాపూర్వస్థితిని డయాస్టోల్ అంటారు.

హృదయ స్పందన / గుండె కొట్టుకోవడం

- ఒక సంకోచం + ఒక సడలిక లేదా ఒక సిస్టోల్ + ఒక డయాస్టోల్ లేదా ఒక లబ్ + ఒక డబ్‌ను హృదయ స్పందనగా పేర్కొంటారు.
- హృదయ స్పందన ప్రారంభమయ్యే ప్రదే శం లయారంబకం (పేస్‌మేకర్).
- మానవుడిలో లయారంబకం SAN, A.V. Node. (Sinus Auricular Node), (Atriun Ventricle node) (సిరాకర్ణిక, కర్ణిక జఠరిక కణుపు)
- కప్పలో లయారంబకం SAN మాత్రమే. ఇది కుడికర్ణికలో ఉంటుంది.
- మానవుడిలో హృదయ సంకోచం సిరాకర్ణిక కణుపులో ప్రారంభమై SAN కర్ణిక జఠరిక కణుపునకు వ్యాపించి అక్కడి నుంచి సంకోచం చెంది బండిల్ ఆఫ్ హిజ్ ద్వారా జఠరిక కుడ్యానికి విస్తరిస్తుంది.
- ఆరోగ్యవంతమైన ప్రౌఢ వ్యక్తిలో గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది.
- చిన్నపిల్లల్లో నిమిషానికి 130-140 సార్లు, వృద్ధుల్లో 60-70 సార్లు కొట్టుకుంటుంది.
- ఒక హృదయ స్పందనకు పట్టే కాలం - 0.8 సెకన్లు.

వివిధ జీవుల్లో గుండె గదుల సంఖ్య- రక్త ప్రసరణ				
జీవి	కర్ణికలు	జఠరికలు	మొత్తం గదులు	రక్త ప్రసరణ విధానం
చేపలు	1	1	2	ఏకవలయ రక్త ప్రసరణ వ్యవస్థ(సింగిల్ సర్క్యులేషన్)
ఉభయచరాలు	2	1	3	అసంపూర్ణ ద్విప్రసరణ
సరీసృపాలు	2	1½	3½	అసంపూర్ణ ద్విప్రసరణ
ఎ) మొసలి (సరీసృపం) బి) పక్షులు సి) క్షీరదాలు	2	2	4	ద్వంద్వ ప్రసరణ (డబుల్ సర్క్యులేషన్)

జంతువు	శరీర బరువు	గుండె బరువు	నిమిషానికి హృదయ స్పందనలు
నీలి తిమింగలం	1,50,000 కిలోలు	750 కిలోలు	7
ఏనుగు	3,000 కిలోలు	12-21 కిలోలు	46
మానవుడు	60-70 కిలోలు	300 గ్రాములు	72
కోయల్ టిట్ పక్షి	8 గ్రాములు	0.15 గ్రాములు	1200

- కర్ణికల సంకోచానికి పట్టే సమయం - 0.11 -0.14 సెకన్లు.
- జఠరికల సంకోచానికి పట్టే సమయం - 0.27 -0.35 సెకన్లు.
- చిన్న పిల్లలు, వ్యాయామం చేసే సమయంలో, జ్వరం వచ్చిన వారిలో హృదయ స్పందన ఎక్కువగా ఉంటుంది.
- హృదయ స్పందనను వినే పరికరాన్ని స్టెతస్కోప్ (ప్రోనోకార్డియోగ్రాఫ్) అంటారు. దీన్ని రెనె లిన్నెక్ కనుకొన్నారు.
- ధ్వని పరావర్తన సూత్రంపై ఆధారపడి స్టెతస్కోప్ పనిచేస్తుంది.
- అతిపెద్ద హృదయం (ఎక్కువ బరువు ఉన్న గుండె) తిమింగలంలో ఉటుంది.
- అతి తక్కువ హృదయ స్పందనలు చూపే గుండె నీలి తిమింగలం - 7 / నిమిషం.
- అతి చిన్న హృదయం (తక్కువ బరువు) కోయల్ టిట్ పక్షిలో ఉంటుంది.
- అతి ఎక్కువ హృదయ స్పందనలు చూపే గుండె కోయల్ టిట్ పక్షి -1200 / నిమిషం.
- క్షీరదాల్లో అతి చిన్న హృదయం ష్రూ (చుంచెలుక)లో ఉంటుంది. దీని గుండె నిమిషానికి 500 సార్లు కొట్టుకుంటుంది.
- టాకికార్డియా అంటే సగటుకంటే అధిక హృదయ స్పందనరేటు.
- బ్రాకికార్డియా అంటే సగటు కంటే తక్కువ హృదయ స్పందన రేటు.
- ఒకసారి హృదయ స్పందన జరిగినప్పుడు పంపు చేయడానికి కావాల్సిన రక్తం 70 మిల్లీలీటర్లు.
- ఒక నిమిషానికి మానవుడి హృదయం (4,900 మి.లీ.) దాదాపు 5 లీ. రక్తం పంపు చేస్తుంది.
- 72 స్పందనలు × 70 మి.లీ. రక్తం = 5040 మి.లీ. / నిమిషం. దాదాపు 5 లీటర్ల రక్తం.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. పేస్‌మేకర్ కింది వాటిలో దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 2000)
   1) ఊపిరితిత్తులు 2) కాలేయం
   3) గుండె 4) మూత్రపిండం
2. డెక్స్‌ట్రో కార్డియా అంటే? (అసిస్టెంట్‌ఎండోమెంట్ కమిషనర్, 2009)
   1) చిన్న గుండె 2) పెద్ద గుండె
   3) గుండె కుడివైపు ఉండటం
   4) ఎడమ వైపు ఉండటం
3. రక్తపోటును కొలిచే సాధనం? (గ్రూప్-2బి, 1984)
   1) థర్మామీటర్
   2) స్పిగ్మోమానోమీటర్
   3) లాక్టోమీటర్ 4) బారోమీటర్
4. హృదయ గరుకం (హార్ట్ మర్‌మర్) అనేది ఏ విధంగా వస్తుంది? (సివిల్స్, 2001)
   1) పనిచేయలేని ఎట్రియం
   2) తెరుచుకున్న కవాటాలు
   3) కరోనరీ థ్రాంబోసిస్
   4) చిన్న అయోర్టా
5. బ్లూ బేబీ అంటే? (ఏఎస్ఓ, 2008)
   1) ఒక ఇంగ్లిష్ సినిమా పేరు
   2) గుండె సంబంధ అనారోగ్యంతో జన్మించిన శిశువు
   3) ఒక నవల 4) ఏదీకాదు
6. గుండె నొప్పికి కారణం? (గ్రూప్-2ఎ, 1984)
   1) రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ అడ్డురావడం
   2) గుండె కొట్టుకోవడం ఆగిపోవడం
   3) గుండెపై మెదడు అధికారం లేకపోవడం
   4) ఏదీకాదు
7. ఆరోగ్యంగా ఉన్న మనిషి గుండె చేసే రెండు చప్పుళ్ల మధ్య వ్యవధి? (ఎఫ్ఆర్ఓ, 2005)
   1) అర సెకన్ 2) ఒక సెకన్
   3) రెండు సెకన్లు 4) మూడు సెకన్లు
8. మానవ హృదయం ఒక? (గ్రూప్-1, 1999)
   1) నాడీ జనకం 2) కండర జనకం
   3) కండర నిర్మితం + నాడీ జనకం
   4) ఏదీకాదు
9. ప్రపంచంలో మొదట గుండె మార్పిడి ఆపరేషన్ నిర్వహించింది ఎవరు? (డిప్యూటీ ఈఓ, 2008)
   1) డోనాల్డ్ బెర్నార్డ్
   2) వేణుగోపాల్
   3) క్రిస్టియన్ బెర్నార్డ్
   4) భాస్కర్‌రావు
10. మనుషుల్లో సాధారణంగా ఉండే హృదయ స్పందన రేటు? (గ్రూప్-2ఎ, 1994)
    1) 55 2) 72
    3) 95 4) 120
11. కార్డియాక్ అరెస్ట్ - హృదయ స్పందన ఆగిపోతే ఈ కింది ప్రక్రియను ప్రాథమిక చికిత్సగా గుర్తించొచ్చు? (జె.ఎల్., 2001)
    1) నోటి నుంచి నోటిలోకి శ్వాసక్రియ
    2) కార్డియాక్ మసాజ్
    3) డాక్టర్‌ని పిలవడం
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3 2) 3 3) 2 4) 2 5) 2
6) 1 7) 2 8) 3 9) 3 10) 2
11) 3

The meaning of Dictum is..

BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The rise (1)/ in interest rates (2)/ sabotaged much chances (3)/ of the firm's recovery. (4)/ No error (5)
2. People buy tickets with numbers on them (1)/ and some of these numbers (2)/ are latter chosen (3)/ to win prizes. (4)/ No error (5)
3. Many treasures (1)/ were lost (2)/ when the tombs are raided (3)/ in the last century. (4)/ No error (5)
4. The plans for the development (1)/ of the new capital (2)/ have raised angry protests (3)/ for some local residents. (4)/ No error (5)
5. Estimates of the damage due to heavy rains (1)/ in many parts of Tamilnadu (2)/ and especially in Chennai (3)/ range among Rs. 100 crores to Rs. 200 crores. (4)/ No error (5)

Directions(Q. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. She have had a number of different jobs, ranging from chef to swimming instructor.
   1) have 2) had 3) has had
   4) has 5) No correction required
7. The university is ranked number one in the country at engineering.
   1) on 2) upon 3) in to
   4) for 5) No correction required
8. Overuse of credit cards has ratcheted up consumer debt to unacceptable levels.
   1) rated 2) reduced
   3) diminished 4) increase
   5) No correction required
9. Two passengers were injured when their taxi is running from behind by a bus.
   1) was hitting 2) was running
   3) is hitting 4) was rammed
   5) No correction required
10. Experts say a lot of corporate crime is staying under the radar.
    1) stay 2) staying
    3) stayed 4) stays
    5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. Many _______ were raised as within months she was _______ to ministerial rank.
    1) questions, promoted
    2) probes, transferred
    3) answered, withheld
    4) eyebrows, elevated
    5) dissent, ranked
12. The kidnappers _______ a ransom of Rs. 5 crores from his family.
    1) resolution 2) ordered
    3) probed 4) questioned
    5) demanded
13. The government is _____ of ratting on its promises to the _____.
    1) agreed, poor
    2) bent, powerful
    3) accused, unemployed
    4) praised, people
    5) appreciated, youth
14. The conflict has now reached a new level of _______.
    1) height 2) volume
    3) course 4) intensity
    5) modesty
15. In its new _______, the magazine hopes to attract a much _______ readership.
    1) topic, broader
    2) avatar, valued
    3) process, largest
    4) format, wider
    5) print, finer

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Were you bedridden for a day or so with a mysterious fever - and, if so, what kind of activities had you been engaging in previously? When was the last time you called a doctor and for what?



B) This recommendation comes from Dr.H.E.Robertson of the Mayo Foundation. Did you turn yellow after taking that worm medicine a few years ago? There may be a clue to liver injury there.

C) Your diary, if you keep the right kind, may be a life saver if you turn it over to your doctor when illness strikes.

D) This unromantic information can be very helpful indeed when you need a doctor's services.

E) How often have those troublesome stomach aches been occurring - how many days between them? How many colds do you have a year?

F) He isn't interested in what Jim said under the moon, but he would like to know the details of your past that can give him important information on health history.

16. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. 21-28): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Fried foods have long been frowned upon. Nevertheless the skillet is about our handiest and most useful piece of kitchen equipment. Stalwart lumberjacks and others engaged in active labour requiring 4,000 calories per day or more will take approximately one-third of their rations prepared in this fashion. Meats, eggs and French toast cooked in this way are served in millions of homes daily. Apparently the consumers are not **beset** with more signs of indigestion than afflict those who insist upon broiling, roasting or boiling. Some years ago one of our most eminent physiologists investigated the digestibility of fried potatoes. He found that the pan variety was more easily broken down for assimilation than when deep fat was employed. The latter, however, dissolved within the alimentary tract more readily than the boiled type. Furthermore, he learned, by watching the progress of the contents of the stomach by means of the fluoroscope, that the fat actually accelerated the rate of digestion. Now all this is quite in contrast with "authority." Volumes have been written on nutrition and everywhere the **dictum** has been accepted- no fried edibles of any sort for children. A few will go so far as to forbid this style of cooking wholly. Now and then an expert will be bold enough to admit that he uses them himself, the absence of discomfort being explained on the ground that he possesses a powerful gastric apparatus. We can of course sizzle perfectly good articles to death so that they will be leathery and tough. But thorough heating, in the presence of shortening, is not the awful crime that it has been labeled. Such dishes stimulate rather than **retard** contractions on the gall bladder. Thus it is that bile mixes with the nutrient shortly after it leaves the stomach. We don't need to allow our food stuffs to become oil soaked, but other than that there seems to be no basis for the widely heralded prohibition against this method. But notions become fixed. The first condemnation probably arose because an "oracle" suffered from dyspepsia which he ascribed to some fried item on the menu. The theory spread. Others agreed, and after a time the doctrine became incorporated in our textbooks. The belief is now tradition rather than proved fact. It should have been **refuted** long since, as experienced has demonstrated its falsity.

21. Which of the following is mentioned in the passage?
    1) Potato fry is a delightful yummy dish.
    2) Many people prefer to have boiled food.
    3) The dissolving power of fried food is faster than boiled one.
    4) Bile mixes with the nutrients in the liver.
    5) There is a wide basis proved beyond doubt regarding the fried foods.
22. Fried foods as per the passage -
    a) Harmful for the health
    b) The theory spread widely and it became a doctrine that is believed by many as harmful
    1) Only a 2) Only b
    3) Both a & b
    4) Neither a nor b 5) a or b
23. The findings of an eminent physiologist revealed that -
    1) Potatoes are a nutritious diet
    2) Nutrient value of potatoes are changing frequently
    3) Potatoes are a nutritious diet which are liked by people across the world
    4) Fried potatoes are dissolved within the alimentary tract more readily
    5) There is a sea of difference in the taste of fried potatoes and boiled potatoes
24. What is the notion which is fixed?
    1) Allow our food stuffs to become oil soaked
    2) No fried edibles of any sort for children
    3) Thorough heating is an awful crime
    4) Deep fat is employed in the stomach
    5) Indigestion is a major problem hitting many lives
25. The synonym of **Beset** is
    1) Overwhelmed
    2) Inundated 3) Marooned
    4) Complied 5) Abide
26. The meaning of **Dictum** is
    1) Maxim 2) Maximum
    3) Minimum 4) Mandate
    5) Mitigate
27. The antonym of **Retard** is
    1) Alacrity 2) Animosity
    3) Adversity 4) Amicability
    5) Anonymity
28. The antonym of **Refuted** is
    1) Disprove 2) Contest
    3) Counter 4) Besiege
    5) Attest

Directions (Q. 29-30): Read the four options carefully, a set of words from the four options is related either synonymously or anonymously. Choose that set and mark your answer.

29. 1) Juxtapose, Distribute
    2) Entangle, Entrust
    3) Surround, Surpass
    4) Encomium, Boorish
30. 1) Couch, Lien
    2) Travelogue, Monologue
    3) Repertoire, Gamut
    4) Spellbind, Magistrate

KEY

1) 3 2) 3 3) 3 4) 4 5) 4
6) 3 7) 4 8) 5 9) 4 10) 4
11) 4 12) 5 13) 3 14) 4 15) 4
16) 5 17) 2 18) 1 19) 3 20) 4
21) 3 22) 3 23) 4 24) 3 25) 1
26) 1 27) 1 28) 5 29) 4 30) 3